# కాశ్మీర్ కథ




954.6
శాస్త్రి-కాశ్మీ
6,633

ఎం.వి.ఆర్. శాస్త్రి

# కాశ్మీర్ కథ

ఎం.వి.ఆర్. శాస్త్రి

దుర్గా పబ్లికేషన్స్
హైదరాబాద్

# KASHMIR KATHA

*by* **M.V.R. SASTRY**

© Author

Copies 1000

Price: Rs. 75/-

**First Published**

**November 2001**

**Title Design :** *Aelay Laxman*

954.6

C 17872

**For Correspondence & Copies**

*M. Durga*
*H No 1-8-726/42/18*
*Padma Colony, Nallakunta,*
*Hyderabad - 500 044.*
*Ph 040-7632824*

**Copies Available at**

*Visalandhra Book House*
*All Branches in A P*

A C No 6633
-500 044

**D.T.P. at**

*Chandana Graphics*
*Warasiguda, Secunderabad*
*Ph 040-7506748*

**Title Printed at**

*Pragati Printers*
*Hyderabad.*

**Text Printed at**

Akruthi Offset Printers.
Chikkadpally, Hyderabad



# ముందుమాట

భారతీయ సంస్కృతికి, సనాతన ధర్మానికి చరిత్రకందని కాలం నుంచి కాశ్మీర్ రత్న కిరీటంలాగా వర్ధిల్లింది అక్కడ విస్తరించిన శివయోగంలో ఆవిర్భవించిన మహాయోగీశ్వరి లల్లాదేవి కల్హణ, మల్హణ, బిల్హణాది మహాకవుల చేతులలో తారపథాన్ని అంటిన సంస్కృత వాఙ్మయ వైభవం మహోన్నతమైనది 14వ శతాబ్దంలో బలాత్కారంగా ఇస్లాంలోకి మార్చబడి లక్షలాది హిందూ ప్రజలు పాక్షికంగా హిందూ సంస్కృతిని పోషించుకుంటూ వచ్చారు హిందూరాజ్యంగా మొన్నటిదాకా ప్రశాంత వాతావరణంలో ప్రసిద్ధ పర్యాటక స్థలంగా ఉంటూ వచ్చింది కాశ్మీరం. హిందూ ముస్లిం సంఘర్షణలు మొత్తంమీద స్వల్పంగా ఉంటూ చాలామటుకు సామరస్యంతో భారతీయ సంస్కృతిని పోషిస్తూ వచ్చింది కాశ్మీరం. 1988లో నేను శ్రీనగరం వెళ్లినప్పుడు అక్కడి ముస్లిం కుటుంబాలవారే సగౌరవంగా నన్ను, నాతో వున్న వారందరిని ఆదరించి గౌరవించారు. కాశ్మీరంలోని పూర్వతరాల ముస్లిములను చూస్తే వారిలోని భారతీయత, సమ్యక్ దృష్టి, ఉత్తమ నాగరికత నాకు గోచరించాయి

ప్రస్తుత కాశ్మీర్ సమస్య మత సమస్యా? రాజకీయ సమస్యా? మత ప్రసక్తి లేని ప్రభుత్వమే నిజంగా వుంటే కాశ్మీరం కేవల రాజకీయ సమస్యగా పరిగణించబడి చిట్టచివరకు సైనిక చర్య ద్వారానైనా ఎప్పుడో పరిష్కారం అయి ఉండవలసింది. దీన్ని మత సమస్యగానే పరిగణించే పక్షంలో కాశ్మీర్ ప్రజలు తమ స్వంత ఆస్తి అని మత ప్రాతిపదికపైన ఏర్పడ్డ పాకిస్తాన్ భావిస్తోంది కాబట్టి కాశ్మీర్ ప్రజలను, ప్రాంతాన్ని కూడా పాకిస్తాన్‌కు ధారాదత్తం చేయడమే ఒక పరిష్కారం కావచ్చు మనకు ఉన్నది నిజంగా మతాతీతమైన ప్రభుత్వమైతే

రాజకీయ పరిష్కారమే శరణ్యం అందులో సైనిక చర్య కూడా ఒక భాగం ఈ రెండు పనులు చేయలేక పోయిన భారత ప్రభుత్వం దిక్కుతోచనిది అనబడుతుంది ఏమైనా ప్రజల అభిప్రాయం ప్రభుత్వానికి మార్గదర్శకం కాలేక పోయింది. దినచర్యగా ప్రాణనష్టం, ధననష్టం తప్పడంలేదు. పాకిస్తాన్ ప్రభుత్వం యొక్క అమిత మతవాదం భారత ప్రభుత్వం యొక్క అమిత మితవాదం ఈ రెండూ కూడా కాశ్మీర్ విషయంలో విఫలమే అయినాయి

ఇలాంటప్పుడు ఏమి చేయాలి? కాశ్మీర్ సమస్యపై దేశం మొత్తం మీద ప్రజాభిప్రాయం సేకరించి ప్రభుత్వం దాన్ని అమలుచేయాలి.

కాశ్మీరం భారతదేశంలో అంతర్భాగమని 5 0 సంవత్సరాల నుంచి ప్రభుత్వం వాదన. దేశంలో అంతర్భాగమంటే మొత్తం దేశం ప్రజలు అందరికీ కాశ్మీర్ సమాన హక్కులు కలిగిన ప్రాంతమని భావం. అంటే – కాశ్మీరం కాశ్మీర్ ప్రజలది మాత్రమే కాదు ఎలాగంటే – ఆంధ్రదేశం ఆంధ్రుల ప్రత్యేక స్వంత ప్రాంతం కాదు దేశంలో అందరిదీనూ ఆ విధంగా ప్రతి పౌరుడికి దేశంలో ప్రతీ ప్రాంతం సమాన హక్కులతో స్వంతం అయినట్టే కాశ్మీర్ కూడా అయి తీరాలి.

కాశ్మీరం వేరుగానే ఉంటుంది దేశంలో విలీనం కాదు అని అక్కడి ముఖ్యమంత్రి కుమారుడైన కేంద్ర మంత్రిగారు ఇప్పటికే స్పష్టం చేస్తున్నాడు. అలాగైతే భారతదేశం ధన ప్రాణాలు వ్యయం చేసి కాశ్మీర్‌ను ఎందుకు రక్షించాలి? వారి స్వాతంత్ర్యం వారే రక్షించుకోవాలి కదా?

పాకిస్తాన్ అక్కడ జరుగుతున్న నేరాలన్నీ కాశ్మీర్ ప్రజలు చేస్తున్న స్వాతంత్ర్య సమరం అంటున్నది. దానికి సహాయం పాకిస్తాన్ ప్రభుత్వం ఇస్తున్నది అని వారి వాదన. అటువంటి వాదమే కాశ్మీర్ ప్రజలు చేస్తున్నారని అనుకోవాలా? కాశ్మీర్ ప్రజలను ఓటు అడిగితే నేడు భారతదేశంలో మేము భాగం కాదనే అనవచ్చు మరి మనం ఎవరి నుంచి ఎవరిని రక్షిస్తున్నాం? పాక్ ప్రభుత్వం, కాశ్మీర్ ప్రజలు అంటున్నది ఒకటే మాట అన్నమాట కాని కాశ్మీర్ ముఖ్యమంత్రి తమ స్వాతంత్ర్యం కోసం భారతదేశం పాకిస్తాన్‌తో యుద్ధం చేయాలని పిలుపునిస్తున్నారు. మనం చేస్తున్న పని కూడా అదే కాకపోతే పెద్ద ఎత్తులో యుద్ధమనేది జరగడంలేదు. ఇలా ఎంతకాలం నడుస్తుంది? తమంతట తామే మధ్యవర్తులుగా వ్యవహరించే అమెరికా వంటివారు మన పక్షం మాట్లాడటంలేదు అలాంటప్పుడు మనం సూటిగా కాశ్మీర్ ప్రజలను భారతదేశంలో కలిసిపోయారా – మీ క్షేమం మేము వహిస్తాం యుద్ధమైనా చేస్తాం. లేదా – మీ కాళ్ళ మీద మీరు నిలబడండి. మేము తప్పుకుంటాం – అని అందామా?

లేక- భారతదేశంలో ఇదివరకే చట్టరీత్యా విలీనం అయిపోయిన కాశ్మీర్ విషయంలో ఇప్పుడు ఆ ప్రశ్నే తలెత్తకూడదని నిర్ణయం తీసుకుని, యుద్ధం ప్రాతిపదికపైనే పాకిస్తానీలను వెళ్ళగొట్టాలా? కాశ్మీర్ నుంచి వెళ్ళగొట్టబడిన హిందువులను మళ్ళీ ఇంటికి చేర్చి పరిస్థితి చక్కబడేవరకూ కాశ్మీర్ పరిపాలన మొత్తం కేంద్ర ప్రభుత్వమే నిర్ణయించాలా?

కాశ్మీర్ విషయంలో ఏ విధంగా పాకిస్తాన్ ప్రజలందరూ ఏక కంఠంతో వాదిస్తున్నారో అలాగే యావద్భారత ప్రజలు తమ అభిప్రాయాలను చెప్పాలి అంటే పార్లమెంటులో రాజకీయ నాయకుల చర్చల ద్వారా కాదు నిర్ణయం తీసుకోవలసింది. ప్రజలు తీర్పు చెప్పాలి దానిని ప్రభుత్వం అమలు చేయాలి. అంటే.. ప్రజాభిప్రాయ సేకరణ కాశ్మీర్ ప్రజలతో కాదు- యావద్భారత ప్రజలలో జరగాలి కాశ్మీర్ సహిత భారత ప్రజల తీర్పే కాశ్మీర్‌కు వర్తించాలి

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిననాటినుంచి నేటివరకు అనేక రాజకీయపరమైన అపరాధాలు, తప్పులు, పొరపాట్లు చేసి కాశ్మీరం ఇంతవరకు మనది కాకుండా చేసుకొని అక్కడి హిందూ సంస్కృతిని, ప్రజలను ఆపదలపాలు చేసి యాభై ఐదు సంవత్సరాలలో అమితమైన ధనాన్ని, అనేకమంది ప్రాణాలను, సమూలంగా కుటుంబాలను పోగొట్టుకోవడానికి ఎటువంటి రాజనీతి కారణం? వివరాలు చాలామందికి తెలియవు బాధ్యత కలిగిన ప్రతి భారతీయుడికి ఈ వివరాలను తెలుసుకోవలసిన అవసరం, ప్రతిస్పందించవలసిన బాధ్యత నేడు ఉన్నాయి దానికొరకు సమగ్రమైన విషయ సేకరణతో కూడి, ఒక గ్రంథ రూపంలో తెలుగువారికి తెలియజెప్పడానికి శ్రీ ఎం వి ఆర్ శాస్త్రిగారు జయప్రదమైన ప్రయత్నం చేశారు ఇది ప్రతి తెలుగు పౌరుడు ఆబాలగోపాలం చదవాలి ప్రతిస్పందించాలి శ్రీ శాస్త్రిగారి ప్రయత్నం ఆవిధంగా సఫలీకృతం కాగలదని ఆశిస్తూ ఆయనను అభినందిస్తున్నాను శాస్త్రిగారికి నా హృదయపూర్వకమైన ఆశీస్సులు

ఆనందవనం

భీమునిపట్నం

10-11-2001

కందుకూరి శివానందమూర్తి

# రచయిత గురించి

'ఈనాడు'లో అసిస్టెంట్ ఎడిటర్ స్థాయి వరకు వివిధ హోదాల్లో పదమూడేళ్లు పనిచేసి ఆంధ్రప్రభ దినపత్రికకు డిప్యూటీ ఎడిటరుగా వెళ్లారు.

అక్కడ నాలుగేళ్లు ఉన్నాక 1994 డిసెంబరులో ఆంధ్రభూమి దినపత్రికకు సంపాదకులయ్యారు.

తొమ్మిదేళ్లుగా 'ఉన్నమాట', ఆరేళ్లుగా 'వీక్‌పాయింట్' శీర్షికలను నిర్వహిస్తున్నారు.

పాతికేళ్ల పత్రికా వ్యాసంగంలో ఇంకా వందలాది సంపాదకీయాలు, ప్రత్యేక వ్యాసాలు రాశారు.

# ఒక్కక్షణం

శ్రీనగర్.

ఇంత చక్కని సాంప్రదాయకమైన పేరుగల రాజధాని దేశంలో మరే రాష్ట్రానికీ లేదు.

భారతీయ సంప్రదాయానికి, భారత జాతీయతకు ఇంతటి పెనుముప్పు మరో రాష్ట్రానికీ లేదు

సర్వసత్తాక స్వతంత్ర గణతంత్ర రిపబ్లిక్ అయిన భారతదేశంలో కాశ్మీర్ ఎవరూ విడదీయలేని భాగమని మనం విసుగులేకుండా చెప్పుకుంటాం. నిజానికి ఇండియన్ రిపబ్లిక్ సార్వభౌమాధికారం అక్కడ చెల్లకుండా పోయి అర్ధ శతాబ్ది గడిచింది. మన చేతకానితనంవల్ల కాశ్మీర్‌లో మూడోవంతు నేల విరోధుల వశమైంది. మనకు మిగిలిందను కుంటున్న ప్రాంతమూ మన నాయకుల అసమర్థ నిర్వాకాల, స్వార్థ రాజకీయాల, పలాయన మనస్తత్వాల పర్యవసానంగా దేశద్రోహుల ఆటపట్టయింది. ఏటా వందల, వేల కోట్ల రూపాయల భారత ప్రజాధనాన్ని లోయలో కుమ్మరిస్తున్నది ఎవరినుంచి ఎవరిని రక్షించటానికో, ఎవరిని ఉద్ధరించటానికో, ఏమి సాధించటానికో అంతుబట్టని అయోమయం విచిత్రంగా అలుముకుంది.

కాశ్మీర్ సమస్య గురించి మనం యాభైనాలుగేళ్లుగా మాట్లాడుతున్నాము. కాని చిత్రమేమిటంటే అసలు కాశ్మీర్ సమస్య ఏమిటో, దాన్ని ఎలా పరిష్కరించబోతున్నామో, కనీసం ఎలా పరిష్కరించగోరుతున్నామో మనను నడిపించే నాయకులకే ఈనాటికీ సరిగా తెలియదు. సమస్య ఉత్పన్నమైన అర్ధ శతాబ్ది తరవాత కూడా కాశ్మీర్‌పై మన విధానమేమిటో మన విధాన నిర్ణేతలే కచ్చితంగా చెప్పలేరు. పాలసీ మేకర్లలో ఉన్న అస్పష్టతే ఒపీనియన్ మేకర్లలోనూ ఉంది పత్రికల్లో టన్నుల కొద్దీ న్యూస్‌ప్రింటు ఖర్చుచేసి రాస్తున్న రాతలు ఎంత చదివినా, టీవీలో రోజుకు గంటల తరబడి నడిపే 'టాక్‌షో' లు ఎంత విన్నా, మేధావుల

ఖండన మండనలు ఎన్ని ఆలకించినా గందరగోళం పెరిగి ఉన్న మతి పోతుందే తప్ప జాతీయ ఏకాభిప్రాయానికి ఏవిధంగానూ దోహదమవడం లేదు.

కాశ్మీర్ అనేది జాతీయ దౌర్బల్యానికి గురుతుగా, మన నిష్క్రియాపరత్వానికి, మన ప్రభుత్వాల బాధ్యతారాహిత్యానికి నిలువెత్తు నిదర్శనంగా, జవాబు దొరకని ప్రహేళికలా, జాతి క్షేమాన్ని క్షయం చేసే రాచపుండులా తయారైన స్థితిలో .. యావద్భారతాన్ని వ్యాకులపరుస్తున్న సమస్య ఎక్కడ మొదలై ఎన్ని మలుపులు తిరిగి ఎలా పరిణమించిందో రేఖామాత్రంగా వివరించే ప్రయత్నం ఈ గ్రంథం 2001 మార్చి 4 మొదలుకొని వరసగా పదహారు వారాలపాటు 'కాశ్మీర్ కథ' పేరుతో ఆంధ్రభూమి దినపత్రిక ఆదివారం అనుబంధంలో నేను రాసిన వ్యాసాలు ఇందులో ఉన్నాయి.

నడుస్తున్న చరిత్రను అక్షరబద్ధం చేయటం కష్టమైన పని. రచన మొదలుపెట్టేనాటి పరిస్థితి మరునాటికి మారిపోవచ్చు. పత్రికలో ఈ వారం రాసిన వ్యాసానికి మరుసటి వారమే కాలదోషం పట్టవచ్చు. ఆంధ్రభూమి ఆదివారం అనుబంధంలో 'కాశ్మీర్ కథ' ప్రారంభించిన సమయానికి వాజపేయి ప్రభుత్వం టెర్రరిస్టులకు రంజాన్ కానుకగా ముప్పై రోజుల ''కాల్పుల విరమణ''ను ప్రకటించటమే తాజా విశేషం. చరిత్ర వెనక్కి వెళ్ళి అర్ధ శతాబ్ది కాలంలో జరిగిన ఘటనలను వ్యాస పరంపరలో సింహావలోకనం చేస్తుండగానే వర్తమాన పరిస్థితి శీఘ్రగతిన మారింది. కొద్దిరోజుల కోసమని మొదట ఉద్దేశించిన ''కాల్పుల విరమణ''ను కేంద్రం వాయిదాల పద్ధతిలో పొడిగించి హఠాత్తుగా ఆ ''సీరియల్''ను ఆపేసి, పాక్ నియంత ముషారఫ్‌తో ముచ్చట్లకు ఉపక్రమించింది. ఆంధ్రభూమిలో 'కాశ్మీర్ కథ' పూర్తయిన తరవాత ముషారఫ్ ఆగమనం, ఆగ్రాలో శిఖరాగ్ర ప్రహసనం సంభవించాయి. ఆ రసాభాస ఘట్టంలో రేగిన పరస్పరారోపణల దుమారం సద్దుమణగకముందే, సెప్టెంబర్ 11న అమెరికాపై బిన్ లాడెన్ ప్రతాపం చూపాడు. మానవుడి మనుగడకు టెర్రరిజం ఎంతటి ప్రమాదకారి అన్నది అమెరికన్లు సైతం అనుభవపూర్వకంగా గ్రహించి ఇస్లామిక్ టెర్రరిజంపై అంతర్జాతీయ పోరాటానికి తమ పద్ధతిలో ఆయత్తమయ్యారు. ఆ ప్రకంపనాల ప్రభావం కాశ్మీరీ టెర్రరిజంమీదా సహజంగానే పడింది. త్వరితగతిన సంభవించిన పరిణామాలకు స్పందిస్తూ 'ఉన్నమాట', 'వీక్‌పాయింట్' శీర్షికల్లోనూ, ఆంధ్రభూమి సంపాదకీయాలలోనూ నేను అనేక వ్యాసాలు రాశాను. వీటిని, ఇంతకుముందు వరసగా రాసిన వ్యాసాలను అవసరాన్ని బట్టి ఎడిట్ చేసి, కాలదోషం పట్టిన భాగాలను తీసేసి పుస్తక రూపంలో మలిచాను. ఈ పని పూర్తయిన తరవాత శ్రీనగర్ అసెంబ్లీపై టెర్రరిస్టుల ముట్టడి గురించి ఆంధ్రభూమిలో రాసిన

సంపాదకీయాన్ని, కాశ్మీర్ పూర్వచరిత్రను స్పృశిస్తూ 'ఉన్నమాట' శీర్షికలో రాసిన ''మనకు తెలియని కాశ్మీరం'', ''టెర్రరిజానికి ఏడొందల ఏళ్లు'' వ్యాసాలను కూడా 'అనుబంధం-1'లో చదవవచ్చు. ఇండియాలో కాశ్మీర్ విలీనానికి సంబంధించిన పత్రాలను సిమ్లా ఒప్పందం, కాశ్మీర్‌పై పార్లమెంటు 1994 తీర్మానం పాఠాలను యథాతథంగా అనుబంధం-2లో చూడవచ్చు

ఇలా తయారైన 'కాశ్మీర్ కథ' ప్రామాణిక చరిత్ర గ్రంథమన్న భ్రమ నాకు లేదు చిరకాలంగా కాశ్మీర్ ఘటనలను గమనిస్తున్న విజ్ఞులకు తెలియని కొత్త విషయాలేవీ ఇందులో లేవు కాశ్మీర్ సమస్యకు మూలకారణాలు ఏమిటి, పరిస్థితి ఇలా ఎందుకు విషమించింది అని తెలుసుకోగోరే సామాన్య పాఠకులకు కాశ్మీర్ పూర్వాపరాలను నాకు తెలిసినంతలో, నాకు చేతనైనంతలో సరళంగా, క్లుప్తంగా అందించడానికే ఈ ప్రయత్నం. భారతీయ విద్య గురించి 'మన చదువులు'లాగే, 'కాశ్మీర్ కథ'నూ పుస్తకంగా ఎప్పుడు తెస్తారని అడుగుతున్న మిత్రులకూ, అభిమానులకూ. అలా తెస్తే బాగుంటుందని సూచించిన పెద్దలకూ ఇది నచ్చుతుందనే ఆశిస్తున్నాను కాశ్మీర్ గురించి వరసగా రాయాలన్న ఆలోచన రాకపోతే విలువైన సమాచారం గల చాలా పుస్తకాలను నేను చదివేవాడిని కాదు కాశ్మీర్ సమస్యలో ఇమిడిన అనేక కోణాలు నాకు తెలిసేవి కావు ఆ విధంగా ఈ రచన నావరకు మంచి ఎడ్యుకేషనే!

విషయ సేకరణలోనూ, గ్రంథ ప్రచురణలోనూ ఎంతోమంది మిత్రులు విలువైన సహాయ సహకారాలనందించారు అందరికీ ధన్యవాదాలు కాశ్మీర్ సమస్యపై అందరినీ ఆలోచింప జేసే అభిప్రాయాన్ని వెలిబుచ్చి దయతో తమ దివ్యాశీస్సులను అనుగ్రహించినందుకు గురువుగారికి వినమ్ర ప్రణామాలు

హైదరాబాద్,

వృష – దీపావళి,

14 నవంబర్ 2001

ఎం.వి.ఆర్. శాస్త్రి

# ఇదీ వరస



| | | |
|---|---|---|
| 1. | భూతాల స్వర్గం | 1 |
| 2. | రాజుగారి డైలమా | 3 |
| 3. | మౌంట్‌బాటన్ నమ్మకద్రోహం | 10 |
| 4. | అలస్యం తెచ్చిన అనర్థం | 17 |
| 5. | తప్పుమీద తప్పు | 25 |
| 6. | సింహం కాదు భూతం | 32 |
| 7. | బుద్ధి మారని అబ్దుల్లా | 41 |
| 8. | తాష్కెంట్ నుంచి సిమ్లాకు | 48 |
| 9. | సిమ్లా సీక్రెట్ | 56 |
| 10. | సింహంగారు వన్స్‌మోర్ | 64 |
| 11. | తండ్రికి తగ్గ తనయుడు | 71 |
| 12. | ఆపరేషన్ టోపాక్ | 78 |
| 13. | అసమర్థ వాజపేయం | 85 |
| 14. | మానవ హక్కులు మృగాలకేనా? | 94 |
| 15. | అసలు లొసుగు ఆర్టికల్ 370 | 101 |
| 16. | ఆక్రమిత కాశ్మీరే అసలు సమస్య | 108 |
| 17. | ముషారఫ్‌తో ముషాయిరా | 114 |
| 18. | అనుకున్నదే అయింది | 121 |
| 19. | భరతం | 126 |

# అనుబంధం - 1


| | | |
|---|---|---|
| I. | అమెరికాను చూసయినా నేర్చుకోండి | 139 |
| II. | మనం మరచిన కాశ్మీరం | 144 |
| III | టెర్రరిజానికి ఏడొందల ఏళ్లు | 151 |


# అనుబంధం - 2


| | | |
|---|---|---|
| I. | Letter from Maharaja Hari Singh to Lord Mountbatten | 163 |
| II | Reply from Lord Mountbatten to Maharaja Hari Singh | 165 |
| III | Instrument of Accession | 166 |
| IV | Simla Agreement, 2 July 1972 | 168 |
| V | Parliament Resolution on Jammu and Kashmir | 171 |




## ముఖ్యమైన గణాంకాలు

| జమ్మూకాశ్మీర్ | వైశాల్యం చ కి మీ | శాతం |
|---|---|---|
| **జమ్మూకాశ్మీర్ మొత్తం వైశాల్యం** | **2,22,236** | **100%** |
| పాక్ ఆక్రమించిన ప్రాంతం | 78,114 | 35 15% |
| చైనా అక్రమించిన ప్రాంతం | 37,555 | 16 90% |
| పాకిస్తాన్ అక్రమంగా చైనాకు అప్పగించిన ప్రాంతం | 5,180 | 2.33% |
| ఇండియాలో మిగిలివున్న ప్రాంతం | 1,01,387 | 45 62% |
| **ఇండియాలో మిగిలివున్న ప్రాంతం** | **1,01,387** | **100%** |
| లడాఖ్ డివిజన్ | 59,149 | 58 34% |
| జమ్మూ డివిజన్ | 26,321 | 25 96% |
| కాశ్మీర్ డివిజన్ | 15,917 | 15 70% |

# కాశ్మీర్ కథ

# భూతాల స్వర్గం

ఒకప్పుడు అది 'భూతల స్వర్గం'.

ఇవాళ అది 'భూతాల స్వర్గం'.

కాశ్మీర్.

*ఆ పేరు తలుచుకుంటేనే... నింగినంటే హిమగిరులు, పాతాళపు లోయలు, మంచుకొండల మధ్య వొంపుసొంపుల బాటలు, పచ్చని పచ్చిక బయళ్ళు, విరబూసిన పూలతోటలు, మనోహర సరోవరాలు, నౌకావిహారాలు, పడవల్లో కాపురాలు స్ఫురించి – ఒకప్పుడు కవులకు, కళాకారులకు భావుకత ఉప్పొంగేది. ప్రేమికుల ఊహలు రెక్కల గుర్రాల మీద ఎగిరిపోయి లోయల దారులలో ఊయలలూగేవి 'అంత సీను' కానలేని సామాన్యులకు తమ అభిమాన నాయికా నాయకులు సినిమాల్లో అభినయించగా చూసిన సుందర కాశ్మీర దృశ్యాలు కళ్లకు కట్టేవి.*

మతం మీద శ్రద్ధ, దేవుడి మీద భక్తిగల కోట్లాది హిందువులకైతే . ఆదిశంకరులు నడయాడిన సీమగా, ముక్తినిచ్చే పరమపావన పుణ్యక్షేత్రాల నెలవుగా, దేవతల కొలువుగా, అనాది నుంచీ భారతీయుల ఆత్మలో ఆత్మగా, భారతీయ సంస్కృతిలో అవిభాజ్య భాగంగా, అర్షధర్మానికి పట్టుగొమ్మగా నిలిచిన పుణ్యభూమి మనసులో మెదిలేది. దేశం దశదిశల నుంచీ డబ్బు గలవాళ్ళు వేసవి రాగానే కాశ్మీర్‌కు వలసపోయి సేద తీరేవారు. ఏటా వెళ్ళే శక్తి లేకపోయినా కనీసం జీవితంలో ఒకసారి కాశ్మీర్ చూసి రావాలని మధ్యతరగతి కుటుంబీకులూ ఉవ్విళ్ళూరేవారు. ప్రేమ యాత్రలకూ, హనీమూన్లకూ చాలామంది కాశ్మీర్‌నే ఎంచుకునేవారు కనీసం ఒక పాటనైనా కాశ్మీర్‌లో చిత్రీకరించడాన్ని అన్ని భాషల సినిమా నిర్మాతలూ సక్సెస్ ఫార్ములాగా పెట్టుకునేవారు దేశదేశాల నుంచి 'పారడైజ్ ఆన్ ఎర్త్' (భూలోక స్వర్గం) గా పేరుపడ్డ సీమను చూడ వెళ్ళే టూరిస్టులతో కాశ్మీరు మహా

సందడిగా ఉండేది. టూరిజం వల్ల ఆదాయమే అక్కడి ప్రజలకూ, ప్రభుత్వానికీ కూడా ప్రధానాలంబనంగా ఉండేది

ఇప్పుడో?

కాశ్మీర్ పేరు చెబితేనే ప్రతివారికీ వెన్నులో వణుకు పుడుతుంది మిలిటెంటు మిన్నాగుల బుసలు... టెర్రరిస్టు విషసర్పాల కాట్లు, బాంబు పేలుళ్లు. . తుపాకుల కాల్పులు, కర్ఫ్యూలు సోదాలు; సామాన్యుల ఊచకోతలు పథకం ప్రకారం జాతిహత్యాకాండలు, విచ్చలవిడి విధ్వంసాలు . దేశద్రోహుల వీరంగాలు, కళ్ల ముందు మెదిలి బ్లడ్‌ప్రెషర్ పెరుగుతుంది. ప్రాణం మీద ఆశ ఉన్నవారెవరూ ఇవాళ కాశ్మీర్‌లో అడుగుపెట్టేందుకు సాహసించరు. రైళ్లు, రోడ్లు లేని కాలంలో కాశీకి పోవటం, కాటికి పోవటం సమానమనుకునేవారు. రైఫిళ్లు, రోడ్‌బ్లాస్టులు ఆగకుండా మారుమోగే ఈ కాలంలో కాశ్మీర్‌కు పోవటం కూడా కాటికి టిక్కెటు కొనుక్కోవటం లాంటిదే

తాము వేరు భారతీయులు వేరు అని ఈ మధ్యదాకా కాశ్మీరీలు అనుకోలేదు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన భారతీయులను ఆప్తబంధువుల్లా స్వాగతించారే తప్ప శత్రుభావం చూపలేదు. కాని ఈనాటి కాశ్మీరీల్లో నోరు గల వర్గానికి ఇండియా పొడే గిట్టడంలేదు తామూ భారతీయులమేనని వారు భావించడమే లేదు. ఇండియా అన్నా, ఇండియన్లన్నా ద్వేషమూ, అపనమ్మకమే తప్ప మరో భావం వారికి కలగడంలేదు పాలకులు పాచి నోటితో శాంతి మంత్రాలు చదివేకొద్దీ కాశ్మీర్ లోయలో అశాంతి పెరిగిపోతున్నది ప్రజల విశ్వాసం చూరగొనడానికి అసమర్థ ప్రభువులు ప్రయత్నించే కొద్దీ ప్రజల్లో విశ్వాస రాహిత్యం అధికమవుతున్నది. తుపాకులు ఎక్కుపెట్టి శాంతిని అరెస్టు చేయడం అసాధ్యమని తేలిపోయింది. కాశ్మీర్‌లో శాంతిభద్రతలను బంధించేందుకని ఏటా కుమ్మరిస్తున్న వేల కోట్ల రూపాయలు బూడిదలో పోసినట్టేనని స్పష్టమైంది. కొంచెం స్వేచ్ఛగా తిరగనిస్తే చాలు సామాన్య జనం వేల సంఖ్యలో వీధుల్లోకి వచ్చి ఇండియాను శాపనార్థాలు పెడుతూండటాన్ని బట్టే ఇన్నేళ్లలో ఇన్ని తరాల్లో అన్ని ప్రభుత్వాలూ అనుసరించిన దిక్కుమాలిన విధానాలు, ఆడిన కపట నాటకాలు, నడిపిన కుటిల రాజకీయాలు కాశ్మీర్ పుండును ఎంతటి బ్రహ్మ రాక్షసిగా మార్చాయో తేటతెల్లమవుతుంది

ఇలాంటి విషమ స్థితి ఎందుకు వచ్చింది? అనాదిగా మనదనుకున్న కాశ్మీరం ఇప్పటికే మానసికంగా మనది కాకుండా ఎందుకు పోయింది? అసలు కాశ్మీర్ సమస్య ఎలా పుట్టింది? ఏ మలుపులు తిరిగింది? ఎవరివల్ల ఎలా వికటించిందది?

# రాజుగారి డైలమా

చరిత్ర గతి చిత్రంగా ఉంటుంది.

ఒక్కోసారి మన్నుతిన్న పాములా స్తబ్ధంగా ఉంటుంది. ఎవరు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఎన్ని ఉద్యమాలు నడిపినా కోరిన మార్పు రాదు. అడుగు ముందుకు పడదు. అదే చరిత్ర ఒక్కోసారి రేసుగుర్రంలా ఉరుకుతుంది. ప్రచండ వేగంతో పరుగెత్తే పరిణామాలను అకళింపు చేసుకుని లాఘవంగా స్వారీ చేయడం మహారౌతులకే శక్తికి మించిన పని అవుతుంది.

1920లో సహాయ నిరాకరణ ఉద్యమ శంఖాన్ని పూరించినప్పుడు సంవత్సరంలో సాధించి తీరుతామని మహాత్ముడు దృఢంగా నమ్మిన స్వరాజ్యం పావు శతాబ్దానికి కూడా జాడలేదు ఆశపడ్డవారు నీరసించేంత మెల్లిగా నడిచిన స్వాతంత్ర్య రధం 1947 వచ్చేసరికి జెట్ విమానంలా పరుగెత్తింది. భారతదేశం నుంచి 1948 జూన్ నాటికి సామాన్లు సర్దుకు పోతామని 1947 ఫిబ్రవరి 20న బ్రిటిష్ పార్లమెంటులో ప్రధాని అట్లీ ప్రకటించినప్పుడు . ఇంకా సంవత్సరం తరవాత సంగతి కదా, ఈలోపు నింపాదిగా అన్ని ఏర్పాట్లు చేసుకోవచ్చని అందరూ అనుకున్నారు కానీ... దేనికీ వ్యవధి చాలకుండా అప్పటి నుంచీ చరిత్ర దయ్యపు వేగంతో దౌడు తీసింది. అట్లీ ప్రకటన వెలువడ్డ నెలకల్లా చివరి వైస్రాయ్‌గా మౌంట్ బాటన్ వచ్చాడు. వస్తూ రాగానే సతీసమేతంగా సమ్మోహనాస్త్రాలు సంధించి అందరి మతులు పోగొట్టాడు. ఊహకందని రీతిలో పావులు కదిపి, నాయకులందరినీ తెలివిగా బుట్టలో వేసుకుని, అసంభవమనుకున్న దేశ విభజనను సంభవం చేస్తూ జూన్ 3 కల్లా ప్లాను తయారుచేసి, కాంగ్రెసును, గాంధిని తెలివిగా ఒప్పించి, ఎవరికీ బుర్రలు పనిచేసే సావకాశం చిక్కకుండా ఆదరాబాదరా దేశాన్ని చీల్చి, నెత్తురు ముద్ద స్వాతంత్ర్యాన్ని ప్రజల చేతిలో పెట్టాడు. ఊహించని వేగంతో సాగిన పరిణామాల హోరులో, సామూహిక ఊచకోతల ఘోరకలిలో, తమ చుట్టూ ఏమవుతున్నదో ఎటు పోతున్నామో ఎక్కడికి చేరతామో

తెలియని అయోమయంలో మహామహా జాతీయ నాయకులే కిందు మీదయ్యారు హింస హెచ్చి, ఉన్మాదం రెచ్చి, వివేకం చచ్చి ఎవరు చెప్పేదీ ఎవరూ వినిపించుకోక, ఒకరిని ఒకరు అనుమానించి, వెనకటి ధైర్యసాహసాల స్థానంలో భయవిహ్వాలత చోటుచేసుకుని, అల్లకల్లోలంలో వినాశపు దిశగా తెలియని శక్తులేవో నడిపించినట్టల్లా జాతి నేతలు నడిచిన భయానక నేపథ్యంలో . కాశ్మీర్ సమస్యకు తెర లేచింది

కలలో కూడా జరగదని కొద్ది నెలల కిందటి దాకా అనుకున్న దేశ విభజన కాస్తా తరుముకొచ్చి, ఇండియా, పాకిస్తాన్‌లుగా దేశం రెండు ముక్కలవుతున్నప్పుడే కాశ్మీర్ భవిష్యత్తు ఏమిటన్న ప్రశ్న ఉదయించింది అప్పటిదాకా అది బ్రిటిష్ సార్వభౌమత్వానికి లోబడిన స్వతంత్ర సంస్థానం అలాంటి సంస్థానాలు ఆనాడు ఐదువందలకు పైగా ఉన్నాయి ఆంగ్ల సార్వభౌములు నిష్క్రమించడంతో టెక్నికల్‌గా అవి స్వతంత్రమయినట్టే అలాగని సర్వస్వతంత్ర రాజ్యాలుగా దేనికది చలామణి కాగలగడమూ కుదరని పని కాబట్టి ఇండియన్ యూనియన్, పాకిస్తాన్‌లలో ఏదో ఒక దానిలో విలీనం కావడం మినహాగత్యంతరం లేదు అందువల్ల 1947 ఆగస్టు 15లోగా సంస్థానాలు తాము ఎటు కలిసేది నిర్ణయించుకోవాలని మౌంట్ బాటన్ చెప్పాడు నిజానికి ఎంచుకోవడానికి ఛాయిస్ అనేది చాలా సంస్థానాలకు లేదు నాలుగువైపులా భారత భూభాగం ఉన్న సంస్థానం ఇండియాలో విలీనం కావలసిందే తప్ప ఎంత కోరిక ఉన్నా పోయి పాకిస్తాన్‌లో కలవడం సాధ్యపడదు అలాగే పాకిస్తాన్ మధ్యలో ఉన్న సంస్థానం కోరుకున్నా ఇండియాలో చేరలేదు

అటా ఇటా అన్నది ఎంచుకునే అవకాశం ఉన్నదల్లా ఒక్క కాశ్మీర్ సంస్థానానికే ఎందుకంటే . అది భారత్, పాకిస్తాన్‌లకు మధ్యలో ఉంది దేనిలోనైనా కలవవచ్చు

ఎందులో కలిసేది నిర్ణయించవలసింది ఎవరు? సంస్థానాధీశుడా? సంస్థానంలోని ప్రజలా? ఈ విషయంలో సందిగ్దానికి తావే లేదు నిర్ణయాధికారం సంస్థానాధీశుడిదేనని బ్రిటిష్ ప్రభుత్వం ప్రకటించింది అటు కాంగ్రెస్, ఇటు ముస్లింలీగు కూడా అందుకు సరేనన్నాయి ఆ ప్రకారం మిగతా సంస్థానాల వారివలె కాశ్మీర్ రాజు కూడా గడువులోగా తన నిర్ణయాన్ని ప్రకటిస్తే ఏ గొడవా ఉండేది కాదు కాని కాశ్మీర్ మహారాజా హరిసింగ్ ఎటూ తేల్చకుండా పుణ్యకాలం దాటవేశాడు కాశ్మీర్ ఎవరిదో తేలకుండానే దేశం చీలిపోయింది

అదీ సమస్యకు మూలం

అక్కడికీ - వైస్రాయ్ మౌంట్‌బాటన్ 1947 జూన్‌లో స్వయంగా కాశ్మీర్‌కు వెళ్ళి ఏదో ఒకటి త్వరగా తేల్చుమని పబ్లిగ్గానూ . పాకిస్తాన్‌లో చేరమని జనాంతికంగానూ -

రాజా హరిసింగ్‌కు నొక్కి చెప్పాడు

మౌంట్ బాటన్ మాటల్లోనే చెప్పాలంటే

*"On everyone of those four days, I persisted with the same advice· ascertain the will of your people by any means and join whichever Dominion your people wish to join by August 14 this year He did not do that . Had he acceded to Pakistan before August 14, the future government of India had allowed me to give His Highness an assurance that no objection whichever would be raised by them Had His Highness acceded in India by August 14, Pakistan did not then exist and therefore could not have interfered "*

(Time Only to Look Forward Mountbatten's speeches)

*(అక్కడ ఉన్న నాలుగు రోజులూ నేను ఒకే సలహా ఇచ్చాను ఏదో ఒక రకంగా మీ ప్రజల ఇష్టం తెలుసుకుని ఈ సంవత్సరం ఆగస్టు 14 లోగా ఏదో ఒక డొమీనియన్‌లో చేరమని మహారాజా ఆ పని చేయలేదు ఆగస్టు 14 లోగా కనక ఆయన పాకిస్తాన్‌లో విలీనమవదలచుకుంటే తమకు ఎలాంటి అభ్యంతరమూ ఉండదని రాబోయే భారత ప్రభుత్వం స్పష్టీకరించింది తమ తరపున ఈ హామీని మహారాజుకు ఇవ్వమని భారత నాయకులు నాకు చెప్పారు ఒకవేళ రాజు కనుక ఆగస్టు 14 లోపు ఇండియాలో చేరదలచుకుంటే - అప్పటికి పాకిస్తాన్ అనేదే ఉండదు కనక అది అడ్డు తగిలే ఆస్కారమే లేదు )*

ఇదే విషయాన్ని రాజా హరిసింగ్ కుమారుడైన కరణ్‌సింగ్ తన ఆత్మకథ *'Heir Apparent'*లో ఇలా ధ్రువీకరించాడు

*Mountbatten in fact had come to persuade my father to make up his mind well before 15 August and had brought an assurance from the Indian leaders that they would not take objection to his deciding in whatever way he thought fit, even if it was accession to Pakistan. (p 48)*

*(ఆగస్టు 15 లోగా ఒక నిర్ణయానికి రమ్మని మా తండ్రికి నచ్చజెప్పటానికే మౌంట్‌బాటన్ వచ్చాడు తనకు ఏది మంచిదని తోస్తే అలా ఆయన చేసే నిర్ణయానికి- పాకిస్తాన్‌లో చేరాలని ఆయన ఎంచుకున్నా సరే - తాము అభ్యంతరం తెలపబోమన్న భారత నాయకుల హామీని ఆయన తీసుకువచ్చాడు )*

దీన్నిబట్టి తేలేదేమిటంటే .కాశ్మీర్ అనాదిగా తన ప్రాణంలో ప్రాణంగా, తన

సంస్కృతిలో అవిభాజ్య భాగంగా ఎంతలా పెనవేసుకుపోయినా . దేశ విభజనలో అది తన వాటాకే వచ్చి తీరాలని ఇండియా ఎప్పుడూ పట్టుబట్టలేదు కాశ్మీర్‌ను ఎగరేసుకు పోవాలని ముస్లింలీగ్ నాయకులు ఎన్ని ఎత్తులు వేసినా, కాశ్మీర్ తన జేబులో ఉందని మహమ్మదాలీ జిన్నా స్టేట్‌మెంట్లు ఇచ్చినా భారత నాయకులు తొందరపడలేదు పైపెచ్చు .. కాశ్మీర్ కనుక పాకిస్తాన్‌లో చేరాలని ఎంచుకున్నా సరే తమకు అభ్యంతరం ఉండదని, దాన్ని మైత్రీ ఘాతుక చర్యగా పరిగణించబోమని వారు స్పష్టం చేశారు

ఇండియా అంత ''ఔదార్యం'' కనబరచినా సకాలంలో కదలక సమస్యను సాచివేయడం మహారాజా హరిసింగ్ తప్పిదమనడంలో సందేహం లేదు అప్పుడే కనుక దూరం ఆలోచించి, తన పరిమితులను గుర్తించి తన సంస్థానాన్ని ఆయన ఆగస్టు 15 లోగా ఇండియాలో విలీనం చేసి ఉంటే చరిత్ర గతి మరో విధంగా ఉండేది ఆ రాష్ట్రంలో పాకిస్తాన్ భక్తులైన ముస్లిముల్లో అత్యధికులు పొలిమేర దాటి ఆనందంగా ఆవలికి పోయేవారు. పొరుగున ఉన్న పశ్చిమ పంజాబ్, వాయువ్య సరిహద్దు రాష్ట్రాలల్లోని హిందువులు కాశ్మీర్‌కు వచ్చి స్థిరపడేవారు. పంజాబ్ రాజస్థాన్‌లలానే దేశ విభజన అనంతరం జనాభా మార్పిడి అక్కడా జరిగేది. విభజన అనంతర మత కల్లోలాల్లో పాకిస్తాన్ నుంచి గెంటివేయబడ్డ లక్షలాది హిందువులు రావల్పిండి, పెషావర్ లాంటి జిల్లాల నుంచి ఇండియాకు వచ్చి జమ్మూ కాశ్మీర్ గుండానే తూర్పు పంజాబ్‌కు వలసపోయారు ఏ మాత్రం అవకాశం ఉన్నా నైసర్గిక పరిస్థితుల సానుకూలత దృష్ట్యా వారు కాశ్మీర్ లోయలో స్థిరపడేవారు. అనంతర కాలంలో మోరసాచిన అనేక అనర్థాలు దానివల్ల తప్పేవి.

మరి.. ఎటూ తేల్చక విలువైన కాలాన్ని మహారాజా హరిసింగ్ ఎందుకు వృథా చేశారంటే. కారణాలు అనేకం. సమర్థించలేక పోయినా ఆయన అవస్థను అర్థం చేసుకోవచ్చు, అదో చిత్రమైన డైలమా

ఆ సమయంలో కాశ్మీర్ రాజు ముందున్న దారులు మూడు. ఒకటి – ఇండియాలో కలవడం. రెండు – పాకిస్తాన్‌లో చేరడం. మూడు – స్వాతంత్ర్యం ప్రకటించుకోవడం.

ఇండియాలో కలవడం హరిసింగ్‌కు ఇష్టమే. కాని . కలవలేడు ఎందుకంటే ఆ పని చేసిన మరుక్షణం తనకు బద్ధవిరోధి అయిన నేషనల్ కాన్ఫరెన్సు నాయకుడు షేక్ అబ్దుల్లాకు అధికారం అప్పగించమని న్యూఢిల్లీ అడుగుతుందని ఆయన భయం. విలీనం తరవాత మహారాజు నెత్తిన చెంగు వేసుకుని తట్టాబుట్టా సర్దుకుపోవలసిందేనని షేక్ అబ్దుల్లా గట్టిగా చెబుతున్నాడు పోనీ – భారత నాయకులను మంచి చేసుకుని కాశ్మీర్‌లో తన ఉద్వాసనను తప్పించుకుందామా అంటే ఆ ఆశా లేదు కాశ్మీర్‌కు సంబంధించినంత

వరకూ ఇండియాలో జవహర్‌లాల్ నెహ్రూ మాటే వేదవాక్కు. ఆ నెహ్రూకేమో అబ్దుల్లా ఆప్తమిత్రుడు. పైగా హరిసింగ్ అంటే తగని మంట.

దానికీ కారణం లేకపోలేదు. 1946 మేలో డోగ్రా వంశీకుల పాలనపై ధ్వజమెత్తి 'క్విట్ కాశ్మీర్' ఉద్యమం నడిపినప్పుడు షేక్ అబ్దుల్లాను మహారాజా అరెస్టు చేయించాడు. దానిపై నెహ్రూ తీవ్రంగా స్పందించి, అబ్దుల్లాకు సంఘీభావ సూచకంగా కాశ్మీర్‌కు వెళ్ళదలిస్తే ఆయన రాకను రాజుగారు నిషేధించాడు. నిషేధాజ్ఞను ధిక్కరించి నెహ్రూ కాశ్మీర్‌లో అడుగుపెట్టగానే మహారాజు ఆయనను అరెస్టు చేయించాడు. మరికొద్ది నెలల్లో తాత్కాలిక ప్రభుత్వాధినేతగా ఇండియాను ఏలబోతున్న జవహర్‌లాల్ నెహ్రూ అంతటి ప్రజా నాయకుడిని నిర్బంధించడం కంటే అవివేకం, దుస్సాహసం మరొకటి ఉండదు. ఆసమయంలో రాజు కనక కొంచెం తెలివి చూపి, తానై వస్తున్న నెహ్రూను సాదరంగా ఆహ్వానించి, ఆయన స్థాయికి తగ్గట్టు గౌరవించి ఉంటే మునుముందు కాశ్మీర్ చిక్కులను చక్కదిద్దడంలో ఆయన సుహృద్భావం మహారాజుకు కొంతలో కొంత లభించేది. అందివచ్చిన అవకాశాన్ని జారవిడుచుకోవడమే గాక తెగబడి అరెస్టుచేసి భావిభారత ప్రధానిని శాశ్వతంగా తనకు శత్రువును చేసుకున్నాడాయన. సర్దార్ పటేల్ వంటి భారత నాయకులతో హరిసింగ్‌కు సత్సంబంధాలు లేకపోలేదు. స్వతంత్ర భారత ప్రభుత్వంలో సంస్థానాల వ్యవహారాల శాఖను చూసింది పటేలే. ఐదొందల సంస్థానాల్లో ఐదొందల రకాల సమస్యలు ఎదురైతే అన్నిటినీ ఒడుపుగా ధృఢంగా పరిష్కరించిగలిగిన పటేల్‌కు ఏమాత్రం స్వేచ్ఛ దొరికినా కాశ్మీర్ సమస్యను అవలీలగా మూలచ్ఛేదం చేసేవాడే. కానీ... కాశ్మీర్ విషయంలో తాను మినహా మరొకరు కలగజేసుకోవడానికి నెహ్రూ ఒప్పుకోలేదు. ఎందుకంటే ఆయన వంశానికి చాలా తరాలుగా కాశ్మీర్‌తో అనుబంధం. మనోహరమైన కాశ్మీర్ ప్రకృతిని తలచుకుంటేనే ఆయనలోని భావుకుడు వెర్రెత్తేవాడు. పైగా 'కాశ్మీర్ సింహం' అని తాననుకున్న అబ్దుల్లా అంటే నెహ్రూకి మహా గురి. ఏతావతా తాను అల్లారుముద్దుగా చూసుకునే కాశ్మీర్‌లో మరొకరి జోక్యాన్ని ఆయన సహించేవాడు కాదు. అంతిమ నిర్ణేత అయిన ఆ నెహ్రూతో సంబంధాలనే మహారాజా చేతులారా చెడగొట్టుకున్నాడు. న్యూఢిల్లీతో తనకు తలుపులు మూసుకుపోయాయని, ఇండియాలో కలిస్తే నెహ్రూ అండతో అబ్దుల్లా తనను వెంటపడి వెళ్లగొట్టక మానడని ఆయన భయపడ్డాడు. అదీగాక జమ్మూకాశ్మీర్ సంస్థానంలో మెజారిటీ ప్రజలు ముస్లింలు కనుక పాకిస్తాన్‌ను కాదని ఇండియాలో చేరితే పెద్ద ప్రతిఘటన రావచ్చుననీ ఆయన శంకించాడు.

పోనీ. పాకిస్తాన్‌లో చేరదామా అంటే దానికీ రాజుకు మనస్కరించలేదు. తమలో కలిస్తే చాలు బాగా చూసుకుంటామని, అడిగిన వరాలన్నీ ఇస్తామని జిన్నా ఎప్పటినుంచో

ఆయనకు ఎరలు విసురుతున్నాడు నెహ్రూలాగా జిన్నాకు అబ్దుల్లా మీద ప్రేమ ఏమీ లేదు అసలు నేషనల్ కాన్ఫరెన్సే ఒక దొంగల ముఠా అని జిన్నా పబ్లిగ్గా ఈసడించాడు కనక పాకిస్తాన్‌లో చేరితే తన భవిష్యత్తు గురించి భయం లేదు కాని – హరిసింగ్ హిందువు ఇండియా అంటే ఆయనకు సెంటిమెంటు జాస్తి 1931లో లండన్ రౌండ్ టేబుల్ కాన్ఫరెన్సుకు సంస్థానాల ప్రతినిధిగా వెళ్లి, ఇండియాకు సంపూర్ణ స్వాతంత్ర్యం ఇవ్వాలని గట్టిగా డిమాండు చేసి బ్రిటిషు వారికి కంటగింపు అయినవాడాయన తన సంస్థానంలోని దేవాలయాలన్నిటిలోకి హరిజనులను 1932లోనే అనుమతించి, అందుకు అడ్డుపడ్డ ఆస్థాన పురోహితుడిని పీకి పడేయగలిగిన సంస్కరణశీలి ఆయన హిందువులలోని మతమౌఢ్యాన్ని వ్యతిరేకించినట్టే ముస్లింలీగు మతోన్మాదాన్నీ ఆయన సహించలేకపోయాడు తనకు వ్యక్తిగతంగా ఎంత లాభం ఉన్నా పాకిస్తానీలతో చేయి కలపడానికి తన డోగ్రా వంశీకులే ససేమిరా సమ్మతించరని ఆయనకు తెలుసు అలాగే ముస్లిం మతోన్మాదుల బారి నుంచి తన సంస్థానం హిందువుల ధన మాన ప్రాణాలను కాపాడటం అసాధ్యమనీ ఆయన ఎరుగును అందుకే మౌంట్‌బాటన్ స్వయంగా వచ్చి 'ఇండియా ఏమీ అనుకోదు వెళ్ళి పాకిస్తాన్‌లో చేర' మని దుర్బోధ చేసినా మహారాజా మెత్తపడలేదు

ఈ విధంగా . ఇండియాలో చేరాలని ఉన్నా భవిష్యత్తు మీది భయంతో చేరలేక పాకిస్తాన్ రమ్మని పిలిచినా అటు మొగ్గేందుకు మనసొప్పక గుంజాటన పడ్డ స్థితిలో రాజాహరిసింగ్‌కు స్వాతంత్ర్యం ప్రకటించుకోవడం ఒక్కటే రాజమార్గంగా తోచింది తన పూర్వీకుడు గులాబ్‌సింగ్ వలె తానూ స్వతంత్ర డోగ్రా సామ్రాజ్యాన్ని స్థాపించి ప్రపంచ ఖ్యాతి గడించటం ఊహించడానికి రమ్యంగా ఉన్నా ఆచరణలో అయ్యే పనికాదు. ఉద్ధతులైన ఇండియా, పాకిస్తాన్‌ల మధ్య స్వతంత్రంగా కొనసాగడం అల్పవనరుల రాజ్యానికి కలలో మాట పైగా దానివల్ల ఎటు నుంచి దాడి వచ్చినా రెండోవైపు నుంచి రక్షణ లభించే ఆస్కారం ఉండదు హరిసింగ్ మాత్రం ఇలాంటి భయాలేవీ పెట్టుకోకుండా చాలా రోజులు స్వతంత్రపు ఆలోచననే మూర్ఖంగా పట్టుకు వేలాడాడు ఆ దశలో ఆయనను పెడదారి పట్టించిన కరకట దమనకులిద్దరు. ఒకరు సన్యాసి. రెండోవారు సంసారి. తాను గద్దెనెక్కగానే చాలా ఏళ్ళ కిందటే సంస్థానం నుంచి గెంటివేసిన స్వామి సంత్‌దేవ్ అనే కపట సన్యాసిని హరిసింగ్ 1944లో మళ్ళీ నెత్తిన పెట్టుకుని, 1946లో రాజగురువుగా ప్రకటించాడు. అప్పటి నుంచీ ఆయన నంది అంటే నందే. పంది అంటే పందే అదిగో – ఆ మహానుభావుడే. నువ్వు కనక స్వతంత్రం ప్రకటించుకుంటే నా మహిమతో అఖండ రాజయోగం పట్టి చక్రవర్తిలా వెలిగిపోగలవని హరిసింగుకు ఆశపెట్టాడు. నిజమే కాబోలని ఆయన అమాయకంగా నమ్మాడు. దానికి తగ్గట్టు అదే సమయంలో ఆయనకు ప్రధానిగా

ఉన్న రామచంద్రకక్ కూడా రాజగురువు మంత్రానికి తన మంత్రాంగాన్ని జోడించి స్వతంత్రంగా సాగడమే దివ్యమైన దారి అని చచ్చు సలహా ఇచ్చాడు ఈ ఇద్దరి ప్రభావంలో పడి మహారాజా హరిసింగ్ ప్రాప్తకాలజ్ఞత లేకుండా 1947 ఆగస్టు 15కు కూడా ఎటూ తేల్చకుండా తన నెత్తికి తానే చేతులు తెచ్చుకున్నాడు దేశవిభజన కాస్తా జరిగి, పాకిస్తాన్ ఆవిర్భవించి, తనను అడకత్తెరలో నొక్కడం మొదలెట్టాక కంగారుపడి అటు పాకిస్తాన్‌తోనూ, ఇటు ఇండియాతోనూ యథాస్థితిని కొనసాగిస్తూ ఆపద్ధర్మ ఒప్పందానికి (Standstill Agreement) అంగలార్చాడు అదే ప్రకారం - పాకిస్తాన్‌తో హడావుడిగా అగ్రిమెంటు కుదుర్చుకుని గొప్ప దౌత్య విజయం సాధించానని భ్రమించాడు ఘోరంగా మోస పోయాడు ఆలస్యంగా కళ్ళయితే తెరిచాడు, కానీ - అప్పటికే పరిస్థితి చెయి దాటిపోయింది

# మౌంట్‌బాటన్ నమ్మకద్రోహం

*1 9 4 7 అక్టోబర్ 24. విజయదశమి.*

*హిందూ రాజ్యమైన కాశ్మీర్‌లో శరన్నవరాత్రులు ఎప్పటిలాగే కన్నుల పండువగా గడిచాయి. చివరి రోజున తరతరాల ఆనవాయితీ ప్రకారం శ్రీనగర్ రాజప్రాసాదంలో దసరా దర్బార్ వైభవంగా నడుస్తున్నది. మహారాజా హరిసింగ్ వజ్రాలు పొదిగిన తలపాగాతో, మరకత మాణిక్యాల కంఠాభరణాలతో మెరిసిపోతూ స్వర్ణ సింహాసనం మీద ఠీవిగా కూచుని వందిమాగధుల కైవారాలను, వందలాది రాజ్యప్రముఖుల, రాజబంధువుల కైమోడ్పులను సంతోషంగా సగర్వంగా అందుకుంటున్నాడు గొప్పగొప్ప రాజపురుషులు ఒక్కరొక్కరే వచ్చి పట్టురుమాళ్లలో చుట్టిన బంగారు కణికను సవినయంగా మహారాజుకు సమర్పించి సంప్రదాయబద్ధంగా తమ విధేయతను చాటుకుంటున్నారు. తన పూర్వీకుడు గులాబ్‌సింగ్ మహారాజు కాలం నుంచీ అఖండంగా వెలిగిపోతున్న డోగ్రా రాజ్య విశిష్ట ప్రతిష్ఠను తలచుకుంటూ, ప్రపంచమంతా తన ముందు సాగిలపడుతోందన్న అనుభూతితో రాజుగారు చిరునవ్వులు ఒలికిస్తుండగా...*

ఎప్పుడూ జరగనిది, జరగకూడనిది జరిగింది. హఠాత్తుగా లైట్లు ఆరిపోయాయి. కళాత్మకంగా అలంకరించిన షాండిలీర్లతో దీపాల తోరణాలతో దేదీప్యమానంగా వెలిగిపోతున్న రాజప్రాసాదం అంతటా చిమ్మచీకట్లు కమ్మాయి. వందలాది రాజవంశీకులు, రాజోద్యోగులు, వారి కుటుంబసభ్యులు, వందలాది నౌకర్లు చాకర్లు ఏమి జరుగుతున్నదో తెలియక, కన్ను పొడుచుకున్నా తెన్నుకానక కంగారుపడ్డారు. ఎక్కడో ఫ్యూజ్ పోయింది కాసేపట్లో లైట్లు వస్తాయి లెమ్మని సరిపుచ్చుకున్న దొరబాబులకు విషయం తెలిసేసరికి మతులు పోయాయి. ఒక్క రాజభవనంలోనే కాదు. . మొత్తం శ్రీనగర్‌లోనే కరెంటు

పోయింది అదీ యాదృచ్ఛికంగా కాదు. . అక్కడికి 50మైళ్ల దూరంలోని మహుర పవర్‌స్టేషనును పాకిస్తానీ దుండగులు డైనమైట్లతో పేల్చివేశారు.

పేల్చినవారు ఊరుకోలేదు. మిడతల దండులా, పిశాచుల మూకలా రివ్వున దూసుకొస్తున్నారు – శ్రీనగర్ దిశగా! కాశ్మీర్‌ను కార్చిచ్చులా దహించి, మహారాజును వీలైతే చంపి లేదా ఎత్తుకుపోయి, మెడమీద కత్తిపెట్టి పాకిస్తాన్‌లో విలీనమవుతున్నట్టు బలవంతంగా సంతకం చేయించాలన్నది వారికి పురమాయించిన పని. పేరుకు కొండజాతి దండు అయినా వారిలో చాలామంది సాదా దుస్తుల్లోని పాకిస్తానీ సైనికులే వారందరి చేతిలో ఉన్నవి పాకిస్తానీ సైనిక మారణాయుధాలే.

పవర్ పోయిన చాలాసేపటిదాకా అదెందుకు జరిగిందో గ్రహించలేనట్టే – ఏకంగా తన రాజరికానికే పవరు ఊడుతున్న సంగతీ మహారాజావారు చేతులు కాలేదాకా పోల్చుకోలేకపోయారు.

వాస్తవానికి సుందర కాశ్మీరం దుండగుల పాలబడి అప్పటికి నాలుగు రోజులైంది. తనకు ప్రత్యేక నైపుణ్యం గల 'డైరెక్ట్ యాక్షన్' ఆగ్నేయాస్త్రాన్ని మహమ్మదాలీ జిన్నా దొంగచాటుగా కాశ్మీర్ మీదికి ప్రయోగించడానికి ముందు చాలా కథ నడిచింది.

ఇండియాలో విలీనాన్ని గట్టిగా వ్యతిరేకించిన ప్రధాన మంత్రి రామచంద్రకక్‌ను రాజాహరిసింగ్1947 ఆగస్టు 10న డిస్మిస్ చేయగానే పాకిస్తానీలు చాలా భయపడ్డారు– ఇక కాశ్మీర్‌ను తీసుకుపోయి అయన ఏకంగా ఇండియాలో కలిపేస్తాడేమోనని అలాంటిదేమీ జరగలేదు పైగా ఇండియా, పాకిస్తాన్‌లతో యధాస్థితినే కొనసాగించాలని మహారాజు నిశ్చయించాడు దీంతో తెప్పరిల్లిన పాకిస్తాన్ అయన కోరినదే తడవుగా స్టాండ్‌స్టిల్ అగ్రిమెంటునైతే కుదుర్చుకున్నది. సంతకాల తడి ఆరకుండానే దానిని ఆచరణలో తుంగలోతొక్కి కాశ్మీర్‌ను అడకత్తెరలో పెట్టి నొక్కడానికి పెద్దవ్యూహం పన్నింది. ఇందులో భాగంగా కాశ్మీర్‌కు అత్యవసర సరఫరాలేవీ అందకుండా మొదట ఆర్థిక దిగ్బంధం విధించింది.

ఉండటానికి ఇండియా, పాకిస్తాన్‌ల మధ్య ఉన్నా జమ్మూ కాశ్మీర్ వాణిజ్య మార్గాలన్నీ పాకిస్తాన్‌తోనే లంకె పడి ఉన్నాయి. సియాల్ కోటతో జమ్మూకు... రావల్పిండి, అబ్బోతాబాద్‌లతో శ్రీనగర్‌కు వాతావరణ పరిస్థితులతో నిమిత్తం లేని పక్కా రోడ్లున్నాయి ఉప్పు, సబ్బు, చక్కెర, తిండిగింజలు, పెట్రోల్, కిరోసిన్ లాంటి నిత్యావసర వస్తువులన్నిటినీ రావల్పిండి, సియాల్‌కోటలలో నిల్వచేసి అక్కడి నుంచి లారీల్లో కాశ్మీర్ సంస్థానానికి మరలించడం రివాజు. అత్యవసరమైన ఆ సరుకుల రవాణానే పాకిస్తాన్ అర్ధాంతరంగా

అడ్డుకుంది అప్పటికే డబ్బు చెల్లింపు అయిపోయిన సరుకులను చేరవేసేందుకు శ్రీనగర్‌కు పంపిన మోటారు వాహనాలను కూడా పాక్ అధికారులు సీజ్ చేశారు జమ్మూతో సియాల్‌కోటకు రైలు లింకును తెంపేశారు పెట్రోలు వంటి అత్యవసర సరఫరాలే సవ్యంగా అందక మిలిటరీ వాహనాల రాకపోకలకూ ఆటంకం కలిగింది ప్రజా జీవితం అనేక అగచాట్ల పాలయింది ఆర్థిక దిగ్బంధంతోబాటే కాశ్మీర్ మీద ప్రాపగాండా యుద్ధాన్నీ పాకిస్తాన్ పథకం ప్రకారం మొదలెట్టింది లాహోర్ నుంచి ముస్లిం విద్యార్థుల, అధ్యాపకుల బృందాలను పంపి, ఇండియాకు, హిందువులకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున మత విద్వేషాన్ని రెచ్చగొట్టి, జమ్మూకాశ్మీర్ పోలీసు, మిలటరీ, ప్రభుత్వ అధికార యంత్రాంగంలోని ముస్లింలు చాలామందిని తమ వైపునకు లాగేసుకున్నారు కల్నల్ అదాలత్‌ఖాన్ లాంటి ఉన్నత సైన్యాధికారులు, జమ్మూలో పోలీసు సూపర్నెంటు, బారాముల్లా జిల్లా అధికారి లాంటి ఉన్నతాధికారులు ఎందరో పాక్ భక్తులై బాహాటంగా తమ ప్రభుత్వం మీదే తిరుగుబాటును రెచ్చగొట్టారు సరయిన కాపలాకే దిక్కులేని సరిహద్దుల గుండా పాకిస్తానీ ఆయుధాలు, మందుగుండు సామాగ్రి యధేచ్ఛగా కాశ్మీర్‌లో పోగు పడసాగాయి జమ్మూ, శ్రీనగర్ మసీదుల్లో తుపాకుల శిక్షణను ముమ్మరం చేశారు అదే సమయంలో అధికారుల దృష్టిని మళ్ళించి, ఉన్న కొద్దిపాటి భద్రతా బలగాలను చెల్లాచెదురు చేయడానికి పశ్చిమ సరిహద్దు పొడవునా ముఖ్యంగా పూంచ్ ప్రాంతంలో స్థానిక ముస్లింలను అల్లర్లకు ఎగదోశారు

ఈ పరిణామాల సెగ సోకాక ఆలస్యంగా కళ్ళు తెరిచిన మహారాజా హరిసింగ్ కార్యదక్షుడయిన మెహర్‌చంద్ మహాజన్‌ను కొత్త ప్రధానిగా నియమించాడు. షేక్ అబ్దుల్లాను, నేషనల్ కాన్ఫరెన్సు ఇతర నాయకులను జైలు నుంచి విడిచిపెట్టాడు మహాజన్ భారత నాయకులకు సన్నిహితుడు అబ్దుల్లా నెహ్రూకు ఆప్తమిత్రుడు కాబట్టి కాశ్మీర్ మహారాజు ఇండియా ప్రభావంలో పడిపోతాడని శంకించిన పాక్ పాలకులు అందుకు ప్రతిచర్యగా ఆఫ్ఘన్ దుండగులను కూడగట్టి, పాక్ సైనికులను తోడిచ్చి, ఆయుధాలను అందించి కాశ్మీర్ మీదికి అక్టోబర్ 20 అర్ధరాత్రి నేరుగా దండెత్తించారు. అలా వచ్చిన వారు శ్రీనగర్ దరిదాపులకు చేరి రాజు భరతం పట్టేందుకు దూసుకు రాబోతుండగా . రాజా హరిసింగ్‌కు ప్రాప్తకాలజ్ఞత కలిగింది. తన సైన్యమే, తన పోలీసులే తనకు ఎదురు తిరిగి శత్రువుతో చేతులు కలిపి తన మీదికే తుపాకి ఎత్తిన సంకట సమయంలో 'రావే! రక్షక! కావవేవరద' అంటూ న్యూఢిల్లీకి సైనిక సాయం కోసం అక్టోబర్ 24న ఆర్తనాదాలు చేశారు.

సాయం చేయడానికి ఇండియాకు అభ్యంతరం లేదు. కాని. కాశ్మీర్ వచ్చి

ఇండియాలో యథావిధిగా విలీనమైతే తప్ప దాని రక్షణ బాధ్యతను భారత్ స్వీకరించజాలదు విలీనం సంగతి తేలకుండా సైనిక చర్యకు దిగితే అంతర్జాతీయం గానూ, దౌత్యపరంగానూ అనేక సమస్యలు వస్తాయి అందుకే ముందు విలీనం సంగతి తేల్చమని భారతప్రభుత్వం మహారాజును అడిగింది ఈలోపు పరిస్థితిని మదింపు చేయడానికి సంస్థానాల మంత్రిత్వశాఖ కార్యదర్శి వి పి మీనన్‌ను హుటాహుటిన శ్రీనగర్ పంపారు పరిస్థితి త్వరితగతిన విషమిస్తోందని గ్రహించిన మీనన్ 'ఇంకా ఇక్కడ మీరు ఉంటే ప్రమాదమ'ని సమయానికి సరయిన సలహా ఇచ్చి మహారాజును సపరివారంగా శ్రీనగర్ నుంచి ఉన్నపళాన జమ్మూకు తరలి పొమ్మన్నాడు అలాగే ఇండియాలో విలీనానికి ఆయనను ఒప్పించి అంగీకారపత్రాన్ని కూడా తీసుకుని వెంటనే ఢిల్లీ తిరిగి వెళ్ళాడు

చిరకాలపు అనిశ్చితి తొలిగి ఇండియాలో కలిసేందుకు కాశ్మీర్ సంస్థానం ఒప్పుకోవడం కంటే న్యూఢిల్లీ కోరదగింది మరొకటి లేదు అఫ్ఘన్, పాకిస్తాన్, రష్యా, చైనాలకు సరిహద్దుల్లో ఉండి వ్యూహాత్మకంగా కీలకమైన కాశ్మీర్ మీద ప్రాచీన కాలం నుంచీ తనకు గల సహజసిద్ధమైన క్లెయిమును ఖాయపరచుకోవడానికి చరిత్ర ఇచ్చిన సావకాశాన్ని భారత్ సరిగ్గా వినియోగించుకుని ఉంటే చరిత్రగతి మరో విధంగా ఉండేది.

కాశ్మీర్ విలీనానికి సంబంధించినంతవరకూ నిర్ణయాధికారం మహారాజుదే. బ్రిటిష్ సార్వభౌమత్వం పోయాక సంస్థానాల భవిష్యత్తును సంస్థానాధీశుడే నిశ్చయించాలన్నది బ్రిటిష్ ప్రభుత్వం పెట్టిన రూలే ఇండియా, పాకిస్తాన్‌లు రెండూ ఇష్టపూర్తిగా కట్టుబడిన నిబంధనే అది. ఈ పరిస్థితుల్లో అందరూ ఒప్పుకున్న ప్రాతిపదిక ప్రకారం కాశ్మీర్ మహారాజు కోరినదే తడవుగా కాశ్మీర్‌ను తనలో కలిపేసుకోవడానికి ఇండియా ఎగిరి గంతేసి ఒప్పుకోవలసింది

కాని అదేమి మాయాజాలమో కాని కాశ్మీర్ కోరి తన కాళ్లదగ్గరికి వచ్చినా దానిని చప్పున అక్కున చేర్చుకోవడానికి అప్పటి గవర్నర్ జనరల్ మౌంట్‌బాటన్ ఉత్సుకత చూపలేదు ఇండియాలో విలీనానికి సమ్మతిస్తూ మహారాజు లేఖను తీసుకువచ్చిన కాశ్మీర్ ప్రధాని మెహర్‌చంద్ మహాజన్‌కు భారత్ గుంజాటన చూసి ఓరిమి నశించింది 'నేను తెచ్చింది ఈ ఒక్క ఉత్తరమే కాదు. పాకిస్తాన్‌లో కాశ్మీర్‌ను విలీనం చేస్తానంటూ మహారాజుగారు ఇచ్చిన ఇంకో లేఖ కూడా నా దగ్గర ఉంది మీరు కనక ఎటూ తేల్చకపోతే ఇటు నుంచి నేరుగా జిన్నా దగ్గరికి వెళ్ళి కాశ్మీర్‌ను అప్పగించడం కంటే నాకు గత్యంతరం లేదు' అని ఆయన బెదిరించిన తరవాత గానీ మౌంట్‌బాటన్‌కు విలీనాన్ని ఒప్పుకుందుకు చేతులు రాలేదు!

కనీసం అప్పుడైనా తిన్నగా నడిచాడా? ఇండియాలో కాశ్మీర్ విలీనానికి విదిలేక సరేనంటూనే పెద్ద మడత పేచీ పెట్టాడు

1947 అక్టోబర్ 26న లార్డ్ మౌంట్‌బాటన్‌కు పంపిన లేఖలో మహారాజా హరిసింగ్ ఇలా అన్నాడు (లేఖ పూర్తి పాఠాన్ని అనుబంధం-2లో చూడండి)

*With the conditions obtaining at present in my State and the great emergency of the situation as it exists, I have no option but to ask for help from the Indian Dominion Naturally they cannot send the help asked for by me without my State acceding to the Dominion of India I have accordingly decided to do so and I attach the Instrument of Accession for acceptance by your Government*

*(నా సంస్థానంలో ఇప్పుడున్న అత్యయిక పరిస్థితుల్లో ఇండియా నుంచి సహాయం అడగటం కంటే నాకు గత్యంతరం లేదు నా సంస్థానం ఇండియన్ డొమీనియన్‌లో విలీనం కాకుండా నేనడిగిన సాయాన్ని వారు సహజంగానే పంపలేరు ఆ ప్రకారమే చేయడానికి నిర్ణయించి నేను విలీన పత్రాన్ని మీ ప్రభుత్వ ఆమోదం కోసం పంపుతున్నాను )*

విలీనానికి సమ్మతిస్తూ మరునాడు అక్టోబర్ 27న లార్డ్ మౌంట్ బాటన్ మహారాజాకు రాసిందిది: (దీని పాఠాన్ని అనుబంధం-2లో చూడండి)

*In the special circumstances mentioned by Your Highness my Government have decided to accept the accession of Kashmir State to the Dominion of India It is my Government's wish that as soon as law and order have been restored in Kashmir and her soil cleared of the invaders, the question of the State's accession should be settled by a reference to the people .....*

*(తమరు పేర్కొన్న ప్రత్యేక పరిస్థితుల్లో నా ప్రభుత్వం ఇండియాలో కాశ్మీర్ సంస్థాన విలీనాన్ని అంగీకరించాలని నిర్ణయించింది కాశ్మీర్‌లో శాంతిభద్రతల పునరుద్ధరణ జరిగి, ఆ గడ్డ నుంచి ఆక్రమణదారులను తొలగించిన వెంటనే సంస్థానం విలీనం ప్రశ్నను ప్రజలకు నివేదించడం ద్వారా తేల్చాలని నా ప్రభుత్వం కోరుకుంటున్నది.)*

**అనంతర కాలంలో కాశ్మీర్‌కు వచ్చిన తలనెప్పులన్నిటికీ మూలం ఈ చివరి లైనులోనే ఉంది. ఆవేళ మౌంట్‌బాటన్ బుద్ధిపూర్వకంగా పెట్టిన ఆ పితలాటకం నుంచి ఈనాటికీ ఇండియా బయటపడలేకపోతోంది.**

సూటిగా చెప్పాలంటే ఆనాటి భారతంలో, మౌంట్‌బాటన్ పోషించినది శకుని పాత్ర.

సంస్థానాలు ఎటువైపు విలీనమవ్వాలో ఆ సంస్థానం ప్రజల నడిగి ఖరారు చేయాలన్నది ఆ క్షణం వరకూ ఎవరూ కోరని, ఎవరికీ తట్టని నడమంత్రపు ఆలోచన. ఉపఖండంలో అధికారం మార్పిడికి ప్రాతిపదిక అయిన ఇండియన్ ఇండిపెండెన్స్ యాక్ట్‌లో అలాంటి ఊసే లేదు 1946లో ఆలిండియా ముస్లింలీగు చేసిన తీర్మానం సంస్థానాల విలీనాన్ని నిర్ణయించడంలో సంస్థానాధీశులే సర్వాధికారులని స్పష్టంగా పేర్కొనడంవల్ల పాకిస్తానీ నేతలూ ఇందుకు భిన్నంగా నోరెత్తలేరు కాశ్మీర్ మీద పాకిస్తాన్‌కు ఎంత కన్నుపడ్డా, మహారాజు నిర్ణయాన్ని ఆఖరికి మహమ్మదాలీ జిన్నా కూడా కాదనలేడు ఎందుకంటే అదే సమయంలో రగులుతున్న జునాగఢ్ సంస్థానం వివాదంలో – సంస్థానాధీశుడి ఇష్టానికి తిరుగులేదని జిన్నా ఢంకా బజాయిస్తున్నాడు విలీనం తరవాత కాశ్మీర్ మహారాజుతో భారత ప్రభుత్వం కుదుర్చుకున్న విలీన పత్రం (Instument of Accession)లో కూడా ప్రజాభిప్రాయాన్నిబట్టి తుది నిర్ణయమన్న ప్రస్తావనే ఎక్కడా లేదు (విలీనపత్రం పాఠాన్ని అనుబంధం–2లో చూడండి)

పోనీ – ఇండియాలో విలీనం కాశ్మీరీ ప్రజలకు ఇష్టం లేదనడానికి ఆధారాలున్నాయా? ఆ కాలంలో జమ్మూ కాశ్మీర్ రాష్ట్ర ప్రజలందరికీ ప్రాతినిధ్యం వహిస్తున్నదని అందరూ అంగీకరించిన నేషనల్ కాన్ఫరెన్సు కూడా మహారాజుకు తాను ఎంత బద్ధ విరోధి అయినా ఇండియాతో విలీనాన్నే వాంఛించింది. ఆ పార్టీ నాయకుడు షేక్ అబ్దుల్లాకే విలీనానంతరం అధికారం దక్కింది ఇక వివాదానికి ఆస్కారమెక్కడ?

కాశ్మీర్‌కు ఇండియా సైన్యాన్ని పంపినందుకు జిన్నా మండిపడి, పాక్ సైన్యాన్ని నేరుగా అక్కడికి దించమని పురమాయిస్తే సైనిక దళాల జాయింట్ కమాండ్ అధిపతి ఫీల్డ్‌మార్షల్ అచిన్‌లెక్, ఖండితంగా తిరస్కరించాడు. విలీనం తరవాత కాశ్మీర్ ఇండియాలో భాగమై పోయింది. కనక అక్కడికి భారత దళాలను పంపడం సబబేనని, జిన్నా కనక తొందరపడి యుద్ధానికి దిగితే పాక్ దళాలలోని ఆంగ్లేయ అధికారులందరినీ వెంటనే ఉపసంహరిస్తానని ఆయన హెచ్చరించాడు.

ఇలా– ఇండియాలో కాశ్మీర్ విలీనం చట్టబద్ధతను ప్రశ్నించేందుకు ఇసుమంతైనా ఆస్కారం లేకపోయినా .. యథావిధిగా విలీనం జరిగిన తరవాత కూడా దానిని పొసగనీయకుండా మౌంట్‌బాటన్ అడ్డుపడ్డాడు. కాశ్మీర్‌పై వివాదమేదో ఉన్నట్టూ, ప్రజల ద్వారా దాన్ని తేల్చకుండా విలీనానికి సమ్మతిస్తే యుద్ధమేదో తప్పనట్టూ భారత ప్రభుత్వానికి నూరిపోశాడు కాశ్మీర్ మాదే కాబట్టి ఎల్లకాలం దానిని మేము కాపాడుకుంటాం అని కచ్చితంగా చెప్పవలసింది పోయి... ఇప్పుడు జరిగిన విలీనం విలీనమే కాదు తరవాతెప్పుడో

ప్రజలు తీర్పు చెప్పేదాకా అది ఎటూ తేలేదీ కాదు రాజు అడిగాడు కాబట్టి ఇప్పుడు సైన్యాన్ని పంపుతున్నా, మామూలు పరిస్థితిని పునరుద్ధరించగానే దాన్ని వెనక్కు పిలిపిస్తాం. కాశ్మీర్‌ను పరాయి రాజ్యంగానే చూస్తాం - అని భారత ప్రభుత్వం చేత పదేపదే అనిపించి ఇండియా వేలితోనే ఇండియా కన్నును పొడిపించిన మాయావి మౌంట్‌బాటన్!

'వివాదం', 'ప్రజాభిప్రాయం' అంటూ మిషపెట్టి కాశ్మీర్ విలీనాన్ని పొసగనీయకుండా చేసి , ఫుల్‌స్టాప్ పెట్టవలసిన చోట క్వశ్చన్ మార్కును పెట్టించడంలో మౌంట్‌బాటన్ అంతర్యమేమిటన్నది రహస్యమేమీ కాదు. అదేమిటో బ్రిటిష్ రాజుకు తరవాత పంపిన రహస్య నివేదికలో ఆయనే బయటపెట్టాడు

*"I am convinced that a population containing such a high proportion of Moslems would certainly vote to join Pakistan"*

*(అంత ఎక్కువ సంఖ్యలో ముస్లింలు ఉన్న జనాభా పాకిస్తాన్‌లో చేరాలని కచ్చితంగా ఓటు చేస్తుందని నా దృఢ విశ్వాసం)* అని 1947 నవంబర్ 7వ తేదీ రిపోర్టులో ఆయన సెలవిచ్చాడు

అదీ సంగతి! కాశ్మీర్ ఇండియాకు దక్కడం ఇంగ్లండుకు ఇష్టంలేదు భౌగోళికంగా, సైనిక పరంగా కీలకమైన ఆ ప్రాంతం పాకిస్తాన్ చేతుల్లో ఉంటే . ఆ పాకిస్తాన్‌ను తాము గుప్పిట్లో పెట్టుకుని చరిత్రను శాసించగలమని.వారి ఆలోచన అందుకే 1947 జూన్‌లో మౌంట్‌బాటన్ స్వయంగా శ్రీనగర్ వెళ్ళి మీరు కనుక పాకిస్తాన్‌లో చేరితే ఇండియా ఏమీ అనుకోదని మహారాజుకు భరోసా ఇచ్చాడు. అందులోని 'ధ్వని'ని పట్టించుకోకుండా ఆ మహారాజు ఇండియాలో కలవడానికి స్వయంగా తానే ముందుకొస్తేనేమో సంతకాలు చేసినట్టే చేసి, 'అయినా సరే తరవాత మీ జనం ఒప్పుకుంటేగానీ ఇది ఖరారు కాదు' అని అడ్డగోలు షరా పెట్టాడు. కాశ్మీర్‌లో మెజారిటీ జనం ముస్లింలు కనక వారిని అడిగితే పాకిస్తాన్‌కే ఓటు చేస్తారని తెలిసే . అలా జరగాలని కోరుకునే.. విలీనాన్ని నీరుగార్చి నిరర్థకపు తగవుకు మౌంట్‌బాటన్ చేజేతులా అస్కారం ఇచ్చాడు! పెద్ద మనిషి, పరిపాలనాదక్షుడు, ఇండియాకు మిత్రుడు అని నమ్మి మౌంట్‌బాటన్‌ను స్వతంత్ర భారతంలో గవర్నర్ జనరల్‌గా నెత్తిన పెట్టుకున్నందుకు నెహ్రూను తెలివిగా బుట్టలో వేసి, ఆ తెల్లవాడు మనకు చేసిన 'మేలు' ఇది!

తిరుగులేని విలీనాన్ని లేనిపోని వివాదంగా మార్చిన కరణీకంతోటే మౌంట్‌బాటన్ నమ్మకద్రోహం ముగియలేదు అసలు కథ అప్పుడే మొదలైంది

# ఆలస్యం తెచ్చిన అనర్థం

కాసేపటికి రెయిడర్లు మమ్మల్ని చెర నుంచి బయటికి తెచ్చి నది ఒడ్డున డోమెల్ బ్రిడ్జి వైపు నడిపించసాగారు. అక్కడ నేను చూసిన భయంకర దృశ్యం ఈ జన్మలో మరచిపోలేను. మానం కాపాడుకోవటానికి నదిలో దూకిన మహిళల గురించి అంతకు ముందు విన్నాను. ఆ రోజు ప్రత్యక్షంగా చూశాను. కొందరు స్త్రీలు ఒడ్డున నిలబడి నిర్వికారంగా శూన్యంలోకి చూస్తున్నారు. కొంతమంది దిగువన మోకాలిలోతు నీళ్లలో ఉన్నారు. సుడులు తిరుగుతూ వడిగా పారుతున్న కృష్ణగంగ నదిలోకి చంటిబిడ్డలను తల్లులు విసిరేస్తున్నారు

ప్రాణంలో ప్రాణంగా, అల్లారుముద్దుగా పెంచుకున్న చిన్నారి శిశువుల ప్రాణం కడబట్టి కెవ్వున వేస్తున్న చావుకేకలు వారిని కదిలించలేదు. ఎన్నో రోజులుగా తిండి, నీరు లేక, పశువుల కంటే హీనంగా అవస్థలు పడి, నరపిశాచుల బారిన నానా అవమానాలు పడి, మరెన్నో అఘాయిత్యాలకు, అత్యాచారాలకు లోనవక తప్పని స్థితిలో వారి మొహాల్లో కళలేదు ఎలాంటి ఉద్వేగమూ లేదు. ప్రాణభయంతో ఆక్రందిస్తున్న పసిపిల్లలను ప్రచండ ప్రవాహం శాశ్వతంగా నదీగర్భంలోకి కలిపేసుకో గానే. . తల్లులూ చెంగున నదిలోకి దూకారు. క్షణంలో అంతా అయిపోయింది. నిండు బతుకులు నిలువునా జలసమాధి అయ్యాయి.

ఇదంతా నిర్ఘాంతపోయి చూస్తుండగానే నా పన్నెండేళ్ల కొడుకు విశాల్ నదివైపు దూసుకుపోతూ కనిపించాడు. పరుగెత్తి వెళ్ళి వాడి రెక్క పట్టుకుని ఆపాను. వాడు గింజుకున్నాడు. 'ఆత్మాభిమానం ఉన్న ఆడదెవరూ ఇక్కడ బతికి లేదు. అమ్మా! నువ్వూ అక్కలతోబాటు నదిలోకి దూకెయ్. నేనూ చచ్చిపోతాను' అని గొల్లున

*ఏడ్చేశాడు 'మూర్ఖంగా మాట్లాడకు నాన్నా! తలచుకుంటే నేను మాత్రం నదిలో దూకలేనా? కానీ, మీ నాన్నను మరచిపోయావా? మనం ఇంత పిరికిగా చచ్చిపోయామని తెలిస్తే ఆయన ఎంత బాధపడతారు? ముందు – ఆయనకు ఏమైందో తెలుసుకోవాలి. తరవాతే నేను ఏమి చేయాలో నిర్ణయించుకుంటాను' అని వాణ్ని ఎంతో సముదాయించాను*

***

ఇది కథ కాదు యధార్థ గాథ రాసింది ఎంతవరకూ నిజమని సందేహించాల్సిన పనిలేదు భారత ప్రభుత్వ సమాచార, ప్రసార శాఖ ప్రచురణల విభాగం 1966లో అచ్చువేసిన This Happened in Kashmir గ్రంథంలోని భాగమిది 1947 అక్టోబరు చివరి వారంలో పాకిస్తాన్ ఉసిగొలిపిన రెయిడర్లు మిడతల దండులా కాశ్మీర్ సంస్థానంలో చొరబడి, మహమ్మదీయేతరుల ఇళ్ళు, ఆస్తులు తగులబెట్టి, చేతికి చిక్కిన వారినల్లా ఊచకోత కోసి, పిల్లలను, తల్లులను చెరిచి నిరాఘాటంగా సాగించిన ఘోర దురాగతాలకు ప్రత్యక్ష సాక్షి అయిన కృష్ణమెహతా స్వానుభవాల్లో ఒక మచ్చుతునక ఇది

కృష్ణ మెహతా అనామక గృహిణి కాదు సరిహద్దులోని ముజఫరాబాద్ జిల్లా కలెక్టరు (వజీర్ –ఎ– విజారత్) ఇల్లాలిగా లంకంత లోగిలిలో, నౌకర్లు చాకర్ల సేవలందుకుంటూ మహారాణిలా బతికిన మనిషి. తరవాత చాలా రోజులకుగానీ ఆమెకు తెలియకపోయినా, ఆమె భర్త పాక్ దుండగులకు వీరుడిలా రొమ్ము చూపించి తొలిరోజునే దేశం కోసం నేలకొరిగాడు భద్రతా బలగాలను సమీకరించి జిల్లా ప్రజలందరికీ రక్షణ కల్పించవలసిన జిల్లా అధికారే ఆదుకునే దిక్కులేక సొంత ఇంట్లో దుండగుల కాల్పులకు ఒంటరిగా బలి అయ్యాడు జిల్లా అధికారి భార్యే కన్నబిడ్డలతో కట్టుబట్టలతో అన్నం నీరు లేకుండా మైళ్ళకు మైళ్ళు నడిచి, రెయిడర్ల చేతచిక్కి, అనుక్షణం ప్రాణభయంతో, మానం కాపాడుకోవటానికి ఏ నిమిషంలో ప్రాణం తీసుకోవలసి వస్తుందో తెలియని భయవిహ్వల స్థితిలో యమయాతన పడ్డదంటే దిక్కూమొక్కూలేని మామూలు కాశ్మీరీలు ఆ సమయంలో మరెన్ని అగచాట్లు పడి ఉండాలి?

కాశ్మీర్ మనకు పరాయి దేశం కాదు అనాదిగా అది భారతీయ రక్తంలో రక్తం ప్రాణంలో ప్రాణం కొన్ని చారిత్రక కారణాలవల్ల బ్రిటిష్ ఇండియాలో చేరకుండా దేశంలోని వందలాది సంస్థానాల్లాగే కాశ్మీర్ రాజరికంలో కొనసాగుతూ వచ్చినందున దేశానికి స్వతంత్రం రాగానే అక్కడ స్వతంత్ర భారత పతాకం ఎగరలేదన్న మాటే కాని – తాను వేరు, కాశ్మీర్

వేరు అని ఇండియా ఏనాడూ అనుకోలేదు ఇండియాతో సంబంధం లేకుండా విడిగా ఉండాలన్న ఆలోచన కాశ్మీర్ వాసులకూ అప్పట్లో ఏ కోశానా లేదు అలాంటప్పుడు - కాశ్మీర్ బాగోగులు కనిపెట్టి, ఆపదలో ఆదుకోవటం భారత ప్రభుత్వ ప్రాధమిక బాధ్యత సెంటిమెంటు పక్కనపెట్టి ప్రాక్టికల్ దృష్టితో చూసినా, సరిహద్దులో భౌగోళికంగా అత్యంత కీలక స్థానంలో ఉన్న కాశ్మీర్‌ను కంటికి రెప్పలా కాపాడటం, అక్కడ ఏమి జరుగుతుందో తెలుసుకుని అవాంఛనీయ పరిణామాలను సకాలంలో అడ్డుకోవటం న్యూఢిల్లీ కనీస ధర్మం

కాని నమ్ముతారో లేదో! గిరిజన మూకలను కూడగట్టి, పాక్ సైనికులను తోడిచ్చి పాకిస్తాన్ 1947 అక్టోబరులో కాశ్మీర్ దురాక్రమణకు ప్రేరేపిస్తే స్వతంత్ర భారత పాలకులకు ఆ సంగతి చాలా రోజులదాకా తెలియనే తెలియదు బయటి నుంచి భారీఎత్తున దాడి జరుగుతూంటే పొలిమేరలో దాన్ని ఎదుర్కొని మన భూమిని, మన ప్రజలను కాపాడే దిక్కులేక పోయింది పాకిస్తాన్‌కు కాశ్మీర్‌కు మధ్య 800 కిలోమీటర్ల పొడవున వున్న సరిహద్దులను అప్రమత్తంగా కావలి కాయడానికి కావలసిన మందీ మార్బలం కాశ్మీర్ ప్రభుత్వానికి బొత్తిగా లేవు పైగా అప్పటికి కొద్ది రోజుల నుంచీ సరిహద్దుల్లో నాలుగు దిక్కులా పాకిస్తాన్ పథకం ప్రకారం రేపిన అలజడులను ఎదుర్కొనేందుకు ఉన్న కాస్త సైన్యం చెల్లాచెదురయింది పెట్రోలు సరఫరాను పాక్ బిగదీయడంవల్ల మిలిటరీ వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగింది దీనికితోడు కావలికి నియమించిన కొద్దిపాటి సైనికుల్లోనూ చాలామంది ముస్లింలు పాకిస్తాన్ దుర్బోధలకు లోనై ద్రోహం చేశారు దురాక్రమణదారులను ఎదుర్కోవలసింది పోయి, తాము సైతం వారిలో కలిసి జనం మీద పడి లూటీల్లో, మానభంగాల్లో పాలుపంచుకున్నారు శత్రువును ఎదిరించబోయిన సైనికులను వారి సోదరులే కాల్చి వేశారు అడ్డగించేవారెవరూ లేకపోవటంతో వేలాది దుండగుల పిశాచిమూక వందల కొద్దీ వాహనాల్లో వికటాట్టహాసం చేస్తూ కాశ్మీర్‌ను యధేచ్ఛగా కబళించసాగింది

ఇంత విచ్చలవిడిగా ఇంత భయంకరమైన దురాక్రమణ జరుగుతున్న సంగతి న్యూఢిల్లీకి తెలియలేదా? తెలుసు కాని ఆ కబురు భారత నాయకులకు తెలియనివ్వకుండా తెల్లవాళ్లు తొక్కిపట్టారు అప్పట్లో ఇండియా, పాకిస్తాన్ దేశాల కమాండర్-ఇన్- చీఫ్‌లు ఇద్దరూ ఆంగ్లేయులే పరస్పరం మంచి మిత్రులే వేల సంఖ్యలో గిరిజన రెయిడర్లను సమీకరించి, పాకిస్తానీ ఆయుధాలు హంగులు సమకూర్చి కాశ్మీర్ మీదికి దండెత్తించడమనేది పాక్ సైనిక అధికారులకు తెలియకుండా జరిగే పని కాదు పాకిస్తానీ కమాండర్ ఇన్ చీఫ్ మెసర్వీ ఈ సంగతి వాసన పట్టిన వెంటనే ఇండియా సైన్యాధిపతి సర్ రాబ్ లాక్‌హార్ట్ చెవిన వేశాడు ఆయన క్షణం ఆలస్యం చేయకుండా ఉభయదేశాల సైన్యాలను

సమన్వయం చేస్తున్న సుప్రీం కమాండర్ ఫీల్డ్‌మార్షల్ ఆచిన్‌లెక్‌కూ, గవర్నర్ జనరల్ లార్డ్ మౌంట్‌బాటన్‌కూ తెలియపరిచాడు

కాశ్మీర్ తగలబడిపోతోందని, ఆస్తులు లూటీ అవుతున్నాయని, ప్రజలపై భయానక అత్యాచారాలు సాగుతున్నాయని, బలవంతంగా కాశ్మీర్‌ను ఆక్రమించి ఇండియాను దెబ్బతీయటానికి పెద్ద కుట్ర జరుగుతోందని తెలిసి కూడా ఆ సంగతిని తన మార్గదర్శకత్వంలో నడుస్తున్న నెహ్రూ ప్రభుత్వానికి మౌంట్‌బాటన్ చెప్పలేదు దండయాత్ర మొదలై శరవేగంతో కాశ్మీర్‌ను దహించసాగిన 1947 అక్టోబర్ 21న కూడా కాశ్మీర్ ప్రధాని మహాజన్‌కు రాసిన లేఖలో ఉప్పు, పప్పు పంపించడం గురించి, షెక్ అబ్దుల్లాకు అధికారం అప్పగించడం ఎంత అవసరమన్న దాని గురించి, పాకిస్తాన్‌వల్ల కాశ్మీర్‌కు రాగల ముప్పు గురించి నెహ్రూ వివరంగా చెప్పారు అప్పటికే మీదపడి కాశ్మీర్‌ను నుగ్గునూచ చేయసాగిన దురాక్రమణ పెనుముప్పు ఊసే అందులో లేదు

ఎందుకు లేదంటే - ఆ సమయానికి నెహ్రూకీ అది తెలియదు కనుక అక్టోబరు 24న థాయిలండ్ విదేశాంగ మంత్రి గౌరవార్థం ఇచ్చిన విందు పూర్తయి, అతిథులంతా తీరుబడిగా వెళ్ళాక, మౌంట్‌బాటన్ తాపీగా తన చెవిన వేసేదాకా కాశ్మీర్‌లో చాలాభాగం దురాక్రమణకు లోనైన వైనం భారత ప్రధానికి తెలియదు కబురు విని నెహ్రూ తల్లడిల్లి ఏదో ఒకటి చేయాలనుకున్నా మౌంట్‌బాటన్ వెంటనే ఏదీ చేయనివ్వలేదు ఇండో-పాక్ జాయింటు కమాండు సుప్రీం కమాండర్ ఆచిన్‌లెక్ శ్రీనగర్‌లో చిక్కుబడిన ఇంగ్లీషు వారిని కాపాడటానికి బ్రిటిష్ దళాలను అక్టోబరు 24నే విమానంలో పంపదలిచినా మౌంట్‌బాటన్ ఒప్పుకోలేదు స్వాతంత్ర్యం పొందాక సైనిక జోక్యం ఏదైనా భారతీయుల పరంగా జరగాల్సిందే తప్ప బ్రిటిష్ సైనికులను ఉపయోగించడానికి ససేమిరా వీల్లేదని ఖండితంగా చెప్పాడు

అన్ని నీతుల కబుర్లు చెప్పినవాడు పోనీ - పరిస్థితి తీవ్రత దృష్ట్యా భారత సైన్యాన్నయినా తక్షణం జోక్యం చేసుకోనిచ్చాడా అంటే అదీ లేదు 1947 అక్టోబరు 25న కాబినెట్ డిఫెన్స్ కమిటీ సమావేశంలో 5000 మంది కొండజాతి దుండగులు ముజఫరాబాద్‌ను, డోమెల్‌ను ఆక్రమించారని, వారికి అండగా అదనపు బలగాలూ, ఆయుధాలూ దారిలో ఉన్నాయని పాక్ సైన్యాధిపతి పంపిన టెలిగ్రాంను ఇండియా కమాండర్ ఇన్ చీఫ్ చదివి వినిపించాక, మహారాజు ఆర్తనాదాన్ని మన్నించి వెంటనే సైనిక జోక్యం చేసుకోకపోతే పరిస్థితి చెయిదాటి పోతుందని సైనిక నిపుణులు, భారత నాయకులు వ్యాకులపడ్డప్పుడు కూడా మౌంట్‌బాటన్ భారత సైన్యాన్ని పంపడానికి అంగీకరించలేదు విలీనపత్రం మీద సంతకాలు

అవుతేగాని, ఇండియా కలగజేసుకోరాదని శషభిషలు పెట్టి, వి పి మీనన్‌ను కాశ్మీర్‌కు పరిశీలన నిమిత్తం పంపి, ఆయన తిరిగి వచ్చి శ్రీనగర్ ఏ క్షణమైనా శత్రువు వశమవవచ్చని చెప్పాక కూడ మళ్ళీ ఆయనను మహారాజు సంతకం కోసం జమ్మూ విడిదికి పంపించి, యథావిధిగా రాతలు, కోతలు పూర్తయ్యాకగానీ భారత దళాలను మౌంట్‌బాటన్ కదలనియ్యలేదు

ఆ కాలంలో మౌంట్‌బాటన్‌కు ప్రెస్ అటాచిగా పనిచేసి ఆయనకు ఎంతో విశ్వాసపాత్రుడైన Alan Campbell - Johnson తన Mission with Mountbatten గ్రంథం 224వ పేజీలో అక్టోబరు 25న జరిగిందేమిటో ఇలా వివరించాడు

*Mountbatten then explained to me in more detail the reason for the line he had taken on accession at the Defence Committee He said that while urging the Maharaja to make up his mind about accession before the transfer of power, he had all along exerted his influence to prevent him from acceding to one Dominion or the other without first taking steps to ascertain the will of his people by referendum, plebiscite When during the past forty-eight hours it became clear that the Government were determined, against the military advice both by their own Chiefs of Staff and of himself, to send in troops in response to a request from Kashmir for aid, he returned to the charge about accession He considered that it would be the height of folly to send troops into a neutral state, where we had no right to send them*

*(డిఫెన్స్ కమిటీలో 'విలీనం' గురించి తాను ఆ వైఖరి ఎందుకు తీసుకోవలసి వచ్చిందో మౌంట్‌బాటన్ అప్పుడు నాకు వివరంగా చెప్పాడు (ఉపఖండంలో) అధికారపు బదిలీకి పూర్వమే విలీనం సంగతి తేల్చుకోమని మహారాజుకు మొదటి నుంచీ చెబుతూనే . రిఫరెండమో, ప్లెబిసైటో మరొకటో జరిపి ప్రజల అభిమతం ముందుగా తెలుసుకోనిదే ఏ డొమీనియన్‌లోనూ విలీనం జరగకుండా మౌంట్‌బాటన్ తన పలుకుబడి ఉపయోగించాడట భారత సైన్యాధికారులు, తాను సైనికపరంగా మంచిది కాదని ఎంతగా చెప్పినా వినకుండా . కాశ్మీర్ కోరిన ప్రకారం సైన్యాన్ని పంపటానికి భారత ప్రభుత్వం కృతనిశ్చయమైనట్టు గడచిన 48 గంటల్లో స్పష్టమవడంతో విలీనం సంగతి ఆయన ఎత్తుకున్నాడట మనకు ఎలాంటి హక్కులేని తటస్థ రాజ్యంలోకి సైన్యాన్ని పంపడం అవివేకానికి పరాకాష్ఠ అని మౌంట్‌బాటన్ భావించాడట )*

మౌంట్‌బాటన్ శల్యసారథ్యానికి ఇంతకంటే దృష్టాంతం ఏమి కావాలి?

తెల్లవాడు మొదటినుంచీ మనకు పగవాడే పగవాడు చేయాల్సిన పనిని పగవాడు చేయటంలో విస్తుపోవలసింది ఏమీ లేదు కానీ – దేశానికి, ప్రజాహితానికి అంత ఘోరమైన అన్యాయం జరుగుతూంటే ''మనవాడు''. ఏమి చేశాడన్నది పాయింటు మనం మాట్లాడుకుంటున్న ఘటనల కాలానికి ఇండియా సర్వస్వతంత్ర రాజ్యం. ''గవర్నర్ జనరల్'' అన్నవాడు ఇప్పటి రాష్ట్రపతి వలె నామమాత్రపు అధినేత. ప్రధాని, ఆయన మంత్రివర్గ ఇష్టప్రకారం నడవవలసినవాడే తప్ప వెనకటి ''వైస్రాయ్'' వలె నిరంకుశంగా వ్యవహరించగల అంతిమ నిర్ణేత కాడు. ''వైస్రాయ్''గా ఉండగా మౌంట్‌బాటన్‌కు గల అపరిమిత అధికారాలేవీ గవర్నర్ జనరల్ హోదాలో అయనకు మిగిలి లేవు వీటో అధికారం ఏదీ చట్టప్రకారం తనకు లేకపోయినా ప్రధానమంత్రిని మభ్యపెట్టి, ప్రభుత్వాన్ని పెడదారి పట్టించి తక్షణం జరిగి తీరవలసింది జరగకుండా మౌంట్‌బాటన్ వీటో చేయగలిగాడంటే దాన్ని మన జాతీయ నాయకుల చేతకానితనంగానే పరిగణించాలి అంత గొప్ప మేధావి, అంత గొప్ప జాతీయవాది, మహా దేశభక్తుడు అయిన నెహ్రూ అందులోనూ తనకు ప్రియాతిప్రియమైన కాశ్మీర్ విషయంలో నమ్మశక్యం కాని దౌర్బల్యానికి లోనై మౌంట్‌బాటన్ మాయలో పడటం దేశ ప్రజల దౌర్భాగ్యం!

సకాలంలో కదలి కాశ్మీర్‌ను కాపాడకపోవటంవల్ల జరిగిన అనర్థమేమిటో – వివిధ సందర్భాల్లో ప్రధాని నెహ్రూ అన్న మాటలనుబట్టి తెలుస్తుంది, 1947 నవంబర్ 2న జాతినుద్దేశించి చేసిన రేడియో ప్రసంగంలో ఆయన ఇలా చెప్పారు.

*"Armed and well equipped persons in over one hundred lorries had broken in, had sacked Muzaffarabad and killed many persons there including the District Magistrate. The raiders had sacked several towns and had destroyed the great powerhouse of Mahura which supplies electricity to the whole of Kashmir They were on the point of entering the valley The fate of Srinagar and the whole of Kashmir hung in the balance... Srinagar was in peril and the invader was almost on its doorstep There was no administration left then. no troops, no police Light and Power had failed "*

*(వందకుపైగా లారీల్లో సాయుధులు చొరబడి ముజఫరాబాద్‌ను ధ్వంసం చేశారు జిల్లా మేజిస్ట్రేటు [ఈ జిల్లా మేజిస్ట్రేటు ఎవరోకాదు ఈ వ్యాసం మొదట్లో ప్రస్తావించిన కృష్ణమెహతా భర్త]తో సహా ఎంతోమందిని చంపేశారు. చాలా పట్నాలపై విరుచుకుపడ్డారు కాశ్మీర్ మొత్తానికి విద్యుత్ సరఫరాచేసే మహురా పవర్‌హౌస్‌ను ధ్వంసపరచి కాశ్మీర్ లోయలోకి చొచ్చుకురానున్నారు మొత్తం కాశ్మీర్ భవిష్యత్తు ప్రశ్నార్థకమైంది. శ్రీనగర్‌కు*

ప్రమాదం వచ్చింది. ఆక్రమణదారు దాని గడపదాకా వచ్చేశాడు ఫరిపాలన అనేది ఎక్కడా మిగలలేదు సైన్యం లేదు పోలీసులు లేరు లైట్లు లేవు. పవర్ లేదు

1947 అక్టోబరు 31న పాకిస్తాన్ ప్రధాని లియాకత్ అలీఖాన్‌కు పంపిన కేబుల్‌లో జవహర్‌లాల్ నెహ్రూ ఇలా అన్నారు

*It would have been easy for us to send these troops earlier if we had intended doing so and thus stop the raiders at an early stage Both Military and other Competent opinion has criticised us for being dilatory At no time did we consider the question of sending troops for Kashmir previous to the 25th October*

*(మేము కావాలనుకుంటే ఇదే సైన్యాన్ని ఇంకా ముందుగా పంపించి ఆరంభదశలోనే రెయిడర్లను ఆపగలిగేవారం సైనిక, అభిజ్ఞవర్గాల అభిప్రాయం కూడా - తాత్సారం చేశామని మమ్మల్ని విమర్శించింది. అక్టోబర్ 25కు ముందు ఎన్నడూ కాశ్మీర్‌కు సేనలను పంపే సంగతి మేము పరిశీలించనే లేదు)*

1947 నవంబర్ 1న బ్రిటిష్ ప్రధాని సి ఆర్ అట్లీకి పంపిన కేబుల్‌లో నెహ్రూ చెప్పిందిది

*We took no action in regard to Kashmir till the very last moment when complete disaster threatened to overwhelm the State It would have been easy for us to intervene earlier and stop the raiders on the frontier of Kashmir We refrained from taking any action whatever till there was no other choice left for us*

*(మొత్తం రాష్ట్రానికి సర్వనాశనం ఆసన్నమయిన చివరి నిమిషందాకా మేము ఎలాంటి చర్య తీసుకోలేదు అంతకుముందే కలగజేసుకుని కాశ్మీర్ సరిహద్దుల దగ్గరే రెయిడర్లను మేము తేలికగా ఆపగలిగేవారం ఇంకో గత్యంతరం లేకుండా పోయేంతవరకూ మేము చర్య తీసుకోకుండా ఆగాం )*

ఆపగలిగి కూడా దురాక్రమణదారులను సరిహద్దులవద్దే ఆపించనిదీ, సర్వనాశనం ముంచుకొచ్చేదాకా ప్రభుత్వాన్ని కదలనివ్వనిదీ నెహ్రూ కాదు కాశ్మీర్‌పట్ల ఆయనకుగల ఆత్మీయత తెలిసినవారెవరూ బుద్ధిపూర్వకంగా ఆయన కాశ్మీర్‌ను రాబందులపాలు చేశారని ఆరోపించలేరు బారాముల్లాను ఆక్రమించి దాదాపు శ్రీనగర్ దరిదాపుల్లోకి దుండగులు చొచ్చుకొస్తున్నా తక్షణం కదలి, కాశ్మీర్ లోయను ఆదుకోవలసిన భారత ప్రభుత్వాన్ని మాయమాటలతో చివరి క్షణం దాకా కాళ్లు చేతులు కట్టేసింది గవర్నర్ జనరల్

మౌంట్‌బాటన్ కాక ఇంకెవరు? పాకిస్తాన్ ఉసిగొలిపిన రెయిడర్ల తండాలు తమను పురమాయించిన ప్రకారం వేగంగా దూసుకుపోకుండా ముజఫరాబాద్‌లో లూటీలు చేస్తూ, అందినంత మూటకట్టుకుంటూ, చేజిక్కిన స్త్రీలనల్లా పాడుచేస్తూ విలువైన సమయం వృథా చేశారు శ్రీనగర్‌కు 30 మైళ్ల దూరంలోని బారాముల్లాను ఆక్రమించిన వెంటనే వారు కదిలివుంటే శ్రీనగర్ సునాయాసంగా కైవసమయ్యేది తరవాతెప్పుడో ఇండియా తీరుబడిగా ఆదుకుందామనుకున్నా కాశ్మీర్ అనేది మిగిలేది కాదు బారాముల్లాలో క్రిస్టియన్ మిషనరీ నన్స్‌ను, ఇతర స్త్రీలను పైశాచికంగా చెరుస్తూ, 36 గంటలకు పైగా వారు కదలకుండ ఉండిపోయారు కాబట్టే శ్రీనగర్‌కు ముప్పు తప్పింది. శ్రీనగర్ విమానాశ్రయం శత్రువు వశం కాలేదు కనకే భారత దళాలు 27వ తేదీ రాత్రి అక్కడికి చేరుకుని కొంతలో కొంత ఆదుకోగలిగాయి

సరే। చివరి నిమిషం దాకా మౌంట్‌బాటన్ మోకాలడ్డినా రేపులూ లూటీల్లో రెయిడర్ల 'బిజీ' పుణ్యమా అని శ్రీనగర్‌కు గండం తప్పింది మీన మేషాలు లెక్కించి ఎట్టకేలకు భారత సైన్యాన్ని పంపిన తరవాతయినా దాని పని దానిని సజావుగా చేయనిచ్చారా? దురాక్రమణ బారి నుంచి కాశ్మీర్‌ను విముక్తి చేయనిచ్చారా?

# తప్పు మీద తప్పు

వీరులను మరచే జాతికి భవిష్యత్తు చీకటి.

మనదో చిత్రమైన జాతి. నిజమైన వీరుల పేరయినా తలవం కుహనా వీరులను మాత్రం దేవతల్లా కొలుస్తాం.

కాశ్మీర్ మనది అని ఇవాళ ఇంకా చెప్పుకోగలుగుతున్నామంటే.... జాతీయ నాయకుల మహిమ వల్ల కాదు. కాశ్మీరీ పొలిటీషియన్ల చలవవల్ల కాదు బ్యూరాక్రాట్ల తెలివి వల్లా కాదు. సైనికుడి శౌర్యంవల్ల. విపత్తు వచ్చిన ప్రతిసారీ అతడు చేసిన ఆత్మ బలిదానంవల్ల ఆపదలో మనలను ఆదుకుంటున్నదీ సైనికుడే. ఆపద తొలగిందనుకోగానే మనం మరచిపోతున్నదీ... పైపెచ్చు – చవకబారు రాజకీయాలకు మనం బలి ఇస్తున్నదీ ఆ సైనికుడినే! అలనాటి 'శ్రీనగర్' నుంచి నిన్నటి 'కార్గిల్' వరకూ ఇదే కథ.

1947 అక్టోబరు చివరి వారంలో రెయిడర్ల ముసుగులో పాకిస్తానీ సేనలు జమ్మూ కాశ్మీర్ రాష్ట్రం మీద పిడుగులా పడి, ఇళ్ళూ ఊళ్ళూ దహిస్తూ ఆస్తులు దోచేస్తూ మానవతుల శీలాలు హరిస్తూ శరవేగంతో శ్రీనగర్ దిశగా దూసుకువస్తున్న తరుణంలో – మహారాజా హరిసింగ్ తన సైనిక దళాల ప్రధానాధికారి బ్రిగేడియర్ రాజేందర్‌సింగ్ జామ్‌వాల్‌ను పిలిచి – వెంటనే యూరీకి వెళ్ళి 'చివరి సైనికుడి దాకా, చివరి బులెట్ దాకా' పోరాడమని చెప్పాడు

రాజేందర్‌సింగ్ అక్షరాలా అదేపని చేశాడు.

కావాలనుకుంటే – అతడు మొరాయించగలిగేవాడే. వెంటనే కదలడం ఎందుకు కుదరదో మహారాజు మళ్ళీ నోరెత్తలేకుండా ఏకరువు పెట్టగలిగేవాడే, ఉన్న సేవలే కొద్ది. అవీ తలా ఒక దిక్కున చెల్లాచెదురై ఉన్నాయి. పోరాడేందుకు మనుషులు లేరు. ఉన్నవారికి

అధునిక ఆయుధాలు లేవు తిరిగేందుకు సరిపడా వాహనాలు లేవు. ఉన్న కాసిని వాహనాలు నడిచేందుకు సరిపడా పెట్రోలు లేదు. ఇలా అన్నీ సమస్యలే. అయినా బ్రిగేడియర్ రాజేందర్‌సింగ్ వీటిలో ఏ ఒక్కటీ ప్రస్తావించనేలేదు. అసలు నోరు తెరిచి మాట్లాడనేలేదు రాజు అజ్ఞ వినగానే శాల్యూట్ చేసి చరచర రాజప్రాసాదం నుంచి నిష్క్రమించాడు. అందుబాటులో ఉన్న 150 మంది సైనికులను తీసుకుని రివ్వున వెళ్ళి యూరీ - డోమెల్ ప్రాంతంలో శత్రువును నిలువరించాడు అప్పటికే అక్కడ డోమెల్ రక్షణకు ఉన్న కాశ్మీర్ బెటాలియన్లో సగం మంది ముస్లిం సైనికులు కమాండింగ్ ఆఫీసరును చంపి, పాకిస్తానీ మూకల్లో చేరిపోయారు. తమ బలగాలలోనే ఎవరు విధేయులో, ఎవరు విద్రోహులో తెలియని అయోమయ స్థితిలో డీలాపడ్డ సైన్యం రాజేందర్‌సింగ్ రాకతో తెప్పరిల్లింది. ఉన్న కొద్ది బలగంతోనే రాజేందర్‌సింగ్ హోరాహోరీ పోరాడి శత్రువుల మూకను బారాముల్లా చేరకుండా రెండు రోజుల పాటు నిరోధించగలిగాడు. ఆయనతో వెళ్ళిన సైనికులు ఒక్కరూ మిగలకుండా యుద్ధంలో నేలకొరిగారు. చక్రబంధంలో చిక్కి తీవ్రంగా గాయపడ్డ రాజేందర్‌సింగ్ మిగిలిన కొద్ది బలగాన్ని యూరీ బ్రిడ్జిని కూల్చడానికి వెనక్కి పంపేసి తానొక్కడే కేవలం ఒక రివాల్వరుతో చివరి బుల్లెటు దాకా పోరాడి వీరమరణం పొందాడు అలా రెండు రోజులు ఆయన శత్రువును అపగలిగాడు కాబట్టే, ఆయన దళం యూరీ వంతెన కూల్చి శత్రువు ముందుకు సాగకుండా ఇంకో రోజు నిరోధించ గలిగింది కాబట్టే మహారాజుకు న్యూఢిల్లీ సాయం అర్థించడానికి కనీస వ్యవధి దొరికింది

మనదనుకునే కాశ్మీర్ రాష్ట్రంలోకి శత్రుసేనలు చొచ్చుకువచ్చి, మన ఊళ్ళు తగులబెట్టి, మన ఆస్తులు లూటీచేసి, మన ప్రజలను పైశాచికంగా హతమారుస్తూంటే, ప్రభుత్వ నేతలకు వాస్తవాలను తెలియనివ్వక, తెలిశాక కూడా సత్వరం కదలనివ్వక, ప్రొసీజర్ల పేరిట గవర్నర్ జనరల్ మౌంట్‌బాటన్ సాధ్యమైనంత తాత్సారం చేశాక. ఎట్టకేలకు 'విలీనం' పాసగింది చట్టరీత్యా కాశ్మీర్ ఇండియాలో కలసిపోవడంతో దానిని రక్షించటం ఇండియా బాధ్యత అని మౌంట్‌బాటన్ సైతం ఒప్పుకోక తప్పలేదు. క్షణం ఆలస్యం చేయకుండా కాశ్మీర్‌ను కాపాడవలసిందేనని అందరూ అంగీకరించారు

కానీ - ఎలాగ? అప్పటికే శత్రువు శ్రీనగర్‌కు ముప్పై నలభైమైళ్ళ దూరంలోకి వచ్చేశాడు. మరికొన్ని గంటల్లోనే రాజధానిని ఆక్రమించవచ్చు ఈలోపు ఇండియా నుంచి రోడ్డు మార్గాన సేనలను పంపడం అసాధ్యం విమానంలో సైన్యాన్ని అఘమేఘాల మీద తరలించడం ఒకటే దారి. దానికీ ఎన్నో చిక్కులు అప్పట్లో ఉన్న విమానాలే కొద్ది వేలమంది సైనికులను తక్షణం పంపితే తప్ప కాశ్మీర్ దక్కదు మరి అంత మందినీ పంపడానికి ఎన్ని విమానాలు కావాలి? వాటిని ఎక్కడ్నించి తేవాలి? ఎన్ని ట్రిప్పులు వేయించాలి?

నాన్‌స్టాపుగా విమానాలు తిరగడానికి వాతావరణం అనుకూలిస్తుందా? ఈలోగా శ్రీనగర్ విమానాశ్రయం శత్రువుల వశమైతే ఏ విమానమూ కిందికి దిగలేదు కదా? ఇక రక్షణ ఎలాగ?

ఇలా - తరిచే కొద్దీ ఎన్నో ప్రశ్నలు కాని - భారత సేనాపతులు ఎలాంటి శంకనూ దరికి రానీయలేదు ప్రభుత్వం వారిని - వెళ్ళి కాశ్మీర్‌ను కాపాడమంది అంతే వారు వెంటనే రంగంలోకి దూకారు

ఆ తరువాత జరిగింది ప్రపంచ మిలటరీ చరిత్రలో ఒక అద్భుతం

దేశంలో ఎక్కడి పౌర విమానాలను అక్కడే నిలిపేసి అన్నిటినీ రాత్రికిరాత్రి హుటాహుటిన ఢిల్లీకి పిలిపించారు మొట్టమొదటి విమానం రన్‌వే మీదికి వచ్చిన మరుక్షణం మొట్టమొదటి సైనిక దళం శ్రీనగర్‌కు ఎగిరి వెళ్ళింది అది మొదలుకుని దేశంలోని అన్ని విమానాలూ ఢిల్లీ - శ్రీనగర్‌ల మధ్య రోజుల తరబడి నిర్విరామంగా తిరుగుతూనే ఉన్నాయి రెండో ప్రపంచ యుద్ధంలో ఆగ్నేయాసియా సుప్రీం కమాండరుగా పనిచేసిన లార్డ్ మౌంట్‌బాటన్ కూడా అంత తక్కువ వ్యవధిలో అంత భారీఎత్తున సైనికులను విమానాల్లో తరలించడం తన సర్వీసులో ఎప్పుడూ కనీవినీ ఎరుగని సాహసకార్యమని అబ్బురపడ్డాడు. తాను కడదాకా మోకాలు అడ్డినా భారత సైన్యం మెరపులా కదిలి కాశ్మీర్‌ను కాపాడగలదని ఆయన కలలో కూడా ఊహించలేదు

ఢిల్లీలో ఇంత భారీ ఆపరేషను మొదలయిన 1947 అక్టోబర్ 26 రాత్రి, శ్రీనగర్ వాసుల పాలిట కాళరాత్రి. అక్కడ ప్రభుత్వమనేది లేదు పరిపాలించే మహారాజే జమ్మూకు పరారయ్యాడు. 'కాశ్మీర్ సింహమనుకున్న షేక్ అబ్దుల్లా చాలా రోజుల కిందటే కుటుంబాన్ని ఢిల్లీకి తరలించి తానూ జాడలేకుండా పోయాడు ఉన్న కొద్దిమంది సైనికులు దూరానెక్కడో శత్రువులతో పోరాడుతున్నారు పోలీసులూ, అధికారులూ పాక్ అనుకూల, వ్యతిరేక, తటస్థ వర్గాలుగా చీలిపోయి అసలు పనులు మానుకున్నారు. పాకిస్తానీ భాయీలు వచ్చేస్తున్నారన్న ఆనందంతో కొంతమంది ఆకతాయిలు అప్పుడే ఆస్తుల లూటీలు మొదలెట్టారు. ఇండియా అంటే మమకారం ఉన్న ప్రజలు ఢిల్లీ తమను ఆదుకుంటుందన్న ఆశ చావక, సర్వనాశనం జరిగేలోగా సాయం అందుతుందన్న నమ్మకం చిక్కక బిక్కుబిక్కుమంటూ చెవులు రిక్కించి రేడియో ముందు కూచున్నారు అంతలో కాశ్మీర్ సంస్థానం ఇండియాలో విలీనం అయిపోయిందని, దాని రక్షణ భారాన్ని భారత్ స్వీకరించి అతి త్వరలో సైన్యాన్ని పంపుతున్నదని కబురు అందింది శ్రీనగర్ పోలీసు కమీషనరు వెంటనే ఆ సంగతి వీధుల్లో దండోరావేయించి, ఈలోపు ఎవరైనా అరాచక చర్యలకు

పాల్పడితే ఖబడ్దార్ అని హెచ్చరిక చేయడంతో జనానికి గుండెదడ కాస్త తగ్గింది

తెల్లవారేదాక కళ్ళలో వత్తులు వేసుకుని విమానాల రాక కోసం అందరూ ఆకాశం కేసి చూస్తుండగా – వేకువ ఝామున మొట్టమొదటి డకోటా విమానం శ్రీనగర్‌లో దిగింది సిక్కు రెజిమెంటుకు చెందిన 329 మంది జవాన్లు మొదటి జట్టులో ఉన్నారు వారి నాయకుడు లెఫ్టినెంట్ కర్నల్ రంజిత్‌రాయ్ విమానం దిగీ దిగగానే తమ కోసం సిద్ధపరచిన ట్రక్కుల్లోకి చెంగున దూకి, టీ తాగడానికి కూడా ఆగకుండ సరాసరి బారాముల్లాకు దూసుకువెళ్ళారు ఆ సాయంత్రానికే రంజిత్‌రాయ్ యుద్ధరంగంలో భీకరంగా పోరాడుతూ నేలకొరిగాడు

విమానాల ద్వారా సైనికుల చేరవేత తెరపిలేకుండా రేయింబవళ్ళూ సాగుతూండగా పాక్ రెయిడర్లు గుల్‌మార్గ్ వైపునుంచి శ్రీనగర్ ఎయిర్‌పోర్టు దరిదాపులకు వచ్చారు ఆ సమయంలో మేజర్ సోమనాథ్ శర్మ తన చేతిలోని కొద్దిపాటి బలగంతో తమకంటే ఏడింతలు ఉన్న దుండగుల దండును ధైర్యంగా ఎదిరించి, శత్రు సంహారం చేస్తూ నవంబర్ 3న వీరమరణం పొందాడు తమకు అండగా అదనపు బలగాలు చేరుకునేదాకా ఆయన విరోధి మూకను అడుగు ముందుకు వేయకుండా అడ్డుకోగలిగాడు కాబట్టే శ్రీనగర్ ఏరోడ్రోముకు ముప్పు తప్పి బలగాల తరలింపు నిరాఘాటంగా కొనసాగింది

భారత సేనలు కాశ్మీర్ లోయకు ముఖ్య ద్వారమైన బారాముల్లాను తిరిగి స్వాధీనం చేసుకోవటంతో లోయకు గండం గడచింది మరికొన్నాళ్లకు యూరీ విముక్తమైంది గుండె చెదిరిన రెయిడర్లు గుల్మార్గ్, తన్మార్గ్‌లనుంచీ ఒక్క గుండూ పేల్చనవసరం లేకుండానే పలాయనమయ్యారు. పెట్రోలు కొరత గనుక లేకపోతే బారాముల్లానుంచి ఎకాఎకి వెళ్లి మీర్‌పూర్, ముజఫరాబాద్‌లనూ మన సేనలు వశపరచుకునేవే ఒక దశలో లడాఖ్‌ను ఆక్రమించేందుకు రెయిడర్లు విశ్వప్రయత్నం చేశారు మన వైమానిక దళం ఎయిర్ కమొడోర్ మెహర్‌సింగ్ 1948 మే 24న సముద్ర మట్టానికి 23,000 అడుగుల ఎత్తున గుర్తుతెలియని దారిలో ఆక్సిజన్ లేకుండా విమానం నడిపి 12 వేల అడుగుల ఎత్తులోని లే విమానాశ్రయంలో క్షేమంగా దిగాడు. ఆ అపూర్వ సాహసంతో భారత దళాలను దరిమిలా 'లే' కు చేరవేసి లడాఖ్‌ను శత్రువు బారి నుంచి కాపాడుకోవటం వీలయింది. మేజర్ జనరల్ తిమ్మయ్య 11,578 అడుగుల ఎత్తులోని జోజిలాపాస్‌కు నమ్మశక్యంకాని తెగువతో టాంకుల దళాన్ని తీసుకువెళ్ళి బంకర్లను ధ్వంసం చేసి, శత్రువులను తరిమిగొట్టాడు.

ఇలా కొదమసింగాల్లా విజృంభించి వీరవిహారం చేయసాగిన మన సైనిక, వైమానిక

దళాలను అలాగే వాటి పనిని అవి చేసుకుపోనిస్తె అవలీలగా ముందుకుసాగి రెయిడర్లను నిశ్శేషంగా చీల్చి చెండాడి, ఆక్రమిత ప్రాంతాలను తిరిగి వశపరచుకునేవే ఇంగ్లీషు వారే పెట్టిన చట్టం ప్రకారం, కాశ్మీర్ ఇండియాలో కలిసిపోయింది కనుక తన భూభాగం నుంచి దురాక్రమణదారులను తరిమివేయడానికి ఇండియాకు సకల హక్కులూ ఉన్నాయి ఈ దిశలో ఏ చర్య తీసుకున్నా ప్రపంచం ఆక్షేపించదు దొంగదాడిని మొదలెట్టిన జిన్నా కూడా తేలుకుట్టిన దొంగలా మిన్నకున్నాడేతప్ప ఈ విషయంపై ఇండియాతో బాహాటంగా తలపడేందుకు సాహసించలేకపోయాడు కాశ్మీర్ మీదికి దుండగులను ఉసికొలిపి, ఏమి సాధించారంటే ఏమీ చెప్పుకోలేక, స్వదేశంలోనే మొగం చెల్లక, ఏమి చేయటానికీ పాలుపోక జిన్నాకు చెమటలు పట్టిన స్థితిలో

జరగకూడనిది జరిగింది నెహ్రూ ప్రభుత్వం నమ్మశక్యం కాని అవివేకంతో, తప్పుమీద తప్పు చేసింది పనిగట్టుకుని తనకు తానే హాని చేసుకుని, తన కాళ్లకింద తానే గోతులు తవ్వుకుని పాకిస్తాన్ నెత్తిన పాలుపోసింది తనకు అప్పగించిన బాధ్యతను అద్భుతంగా నిర్వర్తిస్తూ భారత సైన్యం వీరవిహారం చేస్తున్న సమయంలో సైనికపరంగా తేల్చవలసిన సమస్యను రాజకీయ రొంపిలోకి ప్రభుత్వమే నెట్టింది 1948 జనవరి 1న పనిగట్టుకుని తానే అనవసరంగా పితూరీ చేసి దురాక్రమణ వ్యవహారాన్ని ఐక్యరాజ్య సమితికి తీసుకు వెళ్లింది అమరవీరుల ఆత్మార్పణను, వీరజవాన్ల రక్తతర్పణను నిష్ఫలం చేసి, . దురాక్రమణదారులను గెంటివేసే పని పూర్తికాకుండానే, రాష్ట్రంలో మూడోవంతు భూభాగం ఇంకా శత్రువు అధీనంలో ఉండగానే, కొంపలేవో మునిగినట్టు అర్ధాంతరంగా యుద్ధాన్ని ఆపేసి, సైన్యం కాళ్లూ చేతులూ కట్టేసి, ఎవరూ అడక్కుండానే తనంతటతాను 1949 జనవరి 1న కాల్పుల విరమణ ప్రకటించింది ఐక్యరాజ్యసమితి గద్దలు, అమెరికన్ సామ్రాజ్యవాద రాబందులు, సామ్రాజ్యం పోయిన బ్రిటిష్ గుంటనక్కలు పన్నిన వలలో కళ్లు మూసుకుని పడి అడ్డగోలు కాల్పుల విరమణ రేఖను తెలివితక్కువగా స్థిరపరచుకుంది. భాష, సంస్కృతుల పరంగా విలక్షణత కలిగిన ఆరు జమ్మూ, కాశ్మీర్ ప్రాంతాల్లో ముస్లింల ప్రాబల్యంగల మూడింటిని కాల్పుల విరమణ రేఖ పేరిట పాకిస్తాన్‌కు అర్పించి, మూడు (జమ్మూ, కాశ్మీర్, లడాఖ్) ప్రాంతాలను మాత్రం ఇండియా దక్కించుకుంది ఇందులో కాశ్మీర్ ఒక్కటే ముస్లిం మెజారిటీ ప్రాంతంకాగా జమ్మూ, లడాఖ్‌లలో నాన్ ముస్లింలదే ప్రాబల్యం మరోవిధంగా చెప్పాలంటే - దేశ విభజన ద్వారా పాకిస్తాన్ పొందలేకపోయిన దాన్ని, సైనిక దురాక్రమణకు దొంగచాటుగా పాల్పడి కూడా ఆ దేశం సాధించలేనిదానిని కాల్పుల విరమణ రేఖ ద్వారా ఇండియాయే చేజేతులా పళ్లెంలో పెట్టి పాకిస్తాన్‌కు అప్పగించింది.

జమ్మూ కాశ్మీర్ సంస్థానం చట్టబద్ధంగా మనలో విలీనమైన తరువాత పూర్వపు సంస్థానానికి చెందిన ప్రతి అంగుళం నేలా మనదే అయిపోయింది. పంజాబీ భాష మాట్లాడే ముజఫరాబాద్, పూంచ్, మిర్‌పూర్‌లు గాని,' వ్యూహాత్మకంగా అత్యంత కీలకమైన గిల్గిత్, బాల్టిస్తాన్‌లు గాని పాకిస్తాన్‌లో చేరాలని తహతహలాడిన దాఖలాలు ఎప్పుడూ లేవు. పాకిస్తాన్ దొంగ దండును పంపి దౌర్జన్యంగా వాటిని అక్రమించినంతమాత్రాన ఆ దురాక్రమణను సహించి ఊరుకోవలసిన అగత్యం మనకు లేదు. సైనికంగా మనం నిస్సహాయులమైతే, బలవంతుడైన శత్రువును తరిమి వేయడం మనవల్ల కానిపని అనుకుంటే పరువు తక్కువ లొంగుబాటుకు తలవంచడాన్ని అర్థం చేసుకోవచ్చు అన్ని అనుకూలతలు మనకే ఉండి . రవంత స్వేచ్ఛనిచ్చి వదిలిపెడితే శత్రువు పీచమణచి తరిమికొట్టటానికి వీర సైనికులు ఉరకలు వేస్తూండగా, మన భూభాగాన్ని శత్రువుకు వదిలేసి, అందులోని ప్రజలను శత్రువు పెట్టే చిత్రహింసల, చిత్రవధల పాలుచేసి, నిస్సహాయంగా అర్జీ పట్టుకుని న్యాయం చేయమంటూ పెద్దమనుషుల పంచాయతీకి పరుగుతీయడం పరువుగల జాతికి అవమానం. ఆత్మహత్యాసదృశం. అతిమంచితనానికి పోయి నెహ్రూ అప్పట్లో వరసగా వేసిన తప్పటడుగులవల్లే కాశ్మీర్ సమస్య కోతిపుండు బ్రహ్మరాక్షసి సామెతలా తయారై కాలక్రమంలో మన నెత్తికి చేతులు తెచ్చింది.

చిత్రమైన విషయమేమిటంటే కాశ్మీర్ వివాదంలో తల దూర్చేందుకు న్యాయంగా అయితే పాకిస్తాన్‌కు వీసమెత్తు సందులేదు. విలీనం చట్టబద్ధతను అది ప్రశ్నించజాలదు. 1948 అక్టోబర్‌లో రెయిడర్లు అక్రమించినా ఉసికొలిపింది తానే అయినా ఆ సంగతి ఎన్నడూ ఒప్పుకోలేదు కాబట్టి తనకు సంబంధం లేని రెయిడర్లు అక్రమించిన ప్రాంతాల భవిష్యత్తు గురించి నోరెత్తే హక్కు పాకిస్తాన్‌కు లేదు అయినా . కాల్పుల విరమణ రేఖకు అవల 'అజాద్ కాశ్మీర్' అనబడే విశాల ప్రాంతాలను తైనాతీల ద్వారా అది తన అదుపాజ్ఞల్లోకి తెచ్చుకోగలిగింది మిగిలిన భూభాగంమీదా ఇండియాకు హక్కులేదని అనేక దశాబ్దాలుగా అంతర్జాతీయంగా యాగీ చేయగలుగుతున్నదంటే ఇది ముమ్మాటికీ మనం ఇచ్చిన అలుసే తిరుగులేని విలీనానికి 'ప్రజల పరంగా తుది నిర్ణయం' షరాను మౌంట్‌బాటన్ ప్రేరేపించగా అనాలోచితంగా జోడించిన నెహ్రూ అదే మౌంట్‌బాటన్ దుర్బోధకు చెవిఒగ్గి 'ఐక్యరాజ్యసమితి ద్వారా ప్లెబిసైట్ నిర్వహణ' పల్లవిని ఎత్తుకోవడం సర్వానర్థానికి ముఖ్య కారణం. శాంతి సామరస్యాల్లో ప్రపంచానికి ఆదర్శంగా నిలవాలన్న అరాటంతో 'ప్లెబిసైట్'ను తనంతటతానే ప్రపంచం ముందు ప్రతిపాదించాననే నెహ్రూ అమాయకంగా అనుకున్నాడు. భారత సేనలు కాశ్మీర్‌కు వెళ్ళిన వారానికే (1947 నవంబర్ 1న) లాహోర్‌లో జిన్నాతో జరిపిన ఏకాంత సమాలోచనల్లో ఐక్యరాజ్యసమితి

ద్వారా ప్లెబిసైట్ పెట్టడం గురించి మౌంట్‌బాటన్ మంతనాలాడిన సంగతి ఆయన పట్టించుకోలేదు అమెరికా, ఇంగ్లండులపట్ల తనకున్న సుహృద్భావమే అటునుంచి తనపట్లా పెల్లుబుకగలదని ఊహించి, ఆ దేశాల నాయకుల తీపి కబుర్లను నమ్మి - ఐక్యరాజ్య సమితిలో తనకు బ్రహ్మరథం పట్టిస్తారని ఆశించాడే గానీ - పాకిస్తాన్ గుప్పిట్లో కాశ్మీర్ ఉండాలనే బ్రిటీష్ వారు మొదటినుంచీ పన్నాగాలు పన్నుతున్నారనీ, సైనిక రాజకీయ వ్యూహాత్మకంగా అమెరికాకు కావలసిందీ అదేనని వాషింగ్టన్ - లండన్‌లు కూడబలుక్కునే మాయదారి మౌంట్‌బాటన్ ద్వారా తనను ప్లెబిసైట్ ఊబిలోకి దింపాయని నెహ్రూ పోల్చుకోలేకపోయాడు తన ఆప్తమిత్రుడైన 'కాశ్మీర్ సింహం' షేక్ అబ్దుల్లా తన చెంత ఉన్నంతవరకూ కాశ్మీర్ తన చేయి దాటిపోతుందన్న భయంలేదని, ఏ ప్లెబిసైటుకూ, ఏ అంతర్జాతీయ పన్నాగానికీ బెదరాల్సిన పనిలేదని వెర్రి నమ్మకం పెట్టుకున్నాడే తప్ప రేపు అదే 'కాశ్మీర్ సింహం' తనకే ఎదురుతిరిగి నిలువునా ముంచనున్నాడని ఆయన ఊహించలేకపోయాడు

భ్రమలనుంచి బయటపడి, అంతర్జాతీయ రాజకీయాల లోతును, మిత్రులనుకున్న వారి అసలు రంగు నెహ్రూ అర్థం చేసుకునేసరికి సమయం మించిపోయింది

# సింహం కాదు భూతం

''మర్నాడు ఉదయం నేను, వి.పి.మీనన్ విమానంలో ఢిల్లీ చేరి ఏకాఏకి ప్రధానమంత్రి నివాసానికి వెళ్ళాం. సర్దార్ పటేల్ అప్పటికే అక్కడ ఉన్నారు. కాశ్మీర్‌లో విషమించిన పరిస్థితిని ప్రధాని నెహ్రూకూ, ఆయనకూ వివరించాను. దూసుకు వస్తున్న రెయిడర్ల బారిన పడి నాశనమవకుండా శ్రీనగర్‌ను తక్షణం కాపాడి తీరాలని చెప్పి, ఎలాంటి షరతుల మీదయినా సరే సైనిక సహాయం వెంటనే అందించాలని కోరాను. అటువంటి పనికి ఎన్నో సన్నాహాలు, ఏర్పాట్లు జరగాలని, ముందుగా అన్నీ ఆలోచించుకోకుండా సైనిక దళాలను నేను అడిగినదే తడవుగా ఉన్నపళాన పంపడం కుదరదనీ ప్రధానమంత్రి చెప్పారు.

''నేను ఎన్ని విధాల చెప్పినా ఆయన వినిపించుకోలేదు ఇక చివరి అస్త్రంగా 'మాకు కావలసిన మిలిటరీ సాయాన్ని ఇవ్వండి. 'విలీనాన్ని' తీసుకోండి మీరు కోరుకున్న పార్టీకి అధికారం ఇచ్చుకోండి కాని – ఈ సాయంత్రానికల్లా శ్రీనగర్‌ను కాపాడటానికి సైన్యం విమానంలో వెళ్ళి తీరాలి. లేదా ఇటు నించి ఇటే నేను లాహోర్ వెళ్ళి జిన్నాతో రాజీ షరతులు మాట్లాడుకుంటాను' అన్నాను అవసరమైతే పాకిస్తాన్‌ను ఆశ్రయించటానికి కూడా నాకు అర్హతలున్నాయని చెప్పటంతో భారత ప్రధాని సహజంగానే మండి పడ్డారు. 'మహాజన్, గో ఎవే' (వెళ్ళిపోండి) అని ఆయన కోపంగా అనడంతో నేను లేచాను. సర్దార్ పటేల్ నన్ను ఆపి, వెళ్ళవద్దని వారిస్తూండగా ప్రధానమంత్రికి ఒక కాగితం ముక్క అందింది. ఆయన దాన్ని చదువుకుని 'షేక్ సాహెబ్ కూడా ఇదే మాట అంటున్నారు' అని బిగ్గరగా అన్నారు. మేము కూచుని ఉన్న డ్రాయింగ్ రూమును ఆనుకుని ఉన్న బెడ్‌రూములో షేక్ అబ్దుల్లా కూచుని మా సంభాషణంతా వింటున్నాడు. పరిస్థితి చెయి దాటుతోందని గ్రహించి, మిలిటరీ సాయాన్ని వెంటనే పంపాల్సిందిగా ప్రైమ్ మినిస్టరుకు ఆయన చీటీ రాసి పంపించాడన్నమాట. . అది చదువుకోగానే ప్రధాని వైఖరి మారింది

10 గంటలకు డిఫెన్స్ కౌన్సిల్ మీటింగు పెడుతున్నానని చెప్పి నన్ను విశ్రాంతి తీసుకోమని పంపేశారు ''

అప్పట్లో కాశ్మీర్ ప్రధానమంత్రిగా ఉండి, అనంతర కాలంలో భారత ప్రధాన న్యాయమూర్తి అయిన జస్టిస్ మెహర్‌చంద్ మహాజన్ తన ఆత్మకథ *'Looking Back'* 152వ పేజీలో వర్ణించిన చరిత్రాత్మక ఘట్టమిది. దీన్నిబట్టి రెండు విషయాలు తెలుస్తాయి. ఒకటి .. అవతల తన ప్రియతమ కాశ్మీర్ తగులబడి పోతున్నా .. కాశ్మీర్ మహారాజు సాయపడమని ఆర్తనాదాలు చేసినా . ఆఖరికి – మీరు కాదంటే పాకిస్తాన్‌నే శరణు వేడుతామని కాశ్మీర్ ప్రధాని హెచ్చరించినా కూడా చలించక భారత సైన్యాన్ని కాశ్మీర్ పంపేందుకు తటపటాయించిన నెహ్రూ, అదే సలహా షేక్ అబ్దుల్లా నుంచి వచ్చేసరికి సరేనన్నారు. అబ్దుల్లా మాటంటే ఆయనకు ఎంత గురో దీన్నిబట్టి అర్థమవుతుంది.

ఇక రెండో పాయింటు పాకిస్తానీలు పంపిన రెయిడర్లు జమ్మూ కాశ్మీర్ రాష్ట్రాన్ని ఆక్రమించి, పల్లెలూ, పట్నాలూ తగులబెట్టి, అమాయక ప్రజలను ఊచకోత కోసి, స్త్రీలను సామూహికంగా చెరచి, ఆస్తులు లూటీచేసి శ్రీనగర్ దిశగా ఉరికివస్తున్న సమయంలో – ది గ్రేట్ 'కాశ్మీర్ కేసరి' షేక్ అబ్దుల్లా కాశ్మీర్‌లో పత్తా లేడు వి.పి.మీనన్, ఎం.సి మహాజన్‌లు మహారాజా హరిసింగ్‌ను భద్రత కారణాల దృష్ట్యా జమ్మూ రాజప్రాసాదానికి తరలి వెళ్ళమని సలహా ఇచ్చి ఢిల్లీ వెళ్ళేసరికే 'వీరాధివీరుడు' అబ్దుల్లా ప్రధాని నివాసంలో విడిది చేసి ఉన్నాడు దానికి కొన్ని రోజుల ముందే ఆయన తన కుటుంబాన్ని క్షేమంగా 'ఇండోర్'కు పంపించేశాడు

ఇందులో గుర్తు పెట్టుకోవలసిన పాయింటు ఏమిటంటారా? అనంతర కాలంలో ఈ మహాశూరుడే – రెయిడర్ల దాడి గండంలో కాశ్మీర్‌లో ధైర్యంగా నిలబడి పోరాడిన ఘనత తనదేనని.. మహారాజు పిరికిపందలా సామాన్లు తీసుకుని జమ్మూకు పరారై పోగా ప్రజలకు అండదండలందించింది తామేనని కాశ్మీర్ కిరీటాన్ని నేలమీద దుమ్ములో పడి వుండగా తాము దొరికించుకున్నామని డప్పుకొట్టి లోకానికి చెప్పుకున్నాడు ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి ముందు కూడా అదే అబద్ధాన్ని జంకు లేకుండా ఆడాడు

వేల సంవత్సరాల భారత చరిత్రలో సమయానుకూలంగా ప్లేటుమార్చే అవకాశవాదులు, స్వార్థం కోసం ఎంతటి ద్రోహాన్నికైనా వెనకాడక నమ్మిన వారిని నట్టేట ముంచే నయవంచకులు ఎందరో కనిపిస్తారు అందునా స్వతంత్ర భారత రాజకీయ శ్రేణుల్లోనైతే మరీనూ కాని ఈ గొప్ప 'లక్షణాల'న్నీ మూర్తీభవించి, దగాకోరు రాజకీయాల్లో ఆలిండియా, ఆల్‌టైమ్ అవార్డును ఇవ్వదగ్గవాడు తన పాపిష్టి స్వార్థం కోసం – నమ్మిన

మిత్రులకూ, ఆదరించిన ప్రజలకూ, మొత్తం దేశానికి తీరని హానిని బహుశా అందరికంటే ఎక్కువగా చేసినవాడూ ఒకే ఒక్కడు!

షేక్ మహమ్మద్ అబ్దుల్లా!

షేక్ అబ్దుల్లా కాశ్మీర్ ప్రజల పక్షాన నిలిచి ఫ్యూడల్ రాజు దుష్టపాలనకు వ్యతిరేకంగా రాజీ పడకుండా పోరాడే మహావీరుడని జవహర్లాల్ నెహ్రూకు గొప్ప అభిమానం అ 'దుర్మార్గపు' రాజు బారినుంచి కాశ్మీర్‌ను విముక్తి చేయడానికంటూ, కాంగ్రెస్ నాయకులతో మాట మాత్రం చెప్పకుండా సాగించిన 'క్విట్ కాశ్మీర్' ఉద్యమంలో అరెస్టయిన అబ్దుల్లాకు సంఘీభావసూచకంగా జమ్మూ కాశ్మీర్‌లో అడుగుపెట్టినందుకే – జవహర్‌లాల్ నెహ్రూ తాను సైతం నిర్బంధానికి గురయ్యాడు. కానీ. . అదే కాశ్మీర్ కేసరి 1947 సెప్టెంబరు 26న జైలునుంచి పంపుకొన్న లేఖలో అదే మహారాజుకు ప్రణమిల్లి ఇలా క్షమాపణ చెప్పుకున్నాడు·

*May it Please your Highness,*

. .. ...

*Inspite of what has happened in the past, I assure your Highness that myself and my party have never harboured any sentiment of disloyalty towards your Highness' Person, throne or dynasty   I assure your Highness the fullest and loyal support of myself and my organisation.*

*Your Highness' Most Obedient Subject*

*S M Abdullah*

*(మహాప్రభూ!*

*గతంలో ఏమి జరిగినప్పటికీ – వ్యక్తిగతంగా తమరన్నా, తమ సింహాసనమన్నా, వంశమన్నా నాకు గాని, నా పార్టీకి గానీ ఎప్పుడూ ఎలాంటి అవిధేయత లేదని తమరికి హామీ ఇస్తున్నాను.. నా యొక్క, నా సంస్థ యొక్క సంపూర్ణమైన, విధేయతా పూర్వకమైన మద్దతును ప్రభువులకు ప్రకటిస్తున్నాను ..*

ఇట్లు

ప్రభువుల వారి అత్యంత ఆజ్ఞాబద్ధుడైన పాలితుడు

ఎస్.ఎం. అబ్దుల్లా

ఇలా బేషరతు క్షమాపణ చెప్పుకుని జైలు నుంచి బయటపడ్డాక మహారాజును సతీసమేతంగా కలిసి దర్బారు సంప్రదాయం ప్రకారం విధేయత సూచకంగా బంగారు నాణేన్ని రాజు చేతిలో పెట్టిన 'నియమబద్ధుడు' అబ్దుల్లా. ఒక చెంప ఈ మహానాయకుడిని రాజు చెర నుంచి విడిపించటానికి జవహర్‌లాల్ తన పలుకుబడినంతా వెచ్చించి శ్రమ పడుతూంటే ఈయనేమో నెహ్రూకు తెలియకుండా, రహస్యంగా అదే రాజుతో లోపాయకారీ సంధి కుదుర్చుకోవటమే వింత. పోనీ- రాజుకు సమయానుకూలంగా ప్రకటించిన విధేయతకైనా కట్టుబడ్డాడా? కనీసం- తననునమ్మి, తమలో ఒకడిగా ఆదరించి సకల సహాయాలూ చేస్తున్న నెహ్రూకూ, కాంగ్రెస్ నేతలకైనా కృతజ్ఞుడిగా వున్నాడా? లేదు. మహారాజుతో మంచిగా వున్నట్టు నటిస్తూనే, స్వతంత్ర రాజ్యంగా కొనసాగాలన్న రాజా హరిసింగ్ తాజా కోరికకు తందాన అంటూనే . రాజుకుగానీ, నెహ్రూకుగానీ తెలియకుండా రహస్యంగా జిన్నాతో బేరం కుదుర్చుకోబోయాడు. కాశ్మీర్ కనుక పాకిస్తాన్‌లో చేరితే తమకు లాభం ఏమిటో కనుక్కురమ్మని తన సహచరుడు సాదిక్‌ను కరాచీ పంపించాడు. దోరగా పండిన పండులా కాశ్మీర్ ఎలాగూ తన ఒళ్లో పడబోతున్నదన్న భ్రమలో వున్న జిన్నా ఈ రాయబారాన్ని లక్ష్యపెట్టలేదు. చేరదలిస్తే బేషరతుగా చేరాల్సిందే తప్ప దాని గురించి అబ్దుల్లా పార్టీతో కండిషన్లు చర్చించేది లేదని ఆయన కరాఖండిగా చెప్పాడు. తదుపరి ఎత్తు గురించి అబ్దుల్లా ఆలోచిస్తుండగానే ఊహించని పరిణామాలు తోసుకువచ్చాయి. పాకిస్తానీ రెయిడర్ల దాడితో దిక్కుతోచని అబ్దుల్లా నెహ్రూ చెంతకు పలాయనం చిత్తగించాడు. కాశ్మీర్‌ను ఇండియాలో కలుపుకోవటం కంటే అబ్దుల్లాకు కాశ్మీర్ కళ్ళేలు అప్పగించటం ముఖ్యమన్న రీతిలో నెహ్రూ వ్యవహరించడంతో ''సింహం'' గారి పని మరీ సులువైంది.

డోగ్రా రాజ్యాన్ని కూలదోసి తాను 'కాశ్మీర్ సుల్తాన్' కావాలన్న చిరకాల వాంఛితం నెరవేరే సూచనలు కనిపించగానే మహారాజుకు బెబ్బే అన్నాడంటే... ఆయనవెంటపడి, పరిపరి విధాల వేధించి, అధికారాలన్నీ ఊడబెరికి, ఏకంగా జమ్మూకాశ్మీర్ రాష్ట్రం నుంచే బయటికి తరిమివేశాడంటే- పాతకక్షలు లెమ్మని సరిపెట్టుకోవచ్చు. కానీ . తనను నెత్తిన పెట్టుకుని, పూర్తిగా నమ్మి, మహోపకారం చేసిన నెహ్రూతోనైనా అబ్దుల్లా తిన్నగా వ్యవహరించాడా? పాకిస్తాన్ తనను గడ్డిపరకలా తీసిపారేసినా, ఇండియా ఎంతో ఆదరించి, అఖండాధికారం తన చేతిలో పెట్టిందన్న కృతజ్ఞతయినా చూపాడా? కనీసం- ఇండియాలో కాశ్మీర్ విలీనం ఎవరూ ప్రశ్నించడానికి వీలులేనిదని, చట్టరీత్యా విలీనమవడంతో జమ్మూకాశ్మీర్ ఇండియాలో విడదీయరాని భాగమైపోయిందని అనడానికైనా అతడికి నోరు వచ్చిందా?

అబ్దుల్లా చేతికి అధికారాలు అప్పగించేందుకు రాజును ఒప్పించి, కాశ్మీర్‌ను

కాపాడేందుకు చివరి నిమిషంలో భారత్ సైన్యాన్ని హుటాహుటి తరలించసాగిన కొద్ది గంటలకే, 1947 అక్టోబరు 27న శ్రీనగర్ రెడ్‌స్క్వేర్‌లో చేసిన మొట్టమొదటి ప్రసంగంలో 'కాశ్మీర్ కేసరి' పలికినదిది

*"We have picked up the crown of Kashmir from dust whether we should join India or Pakistan is a secondary question First we have to complete our Independence "*

*(కాశ్మీర్ కిరీటాన్ని దుమ్ములో పడి ఉంటే మనం తీసుకున్నాం . మనం ఇండియాలో చేరుతామా, పాకిస్తాన్‌లోనా అనేది తరవాత ప్రశ్న ముందు మన స్వాతంత్ర్యాన్ని మనం పూర్తి చేసుకోవాలి )*

సమయానికి ఆదుకున్న భారత ప్రభుత్వం గురించి గాని, భారత సైన్యం గురించి గాని ఒక్క మంచి మాట చెప్పడానికి కూడా అబ్దుల్లాకు మనసొప్పలేదు.

జిన్నా దగ్గర తన పప్పులుడకవని గ్రహించిన అబ్దుల్లా - మరో దారి లేక న్యూఢిల్లీని ఆశ్రయించి, నెహ్రూ పుణ్యమా అని మొదట జమ్మూ కాశ్మీర్ ఎమర్జెన్సీ ఎడ్మినిస్ట్రేషనుకు అధినేత అయ్యాడు 1948 మార్చి 4న ఏకంగా ప్రధానమంత్రి కాగలిగాడు. చట్టపరంగా ఆ రాష్ట్రానికి సంస్థానాధిపతే సర్వాధికారి అయినా, ముఖ్య వ్యవహారాలలో ఆయనను సంప్రదించవలసిన బాధ్యతను కూడా విస్మరించి, పైపెచ్చు ఆయనపై నిరంతర దుష్ప్రచారాన్ని సాగించి, నానావిధాల అవమానించి, చివరికి నెహ్రూ ద్వారా వత్తిడి తెచ్చి 1949 జూన్ 20న యువరాజు కరణ్‌సింగ్‌ను రాజప్రతినిధిగా నియమింపజేసుకుని మహారాజును ఏకంగా కాశ్మీర్ సంస్థానం నుంచి తరిమివేశాడు అప్పటికి యువరాజుకు 18 ఏళ్ళు. రాజకీయ తంత్రంలో తలపండిన మహారాజునే ధిక్కరించినవాడు ఆ అర్భకుణ్ణి లెక్కచేస్తాడా? రాజ్య వ్యవహారాలను తాను అతడికి నివేదించవలసింది పోయి, అతడు ఎక్కడికి వెళ్ళాలన్నా ఏమి చేయాలన్నా ముందుగా తన అనుమతి తీసుకోవాలని అడ్డగోలు ఆంక్షలు పెట్టేంత దూరం అబ్దుల్లా వెళ్ళాడు యుద్ధ వాతావరణంలో సంక్షుభితమైన పరిస్థితుల్లో ఆచితూచి బాధ్యతాయుతంగా అడుగు వేయాలన్న ఇంగిత జ్ఞానం కూడా అతనికి లోపించింది. అధికారం చేతికందడంతో ఢిల్లీతో ఆయనకు అక్కర తీరింది. తెలివితక్కువగా యుద్ధాన్ని మధ్యలో ఆపి, న్యాయం చేయమంటూ భారత ప్రభుత్వం ఐక్యరాజ్యసమితిని దేబిరించడంతో అంతర్జాతీయ వివాదమై పోయిన కాశ్మీర్‌పై వాదం నెగ్గాలంటే ఇండియాయే ఇక తన కాళ్ల దగ్గరికి రావాలని అబ్దుల్లాకు అహంభావం అతిశయించింది ఈలోపు నెహ్రూ ప్రభుత్వం ఇంకో తెలివితక్కువ పని చేసింది భద్రతా

మండలిలో తన తరఫున వాదించే ప్రతినిధి వర్గంలో ఏరికోరి షేక్ అబ్దుల్లానూ చేర్చింది. అసలే కోతి... అందునా కల్లు తాగింది... అన్న సామెతలాగా అసలే అవకాశవాది, అధికార పిపాసి అయిన అబ్దుల్లాకు అంతర్జాతీయ ప్రముఖులతో భుజాలు రాచుకు తిరిగే అవకాశం రావడంతో ఆ పలుకుబడిని ఇండియా కోసం కాక తన స్వార్థం కోసం, సర్వ స్వతంత్ర రాజ్యాధినేతగా తాను కాశ్మీర్ సుల్తాను కావటం కోసం బహుచక్కగా వినియోగించుకున్నాడు. కాశ్మీర్‌ను వీలయితే పాకిస్తాన్‌కైవసం చేసి, లేదా అక్కడ పాకిస్తాన్ ప్రాముఖ్యం పెంచి, ఇండియా నోట మన్నుకొట్టి కాశ్మీర్‌ను రావణకాష్ఠంలా తయారు చేయాలని అమెరికా - ఇంగ్లండు కూటమి దేశాలు అప్పటికే నిశ్చయించుకున్నాయి. సొంత లాభం కోసం ఎవరిని ముంచటానికైనా వెనకాడని అబ్దుల్లా వాటి రాజకీయానికి వాటంగా దొరికాడు. షేక్ అబ్దుల్లాను ఐరాస ప్రతినిధి వర్గంలో చేర్చటం అవివేకమని, అతడు ఏనాటికైనా ఇండియాకు పుట్టి ముంచగలడని మౌంట్ బాటెన్ సహాయకుడుగా పనిచేసిన *Alan Campbell - Johnson* "Mission with Mountbatten" గ్రంథంలో ముందే ఊహించి చెప్పాడు కొన్ని దశాబ్దాలుగా అబ్దుల్లా తన అప్తమిత్రుడని అనుకున్న పండిట్ నెహ్రూ మాత్రం అతడు చేస్తున్న నమ్మకద్రోహాన్ని కనిపెట్టలేక పోయారు.

సమయం వస్తే ఇండియాకు నామం పెట్టటానికి తాను సిద్ధమన్న సంగతి అబ్దుల్లా అతి రహస్యంగా ఏమీ దాచుకోలేదు 1949 మేలోనే *Sunday Observer, New Scotsman* పత్రికల కిచ్చిన ఇంటర్వ్యూలో *Accession to either side can not bring peace We want to live in friendship with both Dominions Perhaps a middle path between them with economic co-operation with each will be the only way of doing it (ఎటువైపు విలీనం వల్లా శాంతి పొసగదు రెండు డొమీనియన్లతో స్నేహంగా బతకాలని మేము కోరుకుంటున్నాము ఇరువురితో ఆర్థిక సహకారం కలిగి మధ్యేమార్గం అనుసరించడం ఒకటే ఇందుకు మార్గం)* అన్నాడు అబ్దుల్లా

పాకిస్తాన్‌ను ఎదుర్కోవడానికి ఇండియా ప్రతినిధిగా ప్రపంచ వేదికనెక్కినవాడు పాకిస్తాన్నూ, ఇండియానూ ఒకే గాట కట్టి తన స్వతంత్రాధిపత్యం కోసం ఎత్తులు వేసినట్టే - రాష్ట్ర పరిపాలనలోనూ ఢిల్లీని లెక్కచేయకుండా, భారత రాజ్యాంగ సార్వభౌమత్వాన్ని గుర్తించకుండా, జాతీయ జండాను గౌరవించకుండా తన రాష్ట్రానికి ప్రత్యేక రాజ్యాంగం కావాలని, ప్రత్యేక జండా ఉండాలని, భారతీయ శాసనాలు తన రాష్ట్రానికి ఆటోమేటిగ్గా వర్తించడానికి వీలులేదని, ఆఖరికి భారత్ పౌరసత్వం, సుప్రీంకోర్టు అధిపత్యం కూడా కాశ్మీర్‌లో చెల్లరాదని పట్టుబట్టాడు. దురదృష్టమేమిటంటే - భారత ప్రయోజనాలకు

అంతర్జాతీయంగా అబ్దుల్లా చేస్తున్న నమ్మకద్రోహాన్ని. . రాష్ట్రంలో పోనుపోను అతడి బుద్ధి వేస్తున్న వెర్రితలలను గమనించి, సకాలంలో తగిన విధంగా అదుపు చేయవలసింది పోయి జవహర్‌లాల్ నెహ్రూ తెలిసో తెలియకో అబ్దుల్లా బ్లాక్‌మెయిల్‌కు దోసిలి ఒగ్గారు వద్దు– మునుముందు చాలా ప్రమాదమని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఎంత హెచ్చరించినా వినకుండా, జమ్మూ కాశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తినిచ్చే 370వ అధికరణాన్ని భారత రాజ్యాంగంలో కేవలం తాత్కాలికమంటూ పొందుపరిచారు. తరవాత పొడసూపిన అనర్థాలకు ఈ అధికరణమే సగం కారణం.

దీనితోబాటు జమ్మూ కాశ్మీర్ వాసులకు ప్రత్యేక పౌరసత్వ హక్కులను, ఆ రాష్ట్రానికి ప్రత్యేక జండాను, అనువంశిక రాజరికం రద్దును అనుమతించి, భారత పౌరులందరి ప్రాథమిక హక్కులకు, రాష్ట్రపతి, సుప్రీంకోర్టు అధికారాల చెల్లుబాటుకు కూడా హద్దులను నిర్ణయిస్తూ అబ్దుల్లాతో కుదుర్చుకున్న ఢిల్లీ ఎగ్రిమెంటును 1952 జూలై 24న పార్లమెంటులో నెహ్రూజీ ప్రకటించారు ఏకపక్ష ఎన్నికల దరిమిలా అప్పటికే ఏర్పడి, నేషనల్ కాన్ఫరెన్సు సభ్యులతోటే నిండిన జమ్మూ కాశ్మీర్ రాజ్యాంగ నిర్ణాయక అసెంబ్లీ కూడా దాన్ని అగస్టు 19న ఆమోదించింది. తన అడ్డగోలు డిమాండ్లకు న్యూఢిల్లీ తల ఒగ్గిన కొద్దీ అబ్దుల్లా మరింత పేట్రేగాడు. తన పార్టీ జండాను రాష్ట్ర పతాకంగా ప్రకటించి, జాతీయ పతాకాన్ని పక్కన పడవేయటం ఒకటే కాదు. *We are One Hundred percent Sovereign ... No Parliament, be it that of India or any other Country has authorisation here* (*మనం నూటికి నూరు శాతం స్వతంత్ర సార్వభౌములం. ఇండియాది గాని, మరో దేశానిదిగాని ఏ పార్లమెంటు అధికారమూ ఇక్కడ చెల్లదు*) అని 1952లో రాష్ట్ర అసెంబ్లీలో నిలబడి పలికిన ఘనుడతడు. 'ఇండియాతో విలీనాన్ని మనం ధ్రువీకరించనంత మాత్రాన పాకిస్తాన్ పాలబడతామన్న భయంలేదు. విలీనానికి ముందునాటి (స్వతంత్ర) స్థితికి మళ్ళీ చేరుతామంతే' ననీ ఆయన అదే వేదిక మీద వదిరాడు. 1952 ఏప్రిల్ 10న రణబీర్‌సింగ్‌పురా సభలో మతతత్వంతో వ్యవహరిస్తున్నారంటూ ఏకంగా నెహ్రూ ప్రభుత్వం మీదే ధ్వజమెత్తాడు. రాష్ట్ర వ్యవహారాల్లో కేంద్ర ప్రభుత్వ జోక్యాన్ని సహించేది లేదని 1952 జూలై 13న కూడా అబ్దుల్లా బహిరంగ సభలో వార్నింగ్ ఇచ్చాడు.

విచిత్రమేమిటంటే – తన విషపు కోరలను అబ్దుల్లా ఇంత బాహాటంగా బయటపెడుతున్నా అతడి నిజస్వరూపాన్ని నెహ్రూ పోల్చుకోలేదు.

*You can criticise Sheikh Abdullah Sheikh Abdullah is no god. He commits many errors and will commit many more He is a brave man and a*

*great leader of his people He has led them when they were facing grave disaster If he has made a mistake here and there, if he has delivered a speech which we do not like what of that? Bigness is bigness inspite of a hundred mistakes*

(షేక్ అబ్దుల్లాను మీరు విమర్శించవచ్చు షేక్ అబ్దుల్లా దేవుడు కాదు ఆయన చాలా తప్పులు చేశాడు ఇంకా చాలా తప్పులు చేస్తాడు ఆయన ధైర్యశాలి తన ప్రజలకు గొప్ప నాయకుడు తీవ్ర వినాశనం ఎదురైన సమయంలో ఆయన వారిని ముందుండి నడిపించాడు ఇక్కడ అక్కడ ఆయన ఒక తప్పు చేస్తే మనకు ఇష్టంలేని ప్రసంగం చేస్తే – ఏమిటట? నూరు తప్పులున్నా సరే పెద్దరికం పెద్దరికమే) అని 1952 ఆగస్టు 7న కూడా లోక్‌సభలో అబ్దుల్లాను నెహ్రూ వెనకేసుకు వచ్చారు

ఈ లోపు అబ్దుల్లా పెడపోకడలకు వ్యతిరేకంగా జమ్మూ ప్రజాపరిషత్ ఆధ్వర్యంలో మొదలైన ఉద్యమం ముమ్మరమైంది 'ఏక్ దేశ్ మే దో విధాన్, ఏక్ దేశ్ మే దో నిషాన్, ఏక్ దేశ్ మే దో ప్రధాన్ నహీఁ చలేంగే – నహీఁ చలేంగే' (ఒకే దేశంలో రెండు రాజ్యాంగాలు, రెండు జండాలు, ఇద్దరు ప్రధానులు వీల్లేదు – వీల్లేదు) అని నినదిస్తూ. ఇండియాలో విలీనమై పోయిన జమ్మూ కాశ్మీర్‌లో మిగతా రాష్ట్రాలన్నిటిలాగే భారత రాజ్యాంగం భారత సార్వభౌమాధికారం పరిపూర్ణంగా వర్తించాలని, నడమంత్రపు ప్రత్యేక ఏర్పాట్లు పోవాలని కోరుతూ జమ్మూ అంతటా ఊపందుకున్న ప్రజాందోళన యావద్భారత దృష్టిని ఆకర్షించింది ఈ ఉద్యమంలో భాగంగానే జమ్మూకు తరలివెళ్ళిన ప్రతిపక్ష నాయకుడు డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీని తన పొలిమేరలో అడుగుపెట్టగానే అబ్దుల్లా ప్రభుత్వం నిర్బంధించింది శ్రీనగర్ చెరలో నలభై రోజులు నిర్బంధించి, కనీస సదుపాయాలను సైతం నిరాకరించి, ఆరోగ్యం త్వరితగతిన క్షీణిస్తున్నా ఉపేక్షించి, పరిస్థితి విషమించాక తప్పుడు వైద్యం చేయించి, అనుమానాస్పద పరిస్థితుల్లో ఆయన ప్రాణాన్ని 1953 జూన్ 23న అబ్దుల్లా ప్రభుత్వం బలి తీసుకున్నది ఈ ఘోర దురంతానికి యావద్భారతం ఉద్విగ్నమైంది దీనికి నెల రోజుల ముందు అమెరికా రాయబారి ఎడ్లాయ్ స్టీవెన్సన్ శ్రీనగర్ వెళ్ళి అబ్దుల్లాతో రహస్యంగా మంతనాలాడాడు ఈ భేటీ జరిగిన కొద్ది వారాలకే 'ఇండియాకో, పాకిస్తాన్‌కో తోకలా పడి ఉండాల్సిన ఖర్మ మాకు పట్టలేదు వీళ్ళకు నేను గుడ్‌బై చెప్పే రోజు రాబోతున్నది' అని అబ్దుల్లా బహిరంగంగా ధ్వజమెత్తాడు ఇండియాతో తెగతెంపులు చేసుకుని స్వాతంత్ర్యం ప్రకటించుకోవాలన్నదే అతగాడి పన్నాగమనడానికి రుజువుగా ఆ దరిమిలా 1953 నవంబర్ 11న లండన్‌లో బ్రిటిష్ ప్రధాని అట్లీ *'Kashmir should belong neither to India nor to Pakistan, but be*

*independent' (కాశ్మీర్ ఇండియాకు గానీ, పాకిస్తాన్‌కు గానీ చెందకుండా స్వతంత్రంగా ఉండాలి)* అని ప్రకటించాడు.

వ్యవహారం ఇంత దూరం వెళ్ళాక, సొంత మంత్రివర్గంలోనే ముసలం పుట్టి, కుడి భుజమనుకునే ఉప ప్రధాని బక్షీ గులాం మహమ్మదే ఎదురు తిరిగి మెజారిటీ మంత్రులు అబ్దుల్లాపై తిరుగుబాటు చేసిన తరవాత నెహ్రూ ప్రభుత్వం కాశ్మీర్ కేసరి నమ్మకద్రోహాన్ని ఆలస్యంగా గుర్తించింది. అప్పుడు సాదర్ – ఇ- రియాసత్‌గా ఉన్న యువరాజు కరణ్‌సింగ్ చేత షేక్ అబ్దుల్లా ప్రభుత్వాన్ని 1953 అగస్టు 8న డిస్మిస్ చేయించి, గుల్మార్గ్ విడిదిలో నిద్రిస్తున్న అబ్దుల్లాను రాత్రికి రాత్రి నిర్బంధించారు.

అక్కడితో అబ్దుల్లా పీడ కాశ్మీర్‌కు తొలగలేదు.

తరవాత గ్రంథం చాలా ఉంది.

# బుద్ధి మారని అబ్దుల్లా

ఒక ముఖ్యమంత్రిని డిస్మిస్ చేయటం ఎప్పుడో తప్ప జరగదు. మెజారిటీకి ఢోకా లేకపోయినప్పటికీ ముఖ్యమంత్రిని బర్తరఫ్ చేయటం ఇంకా అరుదు. రాష్ట్రాన్ని పరిపాలిస్తున్న ఒక ముఖ్యమంత్రిని డిస్మిస్ చేయటమే గాక నిద్రపోతున్న వాడిని లేపి రాత్రికి రాత్రి అరెస్టు చేసి ఖైదులో పెట్టటం మరీ మరీ అరుదు. స్వతంత్ర భారత చరిత్రలో అలాంటి సంఘటన ఒకే ఒకసారి జరిగింది. ముఖ్యమంత్రిని బర్తరఫ్ చేసేది గవర్నరు. ఆ గవర్నరు కేంద్ర ప్రభుత్వం ఏజంటు. ముఖ్యమంత్రి కేంద్ర పాలకులకు విరోధి పక్షం వాడయితే... ప్రధానమంత్రికీ ఆయనకూ వ్యక్తిగత కక్షలేమైనా ఉంటే అన్యాయంగా పగ తీర్చుకున్నారని అనుకోవచ్చు. కాశ్మీర్‌లో షేక్ అబ్దుల్లా విషయం వేరు. అప్పటి ప్రధాని నెహ్రూకు మొదటి నుంచీ ఆయన ఆప్తమిత్రుడు.

అబ్దుల్లా అంతటి మహానాయకుడు, మహాధీరుడు జమ్మూ కాశ్మీర్ మొత్తం మీద మరొకడు లేడని, ఆయన ఏమి చేసినా సహించి, ఎలా రెచ్చగొట్టినా భరించి, ఆయనకు కావలసిన సర్వవిధ సహాయాలు చేయాలని జవహర్‌లాల్ నెహ్రూ సహచరులకు పదేపదే చెప్పేవాడు. అబ్దుల్లా ఫలానా ఫలానా తప్పుడు పనులు చేస్తున్నాడని రుజువులూ సాక్ష్యాలతో ఎవరైనా ఫిర్యాదు చేసినా విశాల ప్రయోజనాల దృష్ట్యా ఆయన పట్టించుకునేవాడు కాదు. అంతటి పెద్ద మనసుగల ప్రధానమంత్రి హయాంలోనే ఆయనకు తెలిసే, ఆయన అనుమతితోనే ముఖ్యమంత్రి ( అప్పట్లో ఆ పదవిని ప్రైమ్ మినిస్టరు అనేవారు) అబ్దుల్లాను డిస్మిస్ చేసి, ఖైదులో పెట్టారు. దీన్నిబట్టి... అన్ని కోణాలూ ఆలోచించాకే... ఇవ్వాల్సిన సంశయ లాభాలన్నీ ఇచ్చాకే... ఇక ఈ మనిషిని బయట ఉండనిస్తే రాష్ట్రానికీ, మొత్తం దేశానికీ ప్రమాదమన్న స్థిర నిశ్చయానికి వచ్చాకే... రుజువులు, ఆధారాలు అన్నీ జాగ్రత్తగా పరీక్షించాకే ఈ తీవ్రాతి తీవ్ర చర్య తీసుకున్నారని అనుకుంటాము కదా? భ్రమలు తొలిగి,

వాస్తవాలు తెలిసి, ఆ మనిషి నిజ స్వరూపం గ్రహించాకయినా అతడితో నిష్కర్షగా, నిర్దయగా వ్యవహరించి చట్టరీత్యా కఠిన చర్య తీసుకోవాలి కదా? ప్రాసిక్యూట్ చేయకపోతే మానె...కనీసం – వెనకటి వలె అతడి మాయలో పడకుండా వెయ్యి కళ్ళతో కనిపెట్టి ఉండి, మళ్ళీ తమను మోసం చేసే అవకాశం ఇవ్వకుండా సర్వవిధాల జాగ్రత్తపడాలి కదా? మరి – షేక్ అబ్దుల్లా విషయంలో జరిగిందేమిటి?

''షేక్ అబ్దుల్లా దేశద్రోహానికి పాల్పడ్డాడు. సామ్రాజ్యవాదులతో షరీకయ్యాడు. దేశ ప్రయోజనాలను దగా చేశాడు. ఆయన ఇచ్చిన స్వాతంత్ర్య నినాదం భారత్, పాకిస్తాన్ దేశాలు రెండిటికీ ప్రమాదకరమైనది .. దానివల్ల కొరియాలాంటి పరిస్థితి ఇక్కడ ఉత్పన్నమయ్యేది'' అని అబ్దుల్లా స్థానంలో అధికారం చేపట్టిన వెంటనే బక్షీ గులాం మొహమ్మద్ రేడియో ప్రసంగంలో ప్రజలకు వివరించాడు. మొదటి నుంచీ అబ్దుల్లాకు కుడిభుజం వలె నమ్మకంగా పనిచేసినా అనంతర కాలంలో అధికారం తలకెక్కాక ఆయన పెడపోకడలను బక్షీ సమర్థించలేక పోయాడు. ఆయన నిక్కచ్చి మనిషి. అబ్దుల్లాను స్వేచ్ఛగా తిరగనిచ్చి విష ప్రచారం చేసుకోనిస్తే మొత్తం కాశ్మీర్‌కు అగ్గిపెడతాడని చెప్పి.. మొదట్లో గవర్నరు (నాడు ఆయన హోదా సాదర్–ఇ–రియసత్) కరణ్‌సింగ్ తటపటాయించినా పట్టుబట్టి షేక్ సాహెబ్‌ను అరెస్టు చేయించాడు. షేక్ అభిమానులు దానికి రెచ్చిపోయి భారీఎత్తున హింస, విధ్వంసాలకు దిగినా ఉక్కుపాదంతో అల్లర్లను అణచాడు అబ్దుల్లా ప్రభుత్వం తనకు కావలసిన అంశాలను మాత్రం ఉపయోగించుకుని, మిగతావి పట్టించుకోక పక్కన పడేసిన 'ఢిల్లీ అగ్రిమెంటు' అమలుకు బక్షీ శాయశక్తులా పాటుపడ్డాడు. బక్షీ గులాం మహమ్మద్ హయాంలోనే భారత రాజ్యాంగంలోని కొన్ని నిబంధనలను జమ్మూ కాశ్మీర్‌కు వర్తింపజేస్తూ రాష్ట్రపతి తొలి ఉత్తర్వు వెలువడింది. జమ్మూ కాశ్మీర్ రాజ్యాంగ నిర్ణాయక అసెంబ్లీకి తనను హాజరు కానివ్వాలని, తన వాదాన్ని ప్రజలకు వినిపించనివ్వాలని అబ్దుల్లా ఎన్ని విధాల వత్తిడి తెచ్చినా బక్షీ లొంగలేదు. ఆయన పూనిక వల్లే రాజ్యాంగ నిర్ణాయక సభ *"The state of Jammu & Kashmir is and shall be an integral part of the Union of India"* *(జమ్మూ కాశ్మీర్ రాష్ట్రం ఇప్పుడు, ఇక ముందు ఇండియన్ యూనియన్‌లో సంఘటిత భాగం)* అని 1956 నవంబర్ 17న నిర్ద్వంద్వంగా ప్రకటించి ఇండియాలో కాశ్మీర్ విలీనానికి తిరుగులేని ఆమోదముద్ర వేసింది.

ఇంతకంటే ఇండియాకు ఏమి కావాలి? చట్టరీత్యా ఏకైక నిర్ణేత అయిన సంస్థాన పాలకుడు విలీన పత్రం రాసి ఇచ్చినప్పుడే జమ్మూ కాశ్మీర్ ఇండియాలో విడదీయరాని భాగమై పోయింది అప్పట్లో మౌంట్‌బాటన్ శకుని తంత్రాన్ని పోల్చుకోలేక నెహ్రూ ప్రభుత్వం 'ప్రజల ఆమోదానికి లోబడి' అన్న అనర్థకపు షరాను చేర్చటంవల్ల కాశ్మీర్ విలీనం మీద

అనవసరపు క్వశ్చన్ మార్కుపడింది. ప్రజాభిమతం తెలుసుకునేందుకు అన్న ఉద్దేశంతో పేర్కొన్న 'ప్లెబిసైటు' మీద ఐక్యరాజ్యసమితి వేదిక మీద, ఇతరత్రా పాకిస్తాన్ నానా రాద్ధాంతం చేయసాగింది. ఈ నేపధ్యంలో – జమ్మూ కాశ్మీర్ ప్రజలు చట్టబద్ధంగా ఎన్నుకున్న రాజ్యాంగ నిర్ణాయక సభ ఐచ్ఛికంగా, అసందిగ్ధంగా ఇండియాలో విలీనాన్ని ధ్రువీకరించ డంతో ఆ లాంఛనమూ తీరి, ఇంకెవరూ నోరెత్తిలేని రీతిలో కాశ్మీర్ ఇండియా పరమైంది. ఇలా కలిసి వచ్చిన అనుకూల పరిస్థితులను సద్వినియోగం చేసుకుని, పేచీకోరు అబ్దుల్లాతో మళ్ళీ తోకలేపే ఆస్కారం లేకుండా కరాఖండిగా వ్యవహరించి, కలతల గతాన్ని పూడ్చిపెట్టి కాశ్మీర్‌ను భారతీయ జన జీవన స్రవంతిలో సంపూర్ణంగా కలిపేందుకు న్యూఢిల్లీ గట్టి కృషి సాగించి ఉంటే చరిత్ర గతి ఇంకో విధంగా ఉంటేది షేక్ అబ్దుల్లా వలె కాశ్మీర్ లోయ మీదే దృష్టి కేంద్రీకరించకుండా, ముస్లింల శ్రేయస్సు మాత్రమే పట్టించుకుని మిగతా మతస్థులను వారి కర్మానికి వదిలేయకుండా బక్షీ గులాం మహమ్మద్ జమ్మూ, కాశ్మీర్, లఢాఖ్ మూడు ప్రాంతాల్లోనూ అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి అందరికీ సమాన న్యాయం చేసేందుకు తనకున్న పరిమితుల్లోనే సమర్థంగా కృషి చేశాడు. న్యూఢిల్లీకి అమ్ముడుపోయాడని, కాశ్మీరీల ప్రయోజనాలను తాకట్టు పెట్టి తీరని ద్రోహం చేస్తున్నాడని అబ్దుల్లా అనుయాయులు ఆయన మీద పెద్ద దుమారం లేపారు. ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే – దూరం ఆలోచించి, అన్నివిధాలా సహకరించి ఆయన నాయకత్వాన్ని బలోపేతం చేయవలసింది పోయి – భారత ప్రభుత్వమే పనిగట్టుకుని ఆయనకు కొత్త సమస్యలు తెచ్చిపెట్టింది. ఇండియానూ పాకిస్తాన్‌నూ ఒకే గాట కట్టి, ఇండియాతో విలీనాన్ని తిరగదోడి, అంతర్జాతీయ కుట్రకు తెగబడ్డ తరవాతయినా షేక్ అబ్దుల్లా ద్రోహబుద్ధిని గుర్తెరిగి, అతడి నీడ మళ్ళీ కాశ్మీర్ భవితవ్యం మీద పడకుండా జాగ్రత్త పడటానికి బదులు సీసాలో బంధించిన భూతాన్ని బిరడా తీసి బయటికి వదలటానికి తానే శక్తివంచన లేకుండా శ్రమపడింది.

తరవాత కాలంలో జమ్మూ కాశ్మీర్ ముఖ్యమంత్రి అయిన మీర్‌కాసిం My Life and Times అనే ఆత్మకథ 72వ పేజీలో రాసిన ప్రకారం – అబ్దుల్లాతో సంభాషణలు మొదలెట్టమని ఆయనను అరెస్టు చేసిన మూడోరోజే న్యూఢిల్లీ నుంచి నెహ్రూ పనుపున రఫీ అహ్మద్ కిద్వాయ్ బక్షీ సాహెబ్‌కు అర్ధరాత్రి ఫోను చేశారట. ఆ సమయంలో జి.ఎం సాదిక్, మీర్ కాసింలు బక్షీ దగ్గరే ఉన్నాడట. షేక్ అభిమానులు తమను దుమ్మెత్తిపోస్తుండగా ... ఆయన అరెస్టు ఎందుకు తప్పనిసరి అయిందో జనానికి వివరించటానికి ఒక చెంప తాము నానా అవస్థ పడుతూంటే – అదే షేక్‌తో మంతనాలు సాగించమంటున్నారేమిటని బక్షీ నిర్ఘాంతపోయాడట.

అయనకు ఇష్టం ఉన్నా లేకున్నా తెర వెనుక రాజకీయం జోరుగానే నడిచింది అబ్దుల్లా ప్రభావం నుంచి కాశ్మీర్‌ను బయట వేయటానికి బక్షీ ప్రభుత్వం చేసిన ప్రయత్నాలకు సమాంతరంగా - అబ్దుల్లా ప్రభావాన్ని ప్రకాశింపజేయటానికి రకరకాల బేరాలు, రాయబారాలు సాగాయి వీటి పర్యవసానంగానే - 1958 జనవరి 8న షేక్ అబ్దుల్లాను బేషరతుగా విడిచిపెట్టారు నెహ్రూ మొహమాటానికి ఆయనను విడుదల చేసినా బక్షీ మొహమ్మద్ ఒక మంచి పని చేశాడు. షేక్ సాహెబ్ మీద గట్టి నిఘా పెట్టి, ఆయన ఎక్కడి కెళతాడు, ఎవరితో ఎక్కడ ఏమి మాట్లాడతాడు, ఏమి చేస్తాడు అన్నవి ఆరాతీసి, గూఢచారుల చేత జాగ్రత్తగా టేప్‌రికార్డు చేయించాడు 'కాశ్మీర్ కేసరి' జైలు నుంచి బయటపడింది మొదలు ముస్లింలకు ఆయన చేసిన ఉపదేశం ఎంత అమోఘమైనదంటే మరుక్షణంలోనే దొమ్మీలు, అల్లర్లు చెలరేగాయి. అది మొదలుకుని ప్రార్థన సమావేశాల్లోనూ, రాజకీయ వేదికలపైన, రహస్య గూడుపుఠాణిల్లోనూ అబ్దుల్లా పలికినది పలికినట్టు రికార్డు చేయించి, మొత్తం టేపులను తీసుకుపోయి బక్షీ సాహెబ్ ప్రధాని నెహ్రూ ముందు పెట్టాడు. వాటిని, అబ్దుల్లా రాసిన లేఖలను, ఆయనకు వచ్చిన జాబులను, ఇతర పత్రాలను చూసి నెహ్రూజీ నిర్ఘాంతపోయాడు షేక్ సాహెబ్ వెనుకటి గుణం మానలేదని, పాకిస్తాన్‌తో ఆయన పెద్ద లాలూచీయే పడ్డారని అర్థమైన మీదట అబ్దుల్లాను మళ్ళీ అరెస్టు చేసి, కేసు పెట్టటానికి ఆయన సమ్మతించాడు వదిలిపెట్టిన మూడు నెలలకే కాశ్మీర్ కేసరిని 1958 ఏప్రిల్ 29న తిరిగి బంధించారు. ప్రభుత్వాన్ని పడగొట్టి, అరాచకం సృష్టించి, కాశ్మీర్‌ను పాక్ పరం చేసేందుకు పాకిస్తాన్‌తో కుమ్మక్కయిన అభియోగంపై ఆయన మీద, ప్లెబిసైట్ ఫ్రంట్ నాయకుడు మీర్జా అఫ్జల్ బేగ్ మీద, మరో 20 మంది మీద 'కాశ్మీర్ కుట్ర కేసు'ను పెట్టారు. విచారణ ఒక పట్టాన సాగకుండా నిందితులు చాలా ఎత్తులు వేశారు విదేశీయులతో కలిసి దేశానికి వ్యతిరేకంగా కుట్ర పన్నారనటానికి ప్రాథమిక సాక్ష్యాధారాలు ఉన్నాయని మేజిస్ట్రేటు ఎట్టకేలకు నిర్ధారించి 1962 జనవరి 25న కేసును సెషన్స్ కోర్టుకు పంపించారు. నాలుగేళ్లు లేటుగానైనా న్యాయరథం కదిలి అబ్దుల్లా ద్రోహానికి తగిన శాస్తి జరగబోతోందని అమాయకులు అనుకున్నారు. మరోసారి మోసపోయారు

అనంతర కాలంలో కాశ్మీర్ రాజకీయాల్లో చాలా మార్పులు వచ్చాయి. ప్రజాస్వామిక హక్కులు పరిరక్షించాలన్న సదుద్దేశంతో బక్షీ ప్రభుత్వం అబుల్లా అంతరంగికుడు మీర్జా అఫ్జల్‌బేగ్‌కు ప్లెబిసైట్ ఫ్రంటు నడుపుకోవటానికి ఇచ్చిన అనుమతి పోనుపోను ఆయనకే నెత్తికి చేతులు తెచ్చింది. అబ్దుల్లా అరెస్టు - విడుదల - మళ్ళీ అరెస్టు దరిమిలా కాశ్మీరీ ముస్లింల్లో ఈ ఫ్రంటు విద్వేషం వ్యాప్తి చేసి బక్షీని ఢిల్లీ తొత్తుగా చిత్రించింది. నేషనల్

కాన్ఫరెన్సు పార్టీలోనూ ముఖ్యమంత్రి చాటున అసమ్మతిని ఎగదోసి, ఢిల్లీకి చాడీలు చెప్పేవారు ఎక్కువయ్యారు కేంద్ర నేతలూ వారికి చెవిఒగ్గేవారు దీనికితోడు బక్షీ మహమ్మద్ చుట్టూ ఒక కోటరీ తయారై ప్రభుత్వ వ్యవహారాల్లో భారీఎత్తున అవినీతికి, బంధుప్రీతికి పాల్పడింది రాజకీయ లౌక్యం లేకుండా తనకు ఎంత తోస్తే అంత మాట్లాడి, అనవసరంగా మనుషులను దూరం చేసుకునే తత్వమూ బక్షీకి శత్రువులను పెంచింది. అవినీతి, అక్రమాల ఆరోపణలు అంతకంతకూ ఎక్కువై, ఆయనకు వ్యతిరేకంగా అసమ్మతి ఊపునందుకున్న సమయంలో 'కామరాజ్ ప్లాన్' వచ్చింది ప్రభుత్వంలో కీలక బాధ్యతను నిర్వహిస్తున్న వారి సేవలను కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు వినియోగించుకోవటానికంటూ అప్పటి కాంగ్రెస్ అధ్యక్షుడు కామరాజ్ నాడార్ ఆ పథకం ప్రకటించిన ఉద్దేశం వేరు. అది కాంగ్రెస్ పార్టీకి పరిమితమైనదే తప్ప ఇతర పార్టీలకు వర్తించేది కాదు అయినా బక్షీ గులాం మొహమ్మద్ లేనిపోని మెహర్బానీ కోసం (ఎలాగూ వద్దంటారన్న నమ్మకంతో) తానూ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేస్తానన్నాడు. నెహ్రూజీ దానికి చప్పున ఒప్పేసుకున్నాడు. విధిలేక 1963 అక్టోబర్ 4న బక్షీ రాజీనామా చేశాడు ఆయన స్థానంలోకి జి ఎం సాదిక్‌ను తేవాలని న్యూఢిల్లీ ప్రయత్నించినా, బక్షీ గట్టిగా నిలబడి, పార్టీలో తన ప్రాబల్యాన్ని ఉపయోగించి తనకు విశ్వాసపాత్రుడైన షంషుద్దీన్‌ను ముఖ్యమంత్రిని చేశాడు తాను వెనుక నుంచి చక్రం తిప్పాడు కాని – ఆ సొంపు నిండా నూరు రోజులు కూడా సాగలేదు.

ముఖ్యమంత్రి మారిన రెణ్నెల్లకే హజరత్‌బల్‌లో మహమ్మద్ ప్రవక్త పవిత్ర కేశం మాయమైంది దాంతో కాశ్మీర్ అంతటా అల్లర్లు లేచాయి లూటీలు, దహనాలు విచ్చలవిడిగా సాగాయి అప్పటి ఇంటలిజెన్స్ బ్యూరో డైరెక్టర్ బి ఎన్ మల్లిక్ చాకచక్యంవల్ల మాయమైన అవశేషం మళ్ళీ యధాస్థానానికి వచ్చింది అది నకిలీది కాదని ఇస్లామిక్ మత పెద్దలూ ధ్రువీకరించారు. దాంతో సంక్షోభమైతే సద్దుమణిగింది కాని అప్పుడు లేచిన మంటలు ముఖ్యమంత్రి పీఠాన్ని చుట్టుముట్టాయి అసమ్మతి రాజకీయాల ఫలితంగా షంషుద్దీన్ నిష్క్రమించి 1964 ఫిబ్రవరి 29న జి ఎం.సాదిక్ కాశ్మీర్ 'ప్రధానమంత్రి' (అప్పటికింకా ఆ పదవి పేరు అదే. ఇంకో ఏడాది తరవాత గాని 'ముఖ్యమంత్రి' 'గవర్నర్' పేర్లు వ్యవహారంలోకి రాలేదు) అయ్యారు.

సాదిక్ సౌమ్యుడు నెహ్రూకు ఇష్టుడు. అప్పటికే నెహ్రూకు షేక్ అబ్దుల్లా ఇంకా కటకటాల వెనుక ఉన్నాడే అన్న బాధ సలుపుతూండేది. బక్షీకి, ఆయన గద్దె నెక్కించిన షంషుద్దీన్‌కూ తన మనసులోని మాటను విప్పి చెప్పలేక పోయేవాడు సాదిక్ వచ్చాక ఆ అవస్థ తీరింది. ప్రమాణ స్వీకారం చేసిన నలభై రోజులకల్లా సాదిక్ సాహెబ్ కాశ్మీర్ కుట్ర కేసును విచారణ మధ్యలో ఉపసంహరించి షేక్ అబ్దుల్లాను విడుదల చేశాడు

1964 ఏప్రిల్ 8న జైలు నుంచి వదిలిపెట్టిన షేక్ అబ్దుల్లా తీరుబడిగా ఢిల్లీ వెళ్ళి ప్రధానమంత్రి నివాసంలో గౌరవ అతిథిగా బస చేశాడు. కలతలు తొలగి పాత స్నేహం మళ్ళీ చిగురించి చకచకా కొమ్మలు రెమ్మలు వేసింది అదే ఊపులో అబ్దుల్లా తాను పాకిస్తాన్ వెళ్లి ప్రెసిడెంటు అయూబ్‌ఖాన్‌కు నచ్చచెప్పి కాశ్మీర్‌పై సామరస్య పరిష్కారానికి ఒప్పిస్తానని ముచ్చటపడ్డాడు. నెహ్రూ కూడా ఆనందంగా అందుకు సరేనన్నాడు అబ్దుల్లా ఆలస్యం చేయకుండా పాక్ వెళ్ళి మే 25న అయూబ్‌ఖాన్‌తో భేటీ వేశాడు. ఇండియా, పాకిస్తాన్, కాశ్మీర్‌లు కలిసి ఒక ఐక్య సమాఖ్యగా ఏర్పడాలని ఆయన సూచించాడు. ఆ ప్రతిపాదన అసందర్భం, అసంబద్ధం అని అయూబ్‌ఖాన్ కొట్టిపారేశాడు *"I told them plainly we should have nothing to do with it. It was curious that whereas we were seeking the salvation of Kashmiris, they had been forced to mention an idea, which, if pursued, would lead to our enslavement" (దానికి సమ్మతించేది లేదని నేను వారికి సూటిగా చెప్పాను కాశ్మీరీలను బానిసత్వం నుంచి విముక్తి చేయాలని మేము కోరుతూంటే, ఏకంగా మమ్మల్నే బానిసత్వంలో పడవేయగల ఆలోచనను వారు, మోసుకురావటం చిత్రం)* అని అయూబ్‌ఖాన్ *'Friends and Not Masters'* అన్న తన గ్రంథం 129వ పేజీలో విస్మయం వెలిబుచ్చారు.

అయూబ్ దగ్గర పప్పులు ఉడకకపోవటంతో అబ్దుల్లా తెల్లమొగం వేసి మరునాడు 'ఆజాద్ కాశ్మీర్' రాజధాని ముజఫరాబాద్‌కు వెళ్ళాడు ఆ మరుసటిరోజే జవహర్‌లాల్ నెహ్రూ ఆకస్మికంగా కన్నుమూయడంతో దౌత్యయాత్రను కట్టిపెట్టి ఇండియాకు తిరిగి వచ్చాడు నెహ్రూ అనంతరం కాశ్మీరీల పరిస్థితి ఏమిటని ఆయన జీవించి ఉండగానే బహిరంగంగా ఆందోళన వెలిబుచ్చిన 'కాశ్మీర్‌కేసరి' తనను నెత్తిన పెట్టుకున్న ఆప్తమిత్రుడు కాస్త కనుమరుగయ్యాక భారత ప్రభుత్వం మీద, భారత నాయకుల మీద ద్వేషం మరింత పెంచుకున్నాడు. భారత వ్యతిరేక దుష్ప్రచారానికి బాహాటంగా పాల్పడ్డాడు. నెహ్రూ అనంతర రాజకీయ అనిశ్చితిని ఆసరా చేసుకుని కాశ్మీర్‌ను తన స్వతంత్రరాజ్యంగా మలచుకునేందుకు అబ్దుల్లా పెద్ద వ్యూహమే పన్నాడు. హజ్ యాత్ర కోసమని చెప్పి లాల్‌బహదూర్‌శాస్త్రి ప్రభుత్వం అనుమతి పొంది 1965 మార్చిలో సతీసమేతంగా విదేశ పర్యటనకు వెళ్ళాడు. దారి మధ్యలో ఇంగ్లండులోనూ ఈజిప్టులోనూ ఇండియాపై ధ్వజమెత్తి, జరగరాని ఘోరాలేవో కాశ్మీర్‌లో జరుగుతున్నాయని గోలపెడుతూ భారీఎత్తున ప్రాపగాండా యుద్ధం సాగించాడు. అటు నుంచి అల్జీరియా వెళ్లి మార్చి 28న చైనా ప్రధాని చౌ ఎన్‌లైతో గూడుపుఠాణీ చేశాడు అసలే చైనా దురాక్రమణ చేసిన గాయం ఇంకా పచ్చిపుండులా భారత ప్రజలను సలుపుతున్న స్థితిలో అబ్దుల్లా విదేశీగడ్డపై చైనా

వాడితో రహస్యతంత్రం నడపటం దేశవాసులందరికీ సహజంగానే ఒళ్ళు మండించింది. చేసిన నిర్వాకం చాలు- యాత్ర ముగించుకుని వెంటనే ఇండియాకు తిరిగి రాకపోతే మీ పాస్‌పోర్టును రద్దు చేస్తామని భారత ప్రభుత్వం అబ్దుల్లాకు తన సౌదీ రాయబారి ద్వారా వర్తమానం పంపింది ఇండియాలో అడుగుపెట్టగానే అరెస్టు తప్పదని షేక్ సాహెబ్‌కు అర్థమైంది అలాగని ఇండియా వెలుపల ఉండి చేయగలిగిందీ లేదు. గత్యంతరం లేని పరిస్థితుల్లో అబ్దుల్లా ఇండియాకు తిరిగి వచ్చాడు. 1965 మే 9న పాలం విమానాశ్రయంలో అడుగుపెట్టగానే డిఫెన్స్ ఆఫ్ ఇండియా రూల్సు కింద ప్రభుత్వం ఆయనను (ముచ్చటగా మూడోసారి) నిర్బంధించింది. లాల్‌బహదూర్ అనంతరం ఇందిరాగాంధి గద్దెనెక్కాక పాకిస్తాన్‌లో మరో రెండు యుద్ధాల తరవాత మళ్ళీ స్వేచ్ఛ ప్రసాదించే వరకూ అబ్దుల్లా చెరసాలలోనే ఉన్నాడు. జైలు నుంచి నేరుగా జమ్మూ కాశ్మీర్ ముఖ్యమంత్రి సింహాసనాన్నే ఒక్క అంగలో మళ్ళీ అందుకున్నాడు

దటీజ్ షేక్ అబ్దుల్లా!

# తాష్కెంట్ నుంచి సిమ్లాకు

*శత్రువు కష్టాలలో ఉన్నాడు; ఇతని ప్రజలు స్వసైన్యం చేతనే పీడించబడి విరక్తులుగా ఉన్నారు. వారిని లోభపెట్టడం సులభం అనుకున్నప్పుడు దండెత్తి వెళ్ళాలి. శత్రువు కంటే తాను దుర్బలుడై పోతున్నప్పుడు సంధి చేసుకోవాలి. అతడికంటే బలవంతుడైనప్పుడు యుద్ధం కొనసాగించాలి.*

*శత్రువు కష్టాలలో ఉన్నా, తెలివితక్కువ వాడైనా 'మనమిద్దరం కలిసి ఉందాం' అని సంధి చేసుకుని తద్వారా విశ్వాసం కలిగించి వాని ఆయువు పట్లను దెబ్బకొట్టాలి.*

*మిత్రునికిగాని, ఎక్కువ మైత్రి ఉన్నవానికి గాని మధ్యవర్తిగా ఉండి ఏ రాజు సహాయం చేస్తాడో అతడు ఎక్కువ లాభం పొందుతాడు. రెండవ వాడికి లభించేవల్లా క్షయం, వ్యయం, శత్రువుకు ఉపకారం చేయడం అనేవి మాత్రమే. శత్రువు తన పని అయిన తరవాత ఎలాగూ చెడ్డగానే ప్రవర్తిస్తాడు.*

*– కౌటిల్యుడి 'అర్థశాస్త్రం'*

*(షాడ్గుణ్య అధికరణం)*

సంధి, యుద్ధం ఎప్పుడు ఎవరితో చేయాలనే రాజనీతిసారాన్ని వివరిస్తూ ఇప్పటికి రెండువేల ఏళ్ళకు పూర్వం ఆర్య చాణక్యుడు చెప్పిందిది విచిత్రమేమిటంటే – కౌటిల్యుడు, అతడి అర్థశాస్త్రం పుట్టిన భారతదేశానికేమో ఈ రాజనీతి ఒంటబట్ట లేదు. శత్రురాజ్యాలు మాత్రం ఇదే రణతంత్రాన్ని ఇండియా మీదే యథేచ్ఛగా ప్రయోగించి ఎంచక్కా లాభపడుతున్నాయి. పాలకులకు దుర్మార్గం ఎక్కువై పొరుగు దేశాలు బాధపడుతూంటే పాలకులకు మంచితనం ఎక్కువై మన దేశం మొదటి నుంచీ అవస్థ పడుతున్నది. మన మంచితనమే మన శత్రువులకు శ్రీరామరక్ష!

దేశ విభజన తరవాత పాకిస్తాన్‌తో మనకు ఇప్పటికి నాలుగు యుద్ధాలు వచ్చాయి వీటిలో ఏదీ మనం కోరుకున్నది కాదు మనం ప్రేరేపించినదీ కాదు మనను దెబ్బతీయడం కోసం, మన భూమిని కబళించడం కోసం పొరుగు రాజ్యమే దండెత్తి దురాక్రమణకు దిగింది నాలుగుసార్లూ మన సైన్యం వీరోచితంగా పోరాడి, అసమాన శౌర్యంతో దురాక్రమణ దారులను తీవ్ర ప్రతికూల పరిస్థితుల్లో కూడా తరిమికొట్టి జాతి పరువు నిలిపింది

ఏం లాభం? ప్రతిసారీ – సైనికుడి పరాక్రమం వల్ల అతడి ఆత్మబలిదానంవల్ల యుద్ధరంగంలో సిద్ధించిన ఆధిక్యాన్ని అనంతర దౌత్యరంగంలో మన దయగల ప్రభువులు చేతులారా వదిలేసుకున్నారు. మన మిత్రులని మనం భ్రమించినవారే ఇతరేతర స్వార్థ ప్రయోజనాల కోసం మనకు తప్పు సలహాలు ఇచ్చారు హృదయం బహు విశాలమైన మన నాయకులు కూడా – మన జోలికి వచ్చిన శత్రువుకు తగిన శాస్తి చేసి రాజ్యాన్ని, సార్వభౌమాధికారాన్ని సంపూర్ణంగా సంరక్షించుకోవాలన్న క్షాత్రధర్మం కంటే – క్షమాగుణం మిన్న అనుకున్నారు ఫలితంగా – శాస్తి జరగడానికి బదులు మన విరోధులకు మంచి శాంతి బహుమతులే అప్పనంగా దక్కాయి

దేశ విభజన అయ్యీ కాగానే రెయిడర్ల ముసుగులో సైన్యాన్ని దండెత్తించి కాశ్మీర్‌ను బలవంతంగా కబళించేందుకు పాకిస్తాన్ పన్నిన వ్యూహం గురించి ఇంతకు ముందు వివరంగా చెప్పుకున్నాం అప్పటి మన నాయకులు రాజ్యపాలనకు కొత్త గాంధీగారి ఒద్దికలో శాంతి, అహింసల వ్రతాన్ని జీవితకాలం ఆచరించిన వారికి హఠాత్తుగా కత్తులు దూసి యుద్ధ తంత్రం నడపటం కష్టమైన పని పైగా – మిత్రుడని నమ్మి మనం నెత్తిన పెట్టుకున్న మౌంట్‌బాటన్ అనే తెల్లవాడు బుద్ధిపూర్వకంగా మనను బొందలోకి నెట్టాడు చట్టబద్ధంగా మన పరమైన జమ్మూ కాశ్మీర్ ప్రాదేశిక సమగ్రతను కాపాడవలసిన ప్రాథమిక బాధ్యత పూర్తి కాకుండా రాష్ట్రంలో మూడోవంతు నేల శత్రువుల కబ్జాలో ఉండగానే యుద్ధాన్ని మధ్యలో ఆపి, కాల్పుల విరమణకు ఒడంబడి, అంతర్జాతీయ పెత్తందారుల మంచిమనసు మధ్యవర్తిత్వం మీద ఆశ పెట్టుకోవటం నెహ్రూ చేసిన పెద్ద తప్పు ఆ సంగతి ఆయన కూడా ఆలస్యంగా గ్రహించారు దుండగులనూ బాధితులనూ ఒకేగాట కట్టి, (అమెరికా, ఇంగ్లండుల పాక్ పక్షపాత ప్రభావంతో) ఐక్యరాజ్యసమితి చేయబట్టిన 'భట్టిప్రోలు పంచాయతీ'కి నెహ్రూ హతాశుడయ్యాడు భద్రతా మండలిని న్యాయం కోసం ఆశ్రయించిన తొలిదశలో పాకిస్తాన్‌ను దురాక్రమణదారు అని నేరుగా పేర్కొనక పోయినా. కాశ్మీర్‌పై ఇండియా హక్కును నిర్ద్వంద్వంగా ఉద్ఘాటించలేకపోయినా కాలక్రమంలో ఇండియా వైఖరి తేటపడింది

1956 మార్చి 29న లోక్‌సభ చర్చకు సమాధానమిస్తూ ప్రధాని నెహ్రూ ఏమన్నారో గమనించండి:

*The first essential was the withdrawal of Pakistan's Armed Forces from that area of the State which they had occupied Today, eight and a half years after that, those Armed Forces are still there Pakistan is out of court till it performs its primary duty by getting out of that part of the State on which it committed aggression.*

*(జమ్మూ కాశ్మీర్ రాష్ట్రంలో వారు ఆక్రమించిన ప్రాంతాల నుంచి పాకిస్తాన్ సాయుధ బలగాలు వైదొలగడమన్నది మొట్టమొదట జరిగి తీరాలి ఇవాళ, ఎనిమిదిన్నర ఏళ్ల తరవాత కూడా ఆ సాయుధ దళాలు ఇంకా అక్కడే ఉన్నాయి... తాను దురాక్రమణ చేసిన రాష్ట్ర ప్రాంతాల నుంచి నిష్క్రమించే ప్రాథమిక విధిని నిర్వర్తించనంతవరకూ పాకిస్తాన్‌కు మరొకటి మాట్లాడే హక్కు లేదు )*

తాను ఆక్రమించిన భాగాన్ని పాకిస్తాన్ తన రాజ్యంలో కలిపేసుకోవడం మీద కూడా ప్రధాని నెహ్రూ తీవ్రాభ్యంతరం తెలిపారు జమ్మూ కాశ్మీర్ రాష్ట్రం యావత్తూ ఇండియాలో విలీనం అయిపోయింది కనుక పాక్ ఆక్రమణలోని సుమారు 50వేల చదరపు మైళ్ల కాశ్మీర్ భూమి కూడా చట్టరీత్యా ఇండియాకు చెంది తీరాలని ఆయన పలుమార్లు నొక్కి చెప్పారు. సరే! మొండివాడు రాజు కంటే బలవంతుడు న్యాయం మన పక్షాన ఉన్నా, ఈ ప్రపంచంలో న్యాయం కంటే స్వార్థం ముఖ్యం కాబట్టి పాకిస్తాన్ కబ్జాను మానలేదు మిగతా మోతుబరి దేశాలూ దానికి బుద్ధిచెప్పి మాన్పించలేదు మన భూమిని మనం స్వాధీన పరచుకునే హక్కు ఉన్నా, దాని కోసం మొదట మనమే దాడికి దిగితే అంతర్జాతీయంగా చెడ్డ పేరు రావచ్చున్న సంకోచం భారత ప్రభుత్వానికి ఉండటం అర్థం చేసుకోదగ్గదే

కానీ మళ్ళీ అవతలి దేశమే యుద్ధానికి వస్తే.. ? నిష్కారణంగా కత్తి ఎత్తి తిరిగి దురాక్రమణకు దిగితే ? ఆ దురాగతాన్ని ఎదుర్కొనే క్రమంలో అంతకు ముందే కబ్జాకు లోనైన ప్రాంతాలను కూడా తిరిగి మనం స్వాధీనపరచుకుంటే ఎవరు మాత్రం కాదంటారు? అందులోనూ – శత్రువు తానుగా ప్రారంభించిన యుద్ధంలో గెలుపు మనదైనప్పుడు, మనకు కావలసిన షరతులన్నిటికీ ఒప్పుకుంటే తప్ప సంధి కుదరదని గట్టిగా పట్టుబట్టి తీరాలి కదా?

చిరకాలంగా శత్రువు ఆక్రమించిన మన భూమిని విడిపించుకునేందుకు అరుదైన అవకాశం వచ్చినా ఉపయోగించుకోకుండా వదిలేసి, యుద్ధంలో మన వశమైన ప్రాంతాలను

కూడా బేషరతుగా తిరిగి విరోధికి ఒప్పగించి వట్టి చేతులతో వెనక్కి వచ్చామంటే మన మగటిమి గురించి ఏమనుకోవాలి?

1965-66 ఘటనలను ఒకసారి గుర్తుచేసుకుందాం

'శత్రువు కష్టాలలో ఉన్నాడు, అతని ప్రజలు పీడించబడి వైముఖ్యంతో ఉన్నారు. వారిని లోభపెట్టడం సులభం అనుకున్నప్పుడు దండెత్తి వెళ్లాలి' అని కదా కౌటిల్యుడు చెప్పాడు? 1965లో పాకిస్తాన్ అదే పని చేసింది. గతంలో మిగిలిపోయిన పనిని పూర్తిచేసి జమ్మూ కాశ్మీర్‌ను పూర్తిగా ఆక్రమించి తనలో కలిపేసుకోవటానికి పరిస్థితులన్నీ కలిసి వచ్చినట్టు అప్పట్లో ఇస్లామాబాద్‌కు అనిపించింది. 1962 యుద్ధంలో చైనా చేతిలో ఘోర పరాజయం పాలై భారత సైన్యం డీలా పడి ఉంది. పదిహేడేళ్లు దిగ్గజంలా ఇండియాను ఏలిన నెహ్రూ కన్నుమూశాడు. ఆయన అనంతరం కాంగ్రెసులో కలతలు హెచ్చి, కేంద్రాధికారం బలహీనపడింది. నెహ్రూ స్థానంలో కూచున్న లాల్‌బహదూర్‌శాస్త్రి అనే పొట్టిమనిషి పాకిస్తానీల కళ్ళకు ఊరపిచ్చుకలా కనిపించాడు. దీనికి తగ్గట్టు షేక్ అబ్దుల్లా తాజా అరెస్టు తరవాత కాశ్మీర్లో అల్లర్ల అగ్గి అంటుకుంది. అదే సమయంలో హజరత్‌బల్‌లో మహమ్మద్ ప్రవక్త పవిత్రకేశం మాయమైంది. కొద్ది రోజులకే అది మళ్ళీ దొరికినా అల్లర్ల దావాగ్ని చల్లారలేదు. ఇదంతా చూస్తే కాశ్మీరీ ప్రజలకు ఇండియా అంటే ద్వేషం పుట్టిందని, తమను విముక్తి చేయటానికి పాకిస్తానీ వీరులు అడుగు పెడితే చాలు మెడలో దండవేసి నెత్తిన ఎక్కించుకుంటారని పాక్ నియంత అయూబ్‌ఖాన్‌కూ, అతడి విదేశాంగ మంత్రి జుల్ఫికర్ అలీ భుట్టోకూ పసందుగా పొడగట్టింది. యుద్ధమంటూ వస్తే భారతీయులు తమ ముందు నిలవలేరని, ఒక పాకిస్తానీ సైనికుడు పదిమంది భారతీయ సైనికులకు సమానమని అది నుంచీ వారికి ఉన్న వెర్రి నమ్మకం సరేసరి! దీనికి తగ్గట్టే - కొద్ది నెలల కింద (1965 ఏప్రిల్‌లో) గుజరాత్‌లోని కచ్‌లో పాకిస్తానీలు దాడిచేస్తే భారతీయ సైన్యం వ్యూహాత్మకంగా వెనక్కి తగ్గింది చివరికి బ్రిటిష్ ప్రధాని జోక్యంతో కాల్పుల విరమణ జరిగి వివాదం అంతర్జాతీయ ట్రిబ్యునల్ మధ్యవర్తిత్వానికి వెళ్ళింది. ఇండియా దౌర్బల్యానికి ఇంతకంటే రుజువు ఏమి కావాలి అనుకున్నారు పాకిస్తానీలు

కచ్‌లో 'టెస్ట్‌డోసు' బాగా పనిచేసిందన్న ధీమాతో ఏకంగా కాశ్మీర్‌ను తన్నుకు పోయేందుకు వారు పెద్ద ప్లానే వేశారు

దానికి పెట్టిన పేరు 'ఆపరేషన్ జిబ్రాల్టర్ అందులో రెండు భాగాలు ఫస్ట్ పార్టులో పాకిస్తానీ సైనికులు స్థానిక గిరిజనుల వేషాలు వేసుకుని సరిహద్దు దాటి కాశ్మీర్‌లో

చొరబడతారు అక్కడి జనాన్ని కూడగట్టి తిరుగుబాటు తెచ్చి సరిహద్దు జిల్లాల్లో అరాజకం సృష్టిస్తారు ఇండియాకు దిక్కుతోచక బెంబేలెత్తిన స్థితిలో పాక్ సైన్యం నేరుగా మెరపు దాడిచేసి మొత్తం రాష్ట్రాన్ని ప్రజల సహకారంతో చప్పున ఆక్రమించి జయభేరి మోగిస్తుంది. 1965 ఆగస్టు 9న మృతవీరుల సంస్మరణం దినంలో వేల మంది గుమికూడేనాడే శ్రీనగర్‌ను స్వాధీనం చేసుకోవాలని పాక్ ఆలోచన

ప్లాను బాగానే ఉంది. అనుకున్న ప్రకారమే మొదలైంది కాని – కథ అడ్డం తిరిగింది పాకిస్తానీ చొరబాటుదారులను దండలు వేసి స్వాగతించడం మాని కాశ్మీర్ ప్రజలు పట్టుకుని అధికారులకు అప్పజెప్పారు మొదటి అంకం రసాభాస అయితేనేమి అనుకుని పాకిస్తానీలు చాంబ్ రంగంలో 1965 సెప్టెంబర్ 1న పూర్తి స్థాయిలో బాహాటంగా యుద్ధానికి దిగారు చీనాబ్ నది మీది అఖ్‌నూర్ బ్రిడ్జిని పట్టుకుని, రాజౌరి, పూంచ్‌లకు మిగతా రాష్ట్రంతో సంబంధాలను తెగగొట్టి, కాశ్మీర్ లోయను చుట్టుముట్టాలని వారి వ్యూహం కచ్‌లో లాగే అక్కడా సునాయాసంగా గెలుస్తామనుకున్న వారి అంచనాలు తలకిందులై భారత దళాలు మొక్కవోని ధైర్యంతో దురాక్రమణను నిలువరించాయి

దానికితోడు పాకిస్తాన్‌కు ఇంకో షాకు! దాడిని కాచుకోవటానికి ఆత్మరక్షణ ప్రయత్నాలే తప్ప తెగబడి ఎదురుదాడి చేయటం ఇండియాకు చేతకాదని పాకిస్తానీలకు అప్పటిదాకా గట్టినమ్మకం అంతర్జాతీయ సరిహద్దును దాటి నేరుగా పాకిస్తాన్ భూభాగంలోకి చొచ్చుకువచ్చే చేవ, చొరవ ఇండియన్లకు కల్ల అన్న ధీమా మీదే వారి యుద్ధతంత్రమంతా ఆధారపడింది తీరా జరిగింది వేరు. పిచ్చుక అనుకున్న లాల్‌బహదూరే బెబ్బులిలా విజృంభించి సైన్యాన్ని పొలిమేర దాటించి పాకిస్తాన్ మీదికి పంపాడు పశ్చిమ పాకిస్తాన్‌లోని లాహోర్, సియాల్‌కోట పొలిమేరల్లోకి భారత సేనలు చొచ్చుకు వెళ్ళడంతో పాక్ పాలకులకు కాళ్లు వణికాయి. చాంబ్ రంగంలో సేనలను వెనక్కు లాక్కుని తోకముడవటం కంటే ఇస్లామాబాద్‌కు గత్యంతరం లేకపోయింది సెప్టెంబర్ 21న అగ్రరాజ్యాల వత్తిడితో, భద్రతామండలి తీర్మానాన్ని పురస్కరించుకుని కాల్పుల విరమణ జరిగేనాటికి కాశ్మీర్‌ను కబళించాలన్న పాక్ పన్నాగం అంగుళం ముందుకు జరగకపోగా లాహోర్, సియాల్‌కోట నగరాలు నేరుగా భారత సేనల ఫైరింగు రేంజిలోకి వచ్చాయి ఇండియా దయాధర్మం మీద వాటి మనుగడ ఆధారపడి ఉంది. జమ్మూ కాశ్మీర్‌ను బలవంతంగా ఆక్రమించాలన్న కుటిల వ్యూహం 1947లో లాగే మరోసారి విఫలమైంది

1962 చైనా యుద్ధంలో ఘోర పరాభవంతో నవ్వుల పాలైన భారత సైన్యానికి 1965 ఘన విజయం గొప్ప ఊరట తన వీర జవాన్ల అద్భుత పరాక్రమాన్ని చూసి భరతజాతి

గర్వించింది యావత్ప్రపంచం అబ్బురపడింది

దురదృష్టమేమిటంటే తొలిదాడిలో లాగే మలి యుద్ధంలోనూ కదనరంగంలో కష్టపడి సాధించిన ఆధిక్యం కాస్తా అనంతర మంతనాల ఘట్టంలో ఆవిరై పోయింది

1947-49 కాలంలో మౌంట్‌బాటన్ మన పాలిటి శకుని కాగా 1965-66లో మనను నేర్పుగా ఉచ్చులో ఇరికించినవాడు సోవియట్ ప్రధాని కోసిగిన్

సోవియట్ యూనియన్ ప్రాబల్యాన్ని నిరోధించే 'కోల్డ్‌వార్' రాజకీయ తంత్రంలో భాగంగా అమెరికా పాకిస్తాన్‌కొమ్ముగాసింది. పాక్‌తో 'సీటో', 'సెంటో' సైనిక ఒప్పందాలను కుదుర్చుకుని అధునాతన మారణాయుధాలను విరివిగా అందించి, ఉపఖండంలో భద్రతకు ముప్పు తెచ్చింది దాంతో భారత ప్రభుత్వం క్రమేణా సోవియట్లకు దగ్గరైంది. నెహ్రూ చొరవతో మొదలైన అలీనోద్యమం వాషింగ్టన్‌కు కంటగింపు కాగా మాస్కోకు ప్రీతిపాత్రమైంది ఆంగ్లో - అమెరికన్ కూటమి కాశ్మీర్ వివాదంపై ఇండియాను భద్రతా మండలిలో దెబ్బతీయజూసిన ప్రతిసారీ మాస్కో వీటో చక్రం అడ్డువేసింది పాకిస్తాన్ సైనిక సవాలును తట్టుకోవటానికి కావలసిన ఆయుధాలకూ రష్యాయే మనకు శరణ్యమైంది ఇలాంటి అనేక మొగమాటాల వల్ల 1965 యుద్ధం దరిమిలా భారత్, పాకిస్తాన్‌ల మధ్య మధ్యవర్తిత్వానికి కోసిగిన్ చొరవ తీసుకుంటే న్యూఢిల్లీ ఎంతో సంతోషించింది మన చిరకాల మిత్రుడు ఏమి చెప్పినా, ఏమి చేసినా మన మంచి కోసమేనని నమ్మింది

కాని - కాలం ఎప్పుడూ ఒకలాగే ఉండదు ఇండియా అంటే అభిమానం తగ్గకపోయినా పోనుపోను పాకిస్తాన్ పట్ల సోవియట్ వైఖరి మారుతూ వచ్చింది ఇండియా సొంతమైన కాశ్మీర్‌ను గుంజుకోవాలని ఎవరు ప్రయత్నించినా తాము ప్రతిఘటించి తీరుతామని కృశ్చేవ్, బుల్గానిన్‌లు శ్రీనగర్ వెళ్ళి బాసచేసిన పాత రోజులు పోయాయి పాకిస్తాన్ చైనాతో చేతులు కలిపి దక్షిణ సరిహద్దుల్లో తన కొంప ముంచకుండా చూసుకోవటానికి పాక్‌ను బుజ్జగించటం రష్యాకు అవసరమైంది మధ్యఆసియాలోని సోవియట్ రిపబ్లిక్కుల ముస్లిం జన బాహుళ్యాన్ని ప్రసన్నం చేసుకోవటానికి ప్రధాన ముస్లిం రాజ్యమైన పాకిస్తాన్ సుహృద్భావమూ రష్యన్లకు కావలసి వచ్చింది

ఇలాంటి అనేక మొగమాటాలు పాకిస్తాన్‌తో వారికి ఉన్నాయి కాబట్టే - 1966 జనవరి 4 నుంచి 10 వరకూ తాష్కెంట్‌లో తన ఆధ్వర్యంలో జరిగిన శాంతి సమావేశంలో-

యుద్ధాన్ని గెలిచిన ఇండియాకు గౌరవప్రదంగా ఉండేలా , 1947 నుంచి తాను అక్రమంగా ఆక్రమించిన భారత భూభాగాన్ని ఇకనైనా ఖాళీ చేస్తే తప్పు కుదరదని పాకిస్తాన్‌ను ఒప్పించేందుకు గాక -

యుద్ధంలో ఓడిన పాకిస్తాన్ ప్రయోజనాలకు కావలసిన రీతిలోనే పరిష్కారం కుదిరేందుకు కోసిగిన్ తన పలుకుబడిని వినియోగించాడు.

1966 జనవరి 10న ప్రధాని శాస్త్రి, ప్రెసిడెంట్ అయూబ్‌ఖాన్‌లు సంతకాలు చేసిన చరిత్రాత్మక ఒప్పందం వల్ల ఇండియాకు ఒరిగిందేమీ లేదు. 1965 అగస్టు 5న ఉన్న స్థానాలకు ఎవరి సైన్యాన్ని వారు ఉపసంహరించి, కాల్పుల విరమణ రేఖకు కట్టుబడాలన్నది ఈ ఒప్పందంలో ముఖ్యమైన క్లాజు దీని ప్రకారం లాహోర్, సియాల్‌కోటల నుంచి భారత సైన్యాన్ని వెనక్కి రప్పించడానికి మనకు ఎలాంటి అభ్యంతరమూ లేదు పాక్ నగరాలను ఆక్రమించాలన్న దుర్బుద్ధి మనకు ఎన్నడూ లేదు. కాని – జమ్మూ కాశ్మీర్‌లోని హాజీపూర్, కార్గిల్ కొండలను కూడా మనం చేజేతులా వదులుకోవలసి వచ్చింది. ఈ ప్రాంతాలు ఆదినుంచీ జమ్మూ కాశ్మీర్‌లో భాగంగా ఉన్నాయి రక్షణ వ్యూహాత్మకంగా ఎంతో కీలకమైనవి. మనకు చెందిన ఈ ప్రాంతాలను 1947లో పాకిస్తాన్ దుర్మార్గంగా ఆక్రమించింది 1965 యుద్ధంలో మళ్ళీ అవి మనకు వశమయ్యాయి. ఇంకా పాకిస్తాన్ దురాక్రమణలో ఉన్న మా భూమిని ఎప్పుడు ఖాళీ చేయిస్తారని అడగవలసింది పోయి, పరాక్రమంతో మనం తిరిగి సంపాదించిన మన భూమిని కూడా పాకిస్తానీలకు పళ్ళెంలో పెట్టి వొప్పగించి, వట్టి చేతులతో వెర్రి మొగం వేసుకుని పూర్వ స్థానాలకు మరల వలస రావటం మన దురదృష్టం! దీని మూలంగా 1947–48 దురాక్రమణలో కబ్జా చేసిన భారత భూభాగం మీద పాకిస్తాన్ అధిపత్యాన్ని ఇండియా ఒక రకంగా గుర్తించినట్టయింది. మిగతా రాష్ట్రం మీద తన హక్కు గురించి వాదులాడ టానికి భవిష్యత్తులోనూ పాకిస్తాన్‌కు అడ్డులేకుండా పోయింది. మిత్రునికి గాని, ఎక్కువ మైత్రి ఉన్నవానికి గాని, మధ్యవర్తి సహాయం చేస్తే అతడే ఎక్కువ లాభం పొందుతాడన్న కౌటిల్యుడి వాక్యం నిజమైంది.

కాశ్మీర్‌లో తిరిగి సంపాదించిన భారత ప్రాంతాలను కూడా పాకిస్తాన్‌కు సమర్పించు కోవాలని సోవియట్లు తెచ్చిన వత్తిడిని లాల్‌బహదూర్ శాస్త్రి చివరి నిమిషం దాకా ప్రతిఘటించాడు రష్యన్ల చొరవకు సమ్మతించకపోతే వారి సుహృద్భావాన్ని కూడా కోల్పోయి అంతర్జాతీయంగా ఇండియా ఏకాకి అవుతుందని తన సహచరులైన విదేశాంగ మంత్రి స్వరణ్‌సింగ్, రక్షణ మంత్రి వై. బి.చవాన్, రష్యాలో భారత రాయబారి టి.ఎన్ కౌల్‌లు నాలుగు వైపులా కమ్ముకుని ఊదరబెట్టిన మీదట నిష్ప్రయోజనమని తెలిసి కూడా ఒప్పందం మీద శాస్త్రీజీ సంతకం చేశాడు బహుశా ఆ మానసిక వత్తిడి పర్యవసానంగానేమో సంతకాల తడి ఆరకుండా తాష్కెంట్‌లోనే ఆయన కన్ను మూశాడు. తాష్కెంట్ ఒప్పందం నిరర్థకత గురించి దేశంలో సర్వత్రా వ్యక్తమైన ప్రతికూలత ప్రియతమ ప్రధాని ఆకస్మిక

మృతితో సద్దుమణిగిపోయింది తాష్కెంట్‌లో తెర వెనుక ఏమి జరిగిందన్నది ఇప్పటికీ శేషప్రశ్నే

తరవాత మనం ఊరుకున్నా పాకిస్తాన్ ఊరుకోలేదు పశ్చిమ పాకిస్తానీల దుర్విచక్షణకు, దుర్విధానాలకు నిరసనగా తూర్పు పాకిస్తాన్ తిరగబడి తెగతెంపులు చేసుకుంటే ఆ నష్టాన్ని పూడ్చుకోవటానికి, తన ప్రజల దృష్టి మరలించటానికి ఇస్లామాబాద్ మళ్ళీ 1971 డిసెంబర్ 3న యుద్ధానికి దిగి, కాశ్మీర్‌ను కబళించజూసింది చాంబ్, యూరీల గుండా జమ్మూ కాశ్మీర్‌లోకి చొచ్చుకు రావటానికి పాక్ ఎంతగా ప్రయత్నించినా భారత సైన్యం మరోసారి వీరవిహారం చేసి శత్రువును నిలువరించింది. హోరాహోరీగా సాగిన నాటి యుద్ధంలో ఇండియా అద్భుత విజయం సాధించింది తూర్పున బంగ్లాదేశ్‌ను విముక్తి చేసి తొంభై వేల మంది పాక్ సైనికులను బందీగా పట్టుకోగలగటం పశ్చిమాన ఐదువేల చదరపు మైళ్ళ పాక్ భూమిని వశం చేసుకోగలగటం మన సేనల శౌర్య విక్రమాలకు ప్రపంచ ప్రఖ్యాతి తెచ్చిన మరపురాని మహత్తర ఘట్టం.

దేశం రెండు ముక్కలై, యుద్ధంలో చిత్తుగా ఓడి, ఉన్న కాస్త పరువును కోల్పోయి, దుందుడుకు పోకడలతో అందరి చీత్కారాలకు లోనై తల నేలకు బాదుకోవలసిన దురవస్థేమో పాకిస్తాన్‌ది। పొరుగు ప్రజల విముక్తి పోరాటానికి నియమబద్ధంగా అండ నిలిచి, యుద్ధంలో విరోధుల పీచమణచి, నిఖిల లోకం నీరాజనాలందుకుంటున్న ఘనత ఇండియాది పైగా తొంభైవేల మంది పాకిస్తాన్ సైనికులు మన చేతిలో బందీలుగా ఉన్నారు ఆ యుద్ధ ఖైదీలను విడిపించుకోవాలంటే ఎలాంటి షరతుకైనా దోసిలి వొగ్గి, మనకు పాదాక్రాంతం కావడం మినహా పాకిస్తాన్‌కు మరో దారి లేదు ఇస్లామాబాద్ మెడలు వంచి, దారికి తెచ్చి, అప్పటికి సుమారు పాతికేళ్ళుగా దాని కబ్జాలో ఉన్న విశాల భూమిని తిరిగి మన అధీనంలోకి తెచ్చుకోవటానికి దానికి మించిన అదను ఏముంటుంది? పైగా అప్పట్లో మనలను ఏలుతున్నది రాజకీయ ప్రజ్ఞలో రాటుతేలి, శత్రువులకు సింహస్వప్నమైన వీరనారి విజయేందిర!

ఇదిగో - ఇన్ని అనుకూలతలు, ఎటుచూసినా శుభశకునాలు కనిపించాయి కాబట్టే ఇందిర చొరవతో, మూడో దేశం ప్రమేయం లేకుండా 1972 జూలై మొదట్లో భారత, పాకిస్తాన్ అధినేతల మధ్య సిమ్లాలో భేటీ జరుగుతోందంటే - అంతటితో కాశ్మీర్ కష్టాలు, ఇండియా తలనెప్పులు తీరినట్టేనని, పావు శతాబ్దంగా నానుతున్న కాశ్మీర్ సమస్య ఇక శాశ్వతంగా పరిష్కారమై పోతుందని జాతి మొత్తం ఆశపడింది అధినాయక సమావేశం జరిగినన్ని రోజులూ ఉపఖండం యావత్తూ సిమ్లా మీదే దృష్టి నిలిపింది

# సిమ్లా సీక్రెట్

***కాశ్మీర్ సమస్య అనగానే మొట్టమొదట మనకు గుర్తొచ్చేది సిమ్లా ఒప్పందం. ఇండో–పాక్ వివాదాలకు, ముఖ్యంగా కాశ్మీర్‌కు సంబంధించి మన దృష్టిలో అది ప్రాణం; ప్రణవం. అపరిష్కృత సమస్యలన్నిటినీ సిమ్లా ఒప్పందం స్ఫూర్తితోనే తేల్చుకోవాలని, ఉపఖండం శాంతిని ఉక్కిరిబిక్కిరి చేస్తున్న నలతలన్నిటికీ అదే సర్వరోగ నివారిణి అని మనం పాతిక ముప్పై ఏళ్ళుగా నమ్ముతున్నాం. అవతలి దేశం దానిని ఏనాడో గుంటబెట్టి గంట వాయించినా, సంతకాల తడి ఆరకుండానే సిమ్లా స్ఫూర్తిని తుంగలో తొక్కినా మనం మాత్రం అనుల్లంఘనీయం అతిపవిత్రం అంటూ అదే ఒప్పందాన్ని పట్టుకు వేళ్లాడుతున్నాం.***

రెండు చేతులూ కలిస్తేనే చప్పట్లు ఇరుపక్షాలూ నిజాయతీతో కట్టుబడినప్పుడే ఏ ద్వైపాక్షిక ఒప్పందానికైనా సార్థకత. ఇండియాతో వ్యవహారానికి సంబంధించినంత వరకూ పాకిస్తాన్‌కు నిజాయతీ అనేది ఏనాడూ ఏ కోశానా లేదు. సిమ్లా ఒప్పందం విషయంలోనూ అంతే

పాకిస్తాన్ అంతకు ముందు దాకా కాశ్మీర్ సమస్యను ప్రతి అంతర్జాతీయ వేదిక మీదా లేవదీసింది కాశ్మీర్ స్వయం నిర్ణయాధికారాన్ని అణచివేస్తోందని ఇండియాపై ప్రపంచ దేశాల ముందు యాగీ చేసింది. కాశ్మీర్‌పై ఇండియాకు ఎలాంటి హక్కూ లేదని అడ్డంగా వాదిస్తూ ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో ప్లెబిసైట్ జరిపి కాశ్మీర్ ప్రజల అభిమతం తెలుసుకోవాలని పట్టుపడుతూ వచ్చింది అటువంటి పొగరుబోతు దేశాన్ని మెడలు వంచి కాశ్మీర్‌లో అధీన రేఖ (లైన్ ఆఫ్ కంట్రోల్) ను మన్నించేట్టూ . . జమ్మూ కాశ్మీర్ అంతిమ పరిష్కారంతో సహా అన్ని విషయాలనూ ఉభయ ప్రభుత్వాలూ పరస్పరం కలిసి శాంతి సఖ్యతలకు అవసరమైన విధి విధానాలను, ఏర్పాట్లనూ చర్చించుకోవాలని అంగీకరించేట్టూ. . సిమ్లాలో గొప్పగా ఒప్పించామని మనం అనుకుంటాం అప్పటిదాకా అంతర్జాతీయ వివాదంగా తాను చిత్రించిన కాశ్మీర్ వ్యవహారం మనలో మనం సామరస్యంగా తేల్చుకోవలసిన ద్వైపాక్షిక సమస్య అని పాకిస్తాన్ చేత పలికించడమే .

అధీనరేఖను అతిక్రమించి బలప్రయోగానికి దిగబోనని పాకిస్తాన్ కట్టుబడేట్టు చేయడమే సిమ్లాలో మనం సాధించిన విజయమని ఇప్పటికీ చెప్పుకుంటాం

మన దృష్టిలో సిమ్లా ఒప్పందం కాశ్మీర్ నావను అశాంతి కల్లోలం నుంచి తప్పించి ఆనంద తీరానికి చేర్చే తారకమంత్రం. పాకిస్తాన్ దృష్టిలో అది విధిలేక తల ఊపవలసి వచ్చిన తూతూ మంత్రం అప్పుడే ముగిసిన యుద్ధంలో ఇండియాకు చిక్కిన 93 వేల మంది పాక్ సైనికులను విడిపించుకోవటానికి, ఇండియాకు వశమైన పాకిస్తాన్ భూభాగాన్ని తిరిగి పొందటానికి మరో దారిలేక సిమ్లా అగ్రిమెంటు మీద 1972 జూలై 2న సంతకం చేసినా దానికి కట్టుబడి ఉండాలన్న ఉద్దేశం పాక్ పాలకులకు ఏనాడూ లేదు సిమ్లాలో ఇందిరాగాంధీతో కలిసి కెమెరాలకు నవ్వుతూ పోజులిచ్చి, ఇండియాతో స్నేహ సామరస్యాల కోసం పరితపిస్తున్న మహాత్ముడిలా శాంతి వచనాలు పలికి స్వదేశం తిరిగి వెళ్ళగానే నాటి పాక్ ప్రెసిడెంటు జడ్.ఎ. భుట్టో ఒప్పందాన్ని నలిచి బుట్టలో పారేశాడు. 'రేవు దాటేదాకా ఓడమల్లయ్య. . రేవు దాటాక బోడి మల్లయ్య' సామెతలాగా – యుద్ధ ఖైదీలను విడిపించుకుని, ఇండియా ఆక్రమిత ప్రాంతాలను తిరిగి పొందేదాకా మహాశాంతం చూపి, ఆ అవసరాలు కాస్తా తీరగానే ఆయన ఇండియాకు బెబ్బే అన్నాడు. తన చేత బలవంతంగా ఒప్పందం మీద సంతకం చేయించుకున్నారని జంకు లేకుండా అభాండం వేశాడు. కాశ్మీర్ విషయంలో పాకిస్తాన్‌ను గొప్పగా కట్టిపడేశామని మనం ఇక్కడ మురిసిపోతూంటే . కాశ్మీర్ గురించి తాను ఎలాంటి కట్టుబాటుకూ కమిట్ కాలేదని అక్కడ పాకిస్తాన్ నేషనల్ అసెంబ్లీలో భుట్టో కుండబద్దలు కొట్టినట్టు చెప్పాడు చట్టబద్ధమైన ప్రభుత్వాన్ని ధిక్కరించి తిరగబడండంటూ కాశ్మీర్ ప్రజలకు ఆయన పనిలో పనిగా పిలుపు ఇచ్చాడు అటువంటి తిరుగుబాటుకు పాకిస్తాన్ సర్వవిధాల సాయపడుతుందనీ ఆయన శ్రమ అనుకోకుండా హామీ ఇచ్చాడు.

సిమ్లా ఒప్పందం స్ఫూర్తితో జమ్మూ కాశ్మీర్ సమస్యకు పరిష్కారం కనుగొనాలని కోరుతున్నట్టు మొదట్లో కొంతకాలం దంత వేదాంతం వల్లించిన పాకిస్తాన్ పోనుపోను ఆ ముక్కుబడి కబుర్లనూ తగ్గించింది భుట్టో కుదుర్చుకున్న ఎగ్రిమెంటును – భుట్టోను ఉరితీసిన జియాఉల్ హక్ గౌరవించలేదంటే అర్థం చేసుకోవచ్చు కాని – మీరు స్వయానా భుట్టోగారి అమ్మాయి కదా చరిత్రాత్మక ఒప్పందం జరిగేటప్పుడు మీరూ మీ తండ్రి వెంట సిమ్లాలో ఉన్నారు కదా మరి – మీరయినా ఆ ఒప్పందానికి కట్టుబడరా – అని 1990 జూలై 18న అప్పటి ప్రధాని బేనజీర్ భుట్టోను భారత విదేశాంగ కార్యదర్శి ముచుకుంద్ దుబే అడిగాడు అప్పుడు ఆమె ఏమంది? ఆ టైములో సిమ్లాలోనే ఉన్నా నేను అప్పుడు మరీ చిన్నదాన్ని నాకేమీ తెలియదు. అయినా సిమ్లా ఎగ్రిమెంటు కుదిరి

దాదాపు 20 ఏళ్లు కావస్తోంది. జమ్మూ కాశ్మీర్‌లోనూ, ఉపఖండంలోనూ అప్పటికీ ఇప్పటికీ పరిస్థితులు మారాయి నాటి ఒప్పందంలోని అంశాలు ఈనాడు ఎంతవరకూ రిలవెంటో చెప్పలేను – అని బేనజీరమ్మ చప్పరించేసిందట. అయినా – సంతకం పెట్టిన భుట్టోకే చిత్తశుద్ధి లేనప్పుడు భుట్టో కూతురుకూ... ఆయనకూ ఆమెకూ బద్ధవిరోధులయిన తరవాతి పాలకులకూ సిమ్లా ఒప్పందం మీద గౌరవం ఉండాలని ఆశించడం మన వెర్రితనం!

అఫ్‌కోర్స్! మనం చాలా మంచివాళ్ళం. అవతలివాడు చెడ్డవాడయినంత మాత్రాన మనమూ చెడ్డ కానవసరం లేదు కాకూడదు కూడా. కష్టపడి కుదుర్చుకున్న ఒప్పందాన్ని అవలి పక్షం వదిలేసిందని చెప్పి మనమూ వదిలి పెట్టనక్కర్లేదు. ఒప్పందంలోని అంశాలు మనకు అనుకూలమైనవైతే, వాటివల్ల మంచి జరుగుతుందని, మన ప్రయోజనం నెరవేరడానికి అంతకు మించి వేరే దారిలేదని అనుకుంటే – ఆ ఒప్పందం అమలుకు మనం పట్టుబట్టవలసిందే. కాని – సిమ్లా అగ్రిమెంటు నిజంగా మనకు అంత అనుకూలమైనదా?

ఈ ప్రశ్నకు జవాబు వెదికే ముందు ఒప్పందం నేపథ్యాన్ని ఒకమారు పరిశీలిద్దాం.

తూర్పున బంగ్లాదేశ్ విముక్తమై, దాదాపు లక్ష మంది సైనికులు తనకు లొంగిపోయిన వెంటనే పశ్చిమ పాకిస్తాన్‌తో హోరాహోరీగా సాగిస్తున్న యుద్ధాన్నీ న్యూఢిల్లీ ఆపేసి ఏకపక్షంగా కాల్పుల విరమణ ప్రకటించింది. తాను తలచుకుంటే యుద్ధాన్ని కొనసాగించి, ఇటు ఆక్రమిత కాశ్మీర్‌ను అటు పాకిస్తాన్‌ను కూడా వశం చేసుకోగలిగి కూడా సంయమనం పాటించి, ఇండియా తనకు తానుగా కాల్పుల విరమణను చాటించడం ప్రపంచ దేశాల మన్నన పొందింది. ఇండియా ఆ నిర్ణయం తీసుకునే సమయానికి యునైటెడ్ నేషన్స్ భద్రతా మండలి సమావేశంలో భుట్టో ఇండియా మీద నిప్పులు చెరుగుతున్నాడు. పశుబలంతో మా దేశాన్ని నాశనం చేయజూస్తోందంటూ రంకెలు వేస్తున్నాడు సరిగ్గా అదే టైములో – ఇండియా ఏకపక్షంగా కాల్పుల విరమణ ప్రకటించిందని భారత ప్రతినిధి స్వరణ్‌సింగ్ ఎనౌన్స్ చేసేసరికి భుట్టో అవాక్కయ్యాడు. ఇండియాను విలన్‌గా చిత్రించే సావకాశం పోయిందన్న అక్కసుతో చేతిలోని కాగితాలు విసిరిగొట్టి ధూంధామ్మంటూ బయటికి పోయాడు

దూరం ఆలోచించి, యుద్ధాన్ని అదనెరిగి చాలించడం మంచి పనే. ఇండియా చరిత్ర, దాని సాత్విక పోకడ తెలిసిన వారెవరూ తనకు తానుగా యుద్ధాన్ని విస్తరించి పోరాడుతుందని ఊహించలేదు. కాని – తన చేయి పైన, విరోధి చేయి కింద అయిన అనుకూల పరిస్థితిలో తన చొరవతో శాంతి సమావేశం జరిగినప్పుడైనా జమ్మూ కాశ్మీర్‌పై

తన సంపూర్ణ సార్వభౌమత్వాన్ని పాకిస్తాన్ చేత ఇండియా అంగీకరింపజేస్తుందని చాలామంది ఆశించారు. సిమ్లా అధినాయక సమావేశంలో కాశ్మీర్ సమస్య శాశ్వతంగా సమసిపోతుందనే సర్వత్రా ఆశాభావం వ్యక్తమైంది.

సిమ్లా చర్చల్లో ఆదినుంచీ ఇండియా అవలంబించినది బహు ఉదారమైన వైఖరి. ఆక్రమిత కాశ్మీర్ యావత్తూ తిరిగి తమకు వశం కావాలని (అలా డిమాండ్ చేసేందుకు సర్వహక్కులూ ఉండి కూడా) మనం కోరలేదు. న్యూఢిల్లీ అడిగిందల్లా - అనాడు జమ్మూ కాశ్మీర్‌లో ఏ జాగా ఎవరి అధీనంలో ఉంటే దానినే అంతర్జాతీయ సరిహద్దుగా గుర్తించాలని!

నిజానికి దానివల్ల నష్టపోయేది మనమే పూర్వపు జమ్మూ కాశ్మీర్ సంస్థానంలో తాను ఆక్రమించిన భూభాగాన్ని పాకిస్తాన్ ఖాళీ చేయాలని కొన్ని దశాబ్దాల కిందటే భద్రతా మండలి తీర్మానించింది. దాని ప్రకారం పాక్ నిష్క్రమించి ఇండియా పరం అయి తీరవలసిన సుమారు యాభైవేల చదరపు మైళ్ళ విశాల భూమి మీద మన హక్కును మనకు మనం వదులుకుంటామనటమే గొప్ప మీ కబ్జాను అలాగే సాగించుకోండి. మీ చేతికి అప్పనంగా చిక్కిన దానితో తృప్తిపడి, కనీసం మా అధీనంలోని భూమి అయినా మాదేనని ఒప్పుకోండి అని యుద్ధంలో గెలిచిన మనం ఆఫర్ చేయడమే పాకిస్తాన్ అదృష్టం.

కాని - షరా మామూలే మనం బిగువు సడలించిన కొద్దీ పాకిస్తాన్ బిర్రబిగిసింది జమ్మూ కాశ్మీర్‌లో అధీన రేఖ (Line of Control)ను వాస్తవ సరిహద్దు (Dejure Border) గా అంగీకరిస్తే తప్ప యుద్ధ ఖైదీల విడుదల, పాకిస్తాన్‌లో ఆక్రమిత ప్రాంతాల నుంచి భారత దళాల ఉపసంహరణ కుదరదని భారత ప్రతినిధి వర్గం ఎంత పట్టుబట్టినా అవతలి పక్షం సమ్మతించలేదు ఐదురోజులు ముమ్మరంగా చర్చలు సాగినా ప్రయోజనం లేకపోయింది. శాంతి సమావేశం విఫలమైందనే అందరూ అనుకున్నారు.

ఆ దశలో ప్రెసిడెంట్ భుట్టో ఏకాంతంగా మాట్లాడదలచినట్టు ప్రధాని ఇందిరాగాంధీకి కబురు పంపారు. ఆమె కూడా సరేనంది 1972 జూలై 2 సాయంత్రం 6 గంటలకు అధినేతలిద్దరూ సహాయకులెవరూ లేకుండా గంటన్నర సేపు ముఖాముఖి మాట్లాడారు. ఏమి జరిగిందో తెలియదు. కాని - ఇండియా షరతులు దేనికీ పాకిస్తాన్ సమ్మతించ కుండానే పాక్‌కు కోరిన వరాలనిస్తూ ఒడంబడిక కుదిరింది ఆ రాత్రే యావత్ప్రపంచం మన శాంతి తత్పరతను కొనియాడుతుండగా చరిత్రాత్మకమైన సిమ్లా అగ్రిమెంటు మీద అధినేతల సంతకాలు జరిగాయి. ప్రపంచ దేశాల ప్రశంసలను, లిబరల్ మేధావుల చప్పట్లను మోసుకుని ఉత్త చేతులతో మన వారు సగర్వంగా ఢిల్లీకి తిరిగొచ్చారు తనకు

తక్షణం కావలసిన అవసరాలన్నిటినీ బేషరతుగా బ్రహ్మాండంగా తీర్చేసుకుని బతకనేర్చిన భుట్టో లోలోన నవ్వుకుంటూ స్వదేశం మరలి వెళ్ళాడు.

ఇన్నేళ్ల తరవాత కూడా చాలా మందికి తెలియని దేవ రహస్యం ఒకటుంది అందరూ ఎరిగిన సిమ్లా అగ్రిమెంటు అసలు అగ్రిమెంటు కాదు. ఇందిరాగాంధీ, భుట్టోల మధ్య పొసగిన అసలు ఒప్పందం వేరే ఉంది అది రహస్యం. ఆ రహస్యమేమిటో అప్పట్లో శ్రీమతి గాంధీకి కార్యదర్శిగా పనిచేసిన పి.ఎన్. ధర్ ఇరవై మూడేళ్ళ తరవాత బయట పెట్టాడు. 'L.O C As Border - Bhutto's Deal with Mrs Gandhi' అనే శీర్షికతో టైమ్స్ ఆఫ్ ఇండియా పత్రికలో 1995 ఏప్రిల్ 4న రాసిన వ్యాసంలో సిమ్లాలో తెర వెనుక ఏమి జరిగిందో ఆయన పూసగుచ్చినట్టు చెప్పాడు ఆయన మాటల్లోనే క్లుప్తంగా చెప్పాలంటే

''1948 కాల్పుల విరమణ రేఖను అంతర్జాతీయ సరిహద్దుగా మార్చడానికి పాక్ ప్రతినిధి వర్గం నాయకుడు అజీజ్ అహ్మద్ ఒప్పుకోలేదు ఆఖరికి ఆ రేఖ పేరును 'లైన్ ఆఫ్ కంట్రోల్' అనడానికి కూడా ఆయన ససేమిరా వీల్లేదన్నాడు. దీనిపై ప్రతిష్టంభన తొలగకుండానే చర్చలు ముగిశాయి సమావేశం విఫలమైందని పత్రికల వాళ్ళు ప్రకటించారు.

''ఈ దశలో భుట్టో చొరవ తీసుకుని సాయంత్రం 6 గంటలకు శ్రీమతి గాంధీని ఆమె విడిదిలో కలిశారు గంటసేపు వారు ఏకాంతంలో సంభాషించారు.

''అప్పుడు నేను, పి ఎన్.హక్సర్ పక్క గదిలో వేచి ఉన్నాం భుట్టో బయటికి వస్తూనే 'మేము అన్నీ పరిష్కారం చేశాం. మీకు చేతి నిండా పని' అని మాతో సంతోషంగా అన్నాడు ఆయన వెళ్ళిన తరవాత శ్రీమతి గాంధీ తమ మధ్య ఏమి జరిగిందో మాకు బ్రీఫ్ చేశారు

''కాశ్మీర్‌లో లైన్ ఆఫ్ కంట్రోల్‌ను సరిహద్దుగా గుర్తించడమే మంచిదని ఆమె అనుకున్నారట. అలా చేస్తే జనాభాను, భూమిని ఒక దేశం నుంచి ఇంకో దేశానికి మార్పిడి చేసుకోవలసిన బాధ ఉండదు ఈ ప్రతిపాదనకు భుట్టో కూడా సిన్సియర్‌గా సరేనన్నాడట ఉన్న పరిస్థితిలో ఇదొక్కటే వాస్తవిక పరిష్కారమన్న నిర్ణయానికి తానూ వచ్చానన్నాడట కాని – ఈ అంశాన్ని ఎగ్రిమెంటులో పొందుపరిస్తే స్వదేశంలో తనకు చాలా ఇబ్బందులు వస్తాయని ఆయన విన్నవించాడట అసలే తూర్పు పాకిస్తాన్‌ను పోగొట్టుకున్నందుకు చాలామంది పాకిస్తానీలు భగభగలాడుతున్న స్థితిలో కాశ్మీర్ మీద కూడా శాశ్వతంగా క్లెయిము వదిలేసుకుంటే జనం మెచ్చరని, సైనిక, రాజకీయ వర్గాలు ప్రతిఘటిస్తాయని,

ఎన్నో ఏళ్ళ తరవాత సైనిక పాలన అంతమై తన నాయకత్వాన ఎట్టకేలకు ప్రజాస్వామిక ప్రభుత్వం ఏర్పడిన తొలి రోజుల్లో ఇటువంటి అగ్రిమెంటు కుదుర్చుకున్నట్టు తెలిస్తే అధికారంలో తన మనుగడ కష్టమవుతుందని అనేక విధాల చెప్పుకున్నాడట కాగితం మీద ఏమీ పెట్టకుండా ఉంటే తాను నెమ్మదిగా రంగం సిద్ధం చేస్తాడట.

''అదీ ఎలాగంటే - అంతర్జాతీయ సరిహద్దులో ట్రాఫిక్ ఊపునందుకోగానే లైన్ ఆఫ్ కంట్రోలు వెంబడి ఎంపిక చేసిన పాయింట్ల దగ్గర రాకపోకలను అనుమతిస్తాడట. ఎంట్రీ, ఇమిగ్రేషన్, కస్టమ్స్ క్లియరెన్సు కార్యాలయాలు ఆ రేఖ వెంబడి పనిచేస్తూ పోవడంతో దాన్నే అంతర్జాతీయ సరిహద్దుగా భావించడానికి పాకిస్తానీలు క్రమేణా అలవాటుపడతారట ఈలోపు భుట్టో ప్రభుత్వమేమో ఆక్రమిత కాశ్మీర్‌ను పాకిస్తాన్‌లో అధికారికంగా కలిపేసుకుంటుందట. దానికి భారత ప్రభుత్వం మంద్రస్థాయిలో అభ్యంతరం తెలిపి ఊరుకోవాలట. **(తర్వాత జరిగింది సరిగ్గా అదే. 1974లో భుట్టో ప్రభుత్వం పాక్ ఆక్రమిత కాశ్మీర్‌ను పాకిస్తాన్ రాష్ట్రంగా రాజ్యాంగ రీత్యా కలిపేసుకున్నప్పుడు ఇండియా పెద్దగా అభ్యంతరం చెప్పలేదు.)** అలాగే ఉభయ దేశాల మధ్య వాణిజ్యం, సహకారం అన్ని రంగాల్లో బ్రహ్మాండంగా వృద్ధి అవడంతో ఉద్రిక్తత తొలిగి ఇరుదేశాలూ దగ్గరవుతాయట. అదిగో - ఆ అనుకూల వాతావరణంలో ఐదేళ్ళలోపే సమయం చూసి భుట్టోగారు కంట్రోలు రేఖను అంతర్జాతీయ సరిహద్దుగా మార్చేయనిస్తారట.''

భుట్టో మీద నమ్మకం ఉన్నా లేకున్నా తన రాజకీయ ప్రతిబంధకాల గురించి ఆయన చెప్పింది సమంజసమేనని శ్రీమతి గాంధీ భావించారట క్రమపద్ధతి ప్రకారం ఇరుదేశాల మధ్య ఉద్రిక్తత తొలగి, సౌమనస్యం నెలకొని, అధీనరేఖ గుండా వర్తక వాణిజ్యాలు, రాకపోకలు మొదలయ్యాక దాన్నే అంతర్జాతీయ సరిహద్దుగా స్థిరం చేస్తే ఎటునుంచీ ప్రతిఘటన ఉండదన్న భుట్టో ప్రతిపాదనను పాయింట్లవారీగా పునశ్చరణ చేసి, శ్రీమతి గాంధీ ఆఖరుగా భుట్టోను *"Is this the understanding on which we will proceed"* *(ఈ అవగాహన మీదే కదా మనం ముందుకు వెళ్ళేది)* అని అడిగారట

*"Absolutely. Aap mujh par bharosa keejiye" (ముమ్మాటికీ, మీరు నా మీద నమ్మకం ఉంచండి)* అన్నాడట భుట్టో

ఈ అవగాహనను రహస్య క్లాజుగా అగ్రిమెంటులో రాసిపెట్టుకోవలసిన అవసరం లేదని ఇరువురు అధినేతలూ అభిప్రాయపడ్డారట లిఖితపూర్వకంగా ఏదీ లేకపోవడమే తనకూ మంచిదని ఇందిరాగాంధీ కూడా అనుకున్నారట. పి ఎన్. ధర్ మాటల్లోనే చెప్పాలంటే

*"Mrs. Gandhi herself was worried that a formal withdrawal of the Indian claim on Pak occupied Kashmir could create political trouble for her. She agreed that the solution should not be recorded in the Agreement for reasons advanced by Bhutto, but it should be gradually implemented as he had suggested."*

*(పాక్ ఆక్రమిత కాశ్మీర్ మీద ఇండియా క్లెయిమును అధికారికంగా ఉపసంహరించు కుంటే తనకు రాజకీయ చిక్కులొస్తాయని శ్రీమతి గాంధీ కూడా కలవరపడ్డారు. భుట్టో చూపిన కారణాలవల్ల ఈ పరిష్కారాన్ని అగ్రిమెంటులో పొందుపరచకూడదని, ఆయన సూచించినట్లు క్రమేణా అమలుపరచాలని ఆమె ఒప్పుకున్నారు.)*

అనంతర కాలంలో భారత విదేశాంగ కార్యదర్శిగా పనిచేసి రిటైరైన జె.ఎన్. దీక్షిత్ రాసిన Anatomy of A Flawed Inheritence గ్రంథం 34, 35, 326, 327 పేజీల్లో సిమ్లాలో కుదిరిన సీక్రెట్ ఒప్పందం వివరాలు చదవొచ్చు.

సిమ్లాలో ఇందిరాగాంధీ ముందు భుట్టో రహస్యంగా కమిట్ అయినది ఏమిటో మరునాడే న్యూయార్క్ టైమ్స్ పత్రిక బయటపెట్టింది. The Simla Agreement. Behind the Progress Reports There is the Possibility of a Secret Agreement అనే శీర్షికతో 1972 జూలై 3న ప్రచురించిన వార్తలో 'న్యూయార్క్ టైమ్స్' ఇలా రాసింది

*President Bhutto was willing to forsake the Indian - held two thirds of Kashmir that contains four - fifths of the population and the prized valley called the Vale, and agree that a Ceasefire Line - to be negotiated - would gradually become the border between the two countries. The key word is "gradually". President Bhutto wants a softening of the Ceasefire Line - with trade and travel across it - and a secret agreement with Mrs.Gandhi that a formally recognised border would emerge after a few years, during which he would condition his people to it without riots and an overthrow of his government.*

*(ఇండియా అధీనంలో ఉన్న మూడింట రెండువంతుల కాశ్మీర్‌ను ఐదింట నాలుగొంతుల కాశ్మీర్ జనాభాను, అపురూపమైన కాశ్మీర్ లోయతో సహా వదులుకోవటానికి ప్రెసిడెంట్ భుట్టో సిద్ధపడ్డాడు. మాట్లాడి నిర్ధారించుకునే కాల్పుల విరమణ రేఖ క్రమేణా రెండుదేశాల మధ్య సరిహద్దు కావాలని ఆయన అంగీకరించాడు 'క్రమేణా' అన్నది ఇక్కడ ప్రధానం. వాణిజ్యాన్ని, ప్రయాణాన్ని అనుమతించడం ద్వారా కాల్పుల విరమణ రేఖను చదును చేస్తే కొన్నేళ్లలో దాన్నే అధికారిక సరిహద్దుగా గుర్తించవచ్చునని, ఈలోగా*

*అల్లర్లు, తన ప్రభుత్వానికి ముప్పు రాకుండా తన ప్రజలను మానసికంగా సిద్ధం చేస్తానని శ్రీమతి గాంధీతో ప్రెసిడెంట్ భుట్టో రహస్య ఒప్పందం.)*

ఇదిగో – ఈ భరోసాతోటే భుట్టో మీద నమ్మకం ఉంచి అంగీకరించిన పరిష్కారాన్ని కాగితం మీద పెట్టకుండా – జమ్మూ కాశ్మీర్‌లో కాల్పుల విరమణ దరిమిలా నెలకొన్న అధీన రేఖ (లైన్ ఆఫ్ కంట్రోలు)ను ఇరుపక్షాలు గౌరవించాలని, పరస్పరం ఎన్ని విభేదాలున్నా దాన్ని ఏకపక్షంగా మార్చజూడరాదని, బల ప్రయోగంతో దానిని అతిక్రమించ రాదని, కాశ్మీర్‌పై అంతిమ పరిష్కారంతో సహా అపరిష్కృత సమస్యలన్నిటినీ ద్వైపాక్షిక చర్చల ద్వారా సామరస్యంగా పరిష్కరించుకోవాలని మాత్రమే సిమ్లా అగ్రిమెంటులో పొందుపరిచారు **(అగ్రిమెంటు పూర్తి పాఠాన్ని అనుబంధం–2లో చూడండి)**

ఇచ్చిన మాట ప్రకారం భుట్టో తాను చేయవలసింది చేసి అలిఖిత ఒడంబడికను అమలుపరచగలడని ఆశించడమే పెద్ద పొరపాటయింది. యుద్ధంలో ఘోర పరాజయం పాలైన నిస్సహాయ స్థితిలో పాకిస్తాన్‌కు కావలసి వచ్చిన వరాలను ఇండియా నుంచి పొందేంతవరకూ ఎక్కడలేని సౌమనస్యం చూపిన భుట్టో యుద్ధఖైదీల విడుదల వంటి అక్కరలు కాస్త తీరగానే మళ్ళీ తన నిజ స్వరూపం ప్రదర్శించాడు ఇస్లామాబాద్ దృష్టిలో సిమ్లా అగ్రిమెంటుకూ టాయిలెట్ పేపరుకూ ఒకటే విలువ.

చరిత్రాత్మకమైన సిమ్లా అగ్రిమెంటు వల్ల ఇంతకూ మనం సాధించిందేమిటి? అప్పటిదాకా కాశ్మీర్ పూర్తిగా భారతదేశం అంతరంగిక సమస్య అనీ, దౌర్జన్యంగా ఆక్రమించిన భూభాగాన్ని ఖాళీచేసి పోవడం మినహా ఇందులో పాకిస్తాన్ ప్రమేయానికి తావేలేదని అప్పటిదాకా ప్రపంచ వేదికలన్నిటి మీదా ఇండియా చేస్తూ వచ్చిన వాదాన్ని మన చేతులతో మనమే పటాపంచలు చేశాం పాకిస్తాన్‌తో కలిసి కూచుని సామరస్యంగా తేల్చుకోవలసిన సమస్యల లిస్టులో కాశ్మీర్‌ను కూడా మనమే చేర్చాం భారతదేశంలో కాశ్మీర్ విలీనాన్ని తిరగదోడేందుకు ససేమిరా ఒప్పుకునేది లేదని చిరకాలంగా ఉద్ఘాటిస్తూ వచ్చిన విధానాన్ని మనమే నీరుగార్చి మనమూ, పాకిస్తాన్ కలిసి తరవాతెప్పుడో తుది పరిష్కారం కనుక్కోవలసి ఉందని ఒప్పుకుని కాశ్మీర్ భవితవ్యాన్ని అనవసరంగా చేజేతులా ప్రశ్నార్థకం చేశాం ఇంతగా విధం చెడ్డా పోనీ సమస్యను సామరస్య పూర్వకంగా తేల్చివేయగలిగామా అంటే అదీ లేదు. కనీసం సిమ్లాలో గుంభనంగా అనుకున్నది ఇదీ అని చెప్పుకోవడానికి మన దగ్గర వీసమెత్తు ఆధారమూ లేదు అంతా నోటిమాటే

ఒక్కమాటలో చెప్పాలంటే సిమ్లాలో మనం భుట్టోను నమ్మి చెడ్డాం మరోసారి దగా పడ్డాం

# సింహంగారు వన్స్‌మోర్

***ఇటువంటి వింతలు ఇండియా దటీజ్ భారత్‌లోనే సాధ్యం. ఇంతకంటే గొప్ప అబ్సర్డ్ డ్రామాను సామ్యూల్ బెకె కూడా రాయలేదు.***

***మెజారిటీకి ఢోకాలేని ముఖ్యమంత్రిని రాత్రికి రాత్రి డిస్మిస్ చేసి, ఖైదులో పెట్టిన అపూర్వ ఘటనను ఇంతకు ముందు చెప్పుకున్నాం. రాజద్రోహ నేరం మోపి, రాష్ట్రంలో ఉండటానికే అర్హుడు కాడని వెళ్లగొట్టిన మనిషికే రాజదండం అప్పగించి అదే రాష్ట్రానికి మళ్ళీ ముఖ్యమంత్రిని చేసిన అత్యద్భుత ఘట్టాన్ని ఇప్పుడు ఆలకించండి.***

రాజరికానికో, సైనిక నియంతృత్వానికో వ్యతిరేకంగా పోరాడిన విప్లవ నాయకులపై రాజద్రోహ నేరాలు మోపి, నిర్బంధించడమూ విముక్తి పోరాటం ఫలించాక ఆ 'రాజద్రోహులే' రాజ్యాధినేతలు కావడమూ చరిత్రకు కొత్తకాదు కాశ్మీర్‌లో జరిగింది అటువంటి 'విప్లవం' కాదు. ఒక రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా తగడని, స్వేచ్ఛగా తిరగనివ్వకూడని ప్రమాదకర వ్యక్తి అని షేక్ అబ్దుల్లాకు ముద్రవేసిన ప్రభుత్వమే తన చేతులతో తాను మళ్లీ అదే మనిషిని ఏరికోరి నెత్తిన పెట్టుకుని రాజ్యాధికారం అప్పగించిన విచిత్ర వైనమిది!

హాజ్ యాత్రకని చెప్పి విదేశాలకు వెళ్లి, చైనా ప్రధానితో అల్జీరియాలో గుసగుసలాడి, ఇండియాకు వ్యతిరేకంగా విషం కక్కసాగిన షేక్ అబ్దుల్లాను పాస్‌పోర్టు రద్దు చేస్తామని బెదిరించి వెనక్కి రప్పించి, 1965 మే 9న పాలం విమానాశ్రయంలో కాలు మోపగానే (మూడోసారి) అరెస్టు చేశాక కూడా 'కాశ్మీర్ కేసరి' మీద మన ప్రభువులకు మమకారం చావలేదు. భారత దేశ భద్రతకే ముప్పుతెచ్చే మనిషి అని నిర్ధారించి డిఫెన్స్ ఆఫ్ ఇండియా రూల్సు కింద అరెస్టు చేశాక షేక్ సాహెబ్ తత్వం మారలేదు మహమ్మదు దగ్గరికి

కొండ రానప్పుడు మహమ్మదే కొండ దగ్గరికి వెళ్లాలని సామెత. తమ కాళ్ల దగ్గరికి అబ్దుల్లా రానప్పుడు అబ్దుల్లా కాళ్ల దగ్గరికి తామే పోవాలన్నది మొదటి నుంచీ న్యూఢిల్లీ నిష్ఠగా పాటిస్తున్న కాశ్మీర్ పాలిసీ! ఇందులో భాగంగానే – అబ్దుల్లా వల్ల దేశభద్రతకు ముప్పు తొలిగిందని ఏకపక్షంగా నిశ్చయించుకుని కాశ్మీర్ కేసరిని రెండున్నర ఏళ్ళకల్లా (1967 డిసెంబర్ 8న) బేషరతుగా విడిచిపెట్టారు.

ఆ తరవాత సర్దుకుపోవాలని ప్రభుత్వం ఎంతగా ప్రయత్నించినా కాశ్మీర్ సింహం కజ్జాకోరు ధోరణి మానలేదు. కేంద్రం పట్ల, కాంగ్రెసు పార్టీ పట్ల అబ్దుల్లా ఎంతగా ద్వేషం పెంచుకున్నాడంటే కాంగ్రెసుకు చెందిన ముస్లిం ఇళ్లలో ఎవరైనా చనిపోతే ముస్లిం స్మశాన వాటికల్లో ఖననం చేయనిచ్చేవాడు కాదు. ఆఖరికి మృతుల కుటుంబాలను ఎవరూ పరామర్శించడానికి వీలులేదని ఆంక్ష పెట్టాడు. అనంతర కాలంలో తన కోసం పదవీ త్యాగం చేసిన మీర్‌కాసిం దగ్గర బంధువు ఒకావిడ చనిపోతే పరామర్శించబోయిన నేరానికి మీర్జా అఫ్జల్‌బేగ్ సోదరుడిని సంజాయిషీ అడిగాడట. ఈ సంగతి మీర్ కాసిమ్ తన ఆత్మకథ My Life And Timesలో చెప్పుకున్నాడు.

అబ్దుల్లాను కాశ్మీరీలు పెద్దగా పట్టించుకోకపోయినా ఆయన వెలిగించిన 'ప్లెబిసైట్ ఫ్రంట్' దీపం కాశ్మీర్‌కు అగ్గి అంటించే కుత్సితాన్ని మానలేదు. వ్యవహారం మళ్ళీ శ్రుతిమించడంతో 1971 జనవరి 8న షేక్ అబ్దుల్లాను, మీర్జా అఫ్జల్ బేగ్‌ను జమ్మూ కాశ్మీర్ రాష్ట్రం నుంచి బహిష్కరించారు. నాలుగు రోజుల తరవాత ప్లెబిసైట్ ఫ్రంట్‌ను నిషేధించారు

మరుసటి సంవత్సరం జమ్మూ కాశ్మీర్ అసెంబ్లీకి ఎన్నికలు జరిగాయి. అందులో అబ్దుల్లాను అరు నూరయినా పాల్గొననీయరాదని ప్రభుత్వం మహా పట్టుదల చూపింది అబ్దుల్లాతో మాట్లాడి ఎన్నికల్లో పోటీకి ఒప్పించడానికి వెళ్ళుబోతున్న ప్లెబిసైట్ ఫ్రంట్ నాయకులను మధ్యలోనే అడ్డగించి అరెస్టు చేసింది. కాశ్మీర్‌లో అడుగుపెట్టేందుకు వీలు లేదంటూ అబ్దుల్లా భార్యకు అనుమతి నిరాకరించింది ఆ విధంగా అబ్దుల్లాను అవలికి నెట్టి జరిపించిన ఎన్నికల్లో మొత్తం 74 అసెంబ్లీ స్థానాలకుగాను కాంగ్రెస్ పార్టీ 57ను గెలుచుకుని ఘన విజయం సాధించింది

కథ ఇంతవరకూ విని ఎవరైనా ఏమనుకుంటారు? నాలుగింట మూడొంతుల స్థానాలు గెలుచుకున్న కాంగ్రెస్ పార్టీ అయిదేళ్ళూ అధికారంలో కొనసాగి, అబ్దుల్లా నీడ కాశ్మీర్ మీద పడకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటుందనే కదా?

కాని – సరిగ్గా ఇక్కడే ఊహించనిది జరిగింది ప్రజలు నమ్మి తన చేతిలో పెట్టిన

అధికారాన్ని తీసుకుపోయి ఎప్పుడెప్పుడు మళ్ళీ అబ్దుల్లా చేతిలో పెడదామా అని మీర్‌కాసిం ప్రభుత్వం తహతహలాడసాగింది! 1971 యుద్ధంలో వెన్నువిరిగిన తరవాత పాకిస్తాన్ డీలా పడటంతో అటునుంచి వత్తాసు మీద షేక్ అబ్దుల్లాకు నమ్మకం పోయింది. సిమ్లా ఒప్పందం కుదిరి ఇండో-పాక్ సంబంధాల్లో కొత్త సఖ్యత చిగురించాక కాశ్మీర్ సమస్యను అంతర్జాతీయం చేసే ఆశా అడుగంటింది. దారులు మూసుకుపోవటంతో అబ్దుల్లా జోరు సహజంగానే తగ్గింది మనవారు అదే గొప్ప అనుకున్నారు. కాశ్మీర్ కేసరిని సరిచేయడానికి వచ్చిన ఆ మహత్తర అవకాశాన్ని వదులుకోరాదని నిశ్చయించి ఇందిరాగాంధీ ప్రభుత్వం సుదీర్ఘ మంతనాలకు ఉపక్రమించింది న్యూఢిల్లీ ప్రతినిధిగా జి పార్థసారథి, షేక్ సాహెబ్ పనుపున మీర్జా అఫ్జల్‌బేగ్ దాదాపు మూడేళ్ళు కిందా మీద పడి పేరుగొప్ప 'కాశ్మీర్ ఒప్పందా'న్ని కష్టపడి కుదిర్చారు ఇండియన్ యూనియన్‌లో భాగంగా 370 అధికరణం కింద ప్రత్యేక ప్రతిపత్తితో కొనసాగడానికి సమ్మతించి, 1953కు పూర్వం ఉన్న ఏర్పాట్లను పునరుద్ధరించాలన్న డిమాండును షేక్ అబ్దుల్లా వదులుకునేట్టు చేయడమే అదృష్టమని మన నాయకులు మురిశారు ఆ మాత్రం సౌమ్యత షేక్ కనపరచినదే తడవుగా హడావుడి పడి అయన నెత్తిన మళ్ళీ ముఖ్యమంత్రి కిరీటం తగిలించారు

అదీ - ఎన్ని డ్రామాల తరవాత?!

1953లో బర్తరఫ్ అయ్యేనాటికి అసెంబ్లీలో దాదాపు అందరూ అబ్దుల్లా మనుషులే అయినా అతడి అధికారం ఊడింది. 1975 నాటి అసెంబ్లీలో అతడికి 'నా' అన్నవాడు ఒక్కడూ లేడు. ఆఖరికి - తానూ ఎమ్మెల్యే కాడు అయితేనేమి? అంతదాకా ముఖ్యమంత్రిగా ఉన్న మీర్ కాసిం ఆనందంగా గద్దె దిగాడు. తిరుగులేని మెజారిటీగల కాంగ్రెస్ పార్టీ అబ్దుల్లా ముఖ్యమంత్రిత్వానికి ఒప్పుకుంది అంతే! 'సింహం' గారు మళ్ళీ సి.ఎం. అయిపోయారు.

ఇక్కడే ఓ ధర్మ సంశయం వచ్చింది. అబ్దుల్లాను కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ నాయకుడిగా ఎన్నుకోవాలా? లీడర్ ఆఫ్ ది హౌస్ (సభా నాయకుడు) గా ఎన్నుకోవాలా - అని! నిజానికి - ఇందులో డౌటు పడాల్సింది ఏమీ ఉండకూడదు షేక్ అబ్దుల్లా స్థాపించిన నేషనల్ కాన్ఫరెన్సు చాలా ఏళ్ల కిందటే కాంగ్రెసులో కలిసిపోయింది అదే కాంగ్రెసు పార్టీ తనను వలచి వరించి నెత్తినెక్కించుకున్నప్పుడు అబ్దుల్లా కూడా కాంగ్రెసులో చేరడమే ధర్మం అబ్దుల్లాకు పల్లకి మోసే పనికి ఒప్పుకున్నాక ఆ పల్లకికి కాంగ్రెసు పేరు పెట్టటానికి ఆ పార్టీ వారికీ అభ్యంతరం ఉండనక్కరలేదు కాని - నాయకుడి ఎన్నిక

ఘట్టం దగ్గరికి వచ్చేసరికి ఇందిరాగాంధీ మనసు మార్చుకుని - అబ్దుల్లాను సభా నాయకుడిగానే తప్ప కాంగ్రెసు లెజిస్లేచర్ పార్టీ నాయకుడిగా ఎన్నుకోవద్దని మీర్ కాసింకు ఫోన్ చేసి చెప్పారట. అబ్దుల్లాను చేర్చుకుంటే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీనే మింగేస్తాడని ఆమె భయమట.

సభలో తనకంటూ ఒక్క ఎమ్మెల్యే కూడా లేనివాడు ముఖ్యమంత్రి కావడం ఒక్కటే కాదు విశేషం. రేపు ముఖ్యమంత్రిగా అబ్దుల్లా ప్రమాణ స్వీకారమనగా 1972 ఫిబ్రవరి 24న న్యూఢిల్లీలో శ్రీమతి గాంధి కొత్త 'కాశ్మీర్ ఒప్పందం' గురించి పార్లమెంటులో సుదీర్ఘ ప్రకటన చేసి .. దానికి ముందు తనకూ షేక్‌కూ మధ్య నడచిన ఉత్తర ప్రత్యుత్తరాలను బహిరంగపరిచారు 1953లో ఉన్నట్టుగా ప్రతిదీ జరగాలని షేక్ కోరగా కాలాన్ని ఎవరూ వెనక్కి తిప్పలేరని ఇందిర బదులిచ్చినట్టు, చివరికి అయన గొంతెమ్మ కోరికలేవీ నెరవేరకుండానే ఒప్పందం కుదిరినట్టు దాన్నిబట్టి స్పష్టమైంది. ప్రధానమంత్రి ప్రకటన సారాంశాన్ని ఆలిండియా రేడియో ప్రసారం చేయగానే శ్రీనగర్‌లో 'షేక్- ఇందిర సమ్‌జౌతా ముర్దాబాద్' అంటూ నిరసన ప్రదర్శనలు సాగాయి. తన అవకాశవాదం, పదవీ వ్యామోహం బయటపడినందుకు ఇందిరమీద అలిగి, ప్రమాణ స్వీకారానికి అబ్దుల్లా రాను పొమ్మన్నాడు

రాజ్‌భవన్‌లో ఏర్పాట్లన్నీ జరిగాయి. అతిథులంతా వచ్చారు. కొత్త ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయవలసిన పెద్దమనిషి అయిపు లేడు. ఏమయిందో తెలియక అంతా ఎదురుచూస్తుండగా ఎవరో జర్నలిస్టు వచ్చి షేక్ సాహెబ్ రావడం లేదని మీర్‌కాసిం చెవిలో ఊదాడట అ పళాన అయన గెస్ట్‌హౌస్‌కు పరిగెత్తుకు వెళ్ళి, నిప్పులు కక్కుతున్న షేక్‌ను అతికష్టం మీద రాజ్‌భవన్‌కు శాంతపరచి తీసుకువచ్చి ప్రమాణ స్వీకారం చేయించాడు

అనంతర కాలంలో కాంగ్రెసు పార్టీ కోరినా ఆ పార్టీలో చేరక పాత నేషనల్ కాన్ఫరెన్సును అబ్దుల్లా పునరుద్ధరించాడు ఇది ఇంకో విచిత్రస్థితి! షేక్ అబ్దుల్లా ముఖ్యమంత్రిగా ఆధారపడినదేమో ఒక పార్టీ మద్దతు మీద ఆ పార్టీకి అయన చెందడు అధ్యక్షుడుగా ఉన్నదేమో వేరే పార్టీకి. ఆ పార్టీకి ఒక్క ఎమ్మెల్యే కూడా లేడు!

తరవాత కొంతకాలానికి ఆ పార్టీ తరపున నలుగురిని, తనకు ప్రాణవాయువు నిస్తున్న కాంగ్రెసు నుంచి నలుగురిని మంత్రివర్గంలోకి అబ్దుల్లా తీసుకోదలిచాడు కాంగ్రెసు నుంచి ఎవరిని తీసుకోవాలో హైకమాండు ప్రమేయం లేకుండా తానే నిర్ణయించాడు. నేషనల్ కాన్ఫరెన్సు లిస్టులోనేమో గతంలో కాంగ్రెసును ముంచిన అబ్దుల్‌ఘనీలోనే అనేవాడిని

కేబినెట్‌లోకి తీసుకోదలిచాడు. కాంగ్రెసు అధిష్ఠాన వర్గానికి ఇది సహజంగానే ఒళ్ళు మండించింది. తెల్లవారితే ప్రమాణ స్వీకారమనగా కాంగ్రెస్ అధ్యక్షుడు జి.కె బారువా శ్రీమతి గాంధి ఆదేశానుసారం శ్రీనగర్‌కు ఫోను చేసి, మళ్ళీ చర్చలు జరిపేదాకా కొత్త మంత్రుల ప్రమాణ స్వీకారం ఆపమని కోరాడు. ఇప్పటికే అన్ని ఏర్పాట్లూ అయిపోయాయి ఆపడం కుదరదు అన్నాడు అబ్దుల్లా. నీ పని ఇలా ఉందా అని – కాంగ్రెసు నాయకులు తమ పార్టీకి చెందిన నలుగురిని ప్రమాణ స్వీకారానికి వెళ్ళవద్దన్నారు.

ఇంకేం? ఈసారి – వెయిట్ చేయడం షేక్ వంతు అయింది. గతంలో తాను అలిగి మొహం చాటేసినట్టు ఈసారి తన సర్కారుకు ప్రాణాధారమైన కాంగ్రెస్ పార్టీ సభ్యులు బాయ్‌కాట్ చేయడంతో వారి కోసం గంటన్నరసేపు ఎదురుచూసి చివరికి ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని మొగం చిన్నబుచ్చుకుని కాన్సిల్ చేశాడు కాశ్మీర్ కేసరి

ఈ విధంగా ఒకరిని ఒకరు నమ్మక, ఒకరిని ఒకరు వదులుకోనూ లేక తడవకో తలనెప్పితో సాగిన కాంగ్రెస్ – షేక్ కలతల కాపురం రెండేళ్ళకే చిట్లిపోయింది. ఎమర్జన్సీ అనంతరం 1977 పార్లమెంటరీ ఎన్నికల్లో జనతా ప్రభంజనం ధాటికి కాంగ్రెసు పార్టీ ఘోరంగా ఓడింది. అవకాశ వాదానికి పెట్టింది పేరయిన షేక్ అబ్దుల్లా కష్టకాలంలో తమను అంటిపెట్టుకుని ఉండే రకం కాదని కాంగ్రెసు వారికి తెలుసు. తమను నట్టేట వదిలి జనతాపార్టీతో బేరం కుదుర్చుకోకముందే ఆయన మోతబరువును తాము వదిలించుకోవాలని ఆరాటపడి అబ్దుల్లాకు వారు మద్దతు ఉపసంహరించారు. అసెంబ్లీలో తమ పార్టీకి తిరుగులేని మెజారిటీ ఉంది కనుక తామే ప్రభుత్వం ఏర్పరచగలమని గవర్నరుకు చెప్పారు.

కాని – అబ్దుల్లా వారికంటే కూటనీతిలో నాలుగాకులు ఎక్కువ చదివినవాడు అసెంబ్లీలో తనను బలపరిచేది ముగ్గురు ఎమ్మెల్యేలు మాత్రమే అయినా – గవర్నర్ ఎల్ కె. ఝాను పట్టుకుని ఏకంగా అసెంబ్లీనే రద్దు చేయించాడు.

ప్రజలు తమకు కట్టబెట్టిన అధికారాన్ని కాంగ్రెసు వారు స్వచ్ఛందంగా వదులుకుని షేక్ అబ్దుల్లా చేతుల్లో పెట్టడంవల్ల కాశ్మీర్‌కు కలిగిన మేలు సున్న. ఇండియన్ యూనియన్‌లో ఏనాడో విలీనమైన కాశ్మీర్‌ను భారత జన జీవన స్రవంతిలోకి మరింత సన్నిహితంగా మిళితం చేయడానికి అబ్దుల్లా చేసింది ఏమీ లేదు. చిరకాలంగా జమ్మూ కాశ్మీర్‌ను వేధిస్తున్న వివిధానేక సామాజిక, ఆర్థిక సమస్యలకు ఆయన పరిష్కారం కనుగొన్నదీ లేదు. అసలు ఆ దిశగా ఆయన బుద్ధి పనిచేయనే లేదు.

కేంద్రంలో కాంగ్రెస్ అధికార భ్రష్టమవడంతో నెహ్రూ నుంచి ఇందిర దాకా కాంగ్రెస్ కేంద్ర నాయకులకు తాను చేసిన బాసలను, కుదుర్చుకున్న ఒడంబడికలను కూడా

'సింహం' గారు గాలికొదిలారు 1977 ఎన్నికల ప్రచారంలో తెగబడి అబద్ధాలాడి, కాశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తికేదో ఫుట్టి మునగనున్నట్టు కాశ్మీర్ ప్రజల్లో లేనిపోని అనుమానాలు రేకెత్తించాడు. *"We shall not hesitate to secede from India if we are not assured of a place of honour and dignity in terms of the safeguards provided for the people of the state under Article 370 of the Constitution" (రాజ్యాంగం 370వ అధికరణం కింద రాష్ట్ర ప్రజలకు సమకూర్చిన రక్షణల ప్రకారం గౌరవ స్థానం దక్కకపోతే ఇండియా నుంచి వేరు పడేందుకు కూడా వెనుకాడము)* అంటూ సహజశైలిలో ప్రాంతీయ తత్వాన్ని, అకారణ భయాలను రెచ్చగొట్టాడు. జనతా పార్టీలో సమన్వయ లోపాన్ని, కాంగ్రెస్ శిబిరంలో అయోమయాన్ని చక్కగా ఉపయోగించుకుని 1977 జూన్ ఎన్నికల్లో 74 సీట్లలో 48ను అబ్దుల్లా నేషనల్ కాన్ఫరెన్సు గెలుచుకుంది

ఆ ప్రకారంగా ఎన్నికల్లో ఘన విజయం సాధించి 1977 జూలై 9న మళ్ళీ ముఖ్యమంత్రి అయ్యాక షేక్ అబ్దుల్లాలో అహంభావం అతిశయించింది. మూడో రవుండులో ఆయన ముఖ్యంగా చేసిందల్లా అల్‌ఫతా లాంటి కరడుగట్టిన తీవ్రవాద సంస్థకు చెందిన 30 మంది టెర్రరిస్టుల మీద కేసులు ఎత్తివేయడం ఒక్కటే తాను మొత్తం జమ్మూ కాశ్మీర్ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయినా కాశ్మీర్ కేసరి ముస్లింల ప్రయోజనాలనే తప్ప ఇతర మతస్థుల బాగోగులను పట్టించుకోలేదు. తన థర్డ్ ఇన్నింగ్సుకు కీర్తిపతాకగా రీ సెటిల్మెంటు బిల్లు నొకదానిని ఆయన కష్టపడి తెచ్చాడు. పాకిస్తాన్ నుంచి, పాక్ ఆక్రమిత కాశ్మీర్ నుంచి వలస వచ్చే ముస్లింలు తన రాష్ట్రంలో ఎక్కడైనా స్థిరపడ వచ్చునట ఆస్తులు కొని, అమ్మి, పౌరసత్వ హక్కులన్నిటినీ సంపూర్ణంగా అనుభవించ వచ్చునట అదే అవకాశానికి పాకిస్తాన్ నుంచి వలస వచ్చే హిందువులు మాత్రం నోచుకోరట పాకిస్తానీ ముస్లింలతో కాశ్మీర్‌ను నింపి, కాశ్మీర్‌లో తరతరాలుగా నివసిస్తున్న హిందువులను వేధించి, వేటాడి బయటికి వెళ్లగొట్టి రాష్ట్రంలో జనాభా స్థితిని బలవంతంగా తారుమారు చేయాలన్నదే కాశ్మీర్‌సింహం తన రాష్ట్రానికి చేయబూనిన మహోపకారం! అసెంబ్లీ ఆమోదం పొంది అదృష్టవశాత్తూ గవర్నరు అడ్డుపడటం వల్ల నడమంత్రపు రీ సెటిల్మెంట్ బిల్లు ఆగిపోయింది

ముస్లింలపట్ల పక్షపాతంతో, నాన్ ముస్లిం కాశ్మీరీలపట్ల కక్ష గట్టినట్లుగా అబ్దుల్లా సాగించిన చిల్లర పనులు ఇంకా ఎన్నో ఉన్నాయి తన అధికారానికి ఎదురులేదని, ఏమి చేసినా చెల్లుతుందని విర్రవీగి నియంతలా చెలరేగాడు. అపరిమిత అధికారం అపరిమిత అవినీతికి దారితీసింది క్రమంగా అబ్దుల్లా చుట్టూ కాకస్‌లు, కోటరీలు ఎక్కడికక్కడ పుట్టుకొచ్చాయి. ప్రాంతీయ అసమానత, మతపరమైన దుర్విచక్షణ, బంధుప్రీతి, అధికార

దుర్వినియోగం విచ్చలవిడిగా సాగాయి అనంతర కాలంలో జమ్మూ కాశ్మీర్‌ను పట్టి పల్లార్చిన పెడధోరణులకు, దేశద్రోహ దురాగతాలకు, విదేశీ కుట్రలకు, టెర్రరిస్టు దుర్మార్గాలకు బీజాలు అబ్దుల్లా హయాంలోనే పడ్డాయి రాష్ట్ర ప్రజలను, వారి సమస్యలను అల్లా దయకు వదిలేసిన అబ్దుల్లా హయాంలో ప్రధానంగా బాగుపడ్డదల్లా అబ్దుల్లా కుటుంబం మాత్రమే. తాను ముఖ్యమంత్రి. అల్లుడు కాబినెట్ మంత్రి. ధర్మపత్ని లోక్‌సభ మెంబరు అంతటితోనే తన బాధ్యత తీరిందనుకోకుండా అబ్దుల్లాగారు దూరదృష్టి చూపారు. తాను గతించాక కూడా అధికారం తన కుటుంబం గుప్పిట్లోనే ఉండేందుకు ఏమి చేయాలా అని తీక్షణంగా ఆలోచించి, కులాసా విలాసాల్లో రికామీగా కాలక్షేపం చేస్తున్న తన సుపుత్రుడు ఫరూక్ అబ్దుల్లా తన రాజకీయ వారసుడు కావడానికి పథకం ప్రకారం రంగం సిద్ధపరచారు. కొడుకుకు పోటీదారులు కాగలరనుకున్న మీర్జా అఫ్జల్ బేగ్ వంటి వారిని పార్టీ నుంచి గెంటివేసి, ఫిరాయింపుల నిషేధ శాసనాయుధంతో ఎమ్మెల్యేలను కట్టుబానిసల్లా కట్టిపడేశాక 'కాశ్మీర్ కేసరి' 1982 సెప్టెంబర్ 8న తృప్తిగా ప్రశాంతంగా కన్నుమూశాడు.

ఈ మధ్యకాలంలో కేంద్రంలో జమానా మారింది జనతాను నేలకరిపించి తిరిగి అధికారం అందుకున్న ఇందిరాగాంధి పాత కలతలను పట్టించుకోకుండా అబ్దుల్లా మీద ఆయన కుటుంబం మీద ప్రసన్నతను ప్రసరించింది వెనక నుంచి ఆమె ఆశీర్వాదం వల్ల, గవర్నర్ బి కె.నెహ్రూ సహకారం వల్ల వారసుడి ఎంపిక సాఫీగా జరిగి, ఫరూక్ అబ్దుల్లాకు రాజ్యాధికారం సిద్ధించింది.

కాశ్మీర్ అసలు కష్టాలు అప్పుడే మొదలయ్యాయి

# తండ్రికి తగ్గ తనయుడు

*మా కలిదిండి కామయ కుమారకుడన్నిట దండ్రి వైఖరే*
*కాక తదన్యుడెట్లగును? గాడిదకుం దురగంబు పుట్టునే?*
*చేకొని కొంకి నక్కకును సింగము పుట్టునె? మాల కాకి కిం*
*గోకిల పుట్టునే? చిఱుత కుక్కకు మత్తగజంబు పుట్టునే?*

**(మా కలిదిండి కామయ్య కొడుకు అన్నిటిలోనూ తండ్రి పోలికే. అవును మరి! గాడిదకు గుర్రం పుడుతుందా? నక్క కడుపున సింహం పుడుతుందా? మాల కాకికి కోకిల పుడుతుందా? కుక్కకు మదపుటేనుగు పుడుతుందా?)**

తన బంధువు ఒకణ్ణి ఆట పట్టించడానికి శ్రీనాధుడు చెప్పిన ఈ చాటువు షేక్‌గారి అబ్బాయి ఫరూక్ అబ్దుల్లాకూ చక్కగా నప్పుతుంది!

తనకు వారసుడు కావడానికి రాజకీయాల్లో తనను అది నుంచి వెన్నంటి వున్న మీర్జా అఫ్జల్ బేగ్ – షేక్ సాహెబ్‌కు పనికిరాలేదు. కష్టసుఖాల్లో తనకు తోడుగా ఉన్న సొంత అల్లుడు జి ఎం షా అందుకు తగునని ఆయన అనుకోలేదు రాజకీయాలకు బొత్తిగా కొత్త అయినా సరే ముద్దుల కుమారుడు ఫరూకే తన ఉత్తరాధికారి కావాలని అబ్దుల్లా కోరుకున్నాడు.

ఫరూక్ పేరుకే కాశ్మీరీ చదువూ గిదువూ ఇంగ్లండులో అక్కడే స్థిరపడి బ్రిటిష్ పౌరసత్వం కూడా తీసుకుని సావాసగాళ్లతో కులాసాగా రంగేళీరాజాలా బతికేస్తున్న సుపుత్రుడిని కావాలని తీసుకొచ్చి అధికారానికి మొదటి మెట్టుగా నేషనల్ కాన్ఫరెన్సు అధ్యక్షుడిని చేశాడు నాన్నగారు ఆ శుభ సందర్భాన జరిపిన బహిరంగ సభలో 'మావాడి మీద నాకు నమ్మకం ఉంది అప్పగించిన పనిలో వాడికి సాయపడమని మిమ్మల్ని కోరుతున్నాను. నాలాగే మా అబ్బాయి కూడా మీ నమ్మకాన్ని వమ్ము చేయడు నేను

సాధించలేక పోయిన దానిని వాడు సాధిస్తాడు' అని అబ్దుల్లాగారు బోలెడు ఆశాభావం వ్యక్తపరిచాడు

ఆ చివరి మాట మాత్రం నిజం! షేక్ అబ్దుల్లా కూడా చేయలేని ఎన్నో అపభ్రంశపు పనులను ఆయన కుమారరత్నం అవలీలగా చేసి పారేశాడు. అసమర్థ నిర్వాకంలో, దుందుడుకు పోకడలో నీతి, నియమం లేని అవకాశవాద రాజకీయంలో తన రికార్డులను తానే బద్దలు కొడుతూ వినాశనం దిశలో జమ్మూ కాశ్మీర్‌ను జయప్రదంగా పరుగులు తీయిస్తున్నాడు.

మామూలు చదువుతోబాటు డాక్టర్ ఫరూక్ అబ్దుల్లా రాజకీయ విద్యాభ్యాసం కూడా ఇంగ్లండులోనే జరిగింది. జమ్మూ కాశ్మీర్ చరిత్రను, సంస్కృతిని అయితే అర్థం చేసుకోలేదు గాని జమ్మూ కాశ్మీర్ లిబరేషన్ ఫ్రంటు చరిత్రను, దాని తీవ్రవాద సంస్కృతిని ఆయన బాగానే వొంటబట్టించుకున్నాడు. జె.కె ఎల్.ఎఫ్ నాయకుడు అమానుల్లాఖాన్, టెర్రరిస్టు లీడర్లు హాషిం కురేషి, మఖ్‌బూల్ బట్‌లు ఆయనకు జిగ్రీ దోస్తులు. వారి ఆహ్వానం మీద 1974లో పాకిస్తాన్‌ను, అటు నుంచి పాక్ ఆక్రమిత కాశ్మీర్‌నూ సందర్శించి, 'కాశ్మీర్ విమోచన'కు సభాముఖంగా శపథం చేసి, బేనజీర్ భుట్టో తదితర పాకిస్తానీ ప్రముఖులతో రహస్య సమాలోచనలు చేసి వచ్చిన 'దేశభక్తుడు' ఫరూక్ అబ్దుల్లా! ఇందిరతో ఒప్పందం తరవాత నాన్నగారు మళ్ళీ కాశ్మీర్ గద్దెనెక్కిన సందర్భాన జరిగిన విజయోత్సవంలో పాల్గొనడానికి బ్రిటన్ నుంచి జె.కె.ఎల్.ఎఫ్. సావాసగాళ్ళు చాలామందిని ఫరూక్ భాయ్ వెంట తీసుకువెళ్ళాడు *Choon Desh, Myon Desh - Kashur Desh, Kashur Desh* *(నీ దేశం, నా దేశం – కాశ్మీర్, కాశ్మీర్)* అని ఓ కొత్త నినాదాన్ని కూడా ఇచ్చాడు.

షేక్ అబ్దుల్లా నీతిమాలిన అవకాశవాది. సందేహం లేదు. కానీ – ఆయన నీతిమాలిన తనంలో కూడా ఎంతో కొంత నీతి ఉండేది కాంగ్రెసు పార్టీకీ, నెహ్రూ కుటుంబానికీ ఆయన మొదటి నుంచీ సన్నిహితుడు మధ్యమధ్యలో ఎన్ని పొరపొచ్చాలు వచ్చినా, ఎంతగా చిటపటలాడినా దూరంగా ఉన్నాడే తప్ప నెహ్రూ కుటుంబం మీద కత్తిగట్టి కాంగ్రెస్ శత్రువులతో చేతులు కలపలేదు. అబ్దుల్లా కుమారుడికి అటువంటి పట్టింపు ఏదీ లేదు. అక్కర తీరగానే ఎవరినయినా బెబ్బే అనడానికి ఆయన తటపటాయించడు షేక్ అబ్దుల్లా 1947లో తొలిసారి ముఖ్యమంత్రి కాగా 1953 వరకూ అంటే ఆరేళ్ళు కేంద్రంతో ఎలాంటి గొడవా పడలేదు. దీర్ఘకాలం ఖైదుచేసినా, రాష్ట్రంలో ఉండటానికి వీల్లేదని బహిష్కరించినా నెహ్రూ కుటుంబంతో వ్యక్తిగత సఖ్యతను వదులుకోలేదు

ఫరూక్ అబ్దుల్లా పద్ధతి వేరు తండ్రికి ఉన్న ప్రజాబలంలో వెయ్యో వంతయినా

ఆయనకు ఏనాడూ లేదు. తండ్రి మరణానంతరం 1982 సెప్టెంబర్ 14న ఆయన సింహాసనం ఎక్కగలిగిందే ఇందిరాగాంధి సౌజన్యంవల్ల అక్కర తీరీ తీరగానే అదే ఇందిరకు ఆయన ఎదురుతిరిగాడు దాని వెనుకా ఒక కుటిల వ్యూహం ఉంది కాశ్మీర్ గౌరవాన్ని నిలబెట్టడానికి కొండలాంటి ఇండియాతో ఢీకొనడానికి సిద్ధమంటూ స్వరాష్ట్రంలో బీరాలు పలకడం ద్వారా, రాష్ట్రాన్ని చుట్టుముట్టిన సమస్యలన్నిటికీ కారణమంటూ న్యూఢిల్లీని పాపాల భైరవునిలా చిత్రించడం ద్వారా ప్రజల దృష్టిని తమ అసమర్థ నిర్వాకం నుంచి మరలించవచ్చు నియంతృత్వ శక్తులతో నిర్భయంగా పోరాడుతున్న వీరుడిగా జనం మెప్పు పొందవచ్చు భారత ప్రభుత్వం మీద తిరగబడినందుకు పాకిస్తాన్ చేత మంచి అనిపించుకోవచ్చు కేంద్ర నిరంకుశత్వాన్ని ఎదుర్కోవడంలో కలిసి వచ్చిన ప్రజాస్వామ్య వాదిగా ప్రతిపక్ష పార్టీల ప్రశంసలనూ అందుకోవచ్చు ఇన్ని లాభాలను ఆశించే, గద్దెనెక్కిన మూడోనెలకే కేంద్రంతో కయ్యానికి దిగి నాన్ కాంగ్రెస్ స్కంధావారంలో ప్రధానపాత్ర వహించాడు జాతీయ ప్రతిపక్ష నేతలను పిలిచి శ్రీనగర్‌లో 'కాన్క్లేవ్' జరిపాడు రాష్ట్రాలకు సముచిత స్వయం ప్రతిపత్తి కోసం జాతీయ పోరాటం సాగిస్తున్న అభిప్రాయం కలిగిస్తూనే పంజాబ్ టెర్రరిస్టులతో సంబంధాలు పెంచుకుని, భింద్రన్‌వాలెతో భేటీ వేసి, తన రాష్ట్రంలో ఖలిస్తానీలకు శిక్షణ శిబిరాలు ఏర్పాటుచేసి పాకిస్తాన్‌తో భళీ అనిపించుకున్న 'జాతీయవాది' డాక్టర్ ఫరూక్!

అబ్దుల్లా తన అధికారం పోయినప్పుడూ, రాజకీయంగా చిక్కున పడ్డప్పుడూ ఇండియాకు వ్యతిరేకంగా ధ్వజమెత్తి, 'స్వతంత్ర కాశ్మీర్' అంటూ హడావుడి చేసినా అధికారం చేతిలో ఉన్నంతకాలం ఎంతో కొంత బాధ్యత గుర్తెరిగే ప్రవర్తించాడు దేశద్రోహులను, పాకిస్తానీ ఏజంట్లను ఆయన మరీ నెత్తిన పెట్టుకోలేదు. జాతి వ్యతిరేక తీవ్రవాద కార్యకలాపాలనూ ఒక హద్దుకు మించి సాగనివ్వలేదు ఫరూక్ అబ్దుల్లాది అధికారంలో ఉన్నప్పుడు, లేనప్పుడూ కూడా ఒకటే తీరు. ఆయన తత్వం ఎప్పుడూ పెడసరమే కాశ్మీర్ గడ్డ మీద పంజాబ్ టెర్రరిస్టులకు ట్రయినింగు క్యాంపులు నడుపుకోనిచ్చినట్టే జమ్మూ కాశ్మీర్‌లో పాకిస్తానీ ఏజంట్ల చొరబాటుకు తలుపులు బార్లా తెరిచాడు సరిహద్దుల్లో నిఘాను నీరుగార్చడంతోబాటు కాశ్మీర్‌లోకి దొంగచాటుగా చొరబడ్డ పాక్ ఏజంట్లకు ప్రభుత్వంలో ఉద్యోగాలిప్పించాడు.

నెహ్రూతోగాని, ఆయన కుమార్తెతోగాని షేక్ అబ్దుల్లా ఎప్పుడూ విరోధం పెట్టుకోలేదు. కొన్నేళ్ల వైముఖ్యం తరవాత ఆయన మళ్ళీ వారికి సన్నిహితం కాగలగడం అబ్బురం కాదు ఫరూక్ అబ్దుల్లాది అటువంటి అషామాషీ ఘనత కాదు 1982లో తనను గద్దెనెక్కనిచ్చిన ఇందిరాగాంధి మీద మూడు నెలలు తిరక్కుండా ఆయన కత్తిదూశాడు.

ఆమె అధికారం ఊడగొట్టటానికి కంకణం కట్టుకుని దేశమంతటా వ్యతిరేకతను కూడగట్టాడు ఆమెను, ఆమె కుమారుడు రాజీవ్‌ను నానా దుర్భాషలాడాడు తన స్వయంకృతాపరాధాల కారణంగా నేషనల్ కాన్ఫరెన్సు పార్టీలో ముసలం పుట్టి 1984 జూలై 2న తనను కూలదోసినప్పుడు ఫరూక్ అగ్గిరాముడయ్యాడు సొంత అక్క, బావ కలిసి అసమ్మతిని కూడగట్టి తనను పడగొట్టిన గృహచ్ఛిద్రమంతటికీ ఢిల్లీ కుట్రే కారణమంటూ పొలికేకలు పెట్టి దేశవిదేశాల్లో యాగీ చేశాడు ఇందిర మరణానంతరం రాజీవ్ ప్రధాని అయ్యాక కూడా పాత శత్రుత్వాన్ని కొనసాగించాడు ఫరూక్ అబ్దుల్లా జాతి వ్యతిరేకి, దేశ భద్రతకు ప్రమాదకారి అని అనేక సందర్భాల్లో రాజీవ్ చేత బహిరంగంగా అనిపించుకున్నాడు మధ్యలో పచ్చగడ్డివేస్తే భగ్గుమనేంతగా వైషమ్యాలు పెరిగిన తీరునుబట్టి మళ్ళీ జన్మలో వారిద్దరూ కలవరనే అందరూ అనుకున్నారు కాని మూడేళ్ళు తిరక్కుండా మళ్ళీ అదే రాజీవ్‌గాంధి ప్రాపకం సంపాదించి, తనను పడగొట్టిన కాంగ్రెసు పార్టీచేత తన పల్లకీ మోయించి 1986 నవంబర్ 7న ఫరూక్ అబ్దుల్లా తిరిగి ముఖ్యమంత్రి కాగలిగాడు రాజకీయ లౌక్యంలో తండ్రిని మించిన వాడనటానికి ఇంతకంటే దృష్టాంతం ఏమీ కావాలి?

1984లో చేజేతులా పోగొట్టుకున్న అధికారాన్ని రాజీవ్ దయతో 1986 చివరిలో ఫరూక్ తిరిగి పొందాక ప్రజల్లో భ్రష్టు పట్టినా రిగ్గింగు చేసి ఎన్నికల్లో గెలిచి మూడేళ్ళకు పైగా రాజ్యమేలాడు. హోంమంత్రి కూతురు రూబియా కిడ్నాప్ అనంతరం వి పి సింగ్ ప్రభుత్వం తన అసమర్థతకు ఓరిమి నశించి బర్తరఫ్ చేయనున్నదనగా 1990 జూన్‌లో తానే త్వరపడి రాజీనామా చేశాడు ఆరేళ్ల గవర్నర్ పాలన అనంతరం 1996 అక్టోబరులో అసెంబ్లీ ఎన్నికలనూ యథాప్రకారం రిగ్గింగు చేసి ముచ్చటగా మూడోసారి ముఖ్యమంత్రి అయి నేటికీ అదే పదవిలో విరాజిల్లుతున్నాడు ఏ ఎండకా గొడుగు పట్టటంలో ఫరూక్ సాటిలేని ప్రజ్ఞాశాలి। 1983లో అక్కర తీరగానే కాంగ్రెసును వదిలేసి, ప్రతిపక్ష శిబిరంలో కలిసినట్టే . 1986లో తిరిగి రాజీవ్‌ను పట్టుకుని ముఖ్యమంత్రి అయ్యాక కేంద్రంలో జమానా మారగానే కాంగ్రెసు చెయ్యి వదిలేసినట్టే . 1996లో మూడో విడత ముఖ్యమంత్రిత్వం దక్కాక దేశంలో గాలివాలునుబట్టి ఎన్ డి.ఏ కు తెరచాప ఎత్తాడు ఆ ఎన్.డి ఏ ను నడిపిస్తున్నది బి జె పి అయితేనేమి? ఆ బిజెపి పక్కా మతతత్వ పార్టీ అని, ముస్లింలకు విరోధి అని నిన్న మొన్నటిదాకా ఫరూక్ ఎంతగా నిప్పులు చెరిగితేనేమి? ఆయనకు కావలసింది కాశ్మీర్‌లో అధికారం, కేంద్రంలో తన మాట చెల్లుబాటూనూ. ఆ రెండిటికీ అనువైనవనుకుంటే ఆయన దయ్యాలతోనైనా వియ్యమందగలడు

రాజకీయ నాయకుడికి కావలసింది అధికారం. అది చేతిలో ఉంటేనే ఏదయినా చేయగలిగేది అధికారం అందుకోవడానికి తప్పనిసరి పరిస్థితుల్లో విధం చెడ్డా సమకాలిక ప్రమాణాలనుబట్టి దాని నుంచి సొంత లాభం వీలైనంత పొందినా, ప్రజల పట్ల బాధ్యతను కూడా వంకలేకుండా నిర్వర్తిస్తే ఎవరూ పెద్దగా ఆక్షేపించరు షేక్ అబ్దుల్లాలో అవలక్షణాలు ఎన్ని ఉన్నా పాలనా యంత్రాంగం మీద ఆయనకు గట్టి పట్టు ఉండేది. కుమారరత్నానికి అదే లేదు ఫరూక్ సాహెబ్ విలాస పురుషుడు ఎంతసేపూ తన సుఖమే, తన సరదాలే ఆయనకు కావలసింది. రాష్ట్రం తగలబడుతున్నా, సొంత కొంపకే అగ్గి అంటుకున్నా ఆయనకు పట్టదు జల్సాలు, ఫారిన్ టూర్లు ఆయన మానడు. 1984లో తనను పడగొట్టటానికి అక్క, బావ కంకణం కట్టుకుని చకచకా పావులు కదుపుతున్న సమయంలో ఫరూక్ భాయ్ సినిమా తార జీనత్ అమన్‌ను వెనక ఎక్కించుకుని మోటారు సైకిల్ మీద హీమాన్‌లా ఝామ్మంటూ సోపోర్‌లో విహరిస్తున్నాడు. 1989 చివరిలో కేంద్ర హోం మంత్రి కుమార్తెను టెర్రరిస్టులు కిడ్నాప్ చేసినప్పుడూ ఆయన ఫారిన్‌లో సరదా షికార్లు చేస్తున్నాడు

ముఖ్యమంత్రి ఫరూక్ దేశంలో ఉండే సమయమే కొద్ది ఉన్న కాసేపైనా పరిపాలనను పట్టించుకునే శ్రద్ధ ఆయనకు లేదు అధినేతకే పట్టులేనప్పుడు ఎవరికి వారి ఇష్టారాజ్యమై మొత్తం ప్రభుత్వ వ్యవస్థ చచ్చుబడటం సహజం ఉదాహరణకు 1989 జనవరి 13న జమ్మూలో సిక్కులు గురుగోవిందసింగ్ జయంతి సందర్భంగా తీయదలచిన ఊరేగింపులో అవాంఛనీయ ఘటనలు జరగవచ్చునని, ఇందిరాగాంధీ హంతకులను అమరవీరులుగా కీర్తించడం హిందువులకు ఒళ్లు మండించి అల్లర్లకు దారితీయవచ్చునని ముందే తెలిసినా ఫరూక్ ప్రభుత్వం అనర్థాన్ని నివారించేందుకు ఎలాంటి జాగ్రత్తా తీసుకోలేదు. ముఖ్యమంత్రి, మంత్రులు అందరూ కొలువుతీరి ఉండగా సెక్రటేరియట్‌కు కూతవేటు దూరంలో లూటీలు, దొమ్మీలు, దుకాణాల దహనాలు యథేచ్ఛగా సాగుతూ ఐదు గంటలపాటు అల్లర్లు ఘోరంగా చెలరేగుతుంటే ప్రభుత్వం పక్షవాతం కమ్మినట్టు గుడ్లప్పగించి చూస్తూండిపోయింది తమ కళ్ల ముందే ఖూనీలు, ఆస్తుల విధ్వంసాలు జరుగుతున్నా ఏ పోలీసూ చిటికెన వేలు కదిలించలేదు.

దీనికి మూడు నెలల ముందు 1988 అక్టోబరు 2న గాంధీ జయంతిని పురస్కరించుకుని శ్రీనగర్‌లో కొత్తగా కట్టిన హైకోర్టు కాంప్లెక్సులో మహాత్ముడి విగ్రహాన్ని ఆవిష్కరించదలిచారు భారత ప్రధాన న్యాయమూర్తి ఆర్.ఎస్ పాఠక్ చేతి మీదుగా ఆవిష్కరణ జరగవలసి ఉంది అన్ని ఏర్పాట్లు జరిగాయి. అందరికీ ఆహ్వానాలు

వెళ్ళాయి. ఆ దశలో కొంతమంది ముస్లిం లాయర్లు అభ్యంతరం తెలిపారు. తమను లక్ష్యపెట్టకపోతే అవిష్కరణ ఉత్సవంలో అల్లర్లు తప్పవని హెచ్చరించారు అంతే! ముఖ్యమంత్రి ఫరూక్‌కు కాళ్లు చల్లబడ్డాయి. ఆఖరి నిమిషంలో కార్యక్రమం రద్దయింది భారతదేశంలో భాగమనుకునే సెక్యులర్ కాశ్మీర్‌లో, భారత జాతికి ఆరాధ్యుడైన మహాత్మాగాంధీ విగ్రహాన్ని అత్యున్నత న్యాయ ప్రాంగణంలోనే స్థాపించుకోలేని దుస్థితి .. కొంతమంది మతోన్మాదులు కన్నెర్ర చేయగానే ప్రభుత్వం హడలిపోయి అవిష్కరణ కార్యక్రమాన్ని రద్దుచేసుకునే దుర్గతి... పైగా ఆ ప్రభుత్వంలో గాంధీగారి కాంగ్రెసు పార్టీ భాగస్వామి! ఆత్మగౌరవం గల జాతికి ఇంతకంటే దౌర్భాగ్యం ఏమి కావాలి?

ఈ సిగ్గుచేటు ఉపాఖ్యానానికి ఆసక్తికరమైన ఉపశ్రుతి ఉంది గాంధీ విగ్రహం ప్రతిష్ఠాపనను వ్యతిరేకిస్తూ ఆందోళన నడిపిన మహమ్మద్ షఫీబట్ అనే అడ్వకేటుకు (బహుశా ఆ 'జాతీయ సేవ'కు ప్రతిఫలంగా) ఫరూక్ గారి నేషనల్ కాన్ఫరెన్సు పార్టీ 1989 లోకసభ ఎన్నికల్లో శ్రీనగర్ టిక్కెటు ఇచ్చింది!

1983 అక్టోబరు 13న శ్రీనగర్‌లో ఇండియా, వెస్టిండీస్‌ల మధ్య వన్‌డే ఇంటర్నేషనల్ క్రికెట్ మాచి జరిగినప్పుడు భారత ఆటగాళ్ళను అల్లరిమూకలు దుర్భాషలాడి, కుళ్ళిన పళ్ళూ, రాళ్ళూ మొహాల మీదికి విసిరికొట్టి, ఎన్ని విధాల అవమానించిందీ అందరికీ తెలుసు. స్వతంత్ర భారత భూభాగంలో పాకిస్తాన్ జండాలను సగర్వంగా ప్రదర్శిస్తూ, భారత వ్యతిరేక నినాదాలు చేస్తూ, భారతీయ ఆటగాళ్లను వేధిస్తూంటే. . ఆ ఆగడాన్ని అడ్డుకుని జాతి పరువు నిలబెట్టవలసిన ఫరూక్ ప్రభుత్వం చేష్టలుడిగి నిస్సహాయంగా చూస్తూండిపోయింది. ఈ అసమర్థతను అలుసుగా తీసుకుని దేశద్రోహులు, జాతి శత్రువులు అనంతర కాలంలో పట్టపగ్గాలు లేకుండా ఎంత పేట్రేగారంటే .. 1989 ఆగస్టు 15న భారతదేశమంతటా స్వాతంత్ర్య దినోత్సవాన్ని దేదీప్యమానంగా జరుపుకుంటూండగా కాశ్మీరీ మిలిటెంట్లు శ్రీనగర్‌లో ఎక్కడా దీపం వెలిగించరాదని శాసించి, విజయవంతంగా బ్లాకవుట్ అమలు జరిపారు. ఆ రోజు కాశ్మీర్ లోయలో ఎక్కడ చూసినా పాకిస్తాన్ జండాలే రెపరెపలాడాయి స్వతంత్ర భారత త్రివర్ణ పతాకానికి దిక్కులేక పోయింది

వేర్పాటువాదుల విచ్ఛిన్నకర కార్యకలాపాలు కాశ్మీర్‌లో మొదటి నుంచీ ఉన్నవే కాని – గతంలో ఉన్న ప్రభుత్వాలు ఆలస్యంగానైనా మేల్కొని జాతి వ్యతిరేక చర్యలకు పాల్పడ్డవారిని నిర్బంధించి, కఠినంగా వ్యవహరించి పరిస్థితిని అదుపులోకి తెచ్చేవి ఫరూక్ అబ్దుల్లా వచ్చాక ప్రభుత్వానికి చేవ చచ్చింది. తన కళ్ల ముందే ఎన్ని హత్యలు, ఎన్ని

కిడ్నాప్‌లు, ఎన్ని విధ్వంసాలు ఎన్ని దేశద్రోహకర దురాగతాలు జరిగిపోతున్నా ఆయన సర్కారు నిమ్మకు నీరెత్తినట్టు మిన్నకుండిపోయింది కాశ్మీర్ లోయలో బుసలు కొడుతున్న టెర్రరిస్టు విషనాగులను పట్టి నిర్మూలించవలసింది పోయి మునుపటి ప్రభుత్వాలు పట్టి బంధించిన కాలసర్పాలను కూడా బుద్ధిలేకుండా విడిచిపెట్టి కాశ్మీర్‌ను కాట్లు వేయమని దీవించి పంపింది 1989 జూన్ నుంచి ఐదారునెలల్లో ఏకంగా 70 మంది హార్డ్‌కోర్ టెర్రరిస్టులను బేషరతుగా వదిలిపెట్టిన ఫరూక్ పాపానికి జమ్మూ కాశ్మీర్ ఈనాటికీ భయంకరమైన మూల్యం చెల్లిస్తున్నది

1989 మధ్యలో ప్రధాని రాజీవ్‌గాంధీకి రాసిన లేఖలో గవర్నర్ జగ్‌మోహన్ ఇలా అన్నారు

*"The situation is fast deteriorating . For the last few days there have been large scale violence, arson, firing, hartals, casualties and what not What is still more worrying is that every "victory" of the subversionists is swelling their ranks, and the animosity is being diverted against the Central authorities The Chief Minister stands isolated. He has already fallen - politically as well as administratively Personal aberrations have also eroded his public standing The situation calls for effective intervention Tomorrow may be too late "*

*(పరిస్థితి వేగంగా విషమిస్తున్నది . కొన్ని రోజులుగా భారీ ఎత్తున హింస, దహనకాండ, కాల్పులు, హర్తాళ్లు, దుర్మరణాలు జరిగిపోతున్నాయి విద్రోహశక్తుల ప్రతి 'విజయమూ' వారి శ్రేణులను వృద్ధి చేసి, కేంద్రాధికారం మీద వైషమ్యాన్ని పెంచడం ఆందోళనకరం ముఖ్యమంత్రి ఏకాకి అయ్యాడు రాజకీయంగా, పాలనా పరంగా ఆయన పతనమయ్యాడు వ్యక్తిగత బలహీనతలు కూడా ఆయనకు అప్రతిష్ఠ తెచ్చాయి సమర్థంగా జోక్యం చేసుకోవలసిన పరిస్థితి ఇది రేపటికి సమయం మించిపోవచ్చు )*

సమర్థుడైన పరిపాలకుడిగా ప్రజల మెప్పు పొంది, కాశ్మీర్‌ను వినాశపుటంచు నుంచి కాపాడటానికి శాయశక్తులా పాటుపడ్డ గవర్నర్ జగ్‌మోహన్ ఈ ప్రమాద సంకేతాన్ని పంపి పన్నెండేళ్ళయింది.

నేటికీ అదే పరిస్థితి! అదే ముఖ్యమంత్రి!!

# ఆపరేషన్ టోపాక్

*ఆయూబ్‌ఖాన్ పోకడ యాహ్యాఖాన్‌కు నచ్చదు. యాహ్యాఖాన్ అంటే భుట్టోకు పడదు భుట్టో పొడ జియాఉల్ హక్‌కు గిట్టదు. జియా నీడను కూడా బేనజీర్ భరించలేదు. బేనజీర్‌కు నవాజ్ షరీఫ్ విరోధి. షరీఫ్‌కు ముషారఫ్ శత్రువు*

*వీరందరూ పాకిస్తాన్ పాలకులు. ఒకరిని కూల్చి ఇంకొకరు గద్దెనెక్కిన వారు. ఒకరికి ఒకరు బద్ధ విరోధులు.*

*అయినా... కాశ్మీర్‌కు సంబంధించినంతవరకూ వీరందరిదీ ఒకటే మాట. ఒకటే పాట. సైనిక నియంతృత్వమూ, పౌర ప్రభుత్వమూ అన్న తేడా లేదు పరస్పర శత్రుత్వాలు, వైఖరుల్లో వైరుధ్యాలు ఎన్ని ఉన్నా కాశ్మీర్ విషయంలో ఈ ప్రభుత్వాలన్నిటి మధ్య చక్కటి సారూప్యం ఉంది విధానంలో గొప్ప నిలకడ ఉంది.*

*అదే – మన దగ్గర లేదు.*

నెహ్రూజీ అంటే శాస్త్రీజీకి గౌరవం. శాస్త్రీజీ అంటే ఇందిరాజీకి ఆదరం ఇందిర అంటే రాజీవ్‌కు ప్రాణం. రాజీవ్ అన్నా, నెహ్రూ వంశమన్నా పీవీజీకి ప్రీతి. స్వతంత్రం వచ్చాక 54 ఏళ్ళలో మొత్తం 44 ఏళ్ళు ఒకే పార్టీ రాజ్యమేలింది మధ్యమధ్యలో విరామ సంగీతంలా కాసేపు హడావుడి చేసి పోయిన మురార్జీ, చరణ్‌సింగ్, వి పి సింగ్, దేవెగౌడ, గుజ్రాల్ సర్కార్లకు కుర్చీని కాచుకోవటం తోటే పుణ్య కాలమంతా చెల్లిపోయింది మిగతా అన్ని సమస్యల్లాగే కాశ్మీర్‌పైనా పాత విధానాన్ని పునరాలోచించే తీరిక గాని, తిరగదోడాలన్న కోరిక గాని వాటిలో ఏ గవర్నమెంటుకూ లేదు కాంగ్రెసు పేరు చెబితేనే మైలపడినట్టు చిరచిరలాడే బిజెపి వారు తమ హయాంలో అధికార తత్వం బోధపడ్డాక వెనుకటి కాంగ్రెస్ ప్రభుత్వాల విధానాన్నే తు.చ. తప్పక అనుసరిస్తున్నారు తప్ప అక్షరం మార్చలేదు

కాబట్టి కాశ్మీర్‌పై తీరైన ఏకాభిప్రాయం, విధానాల్లో దృఢమైన నిలకడ ఈ అర్ధశతాబ్దం

పైచిలుకు కాలంలో నెలకొని ఉండాలి కదా?।

నిలకడ మాట దేవుడెరుగు అసలు కాశ్మీర్‌పై మన విధానమేమిటో మనకే ఈనాటికీ తెలియదు సమస్యను సమూలంగా పరిష్కరించడం మీద కంటే . ఆ పని మనం సరైన రీతిలో చేస్తున్నట్టు ప్రపంచానికి నమ్మకం కలిగించడం ఎలా? మన మంచితనం మీద అన్ని దేశాలకూ గురి కుదర్చటం ఎలా అన్న వాటి మీదే ఎంతసేపూ మన ప్రభుత్వాల ఆలోచన తడబాట్లు, తొట్రుపాట్లు, దిద్దుబాట్ల భంగపాట్లతోటే అర్ధశతాబ్ది చెల్లిపోయింది

కాశ్మీర్ విషయంలో మొదటి నుంచీ న్యాయం మన పక్షాన ఉంది పాకిస్తాన్ అది నుంచీ అన్యాయంగానే వ్యవహరిస్తున్నది కాశ్మీర్ మనది - మనది మాత్రమే - అని చెప్పేందుకు మన కేసుకు తిరుగే లేదు పాకిస్తాన్ దగ్గర అసలు కేసే లేదు. దబాయింపు, దౌర్జన్యం, దుర్మార్గాలతో అడ్డగోలుగా చెలరేగడమే తప్ప నిజానికి తన వాదంలో బలంలేదని ఇస్లామాబాద్‌కు తెలుసు అన్యాయాన్ని న్యాయంగా చిత్రించేందుకు, తమకు ఎలాంటి హక్కూ లేని కాశ్మీర్‌ను వీలయితే కబళించేందుకు, కనీసం దాన్ని తగలబెట్టి, ఆరని మంటల్లో ఇండియాను ఆరడి పెట్టేందుకు, ఇంతవరకూ పాకిస్తాన్‌ను ఏలిన ప్రభుత్వాలన్నీ ఒక్క తాటి మీద నిలిచాయి అన్యాయపు వ్యూహాన్ని పాకిస్తాన్ ప్రభుత్వాలు ఎంత పకడ్బందీగా అమలుపరుస్తూ వచ్చాయో గమనిస్తే - ధర్మం, న్యాయం మన పక్షాన ఉండి కూడా మన జాతీయ ప్రయోజనాలను సంరక్షించుకోవటంలో వ్యూహాత్మకంగా మన వైఫల్యం కొట్టొచ్చినట్టు కనపడుతుంది.

తన బలం, మన బలహీనతల మీద పాకిస్తాన్‌కు మొదట్లో చాలా భ్రమలుండేవి. ఒక్కో పాకిస్తానీ సైనికుడు శౌర్య ప్రతాపాల్లో పదిమంది భారతీయుల పెట్టు అనీ, యుద్ధమే కనుక వస్తే ఇండియాను అవలీలగా నమిలేయగలమనీ పాక్ సైన్యాధికారులకు గొప్ప నమ్మకం వరసగా మూడు (1947, 1965, 1971) యుద్ధాలను కోరి కొని తెచ్చి ప్రతిసారీ ఇండియా చేతిలో చిత్తుగా ఓడిపోయిన తరవాత తమ తాహతేమిటో వారికి తెలిసి వచ్చింది. కాశ్మీర్ విమోచన మొదటి నుంచీ పాకిస్తాన్ జాతీయ లక్ష్యాల్లో ప్రధానమైనది. నేరుగా యుద్ధానికి దిగడం ద్వారా దానిని సాధించలేమని పైగా దాని పర్యవసానంగా పాకిస్తాన్ ఉనికికీ, దాని ప్రాదేశిక సమగ్రతకే మోసం రాగలదని అనుభవపూర్వకంగా తేలిపోయింది ఈ పరిస్థితుల్లో ఏమి చేయాలా అని జనరల్ జియాఉల్ హక్ దీర్ఘకాలం ఆలోచించాడు. కాశ్మీర్‌కు సైనిక పరిష్కారం సాధ్యం కాదనుకున్నప్పుడు తమవైపు తిప్పుకుని, ఆయుధాలను ఇచ్చి, ముస్లిం మతోన్మాదాన్ని, భారత వ్యతిరేకతను కాశ్మీర్ యువకుల్లో నూరిపోసి, సుశిక్షితులైన మిలిటెంట్లుగా పాకిస్తాన్‌లో తర్ఫీదు ఇచ్చి వెనక్కి పంపడం,

వారి ద్వారా అంతర్గత కల్లోలాన్ని రేకెత్తించి, దానిని అణచేందుకు ఇండియా ప్రయత్నిస్తే దారుణ దమనకాండ అంటూ అంతర్జాతీయంగా గగ్గోలు పెట్టి, కుహనా మేధావుల ద్వారా దుష్ప్రచారం సాగించి, మెల్లిమెల్లిగా కాశ్మీర్‌ను ఇండియా నుంచి వేరు చేసి తాము కబళించడం ఒక్కటే తెలివైన పని అని ఆయనకు తోచింది

ఇస్లామాబాద్‌లో 1988 ఏప్రిల్ 18న అతి రహస్యంగా జరిగిన మిలిటరీ కోర్ కమాండర్ల సమావేశంలో ప్రెసిడెంట్ జియా కాశ్మీర్‌ను హరించే తన బృహత్ప్రణాళికను విపులీకరించాడు ఈ ప్రసంగాన్ని తరవాత జమాతే ఇస్లామీ సంస్థ Hıjbe Islam పుస్తకంలో ప్రచురించి పాక్ భక్త కాశ్మీరీలకు రహస్యంగా పంచింది *Operatıon Topac* అని జియా ముద్దు పేరు పెట్టిన మూడు దశల పథకంలో ప్రధానాంశాలివి

## మొదటి దశ

1 జమ్మూ కాశ్మీర్‌లో తక్కువ స్థాయి తిరుగుబాటు తేవాలి అది ఎలాంటిదంటే- సర్కారు దిగ్బంధం కావాలి కూలిపోకూడదు

2 మన మనుషులను ప్రభుత్వంలోని కీలక స్థానాల్లో ఉంచాలి పోలీసు బలగాలు, ఆర్థిక సంస్థలు, కమ్యూనికేషను నెట్‌వర్క్ వంటి వాటిని చడిచప్పుడు లేకుండా గుప్పిట్లోకి తెచ్చుకోవాలి

3 విద్యార్థుల్లో, రైతుల్లో మతపరమైన అంశాల మీద భారత వ్యతిరేకత భావాలను రెచ్చగొట్టాలి మనం ఎప్పుడు కావాలనుకుంటే అప్పుడు ప్రభుత్వ వ్యతిరేక ప్రదర్శనలను, అల్లర్లను వారి ద్వారా సాగించగలగాలి సైనికుల అత్యాచారాలను, మానవ హక్కుల ఉల్లంఘనలను, ముస్లింలపై దాడులను నిరసిస్తూ పెద్దఎత్తున యాగీ చేయించాలి

4 పారా మిలిటరీ సాయుధ బలగాలతో తలపడటానికి కాశ్మీరీ యువకులను తర్ఫీదు చేయాలి మనకు ఉపయోగపడేవారిని జాగ్రత్తగా ఎంపికచేసి ఆయుధాల ప్రయోగంలో శిక్షణ నిచ్చి, మన భావాలను నూరిపోసి ఇండియా మీదికి ప్రయోగించాలి

5 జమ్మూకు కాశ్మీర్‌కు మధ్య, కాశ్మీర్‌కూ లడాఖ్‌కు మధ్య కమ్యూనికేషన్లను విచ్ఛిన్నం చేయాలి ఈ పని గుట్టుగా జరగాలి కాశ్మీర్ నుంచి దృష్టి మళ్లించ టానికి సిక్కు తీవ్రవాదుల సాయంతో జమ్మూలో బీభత్సాన్ని, కల్లోలాన్ని తెచ్చిపెట్టాలి హిందువుల్లో కూడా ప్రభుత్వమంటే ఏవగింపు కలిగించాలి

6 కాశ్మీర్ లోయలో భారత సైన్యం మోహరించని ప్రాంతాలను ముఖ్యంగా దక్షిణ కాశ్మీర్‌ను క్రమేణా మన కంట్రోల్లోకి తెచ్చుకోవాలి

## రెండోదశ

1 సియాచెన్, కార్గిల్, రాజౌరి – పూంచ్ సెక్టార్లలో సాధ్యమైనంత ప్రెషరు పెట్టడం ద్వారా, భారత సైన్యం కాశ్మీర్ లోయకు వెలుపల బలగాలను మొహరించేట్టు చేయాలి కాశ్మీర్‌లో శ్రీనగర్, కుప్వారా, బారాముల్లా, బందిపూర్, చౌకీవాలాల్లో ఒకేసారి కోవర్ట్ యాక్షనుతో దాడిచేసి సైనిక హెడ్క్వార్టర్లను, బేస్ డిపోలను ధ్వంసం చేయాలి

2 అజాద్ కాశ్మీర్‌లో స్థిరపడ్డ ఆఫ్ఘాన్ ముజాహిదీన్లు కొందరు ఈలోగా కాశ్మీర్ లోయలో క్రమప్రకారం జాగ్రత్తగా చొరబడి మన పలుకుబడిని విశాల ప్రాంతాలకు విస్తరించాలి.

3 ఆఖరుగా అజాద్ కాశ్మీర్లోని రిటైర్డ్ సైనికాధికారులు, హార్డ్‌కోర్ అఫ్గాన్లు కలిసి కాశ్మీర్‌పై దాడిచేసి విమానాశ్రయాలను, రేడియో స్టేషన్లను ధ్వంసం చేస్తారు. బానిహాల్ టన్నెల్‌ను, కార్గిల్ – లే హైవేను మూసేస్తారు. పంజాబ్‌లోనూ, కాశ్మీర్ చుట్టుపక్కల ఇతర ప్రాంతాల్లోనూ అదే సమయంలో అంతర్గత కల్లోలం తేవాలి.

## మూడో దశ

కాశ్మీర్ లోయను విముక్తి చేసి, స్వతంత్ర ఇస్లామిక్ రాజ్యంగా ఏర్పరచేందుకు మన బృహత్ పథకాన్ని అమలుచేయాలి.

***

సైన్యాధికారుల రహస్య సమావేశంలో 'ఆపరేషన్ టోపాక్' రూపురేఖలను ఆవిష్కరించిన నాలుగు నెలలకే 1988 అగస్టులో ప్రెసిడెంట్ జియాఉల్ విమాన ప్రమాదంలో మరణించాడు బేనజీర్ భుట్టో ప్రధానమంత్రి అయింది. తన తండ్రిని ఉరితీసిన జియా పేరు చెబితేనే ఆమెకు ఒళ్ళంతా కంపరం. అయితేనేం? జాతీయ వ్యూహం దగ్గరికి వచ్చేసరికి వ్యక్తిగత ద్వేషాలను మరచిపోగలగడం పాకిస్తానీల ప్రత్యేకత. సాయుధ దళాల పనిలోనూ, పాక్ గూఢచార సంస్థ ఐ.ఎస్.ఐ. వ్యవహారాల్లోనూ జోక్యం చేసుకోనని అధికారం అందుకునే ముందే బేనజీర్ మాట ఇచ్చింది ఆ ప్రకారమే బేనజీర్ బద్ధ శత్రువు జియా రచించిన 'ఆపరేషన్ టోపాక్' తొలిదశ ఆమె హయాంలోనే విజయవంతంగా మొదలైంది

పాకిస్తానీ ఏజంట్లు కాశ్మీర్ లోయలోని శ్రీనగర్, కుప్వారా, బారాముల్లా జిల్లాల్లో తిరిగి, నిరుద్యోగులైన కాశ్మీరీ ముస్లిం యువకులను 'ఇస్లాం', 'స్వతంత్ర కాశ్మీర్' కబుర్లతో ఆకట్టుకుని, డబ్బులు విరజిమ్మి తమ వైపునకు తిప్పుకునేవారు ట్రక్కుల్లోనూ, బస్సుల్లోనూ వారిని మోసుకుపోయి రహస్యంగా సరిహద్దు దాటించి, పాకిస్తాన్ క్యాంపుల్లో బ్రెయిన్‌వాష్ చేసి, ఆయుధ శిక్షణ నిచ్చి, అత్యాధునిక ఆయుధాలను, బాంబులను చేతికిచ్చి కాశ్మీర్‌లో అగ్గి పెట్టటానికి వెనక్కి పంపేవారు. 1990లో పాకిస్తాన్ సందర్శించిన అమెరికన్ గూఢచారి సంస్థ సి.ఐ.ఎ అధిపతి రాబర్ట్ గేట్స్‌కు కాశ్మీర్ మిలిటెంట్ల కోసం 31 ట్రెయినింగు క్యాంపులను తాము నడుపుతున్నామని పాక్ అధికారులే చెప్పారు నిజానికి పాకిస్తాన్‌లో 63 ట్రయినింగు క్యాంపులు నడుస్తున్నట్టు 1990 ఏప్రిల్ 23న 'వాషింగ్టన్ పోస్ట్' పత్రిక బయటపెట్టింది. మిలిటెంట్లను తర్ఫీదు చేసి ఉసికొలపడంతోబాటు కాశ్మీర్‌లోనూ ఇంగ్లండు, అమెరికా తదితర దేశాల్లోనూ ఐక్యరాజ్యసమితి ముందూ భారత వ్యతిరేక ప్రదర్శనలను ఐ ఎస్.ఐ. ఏజంట్లు భారీఎత్తున నిర్వహించారు. కాశ్మీర్‌లో సైనిక దళాల అఘాయిత్యాలు, మానవహక్కుల ఉల్లంఘనల గురించి ఇండియాలోని సోకాల్డ్ సెక్యులరిస్టులు, వామపక్ష లిబరల్ మేధావులు వెలిబుచ్చిన తీవ్రాందోళనను ఇండియాపై విషం గక్కడానికి పాకిస్తాన్ వాటంగా ఉపయోగించుకుంది. పథకం ప్రకారం కాశ్మీర్ అధికార యంత్రాంగంలో పాక్ ఏజంట్లను చొప్పించి, లోపలి నుంచి ప్రభుత్వాన్ని నిస్తేజం చేసే కార్యక్రమమూ ముమ్మరంగా సాగింది. జమాయతె ఇస్లామీ తదితర సంస్థలు కాశ్మీర్ అంతటా మదరసాలను తెరిచి కాశ్మీరీ పిల్లల్లో లేత వయసు నుంచి మతం పేరిట పాక్ భక్తిని, ఇండియా పట్ల ద్వేషాన్ని నూరిపోసే కార్యక్రమం నిరాఘాటంగా సాగింది. 1989 సంవత్సరానికల్లా జమ్మూ కాశ్మీర్‌లో ఆందోళనలు, బాంబు, గ్రెనేడ్ దాడులు నిత్యకృత్యమయ్యాయి ఫరూక్ అబ్దుల్లా ప్రభుత్వానికి కంట్రోలు పోయి, పరిస్థితి త్వరితంగా విషమిస్తున్నదని గవర్నర్ జగ్‌మోహన్ మొత్తుకుంటే, ఫరూక్‌ను తప్పించాల్సింది పోయి జగ్‌మోహన్‌నే వెనక్కి పిలిచారు. అది టెర్రరిజానికి కొత్త ఊపునిచ్చింది 1989 ఎన్నికల్లో రాజీవ్‌గాంధీ ఓడి, వి పి సింగ్ ప్రభుత్వం కొలువు తీరేనాటికి ఆపరేషన్ టోపాక్‌లో మొదటి దశ దాదాపు పూర్తయింది. కేంద్ర హోంమంత్రి కుమార్తె రూబియాను అపహరించిన జె.కె.ఎల్.ఎఫ్ టెర్రరిస్టులకు పాదాక్రాంతమై ఐదుగురు నెత్తురు తాగే మిలిటెంట్లను అప్పగించడంతో ప్రభుత్వ నపుంసకత్వం జగద్విదితమైంది

ఇంచుమించు ఇదే సమయంలో బేనజీర్‌కూ మిలిటరీకీ మధ్య వ్యవహారం చెడి పాక్ అధ్యక్షుడు ఆమెను బర్తరఫ్ చేశాడు – అనంతరం 1990 నవంబరు ఎన్నికల్లో మిలిటరీ అండతో నవాజ్ షరీఫ్ భుట్టో పార్టీని ఓడించి ప్రధాని అయ్యాడు. అధికారం

చేతులు మారినా ఆపరేషన్ టోపాక్ అంతరాయం లేకుండా కొనసాగింది అదే పాకిస్తానీల ప్రత్యేకత ఇందిరాగాంధీ అంత్యక్రియల సందర్భంలో ప్రెసిడెంట్ జియా రాజీవ్‌తో ఎంత ఆదరంగా మాట్లాడితేనేమి, ఇరువురి మధ్య సమావేశాలు – అధికారుల స్థాయి మంతనాలు ఎంత జోరుగా సాగితేనేమి, ఇక్కడ రాజీవ్ అక్కడ బేనజీర్ అధికారం అందుకోవడంతో తరం మారి ఇండో–పాక్ సంబంధాల్లో కొత్త అధ్యాయం ఆరంభమైందన్న హర్షాతిరేకం సర్వత్రా ఎంతగా వ్యక్తమైతేనేమి, తరవాతి కాలంలో పి వి. – నవాజ్‌షరీఫ్‌ల మధ్య, వాజపేయి – నవాజ్ షరీఫ్‌ల మధ్య భేటీలు, సుహృద్భావ పర్యటనలు, ఎన్ని జరిగితేనేమి – పాక్ దారి పాక్‌దే కాశ్మీర్‌లో చిచ్చుపెట్టడం అది ఈషణ్మాత్రం మానలేదు

కాశ్మీర్ కార్చిచ్చును ఆర్పడం చేతకాక వి.పి.సింగ్ ప్రభుత్వం వెర్రిచూపులు చూస్తున్న సమయంలో కాశ్మీర్‌పై రాజీ పడతారా, యుద్ధం చేయమంటారా అని బేనజీర్ మాజీ హైకమిషనర్ అబ్దుస్ సత్తార్‌తో న్యూఢిల్లీకి వార్నింగు ఇప్పించింది ఆమె తర్వాత గద్దెనెక్కిన నవాజ్ షరీఫ్ 1991 మేలో రాజీవ్ అంత్యక్రియల సందర్భంలో ఢిల్లీ వచ్చినప్పుడు – కాశ్మీర్‌ను మాకు వదిలేసుకుంటే మీకే మంచిది అని అప్పటి ప్రధాని చంద్రశేఖర్‌కు ఉచిత సలహా పారేశాడు. తరవాత కొద్దికాలానికి ప్రధాని అయిన నరసింహారావుతో పైకి ఎంత సఖ్యంగా ఉన్నా కాశ్మీర్‌లో ప్రాక్సీ యుద్ధాన్ని తెరపి లేకుండా సాగించడం, భద్రతా దళాలు గట్టి చర్య తీసుకోసాగగానే మానవ హక్కులు అణచేస్తున్నారంటూ ప్రపంచమంతటా యాగీచేసి కాశ్మీర్‌ను సెగలు కక్కే అంతర్జాతీయ సంక్షోభంగా చిత్రించడం షరీఫ్ సాహెబ్ ఆపలేదు.

అప్పటిదాకా కాశ్మీర్‌లో విడివిడిగా పనిచేస్తున్న రాజకీయ, మతపరమైన, ఫండమెంటలిస్టు సంస్థలు ముప్పై కలిసి 1993 సెప్టెంబర్ 9వ ఆల్ పార్టీ హురియత్ కాన్ఫరెన్సుగా పాకిస్తాన్ ఆశీర్వాదంతో ఏర్పడ్డాయి దీంతో పాకిస్తాన్‌తో విలీనం కోరే శక్తులకు, ఆజాదీని కోరే శక్తులకూ మధ్య వారధి ఏర్పడి తీవ్రవాద కార్యకలాపాలు మరింత ఊపునందుకున్నాయి ఆ ఉత్సాహంలోనే 1993 అక్టోబరులో శ్రీనగర్‌లోని హజ్రత్‌బల్ ప్రార్థనాలయాన్ని మిలిటెంట్లు ఆక్రమించి 32 రోజుల పాటు ప్రభుత్వానికి చెమటలు పట్టించారు. ప్రాణాలకు తెగించి పోరాడి భద్రతా బలగాలు ఎట్టకేలకు 50 మంది మిలిటెంట్లను లొంగదీసుకోగలిగాయి నిస్సందేహంగా అది ఇండియాకు విజయం. అయినా దాన్నించి లాభం పొందాలన్న ధ్యాసే ప్రభుత్వానికి లేకపోయింది. ప్రార్థనా స్థలాల్లో పీఠం పెట్టిన తీవ్రవాదులందరినీ అదే ఊపులో ఏరివేసి మతం ముసుగులో టెర్రరిజం వికృత రూపాన్ని బట్టబయలు చేయవలసింది పోయి – తాము రెచ్చగొట్టినా రెచ్చిపోని పరమ సాత్వికులమని ప్రపంచాన్ని ఎలా నమ్మించాలన్న దానిమీదే పి.వి ప్రభుత్వం

శక్తియుక్తులను వెచ్చించింది

ఈలోపు పాకిస్తాన్‌లో మళ్ళీ బళ్ళు ఓడలు, ఓడలు బళ్ళు అయ్యాయి. నవాజ్ షరీఫ్ బర్తరఫ్ కాగా మళ్ళీ బేనజీర్ ప్రధాని అయింది. ఆమె వస్తూ రావడమే అధికారుల స్థాయి ద్వైపాక్షిక చర్చలను ఆపేసి ఇండియా మీద కత్తిగట్టి ఆపరేషన్ టోపాక్ రెండో దశ అమలుకు శ్రీకారం చుట్టింది ఇటు ఇండియాలో 1996 ఎన్నికల్లో కాంగ్రెస్ పరాజయం తరవాత పార్లమెంటు హంగ్ అయింది తుమ్మితే ఊడే ముక్కులాంటి దేవెగౌడ, గుజ్రాల్ ఓటి ప్రభుత్వాలను ఇస్లామాబాద్ బొత్తిగా లక్ష్యపెట్టలేదు 'గుజ్రాల్‌సిద్ధాంతం' గురించి ఐ కె గుజ్రాల్ ఎన్ని ఆపసోపాలు పడ్డా ఇస్లామాబాద్ ఆలకించినట్టు నటిస్తూనే కాశ్మీర్ మంటల్లో పెట్రోలును కుమ్మరించింది ఇండియాలో రాజకీయ అస్థిరత్వాన్ని చూసి నవ్వుతూండగానే పాకిస్తాన్‌లో బేనజీర్ కుర్చీ కిందికి మళ్ళీ నీళ్ళు వచ్చాయి 1997 ఎన్నికల్లో మూడింట రెండు వంతుల మెజారిటీతో నవాజ్ షరీఫ్ ఆమె నుంచి తిరిగి సింహాసనం లాక్కున్నాడు. గుజ్రాల్‌గారి మెహర్బానీ సిద్ధాంతం మీద బేనజీర్ కున్నంత చిన్నచూపును ఆయనా కనపరిచాడు భారత ప్రభుత్వం శాంతిని కోరుతూ సాచిన ఆలివ్ కొమ్మలకు ప్రతిస్పందనగా అధీనరేఖ పొడవునా సాయుధ ఘర్షణలను తీవ్రతరం చేసి, శ్రీనగర్ – కార్గిల్ – లే శ్రేణిని శతఘ్నుల మోతతో దద్దరిల్లజేసి, పూంచ్, దోడా, రాజౌరి, ఉధంపూర్, జమ్మూల్లో మిలిటెన్సీని ముమ్మరం చేసి ఆపరేషన్ టోపాక్ ద్వితీయ దశను షరీఫ్ సాహెబ్ శాయశక్తులా ముందుకు తీసుకువెళ్ళాడు.

అదిగో – ఆ దశలో అటల్ బిహారీ వాజపేయిగారు భారత భాగ్యవిధాత అయ్యారు

# అసమర్థ వాజపేయం

***కాశ్మీర్ సమస్యను 'కొతిపుండు బ్రహ్మరాక్షసి'లా మార్చిన 'పుణ్యం'లో '47 నుంచి నేటిదాకా దేశాన్నేలిన అన్ని ప్రభుత్వాలకూ అంతో ఇంతో వాటా ఉంది. అన్నిటిలోకెల్లా అసమర్థ నిర్వాకంలో 'అగ్రతాంబూలం' ఇవ్వాల్సింది మాత్రం శ్రీమాన్ అటల్ బిహారీ వాజపేయి ప్రభుత్వానికి! పూర్వపు గవర్నమెంట్లన్నీ చేసిన నష్టం ఒక ఎత్తు. కాశ్మీర్‌కు వాజపేయి సర్కారు చేసిన, చేస్తున్న డామేజి ఇంకో ఎత్తు.***

కాశ్మీర్‌కో చిత్రమైన ప్రత్యేకత ఉంది దానిని మరీ ఎక్కువ ప్రేమించేవారి వల్లే మరీ ఎక్కువ హాని జరిగింది! కాశ్మీర్ అంటే జవహర్‌లాల్ నెహ్రూకు మహా సెంటిమెంటు అందుకే మరొకరిని వేలుపెట్టనివ్వకుండా కాశ్మీర్ వ్యవహారాలను పూర్తిగా తన కంట్రోల్లోనే ఆయన పెట్టుకున్నాడు. అనంతర కాలంలో కాశ్మీర్‌ను చుట్టుముట్టిన అనేక చిక్కులకు అదే మూల కారణం నెహ్రూ తరవాత మళ్ళీ అంతటి సెంటిమెంటు కాశ్మీర్ విషయంలో వాజపేయికి ఉంది అటల్జీగారి భా జ పా కు కాశ్మీర్ పేరు చెబితేనే గతంలో వీరావేశం ఉప్పొంగేది పూర్వాశ్రమంలో 'భారతీయ జనసంఘ్'గా ఉండగా దాని సంస్థాపక అధ్యక్షుడైన డాక్టర్ శ్యామప్రసాద్ ముఖర్జీ కాశ్మీర్ సమస్య మీదే పోరాడుతూ కాశ్మీర్‌లోనే ఆత్మబలిదానం చేశారు జమ్మూ కాశ్మీర్‌లో షేక్ అబ్దుల్లా, ఆయన అనుయాయులు సాగించిన అనేకానేక దాడులకు మొదట గురి అయినది బి.జె పి మాతృసంస్థ అయిన ఆరెస్సెస్సే! అనర్థాలకు మూలం 370 అధికరణమని, అంతవరకూ రాజ్యమేలిన ప్రభుత్వాలన్నీ జాతీయ ప్రయోజనాల కోసం గట్టిగా నిలబడకుండా, లేనిపోని మెహర్బానీలతో జావగారినందువల్లే కాశ్మీర్ సమస్య విషమించిందని ప్రతిపక్షంలో ఉన్నంతకాలమూ ఇల్లెక్కి అరచి బిజెపి వెలిగక్కిన ధర్మాగ్రహం సామాన్యమైనది కాదు ఇంతటి ధీరులూ, శూరులూ కాబట్టే బి జె.పి వారికి అధికారం అందితే చాలు కాశ్మీర్

కంపను శరవేగంతో చక్కబరిచి, దివాలాకోరు రాజీ విధానాలకు స్వస్తి పలికి, దృఢంగా వ్యవహరించి కాశ్మీర్‌ను మళ్ళీ జాతీయ జీవన స్రవంతిలోకి రెక్కపుచ్చుకు లాక్కొస్తారు -కాబోలని జాతిజనులు భావించారు

కాని – ఆశ్చర్యం! రాజదండం చేతపట్టగానే – వెనుకటి ప్రభుత్వాల్లో తాము గతంలో అసహ్యించుకున్న అవలక్షణాలన్నీ బి జె పి. నేతాశ్రీలను దయ్యంలా పట్టాయి. పాత ప్రభుత్వాల్లో తాము ఎత్తిచూపిన తప్పులను మాత్రమే తాము సైతం చేస్తే తమ ప్రత్యేకత ఉండదనుకున్నారేమో! అంతకంటే ఘోరమైన తప్పులను వారు వరసబెట్టి చేయసాగారు

కాపురం చేసే లక్షణం కాలిగోళ్ళ దగ్గరే తెలుస్తుందని సామెత ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో కాసిని సీట్లు గెలిచి, కాళ్ళూడిన కుర్చీని నిలబెట్టుకునే యావలో పడి పాకిస్తానీ ఏజంట్లు హజ్రత్‌బల్ ఆక్రమించి బందీల ప్రాణాలతో చాలా రోజులు చెలగాటమాడిన దుస్సాహసానికి కనీసపు స్పందన లేకుండా బిజెపి నేతలు మిన్నకున్న తీరుతోనే వారి కాశ్మీర్ వీరాలాపాలకు విలువ లేదని తేలిపోయింది. కాశ్మీర్‌కు సామూహికంగా తరలివెళ్ళి శ్రీనగర్‌లో రిపబ్లిక్‌డేనాడు ధైర్యంగా జండా ఎగరేస్తానని చెప్పిన బిజెపి అధ్యక్షుల వారు చివరికి సైన్యం సాయంతో హెలికాప్టరులో వెళ్ళి, గట్టి బందోబస్తు మధ్య, సైనికుల పహరా నడుమ జండా మొక్కు తీర్చుకురావటాన్ని చూశాక ఆ పార్టీ చేసేవి ఉత్తరకుమార ప్రజ్ఞలేనని తేటతెల్లమైంది. అయితే... జాతీయ సమస్యల పరిష్కారానికి ప్రతిపక్షం చేయగలిగింది తక్కువ కాబట్టి బిజెపికే కనుక అధికారం ఇస్తే తాను పొద్దస్తమానం తూర్పారబట్టే ప్రభుత్వాలకు భిన్నంగా నడిచి బహుశా గట్టిమేలు ఏదయినా చేయగలదేమోనని ప్రజలు ఆశపడ్డారు.

ఘోరంగా మోసపోయారు

తమకు ముందున్న కాంగ్రెస్ ప్రభుత్వాలు, లేక కాంగ్రెసుకు తోడుబోయిన పార్టీల ప్రభుత్వాలు కాశ్మీర్‌ను అనవసరంగా అగ్నిగుండం చేశాయని ఆక్షేపించిన బిజెపి నేతలు తాము కిరీటం తగిలించుకున్నాక దాన్ని చల్లార్చకపోగా అగ్నిగుండంలో పీపాల కొద్దీ నెయ్యి కుమ్మరించారు. ఆ రాష్ట్రానికీ, మొత్తం దేశానికే అగ్గి పెట్టారు. అటల్ బిహారీ వాజపేయి రాజదండం పట్టేనాటికి కాశ్మీర్ పరిస్థితి గణనీయంగా మెరుగుపడింది. ఐ.కె. గుజ్రాల్ హయాంలో భద్రతా బలగాలు సమర్థంగా కదిలి టెర్రరిస్టు విద్రోహుల్లో చాలామంది ముఖ్యులను చంపడమో, బంధించడమో చేశాయి తీవ్రవాదుల ఆగడాలు బాగా తగ్గాయి. సామాన్య కాశ్మీరీలు కూడా టెర్రరిస్టు దుశ్చర్యలతో విసిగి వేసారి శాంతి కోసం అర్రులు చాచారు. ఎంతో కొంత శాంతియుత వాతావరణం నెలకొనడంతో టూరిస్టుల

రాకపోకలూ పెరిగి కాశ్మీర్ మళ్ళీ కళకళలాడింది

సరిగ్గా ఆ ఘట్టంలో కళ్లేలు అందుకున్న వాజపేయిజీ సాధించిందేమిటి? మెరుగుపడ్డ పరిస్థితిని జయప్రదంగా విషమింపజేశారు టెర్రరిస్టుల పట్ల కాశ్మీరీల్లో పెరిగిన వైముఖ్యాన్ని విజయవంతంగా పోగొట్టారు కాశ్మీర్‌లో శాంతిని, భద్రతను దుడ్డుకర్ర పుచ్చుకుని తరిమివేశారు టెర్రరిస్టుల్లో చెదిరిన స్థైర్యాన్ని చక్కని రీతిలో చిక్కబరిచారు. అంత దాకా రైళ్ళలో, బస్సుల్లో జనం తిరిగే ప్రాంతాల్లో బాంబులు పేల్చి, రాత్రివేళ గ్రామాల మీద పడి అందిన వారిని హతమార్చి పారిపోయిన టెర్రరిస్టులు అటల్జీ అద్భుత పాలనలో ఎంత అభివృద్ధి చెందారంటే . ఏకంగా సైన్యం స్థావరాల మీదే పట్టిగ్గా దాడిచేసి, నానా బీభత్సం సాగించగలిగారు. అనేక శతాబ్దాలుగా రాజ్యాధికారానికి, ప్రభుత్వ సార్వభౌమాధికారానికి ప్రతీక అయిన ఎర్రకోట మీదే దాడికి దిగేంతటి స్థాయికి ఎదిగారు

ప్రధానమంత్రిని, హోంమంత్రిని ఇంకా ఫలానా ఫలానా వారిని చంపి తీరుతామని పేర్లుపెట్టి విద్రోహులు సవాలు చేస్తుంటే వారిని కొమ్ములు పట్టి నిలువరించి, గట్టి శాస్తి చేసి, తన ఆధిపత్యం చాటుకోవలసిన ఎన్డీఏ సర్కారు ఏమి చేసింది? ఎర్రకోటపై దాడి తన ప్రతాపమేనని బహిరంగంగా ప్రకటించిన లష్కరే తోయిబాను నిర్దయగా అణచి వేయాల్సింది పోయి ఆ ముఠా నాయకుడితో హురియత్ నేత జిలానీ చేత గంటసేపు టెలిఫోను మంతనాలాడించింది ఇందులో ఆశ్చర్యమేముంది? పౌర విమానాన్ని తన కళ్ళ ముందే దారి మళ్ళించుకు పోతుండగా చేతులు ముడుచుకు కూర్చుని, దర్జాగా దేశం దాటనిచ్చి, ఆనక దేశద్రోహులను, విదేశీ ఏజంట్లను ప్రాధేయపడి, వారు కోరిన ఖైదీలను పువ్వుల్లోపెట్టి అప్పజెప్పి బందీలను విడిపించుకున్న ప్రభుత్వం కదా ఇది?!

దేశాన్నేలే వారికి ముఖ్యంగా ఉండవలసింది దేశభద్రత పట్ల నిరంతర జాగరూకత! ఎవరు అమిత్రులో, ఎవరు విరోధులో గ్రహించి, వారి కదలికలను, ఆలోచనలను నిశితంగా గమనించి, ప్రమాదం ఎటు నుంచి రాగలదో ఊహించి, దాన్ని ఎదుర్కొనేందుకు సర్వసన్నద్ధం కాలేనివారు గద్దె మీద కూర్చోవడానికి తగరు. నెహ్రూ మరీ మెతకమనిషి అని బి. జె పి. వారు ఆక్షేపిస్తారు. 1947లో పాకిస్తాన్ కాశ్మీర్ మీదికి దండెత్తినప్పుడూ, 1962లో చైనా దురాక్రమణ చేసినప్పుడూ సకాలంలో సరిగా కదలక, దేశానికి చేటు తెచ్చారని వారు నెహ్రూను నిందిస్తారు దేశ విభజన కల్లోలంలో సర్వత్రా చుట్టుముట్టిన సవాళ్ళ మధ్య సతమతమైన వేళ, కాశ్మీర్‌పై పాకిస్తాన్ దుర్మార్గపు దాడిని కొత్తగా వచ్చిన నెహ్రూ ప్రభుత్వం ముందుగా ఊహించలేదంటే అర్థం ఉంది హిందీ – చీనీ భాయ్‌భాయ్ అంటూ, పంచశీలను ప్రవచిస్తూ, అప్తమిత్రునిలా నటిస్తూనే చైనా తీసిన చావుదెబ్బను

నెహ్రూ ప్రభుత్వం కాచుకోలేక పోవడాన్నీ సమర్థించలేక పోయినా కనీసం అర్థం చేసుకోవచ్చు

వాజపేయి నిర్వాకం అలాంటిది కాదు ఇండియాతో విరోధమే పాకిస్తాన్ ఏకైక విధాన మన్నది బహిరంగ రహస్యం. పైపై కబుర్లు ఎంత తీయగా చెప్పినా - శాంతి వచనాలు ఎన్ని పలికినా - మాయదారి స్నేహం ఎంతగా నటించినా అదను దొరికితే ఇండియాను కాటేయడానికి ఇస్లామాబాద్ సర్వదా సిద్ధమని తెలుసు. అగర్భ విరోధి ఏ ఎత్తు వేస్తున్నాడో, ఏ వ్యూహం పన్నుతున్నాడో కూపీ తీయడానికి గూఢచారి సంస్థలు, ఇంటలిజెన్స్ వ్యవస్థలు ఎన్నో ఉన్నాయి. శత్రువు దాడిని ముందుగానే గ్రహించి, ఆత్మరక్షణ చేసుకుంటూ ఎదురుదాడి చేసేందుకు రక్షణ బలగాలూ సమృద్ధిగా ఉన్నాయి. ఎటొచ్చీ - వాటిని సమన్వయపరచి, నడిపించవలసిన ప్రభుత్వానికే తెలివి, దక్షత కొరవడ్డాయి జమ్మూ కాశ్మీర్‌లో అధీనరేఖను అతిక్రమించి కార్గిల్ కొండల్లో రెండేళ్ల కింద పాక్ సైన్యం చొరబడితే ఆ సంగతి చాలా రోజుల తరవాత గొర్రెల కాపరులు ఎవరో చెబితేగానీ వాజపేయి ప్రభుత్వానికి తెలియలేదు

కార్గిల్ దురాక్రమణ ఆకస్మికంగా జరిగింది కాదు రెండేళ్ల ముందు నుంచే దానికి విస్తృత సన్నాహాలు జరిగాయి జనరల్ ముషారఫ్ కోర్ కమాండర్‌గా ఉండగా 1997 మొదట్లోనే వ్యూహం తయారైంది. సైనికుల చేరవేత మొదలైంది. చొరబడవలసిన ముజాహిదీన్లను ఎంపిక చేయడం, తీవ్ర వాతావరణ పరిస్థితుల్లో యుద్ధానికి వారు అలవాటు పడేట్టు స్పెషల్ ట్రెయినింగ్ ఇవ్వటం జరిగింది. అధీనరేఖ పొడవునా హెలిపాడ్లు నిర్మించారు బంకర్లు కట్టారు. రేషన్లు, ఆయుధాలు, మందుగుండు సామగ్రి నిలవ చేశారు మష్కోలోయ, ద్రాస్, కక్సార్, బతాలిక్ సెక్టార్లలో మొహరించిన పాక్ సైనికులతో సంబంధాలకు కేబుల్ కమ్యూనికేషన్ నెట్‌వర్కును ఏర్పరిచారు.

ఇంత భారీఎత్తున పొరుగు దేశం యుద్ధ సన్నాహాలు చేసుకుపోతుంటే - అన్నీ గమనించి తన భద్రతను తాను చూసుకోవలసిన భారతదేశం ఏమి చేసింది? పాకిస్తాన్‌లో ఉన్నది పౌర ప్రభుత్వం కాబట్టి, ఇండియాతో మైత్రికి అది నిబద్ధమైంది కాబట్టి బెంగలేదని వాజపేయి ప్రభుత్వం నిశ్చింతగా నిదరోయింది. నవాజ్ షరీఫ్‌ను నేరుగా రెండుసార్లు వాజపేయి కలిసి చెలిమి ఎంత గొప్పదో ముచ్చటించుకున్నారు ఇరుదేశాల విదేశాంగ మంత్రులు, ఫారిన్ సెక్రటరీలు పలు పర్యాయాలు భేటీ వేశారు. ప్రధానమంత్రుల మధ్య డైరక్టు హాట్‌లైను, వీసా నియమాల సరళీకరణ, వాణిజ్య సంబంధాలు, రైల్వే లింకులు వగైరా విషయాలు వివిధ స్థాయిల్లో చర్చించారు. ఢిల్లీ - లాహోర్ మధ్య బస్సు నడపాలనుకున్నారు. మొదటి ట్రిప్పులో మొదటి సీటు తనదేనని వాజపేయి గారన్నారు.

ఆ ప్రకారమే బోలెడు పరివారాన్ని, ఇండో-పాక్ సఖ్యతగోరే మేధావుల్ని వెంటేసుకుని 1999 ఫిబ్రవరి 20న బస్సెక్కి లాహోర్ వెళ్ళారు అక్కడ పాక్ ప్రధానిని కలిసి ఫోటోలు దిగి, చాయ్‌లు తాగి, ఆరునూరయినా స్నేహం వదులుకోవద్దని చేతిలో చెయ్యేసుకుని, ఆశల్ని, ఆశయాల్ని కాగితాల మీద రాసుకున్నారు ఆ డొల్ల డిక్లరేషన్‌ను సత్య ప్రమాణంగా రాసుకోవడానికి కొద్దిరోజుల ముందు నవాజ్ భాయ్ కార్గిల్ కొండల మీదుగా జనరల్ ముషారఫ్‌తో కలిసి విమానంలో తిరిగి ఇండియాపై దురాక్రమణకు జరుగుతున్న సన్నాహాలను తనిఖీ చేసి వచ్చాడని సత్తెకాలపు అటల్జీకి పాపం తెలియదు శాశ్వత శాంతికి నాంది పలికానని మంచి మనిషి వాజపేయిగారు మురిసిపోతూండగానే పాకిస్తాన్ - ముందు నవ్వుతూ వెనక గోతులు తీసే కార్యక్రమాన్ని నిరాఘాటంగా కొనసాగించి మరో నెల తిరక్కుండా కార్గిల్‌ను ఆక్రమించింది ప్రధానమంత్రి బస్సు యాత్ర తమకాన్ని, పాకిస్తాన్‌లో శాంతి, సఖ్యతలపై భారత అధికారుల భరోసాను చూసి బేఫర్వాగా ఉన్న సైన్యాధికారులు కార్గిల్ చొరబాటుదారుల పాలయిందని ఆలస్యంగా తెలుసుకుని తెల్లబోయారు పూర్తి స్థాయిలో పాకిస్తాన్ సైన్యం భారత స్థావరాలను ఆక్రమించే సమయానికి కార్గిల్ సెక్టారు మొత్తంలో మన రక్షణకు ఉన్నది ఒకే ఒక బ్రిగేడు.

సరే! ముందుచూపు లేదు. శత్రువు కదలికలపై నిఘా పెట్టలేదు. అవతలి దేశం ఇచ్చకాలను తెలివితక్కువగా నమ్మారు. కనీసం నయవంచనను ఆలస్యంగా గుర్తించాకయినా దురాక్రమణదారులకు సరైన శాస్తి చేశారా? సైనిక చర్యకు పాకిస్తాన్ జాగ్రత్తగా ఎంపిక చేసుకున్న కార్గిల్ క్షేత్రంలో యుద్ధం పాకిస్తానీలకు భౌగోళికంగా వీలు ఇండియాకు కష్టం. అటువైపు నుంచి అధీనరేఖ దాటి అవలీలగా కొండలపైకి చేరి భారత స్థావరాలను పట్టుకోవడం పాకిస్తానీలకు సులువు. పైనుంచి వారు చేసే కాల్పులకు తట్టుకుని కొండలపైకి ఎగబాకి పోరాడటం ఎంతటి ధైర్య సాహసాలుగల సేనలకైనా దుస్సాధ్యమే అదృష్టవశాత్తూ ప్రకృతి అనుకూలించటంవల్ల, వీరజవాన్ల సాటిలేని శౌర్యంవల్ల భారత సైన్యం కాలు చెయ్యి కూడదీసుకుని విమానదళ సహకారంతో ప్రాణాలను పణం పెట్టి శత్రువుతో తలపడింది.

కనీసం - ఆ దశలోనైనా యుద్ధరంగంలోని సైన్యానికి పరిస్థితినిబట్టి వ్యూహం నిర్ణయించుకునే ఆపరేషనల్ స్వేచ్ఛనైనా వాజపేయి ప్రభుత్వం ఇచ్చిందా? లేదు ఎలాగైనా సరే దురాక్రమణదారులను అధీనరేఖ ఆవలికి తరిమివేయాల్సిందే గాని మీరు మాత్రం ఎట్టి పరిస్థితిలోనూ అధీనరేఖను ఆత్మరక్షణకైనా సరే అతిక్రమించకూడదని సైన్యానికి ఆంక్ష పెట్టారు. సైనికుల ప్రాణాల కంటే అమెరికాలాంటి దేశాల చేత 'భారతీయులు మంచి బాలురు' అనిపించుకోవడం ముఖ్యమని వాజపేయి సర్కారు తలపోసింది.

యుద్ధం మొదలెట్టింది మనం కాదు అవతలి వారు అధీనరేఖ అనేది అనుల్లంఘనీయమైన లక్ష్మణరేఖ ఏమీ కాదు గతంలో ఇదే పాకిస్తాన్ మన మీదికి ఇలాగే దుర్మార్గంగా దాడిచేసి విశాల ప్రాంతాలను ఆక్రమించగా, వారిని అక్కడి నుంచి తరిమివేసే పని పూర్తి కాకుండానే, అంతర్జాతీయ పెత్తందారుల పక్షపాతపూరిత సలహాకు నెహ్రూ ప్రభుత్వం అతి మంచితనానికి పోయి తలొగ్గి యుద్ధాన్ని మధ్యలో విరమించిన పర్యవసానంగా యథాస్థితిని నిర్దేశిస్తూ రూపొందిన రేఖ అది ఆ గీత అవతలి నేల కూడా న్యాయంగా మనదే. మనకు ఏ మాత్రం పౌరుషం ఉన్నా ఏనాటికైనా తిరిగి స్వాధీనపరచుకోవలసిందే అధీనరేఖకు కట్టుబడాలన్న బుద్ధి పాకిస్తాన్‌కు లేకపోయినప్పుడు మన సైనికుల ప్రాణాలు పోతున్నా సరే దానిని వ్యూహాత్మకంగానైనా ఎక్కడా దాటరాదంటూ చేతులూ కాళ్ళూ కట్టేయటం విడ్డూరం!

1947లో పాకిస్తాన్ దురాక్రమణదారులను వెళ్లగొట్టే పనిని నెహ్రూ ప్రభుత్వం నడిమధ్యలో విరమించినందువల్ల మనకు కలిగిన అనర్థాన్ని చేతనైతే సరిదిద్దుకునేందుకు 1999 కార్గిల్ యుద్ధం చక్కని అవకాశమిచ్చింది ఎటువంటి కవ్వింపు లేకుండా పాకిస్తానీలు దుర్మార్గంగా మనపై దాడికి దిగినప్పుడు వారి పద్ధతిలోనే దాడిని తిప్పికొట్టి అధీనరేఖ వెలుపల అంతర్జాతీయ సరిహద్దు ఆవలికి వారిని తరిమికొట్టి ఉండవలసింది సరే! అంతటి మగటిమి చూపటం మనకు అలవాటులేదు కనుక, అంతర్జాతీయంగా చెడ్డపేరు రావచ్చు కనుక మన హద్దుల్లో మనమున్నాం బాగానే ఉంది కాని – కనీసం హద్దుమీరి మనపై దురాక్రమణ చేసిన వారిని విశేష ప్రాణనష్టం తరవాత ఎట్టకేలకు జయించిన తరవాతయినా చొరబాటుదారుల భరతం పట్టామా? మేజర్ పద్మపాణి ఆచార్య లాంటి ఎందరో అమరవీరుల ఆత్మలు శాంతించేలా దురాక్రమణదారులను పట్టి దండించామా?

అందుకు కూడా మహాత్మ వాజపేయికి చేతులురాలేదు మన సైనికులను క్రూరంగా, పరమ కిరాతకంగా చంపి, వందల సంఖ్యలో ప్రాణాలు బలి తీసుకున్న చొరబాటుదారులను చుట్టుముట్టి పట్టుకోవడానికి కూడా సైన్యానికి అవకాశం లేకుండా బుద్ధుడూ, మహావీరుడి లెవెల్లో అహింసామూర్తులైన మన ప్రభువులు అడక్కుండానే క్షమాభిక్ష పెట్టేశారు వెనక్కి తిరిగి పోదలచుకుంటే అడ్డుకోకుండా సురక్షితంగా వెళ్ళనిస్తామని తమంతట తామే అభయం ఇచ్చి, ఇచ్చిన గడువును పొడిగించి క్షేమంగా పంపేసి, తమ ఔదార్యానికి తమను తామే అభినందించుకున్నారు. నిష్కారణంగా మనపై దురాక్రమణకు దిగిన కుత్సితాన్ని బయటపెట్టి, ప్రపంచ ప్రజల ముందు పాకిస్తాన్‌ను బోనులో నిలబెట్టి, విశేష

నష్టానికి పరిహారం రాబట్టాలన్న ఆలోచననైనా మన సాత్విక సాధువుల ప్రభుత్వం దరికి రానివ్వలేదు।

గెలిచామో, ఓడామో, గెలిచి ఏమి సాధించామో తెలియని విధంగా కార్గిల్ యుద్ధం ముగియడంతో కథ అయిపోలేదు కాశ్మీర్‌లో మంటలు పెట్టి ఇండియాపై కక్ష తీర్చుకునే కుతంత్రాన్ని పాకిస్తాన్ మానలేదు కార్గిల్ శృంగభంగం దరిమిలా స్వదేశంలో కోల్పోయిన ప్రతిష్ఠను తిరిగి పొందటానికి ఇస్లామాబాద్ చురుకుగా పావులు కదిపింది

అధికారం కోసం పెనుగులాటలో నవాజ్ షరీఫ్ ఓడి, జనరల్ ముషారఫ్ సైనిక కుట్ర చేసి 1999 అక్టోబరు 12న సర్వాధికారి అయ్యాక ఇండియా పట్ల పాక్ వైఖరి మరింత కరకుబారింది. కార్గిల్ యుద్ధానికి ప్రధానకర్త అయిన ముషారఫ్ అప్పటి పరాభవానికి భగభగలాడసాగాడు ఇండియాపై ప్రతీకారంలో భాగంగానే ముషారఫ్ గద్దెనెక్కి రెండు నెలలు తిరక్కుండా ఐ ఎస్ ఐ ప్రత్యక్ష పర్యవేక్షణలో మిలిటెంట్లు ఖాట్మండూలో బయలుదేరిన ఇండియన్ ఎయిర్‌లైన్స్ విమానాన్ని దారిమళ్ళించి కాందహార్‌కు తీసుకుపోయారు. హైజాకర్లు దేశం బయటికి విమానాన్ని తీసుకుపోతూంటే మెదడు చచ్చుబడి ప్రభుత్వం నిస్సహాయంగా గుడ్లప్పగించి చూస్తూండిపోయింది పాకిస్తానీలకు ఆప్తమిత్రులైన తాలిబన్ల చేతికి నిజానికి తానే బందీగా చిక్కి, మసూద్ అజార్ లాంటి పాపిష్టి టెర్రరిస్టులు ముగ్గురిని చెర నుంచి వదిలి హైజాకర్లకు పువ్వుల్లో పెట్టి అప్పగించి బందీలను విడిపించుకుంది. అదే తరవాత మన నెత్తికి చేతులు తెచ్చిపెట్టింది నూరుగురు టెర్రరిస్టుల పెట్టు అయిన మసూద్ ఎకాఎకి పాకిస్తాన్ వెళ్ళి పీఠం పెట్టి మిలిటెంటు విషనాగులను కూడగట్టి కాశ్మీర్‌లోకి చొప్పించాడు. కార్గిల్ యుద్ధం కాలంలో సరిహద్దుదాటి చొరబడ్డ మిలిటెంట్లు పాకిస్తాన్ అండదండలతో కాశ్మీర్‌లో వ్యాపించి, అమాయకులను ఊచకోత కోస్తూ, బాంబులు పేల్చి, మాటువేసి భద్రతా బలగాలను, పౌరులను బలిగొంటూ భయోత్పాతం సృష్టించారు

కాశ్మీర్ మిలిటెంట్ల పాలై చాలా ఏళ్ళయింది. ఆ మిలిటెంట్లను పాలుపోసి పెంచి, ఆయుధాలందించి ఇండియా మీదికి ప్రయోగిస్తున్నది పాకిస్తానేనన్నదీ అందరికీ తెలిసిన రహస్యమే. అయితే ఏణ్నర్థంగా వారి గురు-శిష్య సంబంధంలో గుణాత్మకమైన మార్పు వచ్చింది అంతవరకూ కాశ్మీర్ మిలిటెంట్ల మొగమే తానెరుగనని, వారికి శిక్షణ ఎవరిస్తున్నారో, ఆయుధాలు ఎలా అందుతున్నాయో తెలియదని ఇస్లామాబాద్ అమాయకత్వం అభినయించేది. ఇటీవలి సంవత్సరాల్లో ఆ కాస్త బురఖాను కూడా తీసేసింది ఇండియాపై కక్ష సాధించేందుకు తాను తలపెట్టిన టెర్రరిస్టు మహాసంగ్రామానికి

పాకిస్తాన్ మతం రంగు పులిమి 'జిహాద్' గా నామకరణం చేసింది ఈ పవిత్ర యుద్ధంలో పాల్గొనడం ముస్లింలందరి పవిత్ర తక్షణ కర్తవ్యంగా ప్రకటించి తాలిబన్లనూ, ముజాహిదీన్లను, పాకిస్తానీలను, ఐ.ఎస్ ఐ ఏజంట్లను, పాక్‌భక్త కాశ్మీరీలను కూడగట్టి నేరుగా రంగంలోకి దించింది. లష్కర్ అని, హిజ్‌బుల్ అని, మరొకటని, ఇంకొకటని డజన్ల కొద్దీ మిలిటెంటు సంస్థలు కాశ్మీర్‌లో పనిచేస్తున్నా అన్నీ కీలుబొమ్మలే వాటిలో వాటికి ఎన్ని పేచీలున్నా అన్నిటి పగ్గాలూ ఇస్లామాబాద్ చేతుల్లో ఉన్నాయి ఇండియా పట్ల అభిమానంగాని, ఇండియాలో కాశ్మీర్ విలీనంపట్ల గౌరవం కాని ఏ ఒక్కదానికీ లేవు ఇండియన్లను కుక్కలుగా, ఇండియాను శత్రురాజ్యంగా పరిగణించి, తుపాకులు తెరపి లేకుండా పేల్చి, హిందువులను, నాన్ ముస్లింలను నరికిపోగులు పెడుతూ, భద్రతా దళాలపైనే గురిపెట్టి పేట్రేగుతూ దేశద్రోహులు, విదేశీతొత్తులు బరితెగించి ప్రభుత్వ సార్వభౌమాధికారం మీద ఉమ్మేతున్నారు ప్రభుత్వానికి ప్రజల పట్ల, దేశంపట్ల, బాధ్యత అనేది ఉంటే, తన ప్రాథమిక కర్తవ్యమేమిటో దానికి తెలిస్తే ఈ పిశాచి మూకల వికృతహేలను నిర్దయగా అణచి, జాతి వ్యతిరేకులను, హింసోన్మాదులను కాలరాచి, భద్రతా బలగాలకు సంపూర్ణ స్వేచ్ఛనిచ్చి శాంతి, భద్రత నిలబెట్టవలసిన ఘట్టమిది.

సరిగ్గా ఈ సమయంలోనే వాజపేయి ప్రభుత్వాన్ని నమ్మశక్యంకాని నిష్క్రియా పరత్వం ఆవహించింది కాల్పులు జరపాల్సిన అధనులోనే ఎవరూ అడగా పెట్టకుండా తనకు తాను దేశద్రోహులకు 'కాల్పుల విరమణ' ప్రకటించింది

కాల్పుల విరమణ ఎవరు ప్రకటిస్తారు? ఎవరి మీద, ఎందుకు ప్రకటిస్తారు? యుద్ధానికి దిగిన రాజ్యాలు తమకు తాముగానో, ఇతరుల సలహా మీదో దాడిని ఆపి, సంధికి అనువుగా 'కాల్పుల విరమణ' ప్రకటించడాన్ని చరిత్రలో కన్నాం. విన్నాం కాని . ఒక దేశంలో అలజడి రేపి, విచ్చలవిడిగా హింసకు, విధ్వంసానికి తెగబడిన విద్రోహుల మూకల మీద ఆ దేశపు ప్రభుత్వం కాల్పుల విరమణ (అదీ – ఏకపక్షంగా!) ప్రకటించడం ఎక్కడైనా ఉందా? కాల్పులు జరుపుతూంటే కదా. . కాల్పులు విరమించే ప్రసక్తి వచ్చేది? కాశ్మీర్‌లో 'కాల్పులను' వాజ్‌పేయి ప్రభుత్వం ఎప్పుడు ప్రారంభించింది? ఎవరి మీద ప్రారంభించింది? మనకు తెలిసినంతలో కాశ్మీర్ మీద న్యూఢిల్లీ యుద్ధమేదీ ప్రకటించలేదే? సరిహద్దులను కావలి కాయడం, వాటిని అతిక్రమించే వారిని కాల్చి చంపడం సైన్యం రివాజుగా చేయవలసిన పని. అలాగే . కాశ్మీర్ లోపల శాంతికి భద్రతకు భంగం కలిగించే టెర్రరిస్టు దుష్టశక్తులను నిర్దయగా నిర్మూలించడం భద్రతా బలగాల బాధ్యత. ఇప్పటిదాకా అవి ఆ పనిని మాత్రమే నిర్వర్తిస్తున్నట్టు ప్రభుత్వం కూడా చెప్పుకుంటోంది మరి. ఇందులో 'కాల్పుల విరమణ'కు ఆస్కారం ఎక్కడ?

2000 సంవత్సరం 'రంజాన్ కానుక' గా ప్రకటించి, 2001 జూన్‌లో ముషారఫ్‌ను ఆగ్రా పేరంటానికి పిలవనంపే వరకూ విడతలవారీగా పొడిగిస్తూ పోయిన ''కాల్పుల విరమణ ప్రహసనం'' కాలంలో భద్రతా బలగాల చేతులు కాళ్లు కట్టేసి, సోదాలు, ఆయుధ స్వాధీనాలు, గాలింపుల వంటి మామూలు పోలీసు చర్యలను కూడా కట్టిపెట్టించింది జమ్మూ కాశ్మీర్‌ను టెర్రరిస్టుల ఇష్టారాజ్యంగా మార్చి, ఎవరూ వినిపించుకోని చచ్చుపుచ్చు శాంతి మంత్రాలను వల్లిస్తూ, వాజపేయిజీకి వస్తుందనుకున్న నోబెల్ శాంతి బహుమతి కోసం ఎదురుచూస్తూ అవతల కాశ్మీర్ మంటల్లో మాడిమసి అవుతున్నా కళ్ళు చెవులు గట్టిగా మూసుకుని వాయిదాల పద్ధతిలో కాల్పుల విరమణ పొడిగిస్తూ ప్రభుత్వం చేతులు ముడుచుకుని కూర్చున్నది. ఇండియాలో విలీనానికి ససేమిరా సమ్మతించని వారితో బేషరతు చర్చలకు వాజపేయి ప్రభుత్వం కడుదీనంగా సిద్ధమైనా, సంభాషణ కోసం ప్రత్యేకంగా ఒక మాటల 'పంతు'ను నియమించినా, ప్రభుత్వాన్ని కనికరించి చర్చలకు ఒప్పుకునేందుకు టెర్రరిస్టు ముష్కర మూకలకు దయ కలగలేదు ప్రభుత్వపు ఈ బేలతనాన్ని అలుసుగా తీసుకొని ఏకంగా భద్రతా దళాల మీదే ధ్వజమెత్తి నానా విధ్వంసం, నరమేధం ఆపకుండా సాగిస్తూంటే వాజపేయి సర్కారు మాత్రం మిలిటెంట్లు ఏనాటికైనా మనసు మార్చుకుని తన సాదర హస్తాన్ని స్వీకరించకపోతారా అన్న ఆశతో విలువైన కాలం వృధా చేసింది దేశమంతటా నిరసన పెల్లుబికి, సొంత పార్టీలోనే కంపరం పుట్టాక ఎట్టకేలకు కాల్పుల విరమణను కట్టిపెట్టిన తరవాతైనా టెర్రరిజాన్ని నిశ్శేషంగా నిర్మూలించే పనిమీద దృష్టి నిలిపారా? ఊహుఁ. ఆ పని చేయకపోగా టెర్రరిజానికి మహారాజ పోషకుడైన ముషారఫ్‌ను ఎందుకో, ఏమి చర్చించేందుకో, ఏమి సాధించేందుకో ఎవరికీ తెలియని చర్చల పేరంటానికి పిలిచారు అది ఇంకో ఫార్సు

# మానవ హక్కులు మృగాలకేనా?

*రాత్రి పొద్దుపోయాక టెర్రరిస్టులు సర్వానందకౌల్ ప్రేమి ఇంటి తలుపు తట్టారు. లోపలివారు ప్రాణభయంతో గజగజ వణికారు. రోజులు బాగాలేవు ఏ తప్పూ చేయకపోయినా కాశ్మీరీ హిందువులను మిలిటెంట్లు క్రూరంగా వేటాడుతున్నారు. 'ఇండియా ఏజంట్లయిన కాఫీర్లకు చావు తప్పదు' అంటూ మసీదుల నుంచి లౌడ్ స్పీకర్లలో బెదిరిస్తున్నారు. తక్షణం కాశ్మీర్ విడిచిపోకపోతే మీ ప్రాణాలు, ఆస్తులు ఎవరూ కాపాడలేరని ప్రతిచోటా పోస్టర్లు వేశారు. పలువురు హిందువులను కిరాతకంగా చిత్రహింసలు పెట్టి పట్టపగలు చంపేశారు. హడలిపోయిన హిందువులు చాలామంది అప్పటికే ఇల్లు వదలి సకుటుంబంగా పారిపోసాగారు. అలాగే మనమూ వలసపోదామని 'ప్రేమీ' భార్యా బిడ్డలు చాలాకాలంగా మొత్తుకుంటున్నారు. ఆయన వినలేదు.*

సర్వానందకౌల్ ప్రేమి పేరుమోసిన కాశ్మీరీ కవి హిందువులు, ముస్లింలు సమానంగా గౌరవించే పెద్దమనిషి. ఆయన భగవద్గీతను కాశ్మీరీ భాషలోకి అనువదించాడు. ఆయన పూజ గదిలో 'ఖురాన్' పురాతన ప్రతి ఒకటి ఎప్పుడూ ఉండేది అనంతనాగ్ జిల్లా సోఫ్‌షాలి గ్రామంలో అందరికీ తలలో నాలుకలా మెలుగుతూ, హిందూ, ముస్లింల అభిమానాన్ని సమానంగా పొందిన ప్రేమీజీకి పొరుగువారి మంచితనం మీద, కాశ్మీర్ సెక్యులర్ సంప్రదాయం మీద వల్లమాలిన నమ్మకం. పుట్టిన గడ్డను వదలిపోవడం సుతరామూ ఇష్టంలేక... తన సంగతి తెలిసిన వారెవరూ తనకు హాని తలపెట్టరన్న విశ్వాసంతో... ఆలుబిడ్డల హితవును ప్రేమీ పెడచెవిన పెట్టాడు.

1990 ఏప్రిల్ 29 రాత్రి ముగ్గురు మిలిటెంట్లు చొరబడిన వెంటనే ఇంట్లోని వారందరినీ ఒక గదిలోకి చేర్చి విలువైన వస్తువులు నగానట్రా అంతటినీ ఒక సూట్‌కేసులో

పెట్టించారు దాన్ని పెద్దాయన నెత్తిన పెట్టి మోయించి తమ వెంట తీసుకుపోయారు చీకట్లో ఆయన ఒంటరిగా తిరిగి రాలేడు సాయంగా నేనూ వస్తానని 27 ఏళ్ళ కుమారుడు అంటే చిత్రంగా నవ్వి సరే నువ్వూ రమ్మన్నారు అలా వెళ్ళిన తండ్రికొడుకుల శవాలు రెండు రోజుల తరువాత చెట్టుకు వేలాడుతూ కనిపించాయి ప్రేమీజీ ఒళ్ళంతా సిగరెట్ వాతలు ఆయన నుదుట తిలకం బొట్టు ఉండేచోట మేకుతో కొట్టి రంధ్రం చేసి చర్మం ఒలిచిన గుర్తులు తండ్రి కొడుకులు ఇద్దరికీ గుడ్లు పీకి దగ్గరి నుంచి కాల్చి చంపారు

కాశ్మీర్ లోయలో కాశ్మీరీ హిందువుల మానవ హక్కులకు వాటిల్లిన విఘాతాన్ని పరిశీలించమని కోరుతూ ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్‌కు ఆలిండియా కాశ్మీరీ సమాజ్ పంపిన మెమోరాండంలో మచ్చుకు ఉదాహరించిన 22 ఘాతుకాల్లో ఇది ఒకటి. పాకిస్తాన్ ప్రేరణతో టెర్రరిస్టులు హింసాకాండకు దిగిన తొలి రోజుల్లో తమకు ఆగ్రహం కలిగించిన, లేక తమ దారికి అడ్డువచ్చిన హిందువులనే కాల్చి చంపేవారు పోనుపోను వారువీరని చూడకుండా హిందువై పుట్టిన వారినల్లా విచ్చలవిడిగా చంపసాగారు. అదీ సాధ్యమైనంత క్రూరంగా. ఒకరిని చంపితే వెయ్యి మంది హడలిపోయి ప్రాణభయంతో పారిపోయేటట్లు చేయాలని వారి ఎత్తుగడ అందుకే కళ్ళు పీకడం, బతికుండగానే చర్మం వొలవడం, బహిరంగ స్థలాల్లో పడేసి మెల్లిమెల్లిగా నెత్తురోడి మరణించేట్లు చేయటం, నోట్లో మూత్రం పోయడం, శవాలను ఎవరూ కదిలించరాదని శాసించడం, రోజుల తరబడి చెట్టుకు వేలాడదీసి ఉంచటం రివాజుగా జరిగేవి

అనంతనాగ్ జిల్లాలో మిలిటెంట్లు పేట్రేగి 1986 ఫిబ్రవరి 21న ఒకేరోజు 40 హిందూ దేవాలయాలను మలినపరిచి ధ్వంసం చేశారు 1500 ఇళ్ళు లూటీచేసి 300 ఇళ్ళు తగులబెట్టారు. అప్పట్లో అధికారం చలాయిస్తున్న జి.ఎం.షా ప్రభుత్వానికి అది సీరియస్‌గా తీసుకోవలసిన విషయంగా కనిపించలేదు అనంతరం వచ్చిన ఫరూక్ అబ్దుల్లా గవర్నమెంటుకూ హిందువుల గోడు పట్టలేదు మైనారిటీల హక్కులను కాపాడి, సెక్యులరిజాన్ని సంరక్షణ చేయడానికే ఊపిరి పీలుస్తున్నట్టు చెప్పుకునే భారత ప్రభుత్వానికీ కాశ్మీర్‌లో హిందువుల మానవ హక్కులను ముస్లిం మతోన్మాదులు కాలరాచిన తీరు తన సార్వభౌమత్వానికి సవాలుగా అనిపించలేదు దీంతో పాకిస్తానీ ఏజెంట్లు, ముస్లిం ఫండమెంటలిస్టులు ఇంకా చెలరేగారు తరతరాలుగా కాశ్మీర్‌లో ఉంటూ కాశ్మీరీ సంస్కృతిలో సమగ్రభాగమైన కాశ్మీరీ పండిట్లను వేధించి, హింసించి క్రూరంగా చంపి, వారి స్త్రీలను చెరిచి, గౌరవంగా బతికే వీలు లేకుండా చేసి, కాశ్మీర్ నుంచి వెళ్ళిపోక తప్పని పరిస్థితి తెచ్చి, ముస్లిములు మాత్రమే ఉండే ఇస్లామిక్ రాష్ట్రంగా మార్చే కాశ్మీర్‌ను

భయానక వ్యూహాన్ని సానబెట్టి 1989 నుంచి ముమ్మరంగా అమలుపరచారు మసీదుల నుంచీ, స్థానిక పత్రికల్లోనూ బెంబేలెత్తించే వార్నింగులిచ్చేవారు ప్రాణంతో ఉండాలనుకుంటే మీ ఆడపిల్లలను ముస్లిం కుర్రవాళ్ళకు ఇచ్చి పెళ్ళిచేయాలని, మతంమార్చుకోవాలని హిందువులను నిర్బంధించేవారు రేయింబవళ్ళూ హిందువుల ఇళ్ళ మీద రాళ్లవర్షం కురిపించేవారు పెట్రోలు బాంబులు విసిరేసేవారు. హిట్ లిస్టులోని హిందువుల ఇళ్ళలోకి జొరబడి ఎక్కడ దాక్కున్నా గాలించి, కత్తులతో పొడిచి, కాళ్ళతో తన్ని, మొహం మీద ఉమ్మి, వారి మతాన్ని తూలనాడి, చిత్ర హింసలు పెట్టి చంపేవారు తననూ చంపమని బాధితుడి భార్య అడిగితే 'నువ్వూ చస్తే వాడి కోసం ఎవరు ఏడుస్తారు' అనేవారు భర్తల ముందే భార్యలను, తండ్రుల ముందే బిడ్డలను సామూహికంగా చెరిచేవారు ప్రమాదం ముంచుకొస్తుందని హిందువులు ఎంత వేడుకున్నా పోలీసులు ఆలకించేవారు కాదు తమ కళ్ళ ముందే ఖూనీలు జరుగుతున్నా పోలీసులు గుడ్లప్పగించి చూసేవారు

1988 జులై నుంచి 1991 జులైలోపు మూడేళ్ళలో వెయ్యిమంది కాశ్మీరీ హిందువులను చంపారని, 200 మందిని అపహరించారని 'స్టేట్స్‌మన్' పత్రిక 1991 జులై 18న సవివరంగా బయటపెట్టింది కాశ్మీర్ జనాభాయే తక్కువ అందులో హిందువుల సంఖ్య మరీ తక్కువ. జనాభాలో వారిది 3శాతం మాత్రమే అందులోనే వెయ్యిమంది దుర్మరణం పాలై, 200 మంది జాడ తెలియకుండా పోవడంలో ఆ 'జాతి హత్యాకాండ' దుష్ఫలితాల్ని జమ్మూ కాశ్మీర్‌లోని ప్రతి హిందూ కుటుంబమూ ఏదో ఒక విధంగా అనుభవించింది పగబట్టి పథకం ప్రకారం తమపై సాగిస్తున్న ఈ హత్యాకాండ నుంచి ఆదుకునే నాథుడు లేకపోవటంతో 2,60,000 మంది కాశ్మీరీ పండిట్‌లు పుట్టి పెరిగి తరతరాలుగా ఆత్మీయానుబంధం పెంచుకున్న సుందర కాశ్మీరాన్ని వదిలి పదేళ్ల కింద జమ్మూ, చండీగఢ్, ఢిల్లీలకు వలసపోయారు నేటికీ దిక్కుమొక్కులేక శరణార్థులుగా అష్టకష్టాలు పడుతున్నారు. ఇవాళ కాశ్మీర్ లోయలో మిగిలిన హిందూ కుటుంబాలు 500 లోపు. వారు కూడా టెర్రరిస్టు 'ఏరియా కమాండర్ల'కు మామూళ్లు ఇచ్చుకుంటూ వారి దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి బితుకుబితుకుమంటూ బతుకుతున్నారు

కాశ్మీరీ హిందువుల్లో అత్యధికులు బ్రాహ్మణులు. వారినే కాశ్మీరీ పండిట్లు అంటారు. వారే అసలైన కాశ్మీర్ బిడ్డలు వేల సంవత్సరాలుగా అక్కడ ఉంటున్నారు ముస్లింల దండయాత్రల తరవాత వారి నుంచే పలువురు మహమ్మదీయ మతం స్వీకరించి మెజారిటీ వర్గంగా మారారు. (కాశ్మీర్ పూర్వచరిత్రను అనుబంధం–1లోని ''మనకు తెలియని

కాశ్మీరం'', ''టెర్రరిజానికి ఏడొందల ఏళ్లు'' వ్యాసాల్లో చదవండి) పేరుకు హిందువులే అయినా వారి సంస్కృతి విలక్షణమైనది మాట్లాడే భాష కాశ్మీరీ దానికి మూలం సంస్కృతం కాని పర్షియన్ ప్రభావం అధికం అమర్‌నాథ్, ఖీర్‌భవాని, శారదాభవాని వంటి హిందువుల పరమ పవిత్ర యాత్రాస్థలాలు కాశ్మీర్‌లోనే ఉన్నాయి లోయ చుట్టూ ఉన్న హిమాలయ పర్వతసానువులు వారి దేవుళ్ల పేరుతోనే ప్రసిద్ధమయ్యాయి

ప్రాచీన కశ్యపభూమి అయిన కాశ్మీర్‌లో కాశ్మీర్ పండితులది విడదీయరాని వర్గం తరతరాలుగా కాశ్మీర్‌లో నివసిస్తూ, ఆ నేలను నమ్ముకుని, అక్కడి ప్రతి నీటిబొట్టునూ ప్రతి గడ్డిపరకనూ ప్రేమిస్తూ మమతానుబంధం పెంచుకున్న కాశ్మీరీ పండిట్లకు స్థానం లేకుంటే టెర్రరిస్టులూ, వారి మతగురువులూ, విదేశీ పోషకులూ పాచినోటితో ఉచ్చరించే 'కాశ్మీరియత్'కు అర్థమే లేదు కాని – చిత్రమేమిటంటే మతపరంగా మెజారిటీ అయిన ముస్లింల చేతిలో మైనారిటీలైన హిందువులకు జరిగిన ఈ దారుణ దురన్యాయం మానవ హక్కులను నిలబెట్టడం కోసమే అవతారమెత్తిన ఏ జాతీయ, అంతర్జాతీయ సంస్థకూ పట్టలేదు టెర్రరిజాన్ని అణచే విధి నిర్వహణలో భద్రతా బలగాలు తీసుకునే ప్రతి చర్యనూ భూతద్దంలో చూసి, పాకిస్తానీ ఏజంట్లు, ముస్లిం మతోన్మాద సంస్థలు చేసే అబద్ధాల ప్రాపగాండానంతటినీ అక్షర సత్యంగా నమ్మి, దేశద్రోహులకూ జాతి వ్యతిరేక టెర్రరిస్టు ముష్కరులకూ ఏ కాస్త కష్టం కలిగినా, వారి సుకుమారపు ఒళ్లు ఏ మాత్రం కందినా తల్లడిల్లి మానవహక్కులకు పుట్టి మునిగినట్టు రంకెలు వేసే సోకాల్డ్ పౌర హక్కుల సంరక్షకులకూ అలా చొక్కాలు చించుకోకపోతే ప్రగతిశీల లిబరల్ మేధావులుగా, పేరు రాదని బెంగటిల్లే సూడో సెక్యులరిస్టులకూ కాశ్మీర్‌లో మతం పేరిట మైనారిటీలపై సాగుతున్న జాతి 'హత్యాకాండ' దారుణ దుష్ఫలితాలు కంటికి ఆనవు చెవికి సోకవు

మానవులందరూ స్వతంత్రులుగా, సమానులుగా పుట్టారని, వారు పరస్పరం సోదరభావంతో మెలగాలని ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ 1948లోనే ప్రకటించిన ప్రపంచ మానవ హక్కుల డిక్లరేషను ఘోషించింది. ప్రభుత్వంవల్ల ప్రభుత్వ ఏజెన్సీల వల్ల వ్యక్తులకు జరిగే అన్యాయానికి మాత్రమే అది పరిమితం కాలేదు మానవహక్కుల పరిరక్షణ బాధ్యత మానవులందరిదీ అయినప్పుడు టెర్రరిస్టులకు మాత్రం బాధ్యతలేదా? కాశ్మీర్‌లో రాజ్యాధికార వ్యవస్థ వల్ల హాని జరగకుండా కొద్దిమంది ఫండమెంటలిస్టులకు, టెర్రరిస్టులకు, విదేశీ తొత్తులకు, వారి తైనాతీలకు రక్షణ కల్పించడం కోసమేనా మానవ హక్కులు ఉన్నవి? స్థానిక పోలీసు యంత్రాంగం పక్షపాత పూరితమై మిలిటెంట్లవైపు మొగ్గి, శాంతి సంరక్షణకు సహకరించని ప్రతికూల పరిస్థితుల్లో తమకు పూర్వ పరిచయంలేని

కొత్త ప్రాంతాల్లో సరిహద్దు భద్రతా దళం, సి ఆర్ పి , సైనిక బలగాలు టెర్రరిస్టు చీడపురుగుల ఏరివేతకు, అణచివేతకు ఏకాస్త కరకుదనం చూపినా 'మానవతకు మాయనిమచ్చ' 'అమానుష దమనకాండ' 'మానవ హక్కులపై ఉక్కుపాదాలు' అంటూ కళ్ళు మూసుకుని హక్కుల రాయుళ్ళు రడీమేడ్ స్టేట్‌మెంట్లు గుప్పిస్తారు కాదా? మరి – అదే కాశ్మీర్‌లో– యూదులను నాజీలు నిర్మూలించినట్టు – మైనారిటీ హిందువులను పథకం ప్రకారం పీడించి, స్వస్థలం నుంచి బలవంతంగా పెకలించి, అస్తులు ఇళ్లు వదిలి కడుదీనంగా ఆక్రోశిస్తూ దిక్కులేని శరణార్థులుగా వలసపోయే పరిస్థితి తెచ్చిపెట్టిన టెర్రరిస్టు కిరాతకుల ఘోరాలను ఖండించరేమి? కాశ్మీర్ బయటి నుంచి చొరబడ్డ ఆఫ్ఘన్ ముజాహిదీన్లకు, పాకిస్తానీలకు, వారు పాలుపోసి పెంచిన టెర్రరిస్టు విష సర్పాలకే తప్ప ఆ నేలపై పుట్టి ఆ నేలను నమ్ముకున్న హిందువులకు అక్కడ బతికే హక్కులేదా?

తెలిసీ తెలియక, వాస్తవాలు లోతుగా విచారించక, టెర్రరిస్టుల అనుకూల వర్గాలు చెప్పేదల్లా నమ్మి . ప్రాణాలకు తెగించి శాంతి భద్రతలు కాపాడేందుకు ప్రయత్నిస్తున్న పారామిలిటరీ బలగాలను పాపాల భైరవులుగా చిత్రించడంవల్ల మన మహామేధావులు, వారి జేబు సంస్థలు చేసిందల్లా పాకిస్తానీ ప్రాపగాండా యంత్రానికి శాయశక్తులా ఇంధనాన్ని అందివ్వడమే. కాశ్మీర్‌లో జరుగుతున్నది స్వాతంత్ర్య పోరాటమని, నానాగోత్రాల టెర్రరిస్టులు ప్రజలు కొలిచే పోరాట యోధులని, సైనిక అత్యాచారాలతో, పోలీసు దమననీతితో, ప్రభుత్వ వైఫల్యాలతో కాశ్మీరీలను చేతులారా మనం దూరం చేసుకున్నామని . టెర్రరిస్టులకు, వారి విదేశీ యజమానులకు దోసిలి ఒగ్గి, వారు ఏమి చేసినా సహించి, ఏ ఘోరం చేసినా విస్మరించి వారి ప్రాపకానికి పాకులాడటం ద్వారానే కాశ్మీరీ ప్రజల సుహృద్భావాన్ని ఏనాటికైనా బహుశా పొందగలమని కపట మేధావులు, రాజకీయ గోమాయువులు వినిపించేది మతిమాలిన వాదన.

కాశ్మీర్ మనకు చేయి జారిపోవడం ఒక్క రోజులో జరగలేదు కాశ్మీర్‌లోని ముస్లిం లందరూ మొదటి నుంచీ పాక్ అభిమానులు కారు. తీవ్రవాద దుశ్చర్యలను సహించే వారూ కాదు. వారికి, హిందువులకు అగర్భ శత్రుత్వం ఏమీలేదు. పూర్వపు ముస్లిం పాలకుల ఆంక్షలకూ, శిక్షలకూ తాళలేక... ప్రాణభయంతో గత్యంతరం లేక అనేక తరాల కింద ఇస్లాం మతాన్ని స్వీకరించినా వారిలో చాలామంది హిందూ సమాజంతో తమ ఆదిమూలాలను తెంచుకోలేదు. హిందువులలాగే ఇంటి పేర్లను పెట్టుకున్నారు. షరియత్‌లో లేని దత్తత వంటి హిందూ ఆచారాలు కొన్ని తామూ పాటించారు. వారసత్వపు హక్కులలోనూ హిందూ పద్ధతినే పాటించారు. ఒకరి పండుగల్లో ఒకరు పాలుపంచుకుంటూ, ఒకరి

సూఫీలను, సాధువులను మహనీయులను మరొకరు గౌరవించుకుంటూ, మతాలు వేరైనా తరతరాలుగా కలిసిమెలిసి ఉన్నారు కాశ్మీరీ సంస్కృతి, కాశ్మీరీ జాతీయత వారి బంధాన్ని మతాలకు అతీతంగా సిమెంటు చేసింది కాబట్టే 1947లో, 1965లో, 1971లో పాకిస్తాన్ కాశ్మీర్‌పై దాడికి దిగినప్పుడు కాశ్మీరీ ముస్లింలు పాకిస్తానీలను వ్యతిరేకించి ఇండియా పక్షాన దృఢంగా నిలబడ్డారు

ఇదంతా సాకల్యంగా గమనించే - హిందువులకు ముస్లిములకు మధ్య చిచ్చుపెడితేగానీ కాశ్మీర్ తమ వశం కాదని పాకిస్తాన్ గ్రహించి తదనుగుణంగా పెద్ద ప్లాను వేసి జాగ్రత్తగా పావులు కదిపింది మతోన్మాదాన్ని, ఫండమెంటలిజాన్ని కాశ్మీరీ ముస్లిముల్లో చొప్పించటానికి జమాయితే ఇస్లామీని ప్రయోగించారు. డబ్బు, ఇతర వనరులు సమృద్ధిగా సమకూర్చి కాశ్మీర్ అంతటా మదరసాలను తెరిపించారు. అందులో ముస్లిం పిల్లలకు లేతవయసు నుంచే ఇండియా అంటే ఏహ్యాతను, ఇస్లాంపట్ల వీరావేశాన్ని జాగ్రత్తగా ఎక్కించారు హిందూ 'కాఫిర్ల'ను వెళ్ళగొట్టితే గానీ కాశ్మీర్‌లో ఇస్లామిక్ రాజ్యం అవతరించదని, పాకిస్తాన్ వంటి ముస్లిందేశాల అండ ఉంటేగాని కొండలాంటి ఇండియాను ఢీకొనలేమని, మతం మీద భక్తితో ఆయుధాలిచ్చి, శిక్షణనిచ్చి, నైతిక బలాన్ని సమకూర్చి సర్వవిధాల ఆదుకుంటున్న పాకిస్తాన్‌కు ఆజన్మాంతం రుణపడి ఉండాలని క్రమపద్ధతిలో బ్రెయిన్‌వాష్ చేశారు ఆ రకంగా తయారైన 'జిహాదీ'లను నాజీల తరహాలో హిందువులపై జాతి హత్యాకాండకు వినియోగించారు అప్పటికే ఐ ఎస్ ఐ దర్శకత్వంలో ఆఫ్ఘాన్ ముజాహిదీన్లను, అమాంబాపతు మిలిటెంటు మురాలను కూడగట్టి తయారుచేసిన మాస్టర్ ప్లానుకు వారిని ఒడుపుగా వాడుకున్నారు

కాశ్మీర్‌ను తమ కంట్రోల్లోకి తెచ్చుకోవటానికి పాకిస్తాన్ పద్ధతి ప్రకారం ఎత్తులు వేసింది. పాక్ ప్రేరేపణతో మిలిటెంట్లు ఇస్లాంకు వ్యతిరేకమని చెప్పి మొదట సినిమా హాళ్ళను మూయించారు బ్యూటీ పార్లర్లను ఎత్తివేయించారు వైన్‌షాపులు, బార్లు తొలగించారు. తరువాతి దశలో భారతీయ బ్యాంకులు, పోస్టాఫీసులు, కేంద్ర కార్యాలయాల మీదపడి వాటి బోర్డుల్లో 'భారతీయ' పదాన్ని తుడిపించారు జాతీయ దినోత్సవాల్లో ఎక్కడా జండా ఎగరేయకుండా, వేడుకలు జరగకుండా, ఎవరూ వీధుల్లోకి రాకుండా 'కర్ఫ్యూ' లాంటిది విధించారు. మిగతా దేశమంతా దీపాలంకరణలలో వెలిగిపోతుంటే బ్లాకవుట్ విధించి మొత్తం కాశ్మీర్‌ను చిమ్మచీకట్లో నెట్టారు. పాకిస్తాన్ జాతీయ దినాలను మాత్రం మహాసంబరంగా జరిపేవారు క్రికెట్ మాచ్‌లో పాకిస్తాన్ గెలిస్తే పండుగ చేసుకునేవారు. అదే ఇండియా గెలిస్తే శాపనార్థాలు పెట్టి నానా బీభత్సం చేసేవారు రాష్ట్ర, కేంద్ర

కార్యాలయాల మీద కూడా వేర్పాటువాదుల జండాను ఎగరేయాలని నిర్బంధించేవారు పాకిస్తాన్ స్టాండర్డ్ టైమును బట్టి గడియారాలు సరిచేసుకోవాలని పౌరులను కట్టడి చేసేవారు జాతీయ నాయకుల ప్రసంగాలో, మరో ముఖ్యమైన కార్యక్రమాలో ప్రసారమయ్యే సమయాల్లో విద్యుత్ సరఫరా ఆపేయించి రేడియో టీవీ సెట్లను బందు చేయించేవారు అదే సమయంలో ఇంకో వైపు హిందువుల మీద, 'ఇండియన్ ఏజంట్ల'నుకునే హిందూ అధికారుల మీద విరుచుకుపడి పట్టపగలు నడివీధిలో ఖూనీలు చేసి, లూటీలు, దొమ్మీలు సాగించి, ప్రభుత్వ ప్రైవేటు ఆస్తులు తగులబెట్టి, గ్రామాలపై రాత్రివేళ పడి నిద్రిస్తున్న హిందువులను ఊచకోత కోసి మతపరమైన ఘోరకలిని యధేచ్ఛగా సాగించారు కాశ్మీరీ పండిట్లను హడలగొట్టి జయప్రదంగా తరిమివేసిన తరవాత జమ్మూ కాశ్మీర్‌లోని సిక్కులపైనా, లడాఖ్ ప్రాంతంలో బౌద్ధులమీదా ఇదే రకమైన బీభత్సాస్త్రాలను ప్రయోగించారు కాశ్మీరీ ముస్లిముల్లో పాకిస్తాన్ తొత్తులు కావటానికి ఇచ్ఛగించని వారినీ తెలివిగా, క్రూరంగా వేధించి, భయపెట్టి నోళ్లు మూయించారు కాశ్మీర్‌లో వివిధ మత వర్గాల నిష్పత్తిని దుర్మార్గంగా మార్చేసి, మైనారిటీల నిర్మూలన ద్వారా కాశ్మీర్‌ను పూర్తిగా ఇస్లాంమయం చేశారు

పాకిస్తాన్ దృక్కోణం నుంచీ, వారి చేతిలో మరబొమ్మలైన వివిధానేక మిలిటెంటు ముఠాల అవసరాల దృష్టితోనూ చూస్తే ఈ వ్యూహం చాలా కరెక్టు. దీనివల్ల బోలెడన్ని 'సత్ఫలితాలు' వారికి ఈవరకే అంచనాలకు మించి సిద్ధించాయి. కాని . మన మాటేమిటి? భారత రిపబ్లిక్ అవిభాజ్య భాగమని చెప్పుకునే జమ్మూ కాశ్మీర్ రాష్ట్రంలో ఒక మతవర్గానికి చెందిన లక్షలాది మైనారిటీలను దేశద్రోహులు విదేశీ ఏజంట్లు కలిసి దౌర్జన్యంగా వెళ్ళగొడితే వారిని ఆదుకుని, తిరిగి వారి స్వస్థలానికి తరలించి గౌరవప్రదంగా, స్వేచ్ఛగా జీవించే సావకాశాన్ని కల్పించడం భారత ప్రభుత్వ ప్రాధమిక బాధ్యత అవునా కాదా? కాశ్మీర్ అనేది ఒక 'సమస్య' అని ఒప్పుకుంటే దానికి సంబంధించి మొట్టమొదట తేల్చవలసిన విషయం ఇదే కాదా? కొంపాగోడూ వదులుకుని లక్షలాది కాశ్మీరీ పండిట్లు వీధినపడి దయనీయంగా ఆక్రోశిస్తున్నా ఆలకించక, వారివైపే చూడక, పాకిస్తాన్ భక్తులైన ముస్లిం టెర్రరిస్టు ముష్కర మూకలను ఎలా ప్రసన్నం చేసుకోవాలి, వారిని ముచ్చట్లకు ఎలా ఒప్పించాలి అన్నదాని మీదే జాతీయ నాయకత్వం ఆపసోపాలు పడుతోందంటే దీనికి మించిన బాధ్యతా రాహిత్యం మరొకటి ఉంటుందా? మనం చెప్పే మానవ హక్కులు టెర్రరిస్టు మృగాలకే తప్ప మామూలు మానవులకు వర్తించవా?

# అసలు రోసుగు ఆర్టికల్ 370

ఆమె పేరు రుబీనా నస్రుల్లా. కాశ్మీర్‌లో పుట్టింది. అక్కడే పెరిగింది. శ్రీనగర్‌లో ఎం.బి బి.ఎస్. చదివింది. ఆ మెడికల్ కాలేజిలోనే పోస్టుగ్రాడ్యుయేషను కోర్సు కూడా వేయాలనుకుంటే పర్మనెంటు రెసిడెన్సు సర్టిఫికెటు తెమ్మని కాలేజి వారు చెప్పారు. 'అదేమిటి? నేను కాశ్మీర్ సిటిజను, పర్మనెంటు రెసిడెంటు అయినట్టు ధ్రువపరిచే సర్టిఫికెటు ఇంతకు ముందే ఇచ్చాను కదా' అంది రుబీనా. అధికారులు అది చాలదన్నారు ఈ మధ్య నీకు పెళ్ళయింది కదా? పెళ్లి తరవాత కూడా పర్మనెంటు రెసిడెంటువే అయినట్టు కొత్తగా సర్టిఫికెటు కావలసిందే అన్నారు వారు సరేనని సంబంధిత అధికారులకు ఆ సర్టిఫికెటు కోసం అర్జీ పెడితే ఇవ్వము పొమ్మన్నారు. ఎందుకంటే రుబీనా పెళ్ళాడింది కాశ్మీరీని కాదు. బయటివాడిని. అతడూ భారతీయుడే. కాశ్మీర్ కూడా భారతదేశంలో భాగమే. అయినా కాశ్మీర్ సిటిజను కానివాడికి అక్కడ నివాస యోగ్యత లేదు. బయటివాడిని పెళ్ళి చేసుకుంటే కాశ్మీరీ యువతికి అంతకు ముందున్న శాశ్వత నివాస అర్హత కూడా పోతుంది. ఆ కారణంగానే రుబీనాకు కాలేజి సీటు రాలేదు. అదొక్కటే కాదు. కుటుంబ ఆస్తిలో వారసత్వపు హక్కు కూడా ఆమెకు ఉండదు.

భారతీయుడిని పెళ్లి చేసుకుంటే భారత స్త్రీకి ఉన్నచోట నివాసార్హత, వారసత్వపు హక్కులు పోవడం- విషయం తెలియని వారికి వింతగా ఉండొచ్చు ఇలాంటి విడ్డూరాలు కాశ్మీర్‌లో ఇంకా చాలా ఉన్నాయి

భారత రిపబ్లిక్‌లోని అనేక రాష్ట్రాల్లో జమ్మూ కాశ్మీర్ ఒకటి కాని – మరే రాష్ట్రానికీ లేని నడమంత్రపు ప్రత్యేకతలు దానికి చాలా ఉన్నాయి మిగతా దేశమంతటికీ శిరోధార్యమైన భారత రాజ్యాంగానికి అక్కడ చెల్లుబాటు తక్కువ అక్కడి ప్రభుత్వం ఒప్పుకుంటే తప్ప

పార్లమెంటు చేసే ఏ చట్టమూ జమ్మూ కాశ్మీర్‌కు వర్తించదు ఇండియా అంతటికీ ఒకటే రాజ్యాంగం ఒకటే పౌరసత్వం ఒకటే జండా మరే రాష్ట్రాలకీ లేని రీతిలో జమ్మూ కాశ్మీర్‌కు మాత్రం రెండు రాజ్యాంగాలు, రెండు పౌరసత్వాలు, రెండు ఎంబ్లమ్‌లు, రెండు జండాలు ఇండియన్ యూనియన్‌లో విలీనమైన అర్ధశతాబ్దం తరవాత కూడా కాశ్మీర్ భారతీయ జీవన స్రవంతిలో కలవలేకపోవటానికి ఇలాంటి విపరీతాలే కారణం మరే రాష్ట్రానికీ లేనట్టుగా జమ్మూ కాశ్మీర్‌కు అర్థంపర్థంలేని ప్రత్యేక ప్రతిపత్తినిచ్చి, మిగతా దేశం నుంచి వేరుచేసి, వేర్పాటు ధోరణులకు మూల కారణమైంది భారత రాజ్యాంగంలో 370వ అధికరణం దాని పుట్టుక పెద్ద కథ

ఈ గ్రంథం మొదట్లో వివరించినట్టుగా పాకిస్తాన్ దండెత్తి వచ్చాక మహారాజా హరిసింగ్ ఇండియా శరణువేడి 1947 అక్టోబరు 26న జమ్మూ కాశ్మీర్ సంస్థానాన్ని ఇండియన్ యూనియన్‌లో విలీనం చేశాడు రక్షణ, విదేశీ వ్యవహారాలు, కమ్యూనికేషన్లు అనే మూడు సబ్జెక్టుల మీద ఆధిపత్యాన్ని కేంద్ర ప్రభుత్వానికి ధారపోస్తూ ఆయన విలీన పత్రం మీద సంతకం చేశాడు అంతకు ముందు వందలాది సంస్థానాల పాలకులు అటు పాకిస్తాన్‌లోనో ఇటు ఇండియాలోనో తమ సంస్థానాలను విలీనం చేయడానికి రాసి ఇచ్చిన పత్రం లాంటిదే అది. అక్షరం కూడా తేడా లేదు

బ్రిటిష్ సార్వభౌమత్వం అంతమవడంతో వందలాది సంస్థానాలు బ్రిటిష్ పెత్తనంలోకి రావడానికి ముందున్న స్వతంత్ర ప్రతిపత్తిని మళ్లీ పొందాయి సంస్థానాధీశులు పూర్వంవలె తిరిగి సర్వాధికారులు అయ్యారు భౌగోళిక సామీప్యం దృష్ట్యా ఇండియా, పాకిస్తాన్‌లలో ఎటు చేరాలో నిర్ణయించుకుని, ఆ ప్రకారం సంస్థానాన్ని విలీనం చేసే అధికారాన్ని బ్రిటిష్ పార్లమెంటు చేసిన ఇండియన్ ఇండిపెండెన్సు యాక్టు పూర్తిగా ఆయా సంస్థానాధీశులకే దఖలు పరిచింది. ఆ ప్రకారం మిగతా సంస్థానాల పాలకులలాగే కాశ్మీర్ మహారాజు కూడా విలీన పత్రం మీద సంతకం పెట్టడంతో ఇండియన్ యూనియన్‌లో జమ్మూ కాశ్మీర్ చట్టరీత్యా విలీనమై పోయింది. ఇండియా, పాకిస్తాన్‌లు రెండూ అంగీకరించిన, అనుసరించిన విధివిధానాల ప్రకారమే ఇది జరిగినందున ఈ విలీనాన్ని ప్రశ్నించే హక్కు, తిరగదోడే అధికారం ఎవరికీ లేదు. కాని మాయదారి మౌంట్‌బాటన్ నమ్మకద్రోహం చేసి, తప్పుడు సలహాలతో నెహ్రూ బుర్రతిని ఫుల్‌స్టాప్ ఉండాల్సిన చోట నిష్కారణంగా క్వశ్చన్‌మార్కు పెట్టించాడు. మిగతా రాష్ట్రాల వలె జమ్మూ కాశ్మీర్‌ను ఇండియన్ యూనియన్‌లో కలిపేసుకుని ఊరుకోకుండా జమ్మూ కాశ్మీర్ ప్రజలు తరవాతెప్పుడో ధ్రువీకరించాకే సదరు విలీనం ఖరారు అవుతుందని మోసపు మెలిక వేశాడు

అప్పుడు – జమ్ము కాశ్మీర్ ప్రజలు విలీనాన్ని ధ్రువీకరించేలోగా పరిపాలన ఎలాగ అన్న ప్రశ్న ఉదయించింది కేంద్ర జాబితాలోని, ఉమ్మడి జాబితాలోని అన్ని అంశాల మీద కేంద్రం చేసే చట్టాలు మిగతా రాష్ట్రాల వలె కాక- జమ్ము కాశ్మీర్ ప్రభుత్వం ఒప్పుకుంటేనే ఆ రాష్ట్రానికి వర్తించాలని నిర్దేశిస్తూ తాత్కాలిక ఏర్పాటుగా 370వ అధికరణాన్ని రాజ్యాంగంలో పొందుపరచారు విలీన పత్రంపై మహారాజు సంతకం చేసిన తేదీనుంచి, ఆ విలీనాన్ని రాష్ట్ర ప్రజలు ధ్రువీకరించేలోపు రాజ్యాంగ సంబంధాలను నియంత్రించిన ప్రత్యేక నిబంధన ఇది

జమ్ము కాశ్మీర్ రాజ్యాంగ నిర్ణాయక సభ సిఫారసుతోగాని దీన్ని ఎత్తివేయడానికి వీలులేదని 370వ అధికరణం పేర్కొన్నది జమ్ము కాశ్మీర్ ప్రజలు ఎన్నుకునే రాజ్యాంగ సభ ఆమోదముద్ర వేస్తేతప్ప విలీనం ఖరారు కాదంటూ మౌంట్‌బాటన్ ప్రేరేపణతో అప్పటి భారత నాయకత్వం కట్టిన మడి అవసరం 1956తో తీరింది 1951 అక్టోబరులో జమ్ము కాశ్మీర్ ప్రజలు ఎన్నుకున్న రాజ్యాంగ నిర్ణాయక సభ ఇండియాతో విలీనాన్ని ధ్రువీకరించి, ఆ రాష్ట్రం ఇండియన్ యూనియన్‌లో భాగంగా *(shall be an integral part of Union of India)* ఉండగలదని 1956 ఫిబ్రవరిలో స్పష్టీకరించింది దాంతో దేశంలోని మిగతా రాష్ట్రాలతో జమ్ము కాశ్మీర్ అన్నివిధాల సమానమై పోయింది. దాని కోసం ప్రత్యేక ఏర్పాటు ఆవశ్యకత తొలగింది

ఉద్దేశించిన ప్రయోజనం నెరవేరగానే తాత్కాలిక నిబంధన అయిన 370వ అధికరణాన్నికూడా రద్దుపరచి ఉంటే జమ్ముకాశ్మీర్ జాతీయస్రవంతిలో మిళితమయ్యేది. భారత రిపబ్లిక్ అంతటా చెల్లే రాజ్యాంగం, శాసనాలు యావత్తూ ఆ రాష్ట్రానికీ వర్తించేవి భారత పౌరుడు భారతదేశంలోని ఏ ప్రాంతంలోనైనా నివసించి, ఎక్కడైనా స్థిరపడి, కోరుకున్న వృత్తి వ్యాపారాలను సాగించవచ్చునని రాజ్యాంగం 19 (1) అధికరణం ఇచ్చిన స్వేచ్ఛతో ఇతర రాష్ట్రాల వారు కాశ్మీర్‌కు వెళ్ళి,వ్యాపారాలు చేసి, పరిశ్రమలు పెట్టి, ఆస్తులు సంపాదించి అక్కడే స్థిరపడగలిగేవారు మలబార్ నాయర్లు, మద్రాసీ అయ్యర్లు, పంజాబీ సర్దార్జీలు కాశ్మీర్‌కు కూడా వలసపోయి దుకాణాలు తెరిచేవారు బయటి భారతీయులను రానివ్వడం వల్ల కాశ్మీర్ భూముల విలువ హెచ్చేది వ్యాపారాల్లో పోటీ పెరిగేది. బయటి పెట్టుబడులవల్ల ఆర్థిక వ్యవస్థ పుంజుకునేది ఉపాధి అవకాశాలు పెరిగేవి సామాన్య ప్రజల బతుకులు బాగుపడేవి

కాని – దురదృష్టం! కాశ్మీర్ ప్రజల బాగు కంటే, జాతీయ ప్రయోజనాల కంటే కొద్దిమంది పెత్తందారుల సంకుచిత స్వార్థానిదే పైచేయి అయింది నిక్కచ్చిగా

వ్యవహరించవలసిన కేంద్ర నాయకత్వం మొగమాటాలకు, రాజకీయ వత్తిళ్లకు లొంగింది 1956లోనే తొలగించి ఉండవలసిన 370వ అధికరణాన్ని షేక్ అబ్దుల్లా మెహర్బానీ కోసం నిరవధికంగా కొనసాగించడంతో తాత్కాలిక చర్య కాస్తా శాశ్వతపు ఏర్పాటు అయి కూచుంది ఈలోపు 1952లో పెడసరపు అబ్దుల్లాను ప్రసన్నం చేసుకోవడానికి ఆయన కోరిన వరమల్లా భోళాశంకరుడిలా ఇస్తూ నెహ్రూ ప్రభుత్వం 1952లో కుదుర్చుకున్న డిల్లీ ఎగ్రిమెంటు ప్రకారం జమ్మూ కాశ్మీర్ రాష్ట్రానికి ప్రత్యేక రాజ్యాంగం, ప్రత్యేక పతాకం, ప్రత్యేక చిహ్నం, ప్రత్యేక వారసత్వం సమకూడాయి జమ్మూ కాశ్మీర్ ఇండియాలో విడదీయరాని భాగమని ఇల్లెక్కి చాటుతూనే మరే రాష్ట్రానికీ లేని విధంగా దానికి ప్రత్యేక రాజ్యాంగాన్ని అనుమతించి, భారత పౌరసత్వానికి భారతీయ చట్టాలకు కూడా చెల్లుబాటు లేకుండా చేయటంవల్ల ఇండియా వేరు, కాశ్మీర్ వేరు అన్న భావాన్ని భారత ప్రభుత్వమే చేజేతులా ప్రోత్సహించింది పోనుపోను అదే కాశ్మీర్‌ను శాశ్వతంగా దూరంచేసి మన నెత్తికి చేతులు తెచ్చిపెట్టింది

దేశానికి చేసిన చెరుపు సంగతి అలా ఉంచి ఆర్టికల్ 370 కనీసం కాశ్మీర్‌కైనా మేలు చేసిందా? పార్లమెంటు చేసే ఏ చట్టమైనా జమ్మూ కాశ్మీర్‌కు వర్తించేదీ లేనిదీ ఆ రాష్ట్ర ప్రభుత్వం ఇష్టానికి వదిలిపెట్టిన కారణంగా మిగతా దేశంలో అమల్లో ఉన్న అనేక ప్రగతిశీల శాసనాలకు అక్కడ దిక్కులేకుండా పోయింది ఉదాహరణకు – పట్టణ భూముల గరిష్ఠ పరిమితి చట్టం జమ్మూ కాశ్మీర్‌కు వర్తించదు డబ్బు, రాజకీయ పలుకుబడి కలిగిన మోతుబరి భూస్వాములు పట్నాల్లో బంగారంలాంటి భూములను ఎన్నివందల ఎకరాలు సంపాదించినా, ఎన్ని కబ్జాలకు దిగినా అడ్డుకునే దిక్కులేదు సంపద పన్ను అక్కడ లేదు గిఫ్టుటాక్సు లేనే లేదు సంపన్నులు ఎన్ని అక్రమ లావాదేవీలకు పాల్పడ్డా అక్కడ చట్టం ఏమీ చేయలేదు

దేశమంతటా అమల్లో ఉన్న ఫిరాయింపుల నిషేధ శాసనం ప్రకారం చట్టసభలో సభ్యత్వానికి ఎవరైనా అర్హత కోల్పోయిందీ లేనిదీ నిర్ణయించేది స్పీకరు జమ్మూ కాశ్మీర్‌లో మాత్రం లెజిస్లేచర్ పార్టీ నాయకుడే నిర్ణయాధికారి ఒక పార్టీ నాయకుడి నడవడి నచ్చక మిగతా సభ్యులందరూ మూకుమ్మడిగా తిరగబడినా సరే! ఒంటరి నాయకుడు మొత్తం అందరి ఎమ్మెల్యేగిరీనీ ఊడగొట్టినా కాదనేవారు లేరు ఎన్నికల్లో పార్టీ టిక్కెట్లు పంచి పెట్టేదీ అతడే పార్టీ గెలిస్తే అధికారం అందుకునేదీ అతడే ఇష్టంలేకపోతే చట్టసభలో ఎవరి కుర్చీనైనా లాగివేయగలిగిందీ అతడే. రాష్ట్ర రాజ్యాంగమే ఈ రకమైన వ్యక్తి నియంతృత్వానికి ఆస్కారం ఇచ్చేటప్పుడు ప్రజాస్వామ్యం ఎలా నిలుస్తుంది? ప్రజలకు మేలు ఎలా కలుగుతుంది?

ప్రార్థనా స్థలాలను ఉగ్రవాదులు దుర్వినియోగం చేయడాన్ని అడ్డుకునేందుకు ఖలిస్తానీల వీరంగం ఉధృతంగా సాగుతున్న సమయంలో కేంద్ర ప్రభుత్వం ఒక చట్టం తెచ్చింది ఇలాంటి పరిస్థితుల్లో మిగతా అన్ని రాష్ట్రాల కంటే ఎక్కువగా కాశ్మీర్‌కే అది అవసరం కాని – దేశంలో ఒక్క జమ్మూ కాశ్మీర్‌లోనే దానికి చెల్లుబాటు లేదు కారణం మామూలే ఆర్టికల్ 370।

కాశ్మీర్ పౌరుడికి భారత పౌరసత్వం అడక్కుండానే అందుతుంది. అతడు భారతదేశంలో ఎక్కడికైనా వెళ్ళి స్థిరపడవచ్చు వెళ్ళిన చోటల్లా ఓటుహక్కు పొంది ప్రజాస్వామ్య విధానంలో తన వంతు పాత్రను యధావిధిగా నిర్వర్తించవచ్చు కాని – భారత పౌరుడికి కాశ్మీర్ పౌరసత్వం మాత్రం అడిగినా రాదు చాలా ఏళ్ళుగా అక్కడ ఉంటున్నా ఆస్తి కొనలేడు ఓటూ చేయలేడు స్టేట్ గవర్నమెంటు ఉద్యోగమూ పొందలేడు ఇంతకంటే అన్యాయం, భారత జాతీయతకు, జాతి సమైక్యతకు, సార్వభౌమాధికారానికి ఇంతకంటే అపచారం మరొకటి ఉంటుందా? ఈ రకమైన దుర్విచక్షణ వల్ల నష్టపోయేది బయటి నుంచి కొత్తగా అక్కడికి వెళ్ళగోరేవారు మాత్రమే కాదు. దేశ విభజన సమయంలో అల్లర్లకు, ఊచకోతలకు భయపడి పశ్చిమ పాకిస్తాన్ నుంచి కట్టుబట్టలతో వచ్చి జమ్మూ, కాశ్మీర్‌లో స్థిరపడ్డ లక్షపైచిలుకు హిందువులకు యాభై ఏళ్ళుగా అక్కడ ఉంటున్నా కాశ్మీరీ పౌరసత్వం లేదు వారికీ, వారి పిల్లలకూ, మనవలకూ కనీస మానవ హక్కులే కరవు. పంచాయతీ నుంచి పార్లమెంటుదాకా ఏ ఎన్నికలోనూ వారికి ఓటుహక్కు ఉండదు ఏ గవర్నమెంటు ఏజన్సీ వారికి పైసా అప్పివ్వదు వారి బిడ్డలను ఏ కాలేజీలోనూ చేర్చుకోరు. సామాజిక, ఆర్థిక, రాజకీయ సమానత్వం గురించి మనం చెప్పుకునే కబుర్లు వింటే వారు ఏడవలేక నవ్వుతారు

ఇంకో సంగతి. పాకిస్తాన్ నుంచి ప్రాణభయంతో శరణుజొచ్చిన హిందువులకైతే పౌరసత్వం లేదు గాని – అదే పాకిస్తాన్ నుంచి బాగుపడదామని వలస వచ్చిన ముస్లింలకు మాత్రం పౌరసత్వమిచ్చి, అక్కడే స్థిరపడేందుకు సకల రిసెటిల్మెంటు సదుపాయాలూ కలగజేసిన ఘనత జమ్మూ కాశ్మీర్ పాలకులది! ఇండియాలో భాగమనుకునే కాశ్మీర్‌లో ఇతర రాష్ట్రాల భారతీయులకయితే నివాసార్హత ఉండదు పాకిస్తానీలకు మాత్రం ఎర్రతివాచీ స్వాగతం లభిస్తుంది. ఈ రకమైన అడ్డగోలు అక్రమాలను ఇన్నేళ్ళూ కళ్ళు మూసుకుని సాగనివ్వడం వల్లే జమ్మూ కాశ్మీర్ జనాభాలో వివిధ మత వర్గాల మధ్య ఒకప్పుడున్న నిష్పత్తి మారిపోయింది హిందువులను వేధించి వేటాడి తరిమేసి పాకిస్తానీలను స్థిరపడనివ్వటంతో కాశ్మీర్ వాసుల్లో ఇండియాను ద్వేషించే వారి సంఖ్య క్రమేణా పెరిగింది చివరికి మన నాయకుల చేతకానితనంవల్ల, బాధ్యతా రాహిత్యంవల్ల మొత్తం కాశ్మీరే మానసికంగా మనది

కాకుండా పోయింది

కాలం చెల్లిన ఆర్టికల్ 370ని ఇంకా కొనసాగించడం ఎందుకని అడిగితే మన మహానాయకులు చెప్పే కారణం - దాన్ని కనక తొలగిస్తే కాశ్మీర్ ప్రజల సుకుమారపు మనసులు గాయపడతాయని! కాశ్మీర్ అటానమీకి కొంప మునుగుతుందని! రాజ్యాంగంలో ఇంతకాలమూ ఉన్న ప్రత్యేక ప్రతిపత్తిని హఠాత్తుగా తీసేస్తే జమ్మూ కాశ్మీర్ వాసుల్లో అభద్రతా భావం పెరుగుతుందని! మన అంతర్యాల పట్ల అనుమానాలు మొలుస్తాయని! అంతర్జాతీయంగా చెడ్డపేరు వస్తుందని ఇది హాస్యాస్పదమైన వెర్రిమొర్రి వాదన

జమ్మూ కాశ్మీర్ రాష్ట్రం జమ్మూ, కాశ్మీర్, లడాఖ్ అనే మూడు ప్రాంతాల సముదాయం ఇందులో జమ్మూ, లడాఖ్ ప్రజలకు ప్రత్యేక రాజ్యాంగ ప్రతిపత్తి మొదటి నుంచీ ఇష్టంలేదు 370 ఆర్టికల్‌ను ఎత్తేసి భారత జీవన లహరిలో తమను పూర్తిగా కలిపేసుకోవాలనే వారు మొత్తుకుంటున్నారు ఇక మిగిలింది కాశ్మీర్ లోయ దానిలోని పేదలకు ప్రత్యేక ప్రతిపత్తివల్ల ఒరిగింది సున్న అది వచ్చాక వారి బతుకులు మరింత దుర్భరమయ్యాయి. పేదరికం, వెనకబడినతనం ఇంకా పెరిగాయి బాగుపడిందల్లా కాశ్మీరీ ముస్లింల్లో సంపన్నులైన భూస్వాములు, రాజకీయ దళారులు, అవినీతిపరులైన నాయకులు మాత్రమే ఇతర ప్రాంతాల వారు పోటీకి వచ్చే వీలు లేకుండా చేయడంవల్ల కాశ్మీర్‌లో భూముల, ఆస్తుల విలువ బాగా పడిపోయింది రాజకీయ తిమింగలాలు అందిన మేరకు వాటిని కైంకర్యం చేశాయి మిగతా రాష్ట్రాల్లో వలె బయటి పెట్టుబడులకు ఆస్కారం లేకపోవటంతో ఆర్థికరంగం డీలాపడి సామాన్యుల బతుకు బరువు దుర్భరమైంది బయటి వారెవరో ఇక్కడి సంపదను తరలించుకుపోకుండా కంచె కట్టటంవల్ల రాష్ట్రానికి ఆర్థిక స్వావలంబన చేకూరిందీ లేదు

నేటికీ జమ్మూ కాశ్మీర్ ఆర్థిక వ్యవస్థ బతికేది పూర్తిగా కేంద్ర నిధుల మీద ఆధారపడే పన్నుల రూపేణా రాష్ట్రంలో వసూలయ్యేది సిబ్బంది జీతాలకే చాలదు ప్రణాళిక, ప్రణాళికేతరమైన ఫైనాన్సుకు కేంద్ర ప్రభుత్వమే శరణ్యం మొత్తం రాబడిలో నాలుగింట మూడొంతుల పైగా కేంద్ర నిధుల నుంచి బదలాయించేదే పంచవర్ష ప్రణాళికలన్నిటికీ కేంద్ర సాయమే దిక్కు. ఇంతవరకూ జమ్మూ కాశ్మీర్‌కు పెద్దపీట వేసి స్పెషల్‌గా అరగింపు చేసిన లక్షల కోట్ల రూపాయల్లో అధిక భాగం రాజకీయ పార్టీల నాయకులను, రాజకీయ దళారీలను, లంచగొండి అధికారులను మాత్రమే బాగుచేసింది. అందులో కనీసం పదోవంతు అభివృద్ధి కోసం సవ్యంగా వినియోగమైనా కాశ్మీర్‌కు ఈపాటికి మహర్దశ అందుకునేది దేశాన్ని కొట్టి కాశ్మీర్‌కు పెట్టిన 'ప్రత్యేక ప్రతిపత్తి'ని ఇలాగే నిరవధికంగా

సాగనివ్వాలని గద్దలు, పందికొక్కులు కోరుకోవడం సహజమే కాని – ప్రజలపట్ల, దేశంపట్ల బాధ్యతగల భారత నాయకులు కూడా ఈ దొంగల దోపిడీకి దోసిలి ఒగ్గడం ఎంతవరకు సమంజసం? నిజం కానలేని, తప్పును దిద్దలేని, న్యాయం చేయలేని, చేవ చచ్చిన నిస్పృహాయత దేశాన్నేలే ప్రభుత్వానికి ఎటువంటి గర్వకారణం?

370 అధికరణం మీద అలిండియా స్థాయిలో వక్తృత్వపు పోటీ పెడితే ఫస్టు ప్రైజు అటల్ బిహారీ వాజపేయికి, సెకండ్ ప్రైజు అద్వానీకి రావడం గ్యారంటీ. ఈ అధికరణం ఎంత నిరర్థకమో, అనర్థకమో వారికంటే బాగా తెలిసిన వారు లేరు గతంలో అపోజిషన్లో కూచున్నంత కాలమూ... భారతీయ జనతా పార్టీకి వాయిదాల పద్ధతిన అధ్యక్షత్వం వెలిగించినంత సేపూ- ఈ ఇద్దరు మహా నాయకులు ఆర్టికల్ 370 పేరు చెపితే రయిరయిలాడేవారు. భా జ పా కనుక అధికారంలోకి వస్తే అర్జంటుగా చేసే మొదటి పని ఈ దండుగమారి అధికరణాన్ని ఎత్తేయడమేనని వారు గొప్ప నమ్మకమే కలిగించారు. మూడు నాలుగేళ్ల కిందటిదాకా ప్రతి ఎన్నికల ప్రణాళికలోనూ '370 ఎత్తివేత'ను పెద్దక్షరాలతో రాసి చూపించే వారు ఒట్లు తీసి గట్టున పెట్టి, పాత వాగ్దానాలను కాశీలో వదిలి, అధికారంకోసం విధానాలకు విడాకులిచ్చి, సెంటర్లో కుంటి కుర్చీని నిలబెట్టు కోవడం కోసం ఫరూక్ అబ్దుల్లాలాంటి వారిని ఆశ్రయించి ఎన్డీఏ డేరాలో దూరాక సహజంగానే 370 అధికరణం ఊసెత్తడం వారు మానేశారు. దాన్ని కనక ఎత్తేస్తే కొత్తగా తాము సెక్యులర్ చారల కోసం ఒంటినిండా వేయించుకున్న వాతలు ఎక్కడ మాసిపోతాయోనని పాపం, వారి భయం! అవకాశవాదులు జాతీయ నేతలుగా చలామణీ అయినంతకాలం ఆర్టికల్ 370 చిరంజీవి ఆ అడ్డుగోడను కూల్చటానికి ధైర్యం చాలనప్పుడు కాశ్మీర్ ఇండియాలో సమగ్ర భాగమని, దానిని ఎవరూ వేరు చేయలేరని ఉత్తుత్తి ప్రగల్భాలు పలకడమైనా మన నాయకశ్రీలు మానేస్తే మేలు.

# ఆక్రమిత కాశ్మీరే అసలు సమస్య

పాకిస్తాన్ నియంత పర్వేజ్ ముషారఫ్‌కు పాపం కన్ను మూసినా తెరిచినా కాశ్మీరే కనిపిస్తుంది. భారతీయులతో కాశ్మీర్ మినహా ఇంకో సంగతి మాట్లాడడట. అన్ని సమస్యలకూ, అన్ని టెన్షన్లకూ కాశ్మీరే ఆదిమూలమట. కాశ్మీరీలకు మహా అన్యాయమేదో జరిగిపోతున్నదట. కాశ్మీర్ ప్రజల న్యాయబద్ధ పోరాటానికి అండదండలందించి వారి స్వాతంత్ర్యాన్ని, స్వయం నిర్ణయాధికారాన్ని (ఇండియా బారినుంచి) కాపాడటం కోసమే ఈయన ఊపిరి పీల్చి వదులుతున్నాడట.

ముషారఫ్‌గారి సొంత దేశం ప్రజలకే స్వాతంత్ర్యం లేదు; స్వయం నిర్ణయాధికారమూ లేదు. ఆ రెండిటినీ మిలటరీ ఇనుప బూట్లకింద అణచివేసి, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని కూలదోసి, రాజ్యాంగ విరుద్ధంగా ప్రెసిడెంటును పడగొట్టి సర్వాధికారాలూ దౌర్జన్యంగా గుంజుకున్న పెద్ద మనిషి కాశ్మీర్ ప్రజల స్వయం నిర్ణయాధికారం గురించి మాట్లాడటమంటే దయ్యాలు వేదాలు వల్లించినట్టే ఉంటుంది.

ఇండియాలో కాశ్మీర్ విలీనానికి తిరుగులేదని ఇండియా ఎప్పుడు చెప్పినా పాకిస్తాన్ అరిగిపోయిన రికార్డులా వినిపించేది.. కాశ్మీర్ ప్రజలు సమ్మతిస్తే తప్ప విలీనం ఖరారు కాదని! ఐక్యరాజ్య సమితి పాత తీర్మానాల ప్రకారం ప్లెబిసైట్ జరిపించాలని! జమ్మూ కాశ్మీర్‌లో ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజలెన్నుకున్న రాజ్యాంగ నిర్ణయ సభ ఆ రాష్ట్రం ఇండియన్ యూనియన్‌లో సమగ్ర భాగంగా కొనసాగుతుందని *(The State of Jammu and Kashmir is and shall be an integral part of the Union of India)* అని 1956 నవంబర్ 17న తీర్మానించిననాడే విలీనానికి ప్రజల ఆమోదం షరతు తీరింది

ఇక ఐక్యరాజ్య సమితి తీర్మానాల ఊసు ఎత్తకపోవడం పాకిస్తాన్‌కే మంచిది. వాటి గురించి వివరిస్తే పెద్ద గ్రంథమవుతుంది మామూలు మాటల్లో క్లుప్తంగా చెప్పాలంటే... జమ్మూ కాశ్మీర్ రాష్ట్రంలో తాను బలవంతంగా ఆక్రమించిన ప్రాంతాలను పాకిస్తాన్ ఖాళీ చేస్తేగాని ప్లెబిసైట్ జరపటానికి వీలు లేదు వాటిని విడిచిపెట్టటానికి పాకిస్తాన్ సిద్ధంగా లేదు

అదీ అసలు సమస్య

పూర్వపు జమ్మూ కాశ్మీర్ సంస్థానం ఇండియాలో విలీనమైనప్పుడు ఆ సంస్థానంలో జాగా యావత్తూ భారతదేశానికే చెందాలి. కాని – పూర్వపు జమ్మూ కాశ్మీర్ రాష్ట్రంలో మూడోవంతు భూభాగం నేటికీ పాకిస్తాన్ దురాక్రమణలో ఉంది నేటికీ ఇండియా మ్యాప్‌లో ఆ ప్రాంతమంతా మనకే చెందినట్టు చూపించుకుంటున్నాం. ఆ గీతలో మిల్లీ మీటరు అటూ ఇటూ అయినా మనం సహించం ఆ ప్రాంతంలో చిన్న పట్నాన్ని పాకిస్తాన్ కింద ఎవరైనా ఏ మ్యాపులోనైనా చూపించితే మన ప్రభుత్వం ఊరుకోదు అలాంటి మ్యాపుగల పత్రికనుగాని, పుస్తకాన్నిగాని, మరొకదాన్నిగాని దేశంలోకి అనుమతించదు దురదృష్ట మేమిటంటే – మ్యాపుల్లో గీతల విషయంలో చూపించే శ్రద్ధ నేల మీద వాస్తవాధిపత్యం విషయంలో మన ప్రభుత్వాలకు కరువైంది వేలకువేల వేల చదరపు మైళ్ల భారత భూమిని పాకిస్తాన్ కబ్జానుంచి విడిపించి తిరిగి స్వాధీన పరచుకునే మగటిమి మనకు కొరవడింది పాక్ ఆక్రమిత కాశ్మీర్‌ను వశం చేసుకోవాలని భారత పార్లమెంటు తీర్మానించి ఏడేళ్లు గడిచినా ఆ దిశలో కనీసం ఒక అడుగు ముందుకు పడలేదు సైనిక చర్యతో – స్వాధీన పరచుకునే సంగతి దేవుడెరుగు కనీసం . ఐక్యరాజ్య సమితి స్పష్టంగా గర్హించిన దురాక్రమణను విరమించి, ఐక్యరాజ్య సమితి మనకే హక్కని తేల్చిన మా భూమిని మాకు ఎప్పుడు అప్పగిస్తారని అనునయంగా పాకిస్తాన్‌ను అడిగేందుకు కూడా మన ప్రభుత్వం తెగువ చూపడంలేదు అది అలుసుగా తీసుకునే ఇస్లామాబాద్ అడ్డం తిరిగి, మనకు మిగిలిన కాశ్మీర్‌ను కూడా మననించి కబళించేందుకు కుతంత్రాలను సాగిస్తోంది

కాశ్మీర్ ప్రజల స్వాతంత్ర్యం స్వయం నిర్ణయాధికారం అంటూ విసుగులేకుండా మాట్లాడే సైనిక నియంత ముషారఫ్‌ను నిలదీసి అడగవలసిన ప్రశ్న ఒకే ఒకటి మీరు మాట్లాడుతున్నది ఏ కాశ్మీర్ గురించి అని!

భారతదేశంలోని జమ్మూ కాశ్మీర్ రాష్ట్రం గురించి అయితే – నోరెత్తే అర్హత ముషారఫ్‌కు లేదు పాకిస్తానీలు, వారి తొత్తులైన హురియత్‌లూ, హిజ్‌బుల్‌లూ, లష్కర్లూ ఎంత విషం గక్కినా ఆ రాష్ట్ర వాసులకు న్యూఢిల్లీనుంచి వచ్చిన విపత్తు ఏదీ లేదు మిగతా దేశమంతటా వర్తించే రాజ్యాంగం ఆ రాష్ట్రంలోనూ అమల్లోవుంది మరే రాష్ట్రానికి లేని ప్రత్యేక ప్రతిపత్తి,

ప్రత్యేక రక్షణలు ఆ రాష్ట్రానికి ఉన్నాయి. మరే రాష్ట్రానికి ఇవ్వని విధంగా ఏటా వందలకోట్ల రూపాయలను ఆ రాష్ట్రంమీద కేంద్రం కుమ్మరిస్తున్నది. చట్టబద్ధంగా ఎన్నికైన అసెంబ్లీ, దానికి బాధ్యత వహించే ప్రభుత్వం పనిచేస్తున్నందువల్ల ముషారఫ్ సొంత దేశంలో కంటే ఆ రాష్ట్రంలోనే ప్రజాస్వామ్యం ఎన్నో రెట్లు మెరుగు జమ్మూ కాశ్మీర్‌కు పట్టిన శనల్లా సీమాంతర ఉగ్రవాదం. దాని విషయంలో బోనులో నిలబెట్టాల్సింది పాకిస్తాన్‌ను మన కాశ్మీర్ గురించి ముషారఫ్ ముఖ్యంగా సంజాయిషీ ఇవ్వాల్సిందికూడా దాన్ని గురించే.

పోతే... స్వాతంత్ర్యం లేనిదీ, స్వయం నిర్ణయాధికారం కరవైనదీ పాకిస్తాన్ పెత్తనంలోని సోకాల్డ్ "అజాద్ కాశ్మీర్" వాసులకు! కాశ్మీర్ ప్రజలకు తమ భవిష్యత్తును తాము నిర్ణయించుకునే స్వేచ్ఛ ఉండాలని తాను నొక్కి చెబుతున్న నీతి సూత్రాన్ని ముషారఫ్ మొట్టమొదట అమలు చేయవలసింది పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోనే

ఆక్రమిత కాశ్మీర్ అని చెప్పుకోవడమే గాని అక్కడి స్థితిగతులు ఎలాంటివో, అక్కడి అధికార వ్యవస్థ ఎంత నిరంకుశమైనదో, పాకిస్తాన్ తన ఉక్కుపాదాల కింద దానిని ఎలా అణచివేస్తున్నదో మన దేశంలో చాలామందికి తెలియదు 1947 అక్టోబర్‌లో భారీ ఎత్తున సైనిక సన్నాహాలు సాగించి ఆఫ్ఘాన్ ముజాహిదీన్లను సమీకరించి, పాక్ సైన్యాధికారులను మఫ్టీలో తోడు ఇచ్చి జమ్మూ కాశ్మీర్ మీదికి మిడతల దండెత్తించింది పాకిస్తానేనన్నది జగమెరిగిన సత్యం అదేదో కొండ జాతి రెయిడర్ల పని అని, తనకు ఎలాంటి సంబంధం లేదని బహిరంగంగా బుకాయిస్తూనే ఆక్రమిత ప్రాంతాలను జంకు లేకుండా పాకిస్తాన్‌లో కలిపేసుకున్నారు. ఇది రెండు విధాలుగా జరిగింది గిల్గిట్, బాల్టిస్తాన్‌లను "ఉత్తర ప్రాంతాలు" అని వ్యవహరిస్తూ నేరుగా ఇస్లామాబాద్ ఆధీనంలోకి తెచ్చుకున్నారు. ముజాఫరాబాద్, బాగ్, రావల్‌కోట్, కోట్లీ, మీర్‌పూర్‌లనే ఐదు జిల్లాలనేమో "ఆజాద్ కాశ్మీర్" అని పేరుపెట్టి "లోకల్ అథారిటీ" తడిక చాటున పాకిస్తాన్ పెత్తనం సాగిస్తున్నది

జమ్మూకాశ్మీర్ రాష్ట్రం చట్టబద్ధమైన Instrument of Accession (విలీన పత్రం) ద్వారా ఇండియాలో కలిసినట్టు ఆక్రమిత కాశ్మీర్‌ను పాకిస్తాన్‌లో ఎవరూ ఎప్పుడూ చట్టప్రకారం విలీనం చేయలేదు. ఇస్లామాబాదే తెగబడి ఏకపక్షంగా దాన్ని దశల వారీగా విలీనం చేసేసుకుంది 1974లో ఇస్లామాబాద్ బలవంతంగా తెచ్చి రుద్దిన The Azad Jammu & Kashmir Interim Constitution అధ్యక్షుడినుంచి లెజిస్లేటర్ల వరకూ ఆఫీస్ బేరర్లందరూ పాకిస్తాన్‌లో జమ్మూ కాశ్మీర్ రాష్ట్రం విలీనానికి విధేయులుగా ఉంటామంటూ ప్రమాణం చేయాలని నిర్దేశిస్తుంది.

తమ భవిష్యత్తును తాము నిర్ణయించుకునే స్వేచ్ఛ కాశ్మీరీలకు ఉండాలని, ఇండియా, పాకిస్తాన్‌లలో ఎటు విలీనమయ్యేదీ తమ ఇష్ట ప్రకారం వారిని తేల్చుకోనివ్వాలని పాకిస్తాన్ పాలకులు పెద్ద గొంతుతో మనకు నీతి పాఠాలు చెబుతూంటారు కాని అదే స్వేచ్ఛను, స్వయం నిర్ణయాధికారాన్ని తమ ఆధిపత్యంలోని కాశ్మీరీలకు మాత్రం వారు ససేమిరా అనుమతించరు *"No person or political party in Azad Jammu & Kashmir shall be permitted to propogate against, or take part in activities prejudicial or detrimental to the ideology of the state's accession to Pakistan"* (*అజాద్ జమ్మూ కాశ్మీర్‌లోని ఏ వ్యక్తిగానీ, ఏ రాజకీయ పార్టీగానీ పాకిస్తాన్‌లో రాష్ట్ర విలీనానికి విరుద్ధంగా, భంగకరంగా ఎలాంటి ప్రచారం చేయడానికిగాని, కార్యకలాపాల్లో పాల్గొనడానికిగాని అనుమతించబడదు*) అని ''అజాద్ కాశ్మీర్'' రాజ్యాంగంలోని 7 (2) అధికరణం స్పష్టంగా చెబుతుంది ఇండియాలోని కాశ్మీరీలకు తాను కోరే స్వయం నిర్ణయాధికారాన్ని తన గుప్పిట్లోని కాశ్మీరీలకు మాత్రం పాకిస్తాన్ దక్కనివ్వదు అ మాటకొస్తే ఇండియాలోని కాశ్మీరీలకు కూడా ఇటు ఇండియాకూ అటు పాకిస్తాన్‌కు చెందకుండా స్వతంత్రంగా ఉండే అవకాశాన్ని ఇస్లామాబాద్ కలలోకూడా ఇవ్వదు పాకిస్తానీ భాషలో ''స్వయం నిర్ణయాధికారం'' అనగా పాకిస్తాన్ కాళ్లకింద తొత్తుగా పడి ఉండకోరటమే!

ప్రాథమిక హక్కులు, ప్రజాస్వామిక స్వేచ్ఛలు ఇంత లక్షణంగా ఉంటే - అజాద్ కాశ్మీర్‌లో అధికార వ్యవస్థ మరీ విపరీతం! అక్కడి అసెంబ్లీలో మొత్తం స్థానాలు 48 ఇందులో రాష్ట్ర ప్రజలు నేరుగా ప్రతినిధులను ఎన్నుకునేవి 28 స్థానాలకు మాత్రమే. మిగతా 20లో 12 పాకిస్తాన్‌లోని జమ్మూ కాశ్మీర్ శరణార్థులకు రిజర్వు అయ్యాయి పూర్వం జమ్మూ కాశ్మీర్ రాష్ట్రంలో ఉండి దేశ విభజన సమయంలో పాకిస్తాన్‌కు వలస వెళ్లి అక్కడే స్థిరపడినవారు వీటికి ప్రతినిధులను ఎన్నుకుంటారు వారు పాకిస్తాన్‌లో ఎక్కడైనా స్థిరపడి ఉండవచ్చు. పాకిస్తాన్ పౌరసత్వం, పాకిస్తాన్ పాస్‌పోర్టుకూడా వారికి ఉండవచ్చు అయినా ఒకప్పుడు కాశ్మీరీలు కనక ఈ పాకిస్తానీల్లో ఎవరైనా అజాద్ కాశ్మీర్ అసెంబ్లీకి అ రాష్ట్రప్రజలతో నిమిత్తం లేకుండా ఎన్నికైనా కావచ్చు ఇలా రిజర్వుడు కేటగిరిలో పాకిస్తాన్‌లోని రావల్పిండి నుంచి లోగడ పోటీ చేసిన సర్దార్ సికిందర్ హాయత్ అజాద్ కాశ్మీర్‌కు ఏకంగా ప్రధానమంత్రే అయ్యాడు (పూర్వపు జమ్మూ వాసులకు 6, పూర్వపు కాశ్మీర్ వాసులకు 6 పోగా రిజర్వుడు కేటగిరిలో మిగిలిన 8లో ఒకటి ముస్లిం మత పెద్దలకు, ఒకటి విదేశాల్లోని కాశ్మీరీలకు, ఒకటి టెక్నోక్రాట్లకు ప్రత్యేకం. ఐదేమో మహిళల కోసం)

పోనీ మొత్తం 48లో రిజర్వేషన్లు పోగా అసెంబ్లీలోని మెజారిటీ (28) స్థానాలకు

లెజిస్లేటర్లను ఎన్నుకునేది కాశ్మీరీలే కనక ప్రభుత్వం వారి ఇష్టప్రకారమే నడుస్తుందని తృప్తి పడదామా? అసెంబ్లీ ఎన్నుకునే ప్రధానమంత్రి అధిపత్యంలో ముజాఫరాబాద్‌నుంచి అజాద్ కాశ్మీర్ గవర్నమెంటు అనేది పనిచేస్తున్నా వాస్తవంగా దానిమీద పెత్తనం చలాయించేది మాత్రం ఇస్లామాబాద్‌లోని ఆజాద్ కాశ్మీర్ కౌన్సిలు ఈ కౌన్సిల్‌కు పాకిస్తాన్ ప్రధానమంత్రి చైర్మన్ పాకిస్తాన్ అసెంబ్లీనుంచి ఆయన నామినేట్ చేసే ఐదుగురు సభ్యులు, ఆజాద్ కాశ్మీర్ ప్రధానమంత్రి; ఆజాద్ కాశ్మీర్ అసెంబ్లీ ఎన్నుకునే అరుగురు సభ్యులు, పాకిస్తాన్ ప్రభుత్వంలో కాశ్మీర్ వ్యవహారాల మంత్రి ఈ కౌన్సిల్‌లో మెంబర్లు. మొత్తం 52 సబ్జెక్టులు దీని అధికార పరిధిలోకి వస్తాయి ప్రజాజీవితానికి సంబంధించి ముఖ్యమైన అంశాలన్నింటిలోనూ శాసనాధికారం, పాలనాధికారం ఈ కౌన్సిల్‌దే దీని పరిధిలోకి రాని చిల్లర మల్లర విషయాలమీద మాత్రమే ఆజాద్‌కాశ్మీర్ ప్రభుత్వానికి పెత్తనం

పేరుకు రెండు దొంతరలున్నా ఆక్రమిత కాశ్మీర్‌లో వాస్తవాధికారం యావత్తూ ఇస్లామాబాద్ కేంద్రంగా పనిచేసే కౌన్సిల్ సెక్రటేరియట్‌ది ఆ సెక్రటేరియటేమో కాశ్మీర్ వ్యవహారాలు చూసే జాయింట్ సెక్రటరీ స్థాయి అధికారి చేతిలో ఉంటుంది హోదా కొద్దిదైనా ఆజాద్ కాశ్మీర్‌కు అతడే వైస్రాయ్! ఆ రాష్ట్రం అధ్యక్షుడైనా ప్రధాన మంత్రయినా పనులు కావాలంటే ఆ బ్యూరాక్రాట్ ముందు చేతులు కట్టుకుని నిలబడ వలసిందే ప్రధాని అయినా మరొకరయినా అధికారంలో కొనసాగేది ఇస్లామాబాద్‌కు అణగిమణగి ఉన్నంతవరకే. 1991 జులైలో ఇస్లామాబాద్ రిగ్గింగు చేసిన ఎన్నికలు చెల్లవని ప్రకటించి కొత్తగా ఎన్నికలకు ఉత్తర్వు చేసిన ''అపరాధానికి'' ఆజాద్ కాశ్మీర్ అవధాని రాజా ముంతాజ్ హుస్సేన్ రాథోడ్‌ను చర్చల నెపంతో ఇస్లామాబాద్‌కు పిలిచి, వచ్చీరాగానే అరెస్టుచేసి డిస్మిస్ ఉత్తర్వు చేతిలో పెట్టిన తీరు ఆక్రమిత కాశ్మీర్‌లో పడగనీడ ప్రజాస్వామ్యానికి చక్కటి దృష్టాంతం

ఇంచుమించు ఇంతే అవమానకరంగా ప్రెసిడెంట్ భుట్టో చేతిలో బర్తరఫ్ అయిన ఆజాద్ కాశ్మీర్ ప్రధాని సర్దార్ ఖయ్యూమ్ – పాకిస్తాన్ బారి నుంచి తన రాష్ట్రాన్ని విముక్తి చేయటానికి కలసి రమ్మని ఆక్రోశిస్తూ 1975 మేలో షేక్ అబ్దుల్లాకు రాసిన ఉత్తరంలోని ఈ కింది భాగాన్ని చూస్తే ఆజాద్ కాశ్మీర్‌కు గల ''ఆజాదీ'' ఎంతటిదో బోధపడుతుంది

*"Life has become miserable for the people, who are terrorised by the happenings in Azad Kashmir ..... The lives of Kashmiris are so imperilled that they have given up hope of breathings in freedom. Therefore, if you do not help us immediately, we, the people of Azad Kashmir will be consigned to slavery and humiliation forever"*

*(ఆజాద్ కాశ్మీర్‌లోని ఘటనలకు భయవిహ్వాలులైన ప్రజలకు బతుకు దుర్భరమైంది. కాశ్మీరీల జీవితాలు ఎంత ప్రమాదంలో పడ్డాయంటే స్వేచ్ఛగా గాలిపీల్చే ఆశను వారు వదిలేసుకున్నారు. మీరు కనుక వెంటనే సాయపడకపోతే మా ఆజాద్ కాశ్మీర్ వాసులం శాశ్వతంగా బానిసత్వంలో, అవమానాల్లో మగ్గిపోతాం )*

ఇదిగో- ఇదే రకమైన ''బానిసత్వం''లో ఇదే విధమైన అవమాన కూపాల్లో ఇండియాలోని కాశ్మీరీలను కూడా నెట్టివేయాలనే ఇప్పుడు జనరల్ ముషారఫ్ పట్టుదల! శాశ్వత బానిసత్వంలో మగ్గే ''స్వయం నిర్ణయాధికారం'' మన కాశ్మీరీలకు ప్రసాదించడం కోసమే ఆయన అహరహం తహతహలాడుతూ కడవలకొద్దీ మొసలి కన్నీరు కార్చేస్తున్నారు.

ఆదినుంచీ మనదైన, న్యాయంగా మనకు చెందాల్సిన ఐదువేల చదరపు మైళ్ల విశాల భూభాగంలో ప్రజలను చెరబట్టి, ప్రజాస్వామ్యాన్ని బలత్కారించే పాకిస్తాన్ దాష్టీకాన్ని ఇంతకాలం మనం సహించి ఊరుకుంటున్నాము కనకే అదే క్షుద్రవిద్యను మిగతా కాశ్మీర్ మీదా ప్రయోగించటానికి జనరల్ ముషారఫ్ ఉవ్విళ్లూరుతున్నాడు

ఆక్రమిత కాశ్మీర్ మొదలుకుని మన కాశ్మీర్‌లో టెర్రరిజాన్ని ఎగదోసి ప్రాక్సీయుద్ధం సాగించడం వరకూ ఇన్నేళ్లుగా ఇస్లామాబాద్ అడుగడుగునా ప్రదర్శిస్తున్న తెంపరితనం వల్లే ఇండియా- పాకిస్తాన్ సంబంధాలు ఇంత అధ్వాన్నమయ్యాయి ఈ అసలు సంగతి వదిలేసి వీసాలు, బస్సులు, వ్యాపార లావాదేవీల్లాంటి కొసరు విషయాలు మాట్లాడుకోవటం వల్ల ఉద్రిక్తత తొలగడం కల్ల ''కాశ్మీరే అసలు సమస్య'' అని మనం అనవలసిన మాటను ముద్దాయి ముషారఫే అంటున్నాడు ఇక మన ప్రభువులకు సంకోచమెందుకు? అవును బాబూ (ఆక్రమిత), కాశ్మీరే అసలు సమస్య అని నిలదీయడానికి గుంజాటన ఎందుకు?

# ముషారఫ్‌తో ముషాయిరా

***పాకిస్తాన్‌తో మనకు ఇప్పటికి నాలుగు యుద్ధాలు వచ్చాయి. నాలుగుసార్లూ మనమే గెలిచాం. దొంగదాటు దురాక్రమణలను సైనిక పరాక్రమంతో ఎదుర్కొని పాకిస్తానీలకు వారికి అర్థమయ్యే భాషలో బుద్ధిచెప్పాం కాని, చెప్పుకుంటే సిగ్గుచేటు! నాలుగు యుద్ధాలను ఘనంగా గెలిచిన మనం (అప్రకటిత) 'ఐదో' యుద్ధంలో ఘోరంగా ఓడిపోయాం. ఇక్కడ ప్రస్తావిస్తున్నది 2001 జూలై 15, 16 తేదీల్లో జరిగిన ఆగ్రా 'శిఖరాగ్ర' సందర్భంలో సాగిన ప్రాపగాండా యుద్ధాన్ని బహుశా ఓడిపోయామని చెప్పటం కూడా సరికాదేమో అసలు – పోటీలో పాల్గొంటే కదా ఓడిపోవడానికి?***

అసమర్థ నిర్వాకంలో తన రికార్డును తానే బద్దలు కొట్టాలన్నది ఏకసూత్ర కార్యక్రమంగా పెట్టుకున్న వాజపేయి ప్రభుత్వం కాల్పుల విరమణ సీరియల్ రసాభాసకు ముక్తాయింపుగా ముషారఫ్‌తో ముచ్చట్ల పేరంటం పెట్టింది అంతవరకూ ముషారఫ్ సైనిక ప్రభుత్వం అస్తిత్వాన్నే గుర్తించటానికి నిరాకరించిన వారు హఠాత్తుగా ప్లేటు మార్చి, ''కార్గిల్ విలన్'' ను శిఖరాగ్ర స్థాయి సమాలోచనలకు (బ్రెయిన్‌వేవ్ వచ్చినదే తడవుగా) శుభలేఖ పంపారు సదరు ''శిఖరాగ్రం'' ఎక్కడ ఏ తేదీల్లో జరిగేదీ, ఇండియా – పాకిస్తాన్ దేశాల్లో ఎవరికీ తెలియకముందే ఇంకా ఖరారు కాలేదని రెండు ప్రభుత్వాలూ చెబుతుండగానే ఆగ్రాలో జూలై నెల ఫలానా తేదీల్లో అధికనాయక సమావేశం జరగబోతున్నట్టు అమెరికా ప్రభుత్వాధికారి ఒకరు వాషింగ్టన్‌లో బయటపెట్టడం ఇంకో చోద్యం

ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన నవాజ్ షరీఫ్ ప్రభుత్వాన్ని కుట్రచేసి కూలదోసి తాను గుంజుకున్న అధికారానికి స్వదేశంలోనే ప్రధాన రాజకీయపక్షాల మద్దతు పొందలేక, రాజ్యాంగాన్ని తుంగలో తొక్కి దేశాధ్యక్షుడినీ పక్కకునెట్టి తాను ''అధ్యక్ష భుజకీర్తి'' ని

అక్రమంగా తగిలించుకోవడాన్ని అమెరికా ప్రభుత్వం సైతం గర్హించిన ప్రతికూల పరిస్థితుల్లో తన ప్రధాన శత్రువుగా పాకిస్తాన్ పరిగణించే దేశాన్ని, అందులోనూ ప్రపంచంలోకెల్లా అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమైన ఇండియాను ఏలుతున్న వాజపేయి చర్చలకు రమ్మంటూ సాదర హస్తం చాచటం ముషారఫ్‌కు అయాచిత వరమైంది తన రాజకీయ స్వప్రయోజనాలకు దాన్ని వాటంగా ఉపయోగించుకుని, ప్రత్యుపకారంగా ఇండియాను దాని వేలితో దాని కన్నే పొడవటానికి ఆ సైనిక నియంత పెద్ద ప్లానే వేశాడు మనవారి చేతగానితనంవల్ల చాలా వరకు కృతకృత్యుడయ్యాడు కూడా!

***

లాహోర్ 'యాత్రా స్పెషల్' గుర్తుందా? అప్పట్లో పాకిస్తాన్ గద్దెమీద కూచున్న నవాజ్ షరీఫ్‌ను గాఢాలింగనం చేసుకుని, శాంతి సఖ్యతల కొత్త శకం అర్జంటుగా ఆవిష్కరించటానికి భారత ప్రధాని వాజపేయి బస్సెక్కిపోతే ఆయనకు స్వాగతం పలకటానికి పాక్ ప్రధానితో సహా ఉండాల్సిన వారందరూ సిద్ధంగా ఉన్నారు

ఒక్క మనిషి తప్ప

అతడి పేరు జనరల్ ముషారఫ్ అప్పట్లో పాకిస్తాన్‌కు సేనాపతి (ఇప్పుడూ ఆ పదవి ఆయనదేలెండి ) ప్రొటోకాల్ ప్రకారం విశిష్ట అతిథి సాదర స్వాగతానికి సేనాపతి కూడా వెళ్ళితీరాలి వెళితే శాల్యూట్ చేయాలి భారతదేశం పాలకుడికి అంత గౌరవం ఇవ్వటం ముషారఫ్‌కు ఇష్టం లేకపోయింది అందుకే- తాను లేని లోటు కొట్టొచ్చినట్టు కనిపిస్తుందని తెలిసినా మొగం చాటేశాడు తన ప్రైమ్మినిస్టరూ, ఇండియన్ ప్రైమ్మినిస్టరూ కరచాలనాలు చేసుకుని, కవిత్వాలు చెప్పుకుని స్నేహ ప్రమాణాలు చేసుకుని, మంచికాలం మొత్తానికి వచ్చేసిందని అటూ ఇటూ జనం ఆదమరచి ఉండగా, జనరల్ ముషారఫ్ వేరే 'ఆపరేషను'లో మహా బిజీ అయిపోయాడు ఆ అతిరహస్య వ్యూహమేమిటో నాలుగు నెలల్లో బయటపడింది

***

మేజర్ పద్మపాణి ఆచార్య గుర్తున్నాడా?

కెప్టెన్ విజయంత్ థాపర్? హనీఫుద్దీన్? శరవణన్?

కార్గిల్ కొండల్లో ఊపిరాడనంత ఎత్తున ఎముకలు కొరికే చలిలో త్రివర్ణ పతాకాన్ని నిలబెట్టడం కోసం హోరాహోరీ పోరాడి వీరమరణం పొందారు వారు అలాంటివారు

ఇంకా ఐదొందలమంది ఉన్నారు అందరి గుండెలనూ చీల్చి అందరి పుత్రులను పేల్చిన బుల్లెట్లు ముషారఫ్ సైన్యం నుంచే వెలువడ్డాయి. టీవీలో క్రికెట్ మాచి చూసినట్టు, టైమ్‌పాస్ కోసం దేశభక్తి ప్రబోధించే సినిమాకు వెళ్ళి ఆ కాసేపూ దేశభక్తి ఉద్వేగంతో ఉరకలెత్తినట్టు కార్గిల్ వార్ నడిచినన్ని రోజులూ యుద్ధం వార్తలు ఆసక్తిగా చదివి, చూసి, అమరవీరుల ఆత్మబలిదానానికి ఉప్పొంగిపోయి, ఆ వేడి కాస్త చల్లారగానే వేరే కాలక్షేపాల వైపు దృష్టి మళ్లించాం. మనం మరచిపోయినా కొడుకులనూ, భర్తలనూ, తండ్రులనూ, తమ్ములనూ పోగొట్టుకున్న ఆత్మబంధువులు వారిని బలిగొన్న తుపాకులనూ, ఆ తుపాకుల వెనుకనున్న ముషారఫ్‌నూ రోజూ గుర్తుచేసుకుంటూనే ఉన్నారు కార్గిల్ అమరవీరుల కుటుంబాల్లో కొన్ని ఆగ్రాలో ముషారఫ్ విడిది చేసిన చోటుకు చుట్టుపక్లే ఉన్నాయి. తమ అప్పులను పొట్టన పెట్టుకున్న శత్రువుతో బాణాసంచాలు పేలుస్తూ ఆనందోత్సవాలు సాగిస్తూ జాతీయ నాయకులు చేసిన కరచాలనాలకు, ఆలింగనాలకూ అమరవీరుల కుటుంబాలు ఎంత మురిసి ముప్పందుమై ఉంటాయో ఎవరికి వారు ఊహించుకోవచ్చు.

జనరల్ ముషారఫ్ అంతటి మహానుభావుడు మన ఆహ్వానం మన్నించి మన దేశంలో కాలు మోపనున్నాడంటేనే మనం ఒంటిమీద బట్ట నిలవనంతగా పులకరించిపోయాం ఆయన ఎలా ఉంటాడు, ఎక్కడ బస చేస్తాడు, ఏ వంటకాలు తింటాడు, విడిది గది కిటికీ నుంచి ఎలాంటి ప్రకృతి దృశ్యాలను ఆస్వాదిస్తాడు, ఆయన ఇల్లాలు ఎక్కడెక్కడికి షాపింగుకు వెళుతుంది, ఇద్దరూ కలిసి తాజ్‌మహల్ విహారంలో ఎటునుంచి ఎటు ఎన్ని అడుగులు వేస్తారు, అజ్మీర్ దర్గాకు ఎలా వెళతారు, ఢిల్లీ హవేలీని పావనం చేస్తారా లేదా. అన్న 'అతిముఖ్య' విషయాలను పత్రికలు చెలరేగి రాస్తుంటే ఎగబడి చదివాం!

హార్డ్‌కోర్ రాజకీయాల్లో సెంటిమెంట్లకు స్థానం లేదు విదేశీ నేతలతో రాజ్యతంత్రం నెరపేటప్పుడు మనవాడు, పగవాడు అని తేడాలెంచటం కుదరనిపని దేశానికి అవసరమైనప్పుడు, గొప్ప ప్రయోజనమేదో సిద్ధిస్తుందనుకున్నప్పుడు ఆజన్మ విరోధులనైనా కలిసి మాట్లాడవలసిందే పరమ క్రూరులతో కూడా సంబంధాలు పెట్టుకోవలసిందే చిరకాలంగా పేరుకుని బ్రహ్మజెముడులా అల్లుకుని ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతకు కారణమైన పేచీలను సామరస్యంగా తేల్చడానికి ఎన్ని ప్రయత్నాలైనా చేయవలసిందే ఎవరితో ఎన్ని చర్చలైనా సాగించవలసిందే ఫలానా ప్రయోజనం ఒనగూడుతుందంటే తప్ప చర్చకు కూచోమని మొరాయించటం అవివేకం. ఒక్కోసారి ఇరుపక్షాలూ నిజాయితీగా ఎంత ప్రయత్నం చేసినా అంగీకారం కుదరక పోవచ్చు అందుకు నొచ్చుకోవలసిన అవసరం లేదు కాని ఏ చర్చవల్లయినా ఉపయోగం ఉండాలంటే కనీసం చర్చించబోయేది

ఏమిటో ఉభయ పక్షాలవారికీ కచ్చితంగా తెలిసి ఉండాలి.

అధినేతల సమావేశమనేది ఆషామాషీ విషయం కాదు. ఫలప్రదం కావాలంటే దానికి ముందు ఎన్నో సన్నాహాలు కావాలి. ఎంతో స్పేడ్ వర్కు జరగాలి. అమధ్య అమెరికా – రష్యాల మధ్య 'శిఖరాగ్ర చర్చలు' జరగడానికి కొన్ని వారాల ముందునుంచి విస్తృతమైన ప్రిపరేషను జరిగింది వేయబోయే ప్రతి అడుగునూ, చేయబోయే ప్రతి ప్రకటనను అధికార వర్గాలు, సలహాదారులు క్షుణ్ణంగా చర్చించాకే బుష్, పుతిన్‌లు చర్చకు కూచున్నారు మధ్యప్రాచ్యంలో చిరకాల వైరులైన ఇజ్రేలీ, పాలస్తీనీయుల ప్రతినిధి వర్గాలు ఓస్లోలో మూడో కంటికి తెలియకుండా రహస్యంగా కలిసి, ముందస్తు చర్చలను వివరంగా సాగించి నేలను చదును చేశాకే అరాఫత్ – రాబిన్‌లు శిఖరాగ్ర సమాలోచనలకు ఉపక్రమించారు. చరిత్ర ప్రసిద్ధికెక్కిన 1972 సిమ్లా సమ్మిట్ కూడా ఇండియా, పాకిస్తాన్ అధికార బృందాలమధ్య అనేక విడతల ప్రాథమిక చర్చల తరవాతే జరిగింది. హోంవర్కు ఏమీ చేయకుండా, అడ్వాన్సు ప్రిపరేషను ఏమీ లేకుండా ఖాళీ బుర్రలతో సమాలోచనలు మొదలెడితే ఫలితం కూడా ఖాళీకాక ఏమవుతుంది?

ఇండియా– పాక్ సంబంధాలను సతమతం చేస్తున్నవి సామాన్యమైన సమస్యలు కావు. వాటిని చక్కబరచడానికి 'శిఖరాగ్ర చర్చలు', అధినాయకుల భేటీలు గతంలోనూ జరిగాయి దేశ విభజన జరిగిన కొత్తలో, కాశ్మీర్‌పైకి పాకిస్తాన్ రెయిడర్లను దండెత్తించిన ఉద్రిక్త సమయంలో 1947 నవంబర్ 1న గవర్నర్ జనరల్ మౌంట్‌బాటన్ పాకిస్తాన్ వెళ్లి జిన్నాను (ప్రధాని నెహ్రూ కూడా ఆ సమావేశంలో పాల్గొనవలసింది. ఆకస్మిక అనారోగ్యంవల్ల పడలేదంటారు) కలిసింది మొదలుకొని పాకిస్తాన్‌ను సామరస్యపు దారికి తెచ్చేందుకు ఈ 54 ఏళ్లలో కనీసం 54 సీరియస్ ప్రయత్నాలు జరిగాయి. 1965 యుద్ధంలో పాకిస్తాన్ చిత్తుగా ఓడాక సోవియట్ల చొరవతో తాష్కెంటులోనూ, 1971 యుద్ధంలో మళ్లీ ఆ దేశానికి మొహం బద్దలయ్యాక ఇందిర చొరవతో సిమ్లాలోనూ శిఖరాగ్ర చర్చలు జరిగాయి ఆ రెండు ఘట్టాల్లోనూ పాకిస్తాన్ జుట్టు మన చేతిలో ఉన్నది. దురాక్రమణదారులను తరిమికొట్టే క్రమంలో భారతసేనలు ఆక్రమించిన విశాల పాకిస్తాన్ భూభాగాన్ని విడిపించుకోవడం 1966లో పాక్ తక్షణావసరం కాగా 93వేల మంది యుద్ధ ఖైదీలను ఎలాగైనా విడిపించుకోవడం 1972లో భుట్టోకు తప్పనిసరి పని ప్రత్యర్థి పక్షం బలహీనపడ్డప్పుడే ఇవతలివారు అడకత్తెరలో నొక్కి అనుకున్నది సాధించాలి పాకిస్తాన్ పెడసరపు పోకడల మూలంగా నెత్తురోడుతున్న కాశ్మీర్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించి, ఆక్రమిత కాశ్మీర్‌నుంచి పాకిస్తాన్‌ను పట్టుబట్టి ఖాళీ చేయించడానికి ఆ రెండుసార్లూ

చరిత్ర మనకు చక్కటి అవకాశమిచ్చింది. అయినా మన నాయకులు విదేశీ వత్తిడివల్లో, లేనిపోని ఔదార్యం చూపో చేతికందిన అడ్వాంటేజీలను ఐచ్ఛికంగా వదిలేసుకున్నారు యుద్ధంలో గెలిచిన ఇండియాకు, ఇతమిత్థమైన ప్రయోజనం ఏదీ లేకుండానే . చిత్తుగా ఓడిన పాకిస్తాన్ ఏ పూచీ ఇవ్వనవసరం లేనివిధంగానే తాష్కెంట్, సిమ్లా ఒప్పందాలు కుదిరాయి. అయినా పాకిస్తానీలకు తృప్తి లేకపోయాయి 1966 తాష్కెంట్ అగ్రిమెంట్ కోసం పాకిస్తాన్‌ను తాకట్టు పెట్టారని ప్రెసిడెంట్ అయూబ్‌ఖాన్ మీద భుట్టో ధ్వజమెత్తి, అయనకు ఉద్వాసన పలకగా. . భుట్టో కుదుర్చుకున్న సిమ్లా అగ్రిమెంట్ పాకిస్తాన్‌కు తీరని హాని చేసిందని అయన వ్యతిరేకులు పెద్ద దుమారం లేపి చివరకు అయన పదవినే ఊడగొట్టారు. ఇందిరాగాంధీతో రహస్యంగా కుదుర్చుకున్న ఒప్పందాన్ని, అధీనరేఖను అతి త్వరలో అంతర్జాతీయ సరిహద్దుగా అంగీకరిస్తానని ఆమె ముందు పెట్టుకున్న ఒట్లూ సత్యాలనూ సిమ్లా పొలిమేరలు దాటగానే భుట్టో కూడా గాలికి వదిలాడు ఇండియా పట్ల ద్వేషమే చోదకశక్తిగా రాజకీయాలు నడిచే పాకిస్తాన్‌లో సొంత లాభం చూసుకోవాలనుకునే ఏ నాయకుడూ అంతకుమించి చేయగలిగింది లేదు. నడుము విరిగి కూలబడ్డ నిస్సహాయ స్థితిలో ఇండియాతో చాలా చాలా ఉదారమైన, తమకీ లాభసాటి అయిన పరిమిత ఒప్పందాలను కుదుర్చుకున్న దేశాధినేతలకే ఉద్వాసన తప్పనప్పుడు – తరువాత వచ్చిన పాలకులు మరీ బిర్రబిగిసి ఇండియాతో మూర్ఖంగా అమిత్రవైఖరి కొనసాగించడంలో ఆశ్చర్యం లేదు

ఇండియాను సైనికంగా గెలవలేమని రెండు యుద్ధాల్లో తేలిపోవడంతో ప్రచ్ఛన్న యుద్ధం సాగించి, కాశ్మీర్‌లో టెర్రరిజాన్ని ఎగదోసి ప్రాక్సీవార్‌ను సాగించడంద్వారా 'జిహాద్'ను ముందుకు తీసుకువెళ్లాలని జనరల్ జియా ఉల్ హక్ 1988లో పన్నిన 'ఆపరేషన్ టోపాక్' వ్యూహాన్నే ఇస్లామాబాద్ నేటికీ నిష్ఠగా కొనసాగిస్తున్నది ఈ మధ్య కాలంలో ప్రభుత్వాలు పతనమైనా, సైనిక కుట్రలు జరిగినా, అధినేతలు మారినా, వారిలో వారికి ఎన్ని కక్షలున్నా ఇండియాపై పగబట్టి, శాయశక్తులా వేధించి, కాశ్మీర్‌ను అపమార్గాల్లో కబళించాలన్న విధానంలో మాత్రం మార్పులేదు

అపోహలు, మనస్పర్థల గతాన్ని పాతిపెట్టి పాకిస్తాన్‌తో శాశ్వత చెలిమి నెరపాలన్న వాజపేయి ఆలోచన భేషు కానీ – ఈ ఐడియా కొత్తది కాదు. ఇంతకుముందు రాజీవ్‌గాంధీకి సరిగ్గా ఇలాంటి ఉద్దేశమే కలిగింది ఆ ఆరాటంతోటే అయన తన హయాంలో మొత్తం ఐదుసార్లు జనరల్ జియాను కలిశారు జియా దుర్మరణానంతరం బేనజీర్ భుట్టో గద్దెనెక్కాకైతే, ఇండో–పాక్ మైత్రికి అడ్డంకులన్నీ తొలగినట్టే కనిపించింది ఆయన తల్లి, ఈమె తండ్రి లోగడ సిమ్లాలో మొదలెట్టిన శాంతి ప్రక్రియను యువనాయక

ద్వయం ముందుకు తీసుకుపోవడం తథ్యమనే అందరూ ఆశించారు ఇద్దరు అధినేతలు రెండుసార్లు భేటీ వేసి అరమరికలు లేకుండా మాట్లాడుకున్నారు కానీ మాటలు మాటలే పాకిస్తాన్ చేతలు చేతలే ప్రాక్సీవార్ షరా మమూలే

అధికారం చేతులు మారాక, చంద్రశేఖర్ రెండుసార్లు, పి వి నరసింహారావు మొత్తం ఆరుసార్లు నవాజ్ షరీఫ్‌ను వివిధ సందర్భాల్లో కలిసి మాట్లాడారు అనంతరం 'గుజ్రాల్ సిద్ధాంతం'తో పొరుగు దేశాల ప్రసన్నతకు ఉద్యమించిన ఐ కె గుజ్రాల్ కూడా షరీఫ్ భాయ్‌తో ముచ్చటించారు ఇలా 14 ఏళ్లలో మొత్తం 16 సార్లు రెండు దేశాల అధినేతలు కలిశారు, మాట్లాడుకున్నారు సత్సంకల్పాలను ఉద్ఘాటించుకున్నారు మధ్యమధ్యలో విదేశాంగ కార్యదర్శులూ కొన్ని డజన్ల పర్యాయాలు సమావేశమై సమాలోచనల తీగను తెగకుండా చూశారు

ఏం లాభం? పాక్ కుతంత్రాలు ఆగలేదు, ఇండియాపై ఎత్తిన కత్తిని దించలేదు ఫారెన్ సెక్రటరీల చర్చల్లో తక్షణ పరిష్కారం కోసం గుర్తించిన సియాచిన్, సర్‌క్రీక్ వగైరా అంశాలు దేనిలోను తలలు కలిసే ఆశ కల్ల

అత్యున్నత స్థాయిలో ద్వైపాక్షిక చర్చలకు ఉపక్రమించేటప్పుడు ఏఏ అంశాలపై దృష్టి సారించేదీ, ఏ అంశం మీద ఎంతవరకూ బెసగేదీ, ఏ విషయంలో కరాఖండిగా పట్టుబట్టేదీ స్పష్టంగా అవగాహన ఉండాలి మన వైఖరి ఏమిటన్నది కనీసం మనకైనా స్పష్టత ఉండాలి పాకిస్తాన్‌తో వ్యవహారం విషయంలో మనకు లేనిదే అది ప్రతిపక్ష పార్టీలకు, ప్రజలకు నచ్చచెప్పి ఏకాభిప్రాయం సాధించే మాట దేవుడెరుగు కనీసం ప్రభుత్వానికే ఏ విషయంలోనూ స్థిరత్వంగాని, ఏకాభిప్రాయంగాని ఉన్న దాఖలాలు కనబడవు సీనియర్ మంత్రుల్లోనే ఒకరు చెప్పేదానికి, ఇంకొకరు అనేదానికి పొంతన లేదు ఒకే మంత్రి ఒక్కో సందర్భంలో ఒక్కోరకంగా మాట్లాడుతుంటారు ప్రధానమంత్రికి, ఆయన సలహాదారులకు మధ్య, మంత్రులకు, అధికారులకు నడుమ సమన్వయమన్నది సాధారణంగా కనిపించదు

పనికిమాలిన 'శిఖరాగ్ర' పేరంటానికి ఢిల్లీనుంచి ఆహ్వానం అందింది మొదలుకుని ఆగ్రా చర్చల పందిరికి నిప్పంటించి అర్ధరాత్రి స్వదేశం తిరిగి వెళ్లేదాకా ఆ తరవాత కూడా జనరల్ ముషారఫ్ మనమీద నాన్‌స్టాపుగా ప్రాపగాండా వార్ సాగిస్తూనే ఉన్నాడు ఆశువుగా అబద్ధాలాడుతూ అభాండాలు వేస్తూ వాస్తవాలను వక్రీకరిస్తూ అతిథి మర్యాదను అతిక్రమించి వద్దన్న పనినే చేస్తూ కయ్యానికి కాలుదువ్వుతూ అసలు విషయాలను పక్కకునెట్టి అప్రస్తుతాంశాలపై అడ్డగోలు రాద్ధాంతం చేస్తూ దుష్ప్రచార

దుమారం రేపుతూనే ఉన్నాడు. అసత్యమాడటాన్నే వ్రతంగా పెట్టుకుని అవతలిపక్షం పొల్లుమాటల ఈటెలతో, కృతఘ్నతల శతఘ్నులతో తెరపిలేకుండా దాడి చేస్తుంటే మన సత్యహరిశ్చంద్రుల అసమర్థ ప్రభుత్వం తెల్లబోయి, చేష్టలుడిగి, వెర్రిమొగం వేసి కూచున్నది. మాటకు మాట వడ్డించాల్సిన సమయంలో వడ్డించక, ఎప్పుడు ఏమి చేయాలో అది చేయక, ఎప్పుడు ఏది చేయకూడదో అది చేస్తూ, తడబడుతూ, తడుముకుంటూ పాకిస్తానీల వలలో విజయవంతంగా చిక్కుకుంది! అంతర్జాతీయంగా అభాసుపాలైంది!

# అనుకున్నదే అయింది

యుద్ధం వేరు, దౌత్యం వేరు యుద్ధానికి శౌర్యం కావాలి. దౌత్యానికి లౌక్యం కావాలి శౌర్యం సైనికుడికి ఉంటుంది. లౌక్యం రాజకీయ నాయకుడికి ఉంటుంది సేనలను నడిపే సేనానికి రణతంత్రమే తప్ప రాజకీయ తంత్రం సాధారణంగా తెలియదు. ఈ లెక్కన ఆగ్రా 'శిఖరాగ్రం'లో రాజకీయ దురంధరుడైన అటల్‌బిహారీ వాజపేయి చేతిలో సేనాపతి ముషారఫ్ నజ్జునజ్జు అయి ఉండాలి. ముషారఫ్ వయసుకంటే వాజపేయి రాజకీయానుభవం ఎక్కువ! జీవితమంతా సైనిక ప్రపంచంలో గడిపి, కేవలం రెండేళ్ల క్రితం పవర్ పాలిటిక్స్‌లోకి వచ్చిన జనరల్ ముషారఫ్‌ను జీవితమంతా రాజకీయ ప్రపంచంలో గడిపి, కనీసం ఇరవై రెండేళ్లుగా దౌత్యనీతి కొట్టిన పిండి అయిన వాజపేయి తన దేశంలో తాను ఏరికోరి ఎంచుకున్న దౌత్యవేదిక మీద నిలువరించలేకపోయారు. అతడిని బోల్తా కొట్టించవలసింది పోయి తనే వరసగా పల్టీలు కొట్టారు.

పోనీ - ముషారఫ్ మహా తెలివిగలవాడా? ఆయన తెలివి ఎంతటిదో ఆగ్రా 'శిఖరాగ్రా'నికి అమెరిగా ఒత్తిడి కారణమని పబ్లిగ్గా చెప్పి నాలుక కరచుకున్నప్పుడే తెలిపోయింది. యుద్ధంలాగే దౌత్యం కూడా ఆయనకు బొత్తిగా చేతకాదని - ఇండియా వచ్చేముందు సిమ్లా, లాహోర్ ఒప్పందాలను బుట్టదాఖలు చేయబోయి తొట్రుపడినప్పుడే అర్థమైంది. వాజపేయి గొప్ప వక్త. ముషారఫ్ సరిగా మాట్లాడనే లేడు. వాజపేయి వాగ్ధాటితో ఎలాంటి వార్నైనా ఆకట్టుకోగలడు. ముషారఫ్‌కు కట్టెవిరిచి పొయిలో పెట్టినట్టు మాట తూలి ఎంతటి శాంతమూర్తులకైనా ఒళ్లు మండించటం ఒక్కటే చేతనవును అటువంటి జగమెరిగిన దురహంకారిని కూడా నిలదీసి నిజస్వరూపం బయటపెట్టటం మన 'సత్పురుషుల' ప్రభుత్వం వల్ల కాదంటే . స్వదేశంలోనే చెల్లుబాటులేక, గుంజుకున్న

అధికారానికి చట్టబద్ధతలేక, అంతర్జాతీయ సుహృద్భావాన్ని చూరగొన లేక ఏకాకి అయిన ముష్కరుడి చేతిలోనే – ప్రపంచంలోకెల్లా పెద్ద ప్రజాస్వామ్య దేశంలో సుస్థిర ప్రభుత్వాన్ని నడుపుతున్న 'పెద్దమనుషుల' సర్కారు కుదేలయిందంటే ఏమనుకోవాలి?

అంబరాన్నంటేలా ఆశలు రేపిన ఆగ్రా 'శిఖరాగ్రం' కుప్పకూలటంలో విస్తుపోవలసింది ఏమీలేదు వైఫల్యం దాని మొహం మీదే ఆదినుంచీ రాసిపెట్టి ఉంది పాకిస్తాన్ సైనిక నియంతతో చెట్టపట్టాలు వేసుకుని ప్రధాని వాజపేయి నడవదలచిన 'హైరోడ్'నిండా 'రోడ్‌బ్లాకు'లు, 'డెడ్ఎండ్'లు ఉన్నాయని కనీస లోకజ్ఞానం ఉన్న వారందరికీ ముందే అర్థమైంది. ఇప్పటికంటే తక్కువ ఉద్రిక్తస్థితిలో . ఇప్పటికంటే ఎక్కువ సుహృద్భావ వాతావరణంలో... ఇప్పటి నాయకులకంటే ఎక్కువ వివేకంగలవారు దేశాధినేతలుగా ఉన్న సమయంలో జరిగిన పూర్వపు ''శిఖరాగ్రాలే'' అనేక కారణాలవల్ల విఫల మయ్యాయి అలాంటప్పుడు కార్గిల్ యుద్ధపు భయానక స్మృతుల నేపధ్యంలో ఆ రణ మారణ హోమానికి ప్రధాన బాధ్యుడిని ప్రధాని వాజపేయికి బ్రెయిన్‌వేవ్ వచ్చినదే తడవుగా పిలవనంపి ఒక వ్యూహంగాని, ఒక ప్రణాళికగాని, ఏ అంశంమీదా ఒక నిర్దిష్టమైన ఆలోచన గాని లేకుండా చర్చలకు ఉపక్రమిస్తే ''శిఖరాగ్రం'' కుప్పకూలక ఏమవుతుంది?

భారతీయులు, పాకిస్తానీలు ఒకే తల్లిబిడ్డలు, మత మౌఢ్యపు అడ్డుగోడలు ఎన్ని లేచినా వారి మధ్య ఆర్థికంగా, సాంస్కృతికంగా సమానాంశాలు చాలా ఉన్నాయి పాకిస్తానీల మీద ద్వేషభావం మనకు ఏనాడూ లేదు పాకిస్తానీ ప్రజలకూ మన మీద ద్వేషం లేదు కానీ – పాకిస్తాన్ పాలకవర్గానికి మాత్రం ఆది నుంచీ ఇండియాతో విరోధమే ఊపిరి. పాకిస్తాన్ పుట్టిందే ద్వేషంలోంచి నాటినుంచి నేటిదాకా ఆ దేశాన్ని నడిపిస్తున్నది ఇండియాపట్ల శత్రువైఖరి. రాజ్యమేలేది సైనిక నియంతైనా, ప్రజాస్వామిక ప్రభుత్వమైనా ఆ వైఖరి మారదు అధికారం పీటలమీద కూర్చునేది ఎవరైనా ఆ దేశంలో వెనకనుంచి చక్రం తిప్పేది మాత్రం ముల్లాలూ, సైన్యాధికారులు అనుక్షణం వారు కోరుకునేది ఇండియా సర్వనాశనాన్ని, దేశాధినేత ఒకవేళ మంచిమనిషై, ఇండియాతో శాంతి, సఖ్యతలను కోరుకున్నా ఈ పాలకవర్గాలు అడుగుతీసి అడుగు ముందుకు వేయనియ్యవు. సాహసించి ఎవరైనా ఇండియాతో చెలిమి చేశారో అధికారానికి మూడిందన్న మాటే ఇండియా చేతిలో చిత్తుగా ఓడి, ఇండియా ఆక్రమించిన 5వేల చదరపు మైళ్ళ భూమిని, 93 వేల యుద్ధ ఖైదీలను విడిపించు కోవటానికి న్యూఢిల్లీ దయాదాక్షిణ్యాలపై ఆధారపడ్డ నిస్సహాయ స్థితిలో సిమ్లా చర్చలకు కూర్చున్నప్పుడు కూడా కాశ్మీర్‌లో అధీనరేఖను అంతర్జాతీయ సరిహద్దుగా అంగీకరించ టానికి జుల్ఫికర్ అలీభుట్టో భయపడ్డాడు

దానికి ఒప్పుకుంటే స్వదేశంలో తనను ఒక్కరోజు అధికారంలో కొనసాగనివ్వకుండా పట్టుబట్టి పడగొడతారని ఆయన ఇందిరాగాంధీ ముందు సిగ్గువిడిచి చెప్పాడు. దేశం నిలువునా ముక్కలై ఇండియాకు పాదాక్రాంతం కావడం మినహా గత్యంతరం లేని దుస్థితిలో కూడా కాశ్మీర్ విషయంలో ఇండియాతో రాజీపడ్డట్టు కనిపించటానికి భుట్టోకే గుండె చాలనప్పుడు అటువంటి అగత్యం ఏమీలేని స్థితిలో ముషారఫ్ లాంటి సైనిక ముష్కరుడు వాజపేయి కవిత్వానికి కరిగి, తాజ్‌మహల్ సౌందర్యానికి మురిసి, ఆగ్రా హోటల్ పరమాన్నాలకు పరవశించి ఇండియా స్నేహహస్తాన్ని అందుకునేందుకు కనీసం ఒక్క అడుగు ముందుకు వేస్తాడని ఆశించినవాడు అవివేకి

కడుపులో ఎంత విషం ఉన్నా మాటల్లో తేనెలొలికించడమే రాజకీయ ప్రజ్ఞ. అటువంటి అభినయ ప్రావీణ్యం మునుపటి పాక్ పాలకులు చాలామందికి ఉండేది. కాశ్మీర్ వంటి ముఖ్య సమస్య దేనిలోనూ పట్టిన పంతం నుంచి అంగుళం బెసగకపోయినా సాంస్కృతిక బృందాల మార్పిడుల వంటి అప్రధాన విషయాలపై సుముఖత చూపి శుష్క సుహృద్భావ ప్రకటనల మీద చేయడానికి పాకిస్తాన్ పాలక వర్గాలూ అభ్యంతరం చెప్పవు. కాబట్టే గతకాలపు శిఖరాగ్ర సమావేశాల్లోనూ, అధికారుల స్థాయి సంభాషణల్లోనూ ఒక మోస్తరు ఏకీభావమైనా పొసగింది అయితే అది రాజకీయ లౌక్యం, కనీస సంస్కారం ఉన్నవారు ఇస్లామాబాద్ గద్దెమీద కూర్చున్నప్పటి మాట ప్రస్తుత సర్వాధికారి పర్వేజ్ ముషారఫ్‌కు ఆ రెండు లక్షణాలూ లేవు ఆ మనిషి మొరటు, మనసు మొరటు, మాట మరీ మొరటు. వాజపేయి చొరవవల్లగాక వాష్టింగన్ ఒత్తిడివల్లే తనకు ఆహ్వానం అందిందని చెప్పి (ఒకవేళ ఆ సంగతి నిజమే అయినా కీలక సంభాషణల అదనులో అనవసరంగా దానిని బహిరంగ పరచడం మూర్ఖత్వం) న్యూఢిల్లీని చిన్నబుచ్చింది మొదలుకుని . . కాశ్మీర్ మినహా ఏదీ చూడను, వినను, మాట్లాడను అని బండగా మొండికేయటం నుంచి అన్ని అభ్యంతరాలనూ తోసిపారేసి, అతిథేయ దేశం సెంటిమెంటును పనిగట్టుకుని దెబ్బతీసి హురియత్ ధూర్తులతో రహస్య మంతనాలాడటం వరకూ ముషారఫ్ సైనిక దురహంకారమే తొణికిసలాడింది తప్ప రాజకీయ పరిణతి ఎక్కడా కానరాలేదు. ఆగ్రా విడిదిలో తాను చూసిన ఒక టీవీ కార్యక్రమంలో ఎవరో మహిళ ఆయనను ఉద్దేశించి ''ఈ మనిషిని నమ్మవచ్చా'' అన్నదట – దానికే ముషారఫ్ రెచ్చిపోయి, తన స్థాయిని మరచి, ''ఈ మనిషిని ఇక్కడికి ఆహ్వానించేముందు ఆ ప్రశ్న వేయాల్సింది'' అని ఆ ఆడమనిషికి చెప్పదలిచానని భారతీయ పత్రికా సంపాదకుల గోష్ఠిలో అసందర్భంగా, అనాగరికంగా వదరటం ముషారఫ్ వాచాలత్వానికి మచ్చుతునక దశాబ్దాల అగాధాలను ఒక్క గంతులో దాటనక్కర్లేదు. కనీసం ఆ దిశలో సామరస్య సాధనకు మొదటి అడుగు వేద్దామన్న న్యూఢిల్లీ

అభ్యర్థనను తూష్ణీకరించి, ''జాయింట్ డిక్లరేషను'' ముసాయిదాలో మాటమాటకు మాటిమాటికీ అడ్డం తగిలి, కనీసం మొక్కుబడి స్టేట్‌మెంట్‌కు కూడా ముషారఫ్ కలిసి రాకపోవడం ఆయన సంస్కార స్థాయి ఎరిగిన వారెవరినీ నివ్వెరపరచదు వాజపేయి బస్సుయాత్రలో వెలువడిన లాహోర్ డిక్లరేషన్ పాటి సత్సంకల్పాల పునరుద్ఘాటన కూడా అగ్రా శిఖరాగ్రంలో జరగకపోవటానికి కారణం ఒకటే. నవాజ్ షరీఫ్‌కున్నపాటి రాజకీయ పరిణతి జనరల్ ముషారఫ్‌కు లేదు.

అగ్రా ''శిఖరాగ్రం''లో అద్భుతమేదో జరుగుతుందన్న ఆశ ఎలాగూ లేదు కనుక చర్చలు విఫలమైనందుకు ఎవరూ నొచ్చుకోనక్కర్లేదు కనీసం ఆయా అంశాలపై మన వైఖరి ఏమిటో, అది ఎంత సమంజసమైనదో, అవలిపక్షం చేస్తున్నది ఎంత అర్థంలేని వాదమో లోకం మెచ్చేలా తేటపరిచేందుకు వాజపేయి ప్రభుత్వం తెలివిగా, దృఢంగా ఈ అవకాశాన్ని ఉపయోగించుకోగలిగి ఉంటే ''అగ్రా టాక్ షో'' సార్థకమయ్యేది చేదునిజం చెప్పాలంటే ఇండియా మీద విషంగక్కటానికి, కాశ్మీర్ సమస్యను వక్రీకరించి ప్రపంచాన్ని కన్‌ఫ్యూజ్ చేయటానికి, పాకిస్తానీ ఏజెంట్లయిన జాతి విద్రోహక శక్తులకు ''స్వాతంత్ర్య యోధు''లన్న కుహనా గౌరవనీయత ఆపాదించటానికి అనువుగా ముఠా నాయకుడు ముషారఫ్‌కు వాజపేయి ప్రభుత్వం పందిళ్లువేసి, తోరణాలు కట్టి చక్కటి వేదికను అమర్చి పెట్టింది తప్పులన్నీ తమ దగ్గర పెట్టుకుని కూడా కాశ్మీర్‌పై ఒంటికాలు మీద లేచి ఇండియానే పాపాలభైరవునిలా చిత్రించిన ముషారఫ్ నిర్విరామ దుష్ప్రచారాన్ని అడ్డుకుని, ప్రపంచ ప్రజల ముందు అతడిని బోనులో నిలబెట్టగల దక్షత వాజపేయి సర్కారుకు లేకపోయింది ఎంతసేపూ ''కాశ్మీర్ భారతదేశంలో అవిభాజ్యభాగం'', ''సీమాంతర ఉగ్రవాదం సమస్యకు మూలం'' అన్న రెండు మాటలను అరిగిపోయిన రికార్డులా వినిపించడమే తప్ప ఆక్రమిత కాశ్మీర్‌పై ఇండియా హక్కును, దానిని పాశవికంగా కాలరాచిన ఇస్లామాబాద్ దుర్మార్గాన్ని ముషారఫ్ దిమ్మతిరిగేలా న్యూఢిల్లీ నొక్కి చెప్పలేకపోయింది ఆక్రమిత కాశ్మీర్‌ను అక్రమంగా పాకిస్తాన్‌లో కలిపేసుకుని, దానిపై నోరెత్తే హక్కు అక్కడి కాశ్మీరీలకు లేకుండా చేసి మనకు చెందిన జమ్మూకాశ్మీర్‌లోనేమో చట్టబద్ధంగా జరిగిన విలీనాన్ని తిరగదోడజూస్తూ... పాకిస్తాన్‌లో కలవడమే తప్ప స్వతంత్రంగా ఉండే హక్కు కాశ్మీరీలకు లేదని - అడ్డంగా వాదిస్తున్న పాకిస్తాన్ ''ప్లెబిసైట్'' పల్లవిని అందుకోవటమే వింత. కాశ్మీర్‌ను కబళించాలన్నదే వారి ఏకైక ధ్యేయమన్న వాస్తవాన్ని నిర్ద్వంద్వంగా నిరూపించడం చేతగాక ''సీమాంతర ఉగ్రవాదం'' జపం చేస్తూ ప్రభుత్వం కుదేలవటం మరీ రోత.

కాశ్మీర్ ఇండియాలో అంతర్భాగమైతే అక్కడి టెర్రరిజమూ అంతర్గత సమస్యే

అవుతుంది సరిహద్దు ఆవలినుంచి పాకిస్తాన్ దాన్ని ఎగదోస్తున్నదని ఆక్రోశించటం ఇండియా బలహీనతనే సూచిస్తుంది పాకిస్తాన్ అలాంటి కుత్సితానికి పాల్పడుతూంటే సరిహద్దులను దిగ్బంధంచేసి, టెర్రరిస్టు విషసర్పాలను మట్టుపెట్టి కాశ్మీర్‌కు భద్రత కల్పించడం భారత ప్రభుత్వ అనివార్య బాధ్యత పాకిస్తాన్ తన దుర్మార్గాన్ని ఆపితే తప్ప టెర్రరిజాన్ని తాను అదుపు చేయలేనని చెప్పటం దౌర్బల్యానికి ప్రతీక తన దగ్గర కొత్త ప్రతిపాదన అంటూ ఏదీ లేకుండా అజెండా ఏమిటో తనకే తెలియకుండా ముషారఫ్‌ను మాటల పేరంటానికి పిలవడం వాజపేయి చేసిన మొదటి తప్పు. పాకిస్తాన్‌తో తేల్చుకోవలసిన అసలు సంగతుల ఊసెత్తక, పాకిస్తాన్ దుష్ప్రచారాన్ని సమర్థంగా ఎదుర్కొనలేక చర్చల వైఫల్యానికి నెపమంతా మన మీదనే నెట్టిన పాకిస్తాన్ ఎదురు దాడినీ తిప్పికొట్టలేక అంతర్జాతీయంగా అభాసుపాలవటం రెండో తప్పు వందలాది భారత వీరజవాన్లను బలిగొన్న కార్గిల్ విలన్‌ను అమరవీరుల భార్యలూ తల్లుల కడుపులు దహించుకు పోతుండగా ఇండియాకు గౌరవ .అతిథిలా రావించి, రాచమర్యాదలు చేసిన వాజపేయికి చివరికి దక్కినవి ఆ ముష్కరుడి తిట్లూ దూషణలే. పనికిమాలిన ఆగ్రా శిఖరాగ్ర భాగోతం మొత్తంలో జీరో అయింది వాజపేయి! కార్గిల్ గుండె మంటలారని భారతీయులకు ఒకింత ఉపశమనం ఇచ్చింది శత్రుసేనాపతికి శాల్యూట్ చేయడానికి ధైర్యంగా నిరాకరించి రక్షణదళాల పరువు నిలబెట్టిన వాయుదళాధిపతి టిప్నిస్ ఒక్కడే!

# భశుం

*అడ్డదిడ్డపు సినిమా అయిపోయింది. చివరలో 'శుభం' కార్డు కూడా తిన్నగా కాకుండా 'భశుం' అని తెర మీద పడింది. ఇంత కంగాళీ సినిమా ఎప్పుడూ చూడలేదని తిట్టుకుంటూ ప్రేక్షకులు వెళ్ళిపోతుంటారు బాపు వేసిన ఈ కార్టూను గుర్తొచ్చినప్పుడల్లా మనం నవ్వుకుంటాం.*

*మామూలు సినిమాకే కాదు. కాశ్మీర్ 'చిత్ర' విచిత్రానికీ ఈ కామెంటు చక్కగా నప్పుతుంది. కొమ్ములు తిరిగిన మన ప్రభుత్వాలు స్వాతంత్ర్యం రావడానికి ముందు నుంచి నేటివరకూ అసమర్థ నిర్వాకంలో తమ రికార్డులను తామే బద్దలు కొడుతూ 'వడ్లగింజలో బియ్యపు గింజ' లాంటి కాశ్మీర్ సమస్యను 'కోతిపుండు బ్రహ్మరాక్షసి' తంతులా మార్చిన తీరు చూశాక మెడ మీద తలకాయ ఉన్నవారెవరికైనా కలిగే అభిప్రాయం ఒక్కటే. ఇంత కంగాళీ వ్యవహారం ప్రపంచంలో ఎక్కడా ఉండదనే!*

గతాన్ని గోరీలో వదిలేసి వర్తమానం సంగతే చూద్దాం 'కాల్పుల విరమణ సీరియల్' తో భద్రతా బలగాల కాళ్లు చేతులు కట్టేసి, టెర్రరిస్టులను యథేచ్ఛగా వర్థిల్లనిచ్చి... ముషారఫ్‌తో పనికిమాలిన మాటల పేరంటం పెట్టి ఆగ్రాలో బొక్కబోర్లపడి ఇంటా బయటా అభాసుపాలైన వాజపేయి ప్రభుత్వానికి చరిత్ర ఇంకో చక్కని అవకాశం ఇచ్చింది ఇంతకాలం 'సీమాంతర ఉగ్రవాదమే' కాశ్మీర్‌లో అసలు సమస్య అంటూ ఇండియా ఎంత మొత్తుకున్నా ప్రపంచ దేశాలు పట్టించుకోలేదు ఇస్లామిక్ టెర్రరిజాన్ని పెంచి పోషించి, ఆయుధ, ఆర్థిక సహాయాన్ని సమృద్ధిగా అందించి, తన తైనాతీల ద్వారా ఈ ప్రాంతంలో శాంతికి, భద్రతకు పెద్ద బెడద అయింది పాకిస్తానేనన్న మన వాదనకు బయటివారు పెద్దగా కన్విన్సు కాలేదు పాకిస్తాన్‌ను 'టెర్రరిస్టు రాజ్యం' గా ప్రకటించాలన్న ఢిల్లీ డిమాండునూ అమెరికన్ దొరలు ఈ చెవితో విని ఆ చెవితో వదిలేసేవారు

అదిగో - అలాంటి పరిస్థితిలో 'ఇస్లామిక్ బాంబు' పోయి పోయి ఏకంగా అమెరికా పక్కలో పేలింది అమెరికన్ల ఒడ్డికలో పెరిగి, 'విద్యలు' నేర్చి, తాలిబన్ తాలింఖానాలో సాముగరిడీలు చేసిన ఒసామా బిన్ లాడెన్ తాను నేర్చిన విద్యను తన తొలి గురువుల మీదే జయప్రదంగా ప్రయోగించాడు అమెరికా నడిగడ్డపై 2001 సెప్టెంబర్ 11 ఒక్కరోజునే ఏకకాలంలో నాలుగు పౌర విమానాలను హైజాక్ చేయించి, ఎవరూ ఊహించని రీతిలో క్షిపణులుగా మార్చి అమెరికా ఆర్థిక ప్రాభవానికి ఆకాశమెత్తు ప్రతీకలైన వరల్డ్ ట్రేడ్ సెంటర్ జంట టవర్లను తృటిలో కూల్చి, వేల మందిని బలిగొన్నాడు 'ప్రపంచ పోలీసు' అయిన అమెరికా సైనిక కోటకే గండి కొట్టి, సాక్షాత్తూ అమెరికా ప్రెసిడెంటు ఇంటినే అర్జంటుగా ఖాళీ చేయించవలసిన సిగ్గుచేటు దురవస్థను తెచ్చిపెట్టాడు కలలో కూడా సంభవమనుకోని ఈ అఘాయిత్యాలను చూసి అప్పుడు పోసిన ముచ్చెమటలు అమెరికన్లకు ఇప్పటికీ తగ్గలేదు ఏకంగా పెంటగాన్ రక్షణ వ్యవస్థనే అవలీలగా చొచ్చిన టెర్రరిస్టుల తెంపరితనానికి మాడిపోయిన అమెరికా ప్రభువుల వదనాలు నేటికీ మామూలు చాయకు రాలేదు

టెర్రరిజమంటే ఏమిటో, దాని దాడి ఎంత దుస్సహంగా ఉంటుందో, అందునా ఇస్లామిక్ టెర్రరిజం పంజాదెబ్బ ఎంత క్రూరమో తనకే ప్రత్యక్షంగా, జన్మలో మరచి పోలేనంత తీవ్రంగా అనుభవమయ్యాక న్యాయంగా ఏకైక అగ్రరాజ్యం ధోరణి, దృక్పథం మౌలికంగా మారి ఉండవలసింది. అఫ్ఘనిస్తాన్‌లో సోవియట్ రష్యా ప్రాబల్యాన్ని నిరోధించటానికి తాము సృష్టించిన బిన్‌లాడెన్ అనే భస్మాసురుడు తమ నెత్తినే చేయి పెట్టిన తరవాతయినా - ఇప్పటిదాకా ప్రపంచాధిపత్య వ్యూహంలో భాగంగా తాము ఆడినదీ, ఆడించినదీ ఎంత ప్రమాదకరమైన క్రీడో గ్రహించి అంతర్జాతీయ టెర్రరిజం మూలచ్ఛేదానికి సమాయత్తం కావలసింది తమకు ఎవరు నిజమైన మిత్రులో, ఎవరు వెనక గోతులు తవ్వే నాటకాల రాయుళ్ళో గుర్తించవలసింది కొన్ని దశాబ్దాలుగా టెర్రరిజంతో రాజీ లేకుండా పోరాడుతున్న ఇండియా సహకారం తీసుకుని బిన్ లాడెన్ మీదా, అతడికి ఆశ్రయమిచ్చిన తాలిబన్ల మీదా, ఆ తాలిబన్లకు గురువు, స్ఫూర్తిదాత, అండ అయిన పాకిస్తాన్ మీదా అమీతుమీ తేల్చుకునేందుకు భీకర సమరం ఆలస్యం లేకుండా ఆరంభించవలసింది - అని మనవారు సహజంగానే అనుకున్నారు। న్యూయార్క్ టవర్లు కుప్పకూలిన 'బ్లాక్ ట్యూస్‌డే' తరవాత ఈ రైట్ రాయల్ హైరోడ్డు మినహా అమెరికన్ల ముందు ఇంకో దారి లేదనే మన మహానేతలు, బృహస్పతిని చంపి పుట్టిన వారి సలహాదారులూ సిన్సియర్‌గా నమ్మారు ఆ ఊపులోనే - అమెరికా నోరు తెరిచి అడగడానికి ఎక్కడ బిడియపడుతుందోనన్న ఆరాటంతో ఆ శ్రమ దానికి ఇవ్వకుండా మన వాళ్ళే

వరాల మీద వరాలు అడక్కుండా ఆఫర్ చేశారు తాలిబన్ల కోనలో బిన్‌లాడెన్‌ను కలుగులో నుంచి వెలికితీసి వేటాడటానికి అమెరికాకు ఏమేమి సాయాలు కావలసి వస్తాయో కష్టపడి ఆలోచించి. . ఆ ప్రకారం మా ఆకాశాన్ని, మా నేలను, ఆ నేల మీది సకల సదుపాయాలను మీ సేనల అవసరాల కోసం నిరభ్యంతరంగా వాడుకోవచ్చునంటూ అమెరికా నేస్తులకు బ్లాంకెట్ పర్మిషను పళ్లెంలో పెట్టి సమర్పించుకున్నారు ఆ ఘనకార్యాన్ని రక్షణ మంత్రి జశ్వంత్‌సింగ్ ప్రభృతులు గర్వంగా చాటింపు వేసుకున్నారు తమ ఆఫరు ఇలా వాషింగ్టన్‌కు అందడమేమిటి, అలా అమెరికన్ యుద్ధవిమానాలు రివ్వున వచ్చి మన దగ్గర సేదతీరి లాడెన్ సంహారానికి తాలిబన్ల మీదికి దండెత్తటమేమిటి, అది చూసి పాకిస్తాన్ కుళ్లుకుని నెత్తి బాదుకోవటమేమిటి ఆటోమెటిగ్గా జరుగుతాయని మన నాయకశ్రీలు తమకు తాము ఊహించేసుకున్నారు ఈ దెబ్బతో పాకిస్తాన్ పని ఖాళీ అన్న గట్టి నమ్మకంతో – ఇస్లామాబాద్ తప్పుడు నడతలను, తాలిబన్‌తో దాని చుట్టరికాలను, వాటిని ఉపయోగించి కాశ్మీర్‌లో అది చేస్తూ వచ్చిన అకృత్యాలను అమెరికన్ మిత్రులకు అర్థమయ్యేలా నూరిపోసేందుకు మనవారు ఓవర్‌టైమ్ పనిచేశారు

ఆ అత్యుత్సాహమే మనకు బెడిసికొట్టి కథ అడ్డం తిరిగింది గతంలో లెక్కలేనన్నిసార్లు రుజువైనట్టే సంక్లిష్ట అంతర్జాతీయ పరిస్థితిని సరిగా బేరీజు వేసి, తెలివిగా పావులు కదిపి లాభం పొందటం మన ప్రభుత్వం వల్ల కాదని తాజా సంక్షోభంలోనూ తేలిపోయింది అమెరికా అడగా పెట్టకుండా మా సదుపాయాలన్నిటినీ మీ యుద్ధానికి శుభ్రంగా వాడుకోండంటూ మనమే పిలవనంపినందువల్ల . టెర్రరిజం దెబ్బకు కొంపకూలి అమెరికా అతలాకుతలమవుతూంటే కాశ్మీర్‌లో పాక్ ప్రేరేపిత టెర్రరిజం గురించి మన నేతలు అరిగిపోయిన రికార్డును అసందర్భంగా వినిపిస్తూ పోయినందువల్ల – సందట్లో సడేమియాలా పాకిస్తాన్ మీద కక్ష తీర్చుకునే దుర్బుద్ధితోనే మనం వారి వెంట పడ్డామన్న అనుమానం అమెరికన్లకు జాస్తి అయింది ప్రపంచం దృష్టంతా లాడెన్ సవాలు మీద, తాలిబన్ల తెంపరితనం మీద కేంద్రీకృతమైన సమయంలో మన వారు కాశ్మీర్ గురించి అదేపనిగా మాట్లాడసాగటంతో ఇండియా అంటే ఒక చులకన భావం ఏర్పడి, మనను ఎవరూ సీరియస్‌గా పట్టించుకోని దుర్గతి సంప్రాప్తమైంది చివరికి అటల్ బిహారీ కురుసభలో జాతీయ భద్రతా వ్యవహారాల శకుని అయిన బ్రజేష్ మిశ్రా కాలికి బలపం కట్టుకుని వాషింగ్టన్ సహా ప్రపంచ రాజధానులు అనేకం చుట్టి, 'కాశ్మీర్ కోణం' 'భారత్ ఆత్రం' వగైరాలను ఎంత డైరెక్టుగా, ఇండైరెక్టుగా నొక్కిచూపినా పట్టించుకున్న దిక్కులేదు. 'శభాష్! మా బాగా మాట్లాడాడు! యమా దౌత్యం నెరిపాడు' అని ఆయా దేశాల్లోని భారతీయ విలేకరులయితే బోలెడు మెచ్చుకున్నారుగాని– అంతర్జాతీయ మీడియాలో

బ్రజేష్ భయ్యా వయ్యారాన్ని ఎవరూ పెద్దగా నోటీసు చేయలేదు (కావలసిన భంగపాటు అంతా అయ్యాక అమెరికాకు అసలు ఎలాంటి సాయాన్ని అఫరు చేయలేదు అని ప్రధానమంత్రి 'తూనా బొడ్డు' ఖండన చేయడం ఇంకో ఫార్సు) మడతపేచీలూ పెట్టి, హిరణ్యాక్ష వరాలు కోరి. . చిక్కక, దొరకక పాదరసంలా జారిపోయే పాకిస్తానీలకు ప్రపంచ మీడియా ఇస్తున్న ప్రాముఖ్యంతో పోల్చితే నియమబద్ధ ఆదర్శ భారతదేశానికి దక్కిన గుర్తింపు చాలా హీనం. ప్రపంచంలోకెల్లా పెద్ద ప్రజాస్వామ్యానికి, అందునా అంతర్జాతీయ టెర్రరిజానికి దశాబ్దాలుగా గురిఅవుతూ ఎందరో మహానాయకులను కోల్పోయి, విపరీత విధ్వంసాన్ని, హింసా కల్లోలాన్ని ఘోరాతిఘోరంగా అనుభవిస్తూ వచ్చి, టెర్రరిజంపై ప్రపంచ పోరాటంలో ముందు భాగాన నిలబడవలసిన ఉపఖండ ప్రమాణ విశాల దేశానికి పట్టిన దురవస్థ ఇది।

నిజమే। జరిగిన నగుబాటుకు పూర్తిగా మన నాయకుల నడవడే కారణం కాదు మన కంట్రోల్లో లేని పరిస్థితులు, ప్రభావాలు అనేకం ఉన్నాయి. ఉదాహరణకు – అమెరికా మీద టెర్రరిస్టులు మాడు పగిలేంత దెబ్బకొట్టిన తరవాత కూడా అంతర్జాతీయ టెర్రరిజాన్ని, దాని పోషకులను, ప్రోత్సాహకులను స్వార్థ ప్రయోజనాల సంకుచిత దృష్టితో చూడటాన్ని అమెరికా మానలేదు తాలిబన్లతోనూ, బిన్‌లాడెన్‌తోనూ పాకిస్తానీలకు సన్నిహిత సంబంధాలున్నాయని, టెర్రరిస్టు రాజ్యంగా ప్రకటించి కఠకు ఆంక్షలు విధించదగ్గ లక్షణాలన్నీ పాకిస్తాన్‌కు ఉన్నాయని అమెరికా ప్రభుత్వ సంస్థలు ఇటీవలి కాలంలో అనేక పర్యాయాలు ధ్రువీకరించినప్పటికీ పాకిస్తాన్‌తో వ్యూహాత్మకమైన చిరకాల బంధాన్ని వదులుకోవటానికి వాషింగ్టన్ సిద్ధంగా లేదు కోల్డ్‌వార్ కాలం నుంచీ, అఫ్ఘనిస్తాన్‌లో సోవియట్లపై యుద్ధం నాటి నుంచీ ఇస్లామాబాద్‌తో అమెరికాకు లావాదేవీలు, లోపాయకారీ మతలబులు, లాలూచీలు సవాలక్ష ఉన్నాయి ఇప్పటికిప్పుడు అవన్నీ వదిలేసుకుని, గతమంతటినీ చెరిపేసి, పాకిస్తాన్‌ను ఒగ్గేసి ఇండియాతో అర్జంటు చెలిమి చేయటం కుదిరే పని కాదని అమెరికన్లు తలపోసి ఉండవచ్చు లాడెన్ తలచుకుంటే ఏమైనా చేయగలడని, అమెరికాకు ఎప్పుడైనా ఎక్కడైనా అగ్గి అంటించగలడని తేలిపోయింది కనక.. అత్యాధునిక అమెరికన్ సెక్యూరిటీ వ్యవస్థలేవీ అతగాడిప్రతాపాన్ని నిలువరించలేవని రుజువైంది కనక. . మళ్ళీ ఇలాంటి దాడుల దురాగతాలకు పాల్పడి అసలే వణుకుతున్న అమెరికన్లను ఇంకా హడలగొట్టకుండా అతడిని అడ్డుకోవాలంటే లాడెన్ గోత్రాలెరిగిన పాకిస్తాన్‌ను ప్రసన్నం చేసుకోవడం ఉత్తమమన్న పిరికితనమూ అమెరికాను ఆవహించి ఉండవచ్చు పూర్వం ఇండియాకు సన్నిహితం కావడానికి అమెరికా చేసిన ప్రయత్నా లన్నిటినీ అనుమానించి, దురుద్దేశాలను ఆపాదించి, అమెరికన్లకు కాలుపెట్ట సందునిస్తే

మొత్తం దేశాన్ని కబళించగలరన్న అపోహతో, అలీన విధానపు మడి ఎక్కడ చెడుతుందోనన్న ఆరాటంతో, భారత నేతలు రష్యన్లతో అంటకాగిన సందర్భాలు అనేకం ఉన్నాయి ఇలాంటి అనేక కారణాలవల్ల అనేక దశాబ్దాలుగా పేరుకుపోయిన వైమనస్యాలు, విశ్వాస రాహిత్యాలు ఒక లాడెన్ ధాటిగా హఠాత్తుగా మటుమాయమై అపూర్వ మైత్రీబంధం ఇండియాతో అమెరికాకు అల్లుకుపోతుందని ఆశించడమూ అత్యాశే

అలా ఆశించడమే మన నాయకాగ్రేసరుల ఆలోచనా విధానంలో పెద్ద తప్పు దేశాల మధ్య సంబంధాలు, దౌత్యాలు, సర్దుబాట్లు అనేవి బహు సంక్లిష్ట వ్యవహారాలనీ, ఆయా దేశాల స్వార్థా లు, అవసరాలే తప్ప ఆదర్శాలకు, సిద్ధాంతాలకు అక్కడ పెద్ద విలువ ఉండదనీ అందరికీ తెలుసు అయినా చరిత్ర చెప్పే ఈ పాఠాన్ని విస్మరించి, అమెరికా మీద లాడెన్ దాడులు చేయగానే లాడెన్ మీద, అతడికి ఆశ్రయమిచ్చిన అఫ్ఘాన్‌ల మీద, వారికి గురుపాదులైన పాకిస్తానీల మీద అమెరికా ధ్వజమెత్తి, ఆ క్రమంలో ఇండియాకు దగ్గరై పోతుందని టెక్స్ట్ బుక్ దృష్టితో అంచనాలు వేసి అభాసుపాలవటం మన నేతల అవివేకం లాడెన్ దాడులతో అమెరికా భగ్గుమని, మీ సంగతేమిటో మీరెవరి పక్షమో తక్షణం తేల్చమని తనను నిగ్గదీసిన సంకట స్థితిలో, లాడెన్‌తో తాలిబన్లతో తన అపవిత్ర బాంధవ్యాన్ని యావత్ప్రపంచం అసహ్యించుకున్న దుర్గతిని కూడా తట్టుకుని, అమెరికాను ఎలాగో బుట్టలో వేసి, లాభాల జాక్‌పాట్లు కొట్టగలగటం పాకిస్తానీ పాలకుల బతకనేర్చిన తెలివికి నిదర్శనం

కాశ్మీర్ అనేది మన ఆంతరంగిక సమస్య ఇండియన్ యూనియన్‌లో జమ్మూ కాశ్మీర్ విడదీయలేని భాగమైనప్పుడు అక్కడ శాంతికి, భద్రతకు ఎదురయ్యే ఏ సవాలయినా భారత ప్రభుత్వం మరొకరితో ప్రమేయం లేకుండా స్వశక్తితో ఎదుర్కొనవలసిందే తన భూభాగాన్ని వేరొక దేశం దుండగులు ఆక్రమిస్తే వారిని తరిమికొట్టి తన హక్కును తాను నిలబెట్టుకోవటం, తన భూభాగంపై దేశం లోపలి వారో వెలుపలి వారో అరాచకాన్ని సృష్టించి అల్లకల్లోలం తెబూనితే నిర్దాక్షిణ్యంగా అణచివేసి, దుష్టశక్తులను నిశ్శేషంగా నిర్మూలించి తన సార్వభౌమాధికారాన్ని పునః ప్రతిష్ఠించటం పరువుగల జాతికి అవశ్య కర్తవ్యాలు ఈ ప్రాథమిక సత్యాన్ని విస్మరించి, కాశ్మీర్‌లో పొరుగు దేశం పాపిష్టి పన్నాగాల గురించి అంతర్జాతీయంగా యాగీ చేయటం, మన హక్కును మనం కాపాడుకోవటానికి ప్రపంచ దేశాల సాయం అపేక్షించటం, కరకుగా వ్యవహరించవలసిన సందర్భాల్లో కూడా జావగారి అంతర్జాతీయ మెహర్బానీల కోసం అంగలార్చటం ఇప్పటిదాకా మన ప్రభుత్వాలు చేసిన తప్పిదం మన ఈ బలహీనత వల్లే కాశ్మీర్ సమస్య ఈ అర్ధ శతాబ్దంలో ఇంతగా విషమించి ఇండియా పాలిట రాచపుండులా మారింది

లాహోర్ బస్సు దౌత్యం మొదలుకుని ఆగ్రాలో శిఖరాగ్ర ప్రహసనం, ఆ తరవాత కూడా కాశ్మీర్‌లో శాంతికి పాకిస్తాన్‌ను నమ్ముకుని లాభం లేదని అసందిగ్ధంగా రుజువైనా న్యూఢిల్లీ కార్యశైలి, ఆలోచనారీతి లేశమైనా మారలేదు సీమాంతర ఉగ్రవాదం గురించి, దాని వెనక పాకిస్తానీ కుత్సితం గురించి మనకు ఎంత ధర్మాగ్రహం ఉంటేనేమి? అది ఎంత సమంజసం, ఎంత సహేతుకం అయితేనేమి? ముమ్మాటికీ మనది, మనది మాత్రమే అయిన కాశ్మీర్‌లో ఆ రకమైన ఆగడాలను అరికట్టవలసింది మనం సరిహద్దు ఆవలి నుంచి టెర్రరిజానికి ఊతం అందుతూంటే ఆ సరిహద్దులను చీమ చొరలేనంతగా దిగ్బంధం చేసి, మన భూభాగంలో పీఠం పెట్టిన దేశద్రోహకర, పాక్‌భక్త ఉగ్రవాద మూకల ఉసురుతీసి ప్రజాజీవితంలో శాంతిని, భద్రతను, సుస్థిరతను పునః స్థాపించవలసింది మనం

ఆత్మగౌరవం గల ఏ జాతికైనా ప్రాథమిక విధి అయిన ఈ పనిని మనం ఆలస్యంగానైనా పరిపూర్తి చేయటానికి అమెరికాపై లాడెన్ దాడి సరికొత్త స్వర్ణావకాశాన్ని ఇచ్చింది 'బ్లాక్ ట్యూస్‌డే' అఘాయిత్యాల అనంతరం నిఖిల ప్రపంచం బిన్‌లాడెన్‌ను, అతడి కొమ్ముకాస్తూ వచ్చిన తాలిబన్లను, పాకిస్తానీలను ఏవగించుకుని, టెర్రరిజంపై సమైక్య పోరాటానికి నాగరిక దేశాలన్నీ భుజాలు కలిపిన తరుణంలో పాకిస్తాన్ లోపలా, వెలుపలా, నడుస్తున్న టెర్రరిస్టు శిక్షణ శిబిరాలు, వాటిలో ఆరితేరి కాశ్మీర్‌కు నిప్పు పెట్టటమే జీవిత ధ్యేయంగా పెట్టుకున్న పాకిస్తానీ ఏజంట్లు డీలాపడ్డ మాట వాస్తవం. తాలిబన్లపై అమెరికా యుద్ధాన్ని ఎదుర్కోవటానికి తక్షణం అఫ్ఘాన్‌కు తరలిపొమ్మని ఆదేశాలందటంతో ముజాహిదీన్లు, పెద్ద సంఖ్యలో కాశ్మీర్ వదిలి వెళ్ళినట్టూ వార్తలొచ్చాయి

కాశ్మీర్‌లో శాంతిని స్థాపించి, సీమాంతర ఉగ్రవాదాన్ని శాశ్వతంగా సమాధి చేయటానికి ఇంతకంటే అనుకూల పరిస్థితి ఏమి కావాలి? బిన్‌లాడెన్‌కూ, తాలిబన్లకూ సంబంధం ఉన్నదన్న కారణంతో అమెరికా ప్రభుత్వం ఆస్తులు స్తంభింపజేసిన టెర్రరిస్టు సంస్థల జాబితాలో పాకిస్తానీలు కాశ్మీర్‌పై ప్రయోగించిన హర్కత్ ఉల్ ముజాహిదీన్ కూడా ఉంది. కాశ్మీర్ లోయలోని ముస్లిం మహిళలందరూ విధిగా బురఖా వేసుకుని తీరాలని, హిందూ మహిళలూ తాము పెట్టిన డ్రస్‌కోడ్‌ను పాటించి తీరాలని, లేకుంటే యాసిడ్ దాడులు, కాల్చివేతలు తప్పవని ఇటీవలి పెట్రేగిన లష్కర్ ఎ తోయిబా వంటి సంస్థలూ బిన్ లాడెన్‌తో షరీకైన దృష్టాంతాలు అనేకం బయటపడ్డాయి వీటన్నిటినీ ప్రపంచం ముందు పెట్టి, అంతర్జాతీయ టెర్రరిజంపై ప్రపంచపు పోరులో తన వంతు తోడ్పాటుగా లాడెన్ స్థావరాలకు అత్యంత చేరువలోని కాశ్మీర్‌లో టెర్రరిస్టులను భారత ప్రభుత్వం వెంటాడి, నిశ్శేషంగా వేటాడి ఉంటే ఎవరూ ఆక్షేపించగలిగేవారు కాదు

జమ్మూకాశ్మీర్‌లో మిలిటెంట్ల జోరు ఎప్పుడు తగ్గితే అప్పుడు వారిపై భద్రతాదళాల ఆపరేషన్లూ ఆగిపోవాలని, మళ్లీ వారు విజృంభించినప్పుడు మాత్రమే వారిని అదుపుచేసే చర్యలూ ముమ్మరం కావాలని మతి వున్నవారెవరూ అనరు సీమాంతర ఉగ్రవాదం మన శత్రువు అనుకున్నప్పుడు ఆ శత్రు శిబిరం నైతికధృతి సడలి బేజారై వున్నప్పుడే వేటు వేసి పీడ విరగడ చేసుకోవాలి అసలైన ఆ పనిని అదనెరిగి పూర్తి చేయకుండా అదేదో అమెరికా దయ వుంటేగానీ, వేరే దేశాల ఆమోదం పొందితేగానీ పొసగని కార్యమైనట్టు వాషింగ్టన్ దగ్గర పితూరీలు, పైరవీలు చేయటమంటే మన గౌరవాన్ని మనమే కించపరచుకోవటం కాదా?

తాలిబన్ల మీద అమెరికా మూడోకన్ను తెరుస్తుందన్న భయంతో తాలిబన్ గోత్రీకులైన మిలిటెంట్లు ప్రస్తుతానికి అణగిమణగి వున్నంతమాత్రాన అమెరికాతో వ్యవహారం ఎక్కడ చెడుతుందోనన్న వెరపుతో పాకిస్తాన్‌లోనూ, పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోనూ నడుస్తున్న టెర్రరిస్టు క్యాంపులను ఇస్లామాబాద్ తాత్కాలికంగా మూసివేయించినంత మాత్రాన కాశ్మీర్‌కు టెర్రరిజం బెడద తొలిగిందనుకోవడం శుద్ధ భ్రమ కాశ్మీర్‌లో పనిచేస్తున్న అఫ్గాన్ మిలిటెంట్లను అమెరికాను ఎదుర్కొనేందుకు వెనక్కి వచ్చేయమని తాలిబన్ గురువు ముల్లా ఒమర్ పిలిచిన తరువాత కూడా ఇంకా చాలామంది అఫ్గాన్లు కాశ్మీర్ గడ్డమీదే వున్నారని ఇంటలిజెన్సు వర్గాలు అంటున్నాయి జమ్మూకాశ్మీర్‌లో పనిచేస్తున్న మూడు నాలుగువేలమంది హార్డ్‌కోర్ మిలిటెంట్లలో సగంమంది మాత్రమే విదేశీయులు అమెరికా ఉపగ్రహాలు తమ కదలికలను పసిగడతాయన్న జంకుతోనో, పాకిస్తానీల పురమాయింపుపైనో వారంతా ఒకవేళ సరిహద్దు దాటిపోయినా ఇంకా సగం సజ్జు కాశ్మీర్‌లో మిగిలే వుంటుంది 2001 సెప్టెంబర్ 11కు ముందు పాకిస్తాన్‌లోని టెర్రరిస్టు క్యాంపుల్లో శిష్యులుగా చేరి ''కోర్సు'' దాదాపు పూర్తిచేసిన 400 మంది కాశ్మీరీలను ఆక్రమిత కాశ్మీర్ పొడవునా వున్న 15 సందులగుండా జమ్మూకాశ్మీర్‌లోకి చొప్పించటానికి సన్నాహాలు జరుగుతున్నట్టూ వింటున్నాం మునుపటివలె గ్రామాల మీదపడి అమాయక హిందువుల ఊచకోతలు జరగడంలేదనేకాని, సెప్టెంబర్ 11 తరువాత మిలిటెంట్ల దాడులు ఆగిపోయిందేమీ లేదు సెప్టెంబర్ 11కు పూర్వం రెండువారాల్లో 58 దాడులు జరిగి 35 మంది జవాన్లను బలిగొంటే సెప్టెంబర్ 11 తరువాత రెండువారాల్లో 53 దాడులు జరిగి 15మంది జవాన్లను బలిగొని 71మందిని తీవ్రంగా గాయపరిచాయి అఫ్గానిస్తాన్‌పై అమెరికా చేయబోయే దాడిని నిరసిస్తూ మిలిటెంట్లు పట్టుబట్టి బలవంతంగా కాశ్మీర్ లోయ అంతటా బంద్ చేయించ గలిగిన సంగతి తెలిసిందే. ముష్కర మూకలకు మార్గదర్శి అయిన పాకిస్తాన్ ఇరకాటంలో పడి అటు అమెరికాను ఇటు తాలిబన్లను

సముదాయించేందుకు ఆపసోపాలు పడుతున్న ఇప్పుడే కాశ్మీర్ స్థితి ఇలావుంటే రేపు సాయానికి ప్రతిఫలంగా అమెరికానుంచి కోరిన వరాలు పొంది పాకిస్తాన్ రెచ్చిపోయాక, వందల సంఖ్యలో కొత్త విష సర్పాలు సరిహద్దు అవలినుంచి కాశ్మీర్ పుట్టలోకి చొరబడ్డాక పరిస్థితి ఇంకెంత విషమిస్తుంది? బిన్‌లాడెన్ పుణ్యమా అని ఇస్లామిక్ టెర్రరిజం వికృత హేల తీవ్రతను నిఖిల ప్రపంచం గుర్తించి, గర్హిస్తున్న ఈ తరుణంలోనే మనం కార్యోన్ముఖమై టెర్రరిజం బారినుంచి కాశ్మీర్‌ను శాశ్వతంగా విముక్తి చేయలేకపోతే ఆ పని ఎన్ని జీవితకాలాలకైనా పూర్తి చేయగలమా? కాశ్మీర్ నెగడును ఆరనీయకుండా ఎగదోయడం పాకిస్తాన్ మనుగడకు ప్రాణావసరమైనప్పుడు పాకిస్తాన్‌ను మంచితనంతో ఒప్పించి, వారిచేత వీరిచేత చెప్పించి, శుష్క విన్యాసాలు సాగించి కాశ్మీర్ సమస్యను సామరస్యంగా పరిష్కారం చేసుకోగలమనుకోవడం పిచ్చివాడి పగటికల లాంటిదే కాదా?

మరి కాశ్మీర్ రావణకాష్ఠాన్ని ఆర్పేదెలా? అనేక దశాబ్దాలుగా ఆ రాష్ట్ర ప్రజలు పడుతున్న దుర్భర క్లేశాన్ని తీర్చాలంటే ఏమి చేయాలి? స్వయంకృతాపరాధాలతో చేజేతులా మనం దూరం చేసుకున్న కాశ్మీర్‌ను తిరిగి జాతీయ స్రవంతిలో కలిపేసుకోవటానికి కింకర్తవ్యం? పరిస్థితి ఇంతగా విషమించాక, ఇన్ని చిక్కుముళ్ళు పడ్డాక కాశ్మీర్ సమస్యను సరిచేయటం అసలు సాధ్యమయ్యే పనేనా?

ముమ్మాటికీ - అది కుదిరే పనే! సవాలు బహు సంక్లిష్టమయినా అదృష్టవశాత్తూ పరిస్థితి ఇంకా చెయిదాటిపోలేదు. సమస్య ఎలా ఉత్పన్నమైందో, ఎక్కడ మొదలై ఏ మలుపులు తిరిగి ఏఏ తప్పిదాల వల్ల, ఏఏ వైఫల్యాలవల్ల, ఏఏ బలహీనతలవల్ల ఇవాళ ఇంతగా విషమించిందో అర్థం చేసుకుంటే పరిష్కార మార్గం దానికదే స్ఫురిస్తుంది క్లుప్తంగా చెప్పాలంటే కాశ్మీర్ సమస్య పరిష్కారానికి మునుముందు చేయవలసినవి ఇవి:

- పాక్ ఆక్రమిత కాశ్మీర్ కూడా భారతదేశంలో అంతర్భాగమని అడపాదడపా పలవరించి, అంతటితో బాధ్యత తీరినట్టు ఊరుకోవటం మాని పొరుగుదేశం కబ్జా నుంచి మన భూమిని మనం విడిపించుకోవాలి ఎవరి హక్కును వారు నిలబెట్టుకోవాలే తప్ప - ఎవరో ఏదో చేయాలని ఆశించటం, ఏమి చేస్తే ఏ నింద వస్తుందోనని భయపడటం చేవగల జాతికి ఉండకూడని పిరికి లక్షణం సర్వసత్తాకమైన పార్లమెంటు ముక్తకంఠంతో తీర్మానించిన (ఆక్రమిత కాశ్మీర్‌నుంచి పాకిస్తాన్ వైదొలగాలని డిమాండ్ చేస్తూ పి వి నరసింహారావు ప్రధానిగా ఉండగా 1994 ఫిబ్రవరి 22న భారత పార్లమెంటు ఉభయ సభలు ఏకగ్రీవంగా చేసిన తీర్మానం పాఠాన్ని అనుబంధం-2లో చూడండి ) ఏడేళ్ల తరవాత కూడా మన

భూమిని మనం తిరిగి పొందలేకపోతే మనదీ పరువుగల జాతేనని చెప్పుకోవటం దండుగ.

- కాశ్మీర్ సమస్య కేవలం కాశ్మీర్ వాసులకు సంబంధించిన . వారు మాత్రమే నిర్ణయించవలసిన సమస్య కాదు అది యావద్భారత భవితవ్యం ముడిపడిన కీలక సమస్య. కాశ్మీరీ మిలిటెంటు ముఠాలను, పాకిస్తాన్‌లోని వాటి హెడ్డాఫీసులను సంప్రదించవలసింది ఇందులో ఏమీ లేదు. టెర్రరిస్టులను విష సర్పాలుగాను, వారి గుడారాలను, స్థావరాలను పాముల పుట్టలుగాను పరిగణించి నిర్దయగా నిర్మూలించాలే తప్ప విషపు పురుగులతో కబుర్లాడటం పిచ్చిపని. జాతీయ సమస్య అయిన కాశ్మీర్‌పై ఏమి చేయాలన్న విషయంలో సంప్రదించవలసింది అఖిల భారత ప్రజలను మాత్రమే తనకు తానుగా స్వతంత్రించి తక్షణ కర్తవ్యాన్ని నిర్వర్తించగల ధైర్యం ప్రభుత్వానికి లేకపోతే అన్ని వివరాలనూ విన్నవించి, అన్ని కోణాలనూ బోధపరచి, ఏమి చేయాలన్న దానిపై జాతీయ ప్రజాభిప్రాయం తెలుసుకోవాలి అన్ని రాజకీయ పార్టీలతో, అన్ని రాష్ట్ర ప్రభుత్వాలతో ఆలోచించి, అంతర్ రాష్ట్ర మండలిని సంప్రదించి, రాజ్యాంగ, న్యాయ నిపుణులతో చర్చించి స్థూలమైన ఏకాభిప్రాయం సాధించాలి దాని ప్రకారం అవసరమైతే యుద్ధం చేసయినా సరే – నిర్దిష్ట కార్యాచరణకు సమాయత్తం కావాలి మన హక్కును మనం నిలబెట్టుకోవాలి. మన భూమిని మనం కబ్జానుంచి విడిపించుకోవాలి.

- జమ్మూ కాశ్మీర్ సమస్య కేవలం కాశ్మీర్ లోయకు సంబంధించిన వ్యవహారం కాదు పూర్వపు జమ్మూ కాశ్మీర్ రాష్ట్రం వైశాల్యంలో కాశ్మీర్ లోయది 9 శాతం మాత్రమే మొత్తం రాష్ట్రంలో మూడోవంతు పాక్ ఆక్రమణలో ఉండగా, ఐదోవంతు చైనా చేతిలోకి పోయింది మిగిలిన రాష్ట్రంలో కూడా జమ్మూ, కాశ్మీర్, లడాఖ్ అనే మూడు వేర్వేరు ఖండాలున్నాయి పేరుకు ఒకే రాష్ట్రంలో ఉన్నా మూడిటివీ మూడు చరిత్రలు మూడు రకాల భావాలు జాతీయ నాయకత్వం పట్టుబట్టి తమ రాష్ట్రానికి ప్రసాదించిన ప్రత్యేక ప్రతిపత్తి జమ్మూ, లడాఖ్ వాసులకు బొత్తిగా ఇష్టంలేదు తమను వేరుగా చూడవద్దనీ, 370 ఆర్టికిల్‌ను ఎత్తివేసి, మిగతా రాష్ట్రాల్లాగే తమనూ చూసి జాతీయ జీవితంలో మిళితం చేసుకోవాలని వారు ఎప్పటినుంచో కోరుతున్నారు అలాగే కాశ్మీర్‌లో కలపకుండా, జమ్మూను వేరే రాష్ట్రంగా, లడాఖ్‌ను కేంద్ర పాలిత ప్రాంతంగా

ఏర్పరచాలన్న డిమాండూ గట్టిగా ఉంది సూత్రరీత్యా ఇందుకు అభ్యంతరం చెప్పాల్సింది ఏమీ లేదు. ఈ విషయంలో ప్రమేయం ఉన్న అన్ని పార్టీలతోనూ ఆలోచించి మంచిదనుకుంటే ఇందుకు అంగీకరించవచ్చు

- ఇక మిగిలింది కాశ్మీర్ లోయ దాని భవితవ్యం ఏమిటన్నది తేల్చడంలో అక్కడి ప్రజల ఇష్టాన్ని తప్పక పరిగణనలోకి తీసుకోవలసిందే కాని – ప్రజలంటే ప్రస్తుతం అక్కడ పీరం పెట్టిన పాకిస్తానీలూ, ఇటీవలి సంవత్సరాల్లో సరిహద్దు అవల నుంచి వచ్చి దర్జాగా అక్కడ స్థిరపడ్డ ముస్లింలు కాదు ప్రాచీన కాలం నుంచీ కాశ్మీర్‌లో కాపురముండి, ఇస్లామిక్ టెర్రరిజం ద్వారా బలవంతంగా వెళ్ళగొట్టబడి దిక్కులేనివాళ్ళలా దయనీయంగా బతుకుతున్న ఐదు లక్షల మంది కాశ్మీరీ హిందువులతో నిమిత్తం లేకుండా, వారి ఆర్తిని తీర్చకుండా కుదిరే ఏ పరిష్కారానికీ విలువ ఉండదు లక్షలాది నిర్వాసితులను స్వస్థలాల్లో తిరిగి స్థిరపడేట్టు చేయడం ఎలాగన్నది కాశ్మీర్ విషయంలో తక్షణ సమస్య తరతరాలుగా కాపురం ఉంటున్న కాశ్మీర్‌నుంచి దుర్మార్గంగా వెళ్లగొట్టబడినవారు క్షేమంగా వెనక్కి తిరిగొచ్చి, నిర్భయంగా జీవించే పరిస్థితులు కల్పించడంతో బాటు ఇటీవలి దశాబ్దాల్లో సరిహద్దు ఆవలినుంచి వచ్చి కాశ్మీర్ పౌరులుగా చలామణి అవుతున్న పాకిస్తానీలను, ఇతర విదేశీయులను గెంటివేయాలి జాతీయ నాయకుల అసమర్థతవల్ల, రాష్ట్ర నాయకుల స్వార్థపరత్వంవల్ల, పాకిస్తానీల, వారి తైనాతీల కుత్సితాలవల్ల 1947 తరవాత జమ్మూకాశ్మీర్ జనాభా తీరుతెన్నుల్లో చోటుచేసుకున్న వైపరీత్యాలను తొలగించి, కాశ్మీర్‌ను మళ్లీ కాశ్మీర్ బిడ్డల పరమయ్యేట్టు, భారతీయ జీవన స్రవంతిలో పూర్తిగా కలిసిపోయేట్టు చేయడం తప్పనిసరిగా జరగాల్సిన పని

- అన్నిటికీ మించి అనర్థానికి మూలం కాలం చెల్లిన 370వ అధికరణం దానిని ఎంత త్వరగా రద్దుపరిస్తే కాశ్మీర్‌కూ, దేశానికీ అంత క్షేమం అనర్థకపు అడ్డుగోడలను కూల్చి, దేశంలో ఏ ప్రాంతానికి చెందిన భారత పౌరులైనా జమ్మూ కాశ్మీర్ రాష్ట్రంలో నిరభ్యంతరంగా స్థిరపడి, పెళ్లిళ్లు చేసుకుని, ఆస్తులు కొనుగోలు చేసి, వ్యాపారాలు, పరిశ్రమలు నడుపుకునే సావకాశం కల్పిస్తే గానీ కాశ్మీర్ ఇండియాలో నిజమైన అంతర్భాగం కాదు వేరు భావానికి కారణమైన ప్రత్యేక ప్రతిపత్తి పోతేగానీ మన కాశ్మీర్ మళ్లీ మనకు దక్కదు

వరసగా ఎన్ని చేదు అనుభవాలు ఎదురైనా వాటినుంచి గుణపాఠం నేర్వకుండా లేనిపోని మెహర్బానీలను ఆశించి చేతులు ముడుచుకుని ఒట్టి మాటలతో కాలక్షేపం చేసే అసమర్థ వైఖరిని రాజకీయ నాయకత్వం విడనాడనంతవరకూ కాశ్మీర్‌కు న్యాయం జరగదు సంక్లిష్ట సమస్యకు పరిష్కారం కూడా సంక్లిష్టంగానే ఉంటుంది బయటి దేశాల మెరమెచ్చులకు, అగ్రరాజ్యాల ఒత్తిళ్ళకు లోబడకుండా స్థిరంగా, ధైర్యంగా విశాల దృష్టితో సమర్థ వ్యూహంతో అడుగువేయగలిగితే కాశ్మీర్‌లో మోడువారిన శాంతి తప్పక చిగురిస్తుంది నేటి 'భూతాల స్వర్గం' మళ్ళీ 'భూతల స్వర్గం' అవుతుంది అటువంటి శుభదినం వచ్చేదాకా, చేవ, చొరవ, మగటిమిగల నాయకత్వం జాతికి లభించేంతవరకూ కాశ్మీర్ కథ సశేషం.

# అనుబంధం - 1

# అమెరికాను చూసయినా నేర్చుకోండి

*జమ్మూకాశ్మీర్‌లో భారత సార్వభౌమత్వానికి, రాజ్యాంగాధికారానికి ప్రతీక అయిన అసెంబ్లీని ముట్టడించి పాకిస్తానీ ఏజెంట్లయిన ఉగ్రవాద మూకలు ఇండియా మీద ఏకంగా యుద్ధమే ప్రకటించాయి. టెర్రరిస్టు దాడికి కొద్దిసేపటి ముందు ముఖ్యమంత్రి, మంత్రులు, శాసనసభ్యులు అదృష్టవశాత్తూ సభాప్రాంగణం నుంచి నిష్క్రమించారు కాబట్టి బతికిపోయారు. ప్రభుత్వ ప్రముఖులకు, ప్రజా ప్రతినిధులకు దైవికంగా గండం తప్పినా ముష్కరమూకల ఘాతుకం సామాన్యమైనది కాదు. రాష్ట్ర రాజధానిలో పట్టపగలు అసెంబ్లీని బాంబులతో ముట్టడించి, లోపలికి చొచ్చుకువెళ్లి చేతికి చిక్కిన అసెంబ్లీ సిబ్బందిని చంపి గంటల తరబడి బీభత్సం సాగించి మొత్తం 38 మందిని బలిగొన్న భయానక దురాగతాన్ని తలచుకుంటేనే ఒళ్లు జలదరిస్తుంది. భద్రతా బలగాలు సమయానికి అక్కడ మోహరించి, హోరాహోరీ పోరాడి టెర్రరిస్టులను చంపి, వారి బారిన పడిన వారిని చాలా వరకు రక్షించ గలిగారు కాబట్టి సరిపోయింది. లేకుంటే ప్రాణ నష్టం ఇంకా ఎక్కువ ఉండేది.*

ఇంతవరకూ జనసమ్మర్దంగల ప్రాంతాల్లో బాంబులు పేల్చి, భద్రతా బలగాల స్థావరాలపై మెరపుదాడులుచేసి, రాత్రివేళ గ్రామాలపై పడి అమాయక హిందువులను ఊచకోత కోసి భయోత్పాతం రెచ్చగొడుతూ వచ్చిన ఉగ్రవాద పిశాచిగణాలు ఇప్పుడు సమావేశాల కాలంలో అసెంబ్లీనే ముట్టడించి ప్రజాప్రతినిధులందరినీ మట్టుబెట్టబూనటం కీలక సరిహద్దు రాష్ట్రంలో విచ్ఛిన్న శక్తుల వీరంగం ఏ స్థాయి చేరిందో తేటతెల్లం చేస్తుంది. విధ్వంసం తీవ్రతలో హెచ్చుతగ్గులే తప్ప సెప్టెంబర్ 11న అమెరికాలో న్యూయార్క్ జంట టవర్లను కూల్చి, పెంటగాన్ కేంద్ర స్థావరాన్ని పాక్షికంగా ధ్వంసం చేయగలిగిన

టెర్రరిస్టు ఘాతుకానికీ దీనికీ మౌలికంగా పెద్ద తేడా లేదు అమెరికాపై జరిగిన టెర్రరిస్టు దాడుల వంటివి ఇండియాలోనూ సాగించనున్నామని పాక్‌భక్త ఉగ్రవాద వర్గాలు కొద్దిరోజుల కిందటే బాహాటంగా ప్రకటించాయి కనుక మానవబాంబుతో అసెంబ్లీని ముట్టడించిన దుస్సాహసానికి ఎవరూ నివ్వెరపోనవసరం లేదు. నిర్ఘాంతపడవలసిందల్లా మన అసమర్థ, అప్రయోజక ప్రభుత్వం ఇంతటి తీవ్రమైన సవాలుకు సైతం స్పందించిన తీరు చూసే!

అమెరికాపై బిన్‌లాడెన్ దాడిని యావత్ప్రపంచం నిరసించి, టెర్రరిజాన్ని రూపుమాపటానికి ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో అంతర్జాతీయ సమాజం సమాయత్తమైన తరుణంలో కాశ్మీర్‌లో లాడెన్ తరహా దాడికి లాడెన్ శిష్యగణం పాల్పడటమంటే ప్రపంచ ప్రజల విజ్ఞతను అపహసించటమే! ముఖ్యంగా భారత ప్రభుత్వ సార్వభౌమాధికారాన్ని, భారతజాతి ఐక్యతను, సమగ్రతను వెక్కిరించి వికటాట్టహాసం చేయటమే! సెప్టెంబర్ 11 ఘటనల దరిమిలా ఇస్లామిక్ టెర్రరిస్టుల కులగురువైన బిన్‌లాడెనే ప్రపంచ ప్రజాభిప్రాయపు బోనులో నిలబడ్డాక తాలిబన్లకు, లాడెన్‌కు ఆత్మబంధువయిన పాకిస్తాన్ తాలిబన్లనుంచి వేరుపడ్డట్టు లాడెన్ వేటకు సహకరిస్తున్నట్టు అభినయించ సాగాక అదే పాకిస్తాన్ నుంచి, అదే లాడెన్‌నుంచి స్ఫూర్తిపొందే కాశ్మీరీ మిలిటెంట్లు రోజులు బాగా లేవన్న కారణంతో కొద్ది కాలమైనా తగ్గి ఉంటారని భావించటమూ భ్రమేనని తాజా దురంతంతో తేలిపోయింది ఉచ్చనీచాల స్పృహలేకుండా ఆ విద్రోహులు పెట్రేగి ఇంత తీవ్రమైన సవాలును విసరడం మన కుంభకర్ణ వాజపేయి ప్రభుత్వం కంటికి మాత్రం నిరాశా నిస్పృహలతో చేసిన పనిగా కనిపించటం హాస్యాస్పదం భారతదేశంలో తీవ్రవాదానికి ఇక భవిష్యత్తు లేదని గ్రహించినందువల్లే ఆక్రోశాన్ని వెలిగక్కేందుకు చివరి యత్నంగా ఈ దురాగతానికి పాల్పడ్డారన్న మాన్య ప్రధానమంత్రి వాజపేయి వ్యాఖ్యను విన్నవారెవరైనా నవ్వాలో ఏడవాలో తెలియక నెత్తికొట్టుకోవలసిందే అధికార, ప్రతిపక్ష సభ్యులు, ఉన్నతాధికారులతో సహా ప్రభుత్వాన్ని పూర్తిగా అంతమొందించాలన్నదే తమ లక్ష్యమని దాడికి పాల్పడ్డ జైష్-ఎ-మహమ్మద్ ముఠా బాహాటంగా చెబుతూంటే ఇందులో ''నిరాశ'', ''నిస్పృహల'' జాడ ఎక్కడ? చివరి యత్నంగానే టెర్రరిస్టులు ఈ దురాగతానికి పాల్పడ్డారని అంటున్నారంటే మొన్న జరిగినదే ఇండియాలో టెర్రరిస్టుల చివరిదాడి అనీ, ఇక ముందు జమ్మూకాశ్మీర్‌లోగాని, వెలుపలగాని టెర్రరిస్టులు ప్రతాపం చూపబోరని వాజపేయిజీ గ్యారంటీ ఇస్తున్నారా?

అమెరికాపై సెప్టెంబర్ 11న దాడి చేసిందెవరో ఇదమిత్థంగా నేటికీ బయటపడలేదు తామే ఆ పని చేశామని ఇంతవరకూ ఏ సంస్థ చెప్పుకోలేదు. అది ఒసామా బిన్‌లాడెన్

పనేనని అమెరికా గట్టిగా చెబుతున్నా అందుకు ఆధారాలేమిటో అది బయటపెట్టలేదు. రుజువులు చూపించమని తాలిబన్లు ఎంత అడిగినా వాషింగ్టన్ నుంచి ఉలుకూ పలుకూ లేదు అమెరికన్లు చెప్పేదే నూటికి నూరుపాళ్ళూ నిజమై ఉండవచ్చు. అందరూ అనుమానిస్తున్నట్టు సెప్టెంబర్ 11 పాపం పూర్తిగా లాడెన్‌దే అయి ఉండవచ్చు. ఇక్కడ గమనించవలసింది ఏమిటంటే – తాను ఆ పని చేసినట్టు లాడెన్ చెప్పకపోయినా, నిర్ద్వంద్వమైన రుజువులూ సాక్ష్యాలు తమవద్ద లేకపోయినా అతడే దోషి అని తనకు నమ్మకం కుదిరినదే తడవుగా అమెరికా లాడెన్‌ను నేరస్థుడిగా ప్రకటించింది అతడు ఎక్కడ ఉన్నాడో తనకు కచ్చితంగా తెలియకపోయినా, అఫ్ఘనిస్తాన్‌లోనే ఉన్నాడనటానికి స్పష్టమైన రుజువు లేకపోయినా అక్కడే ఉన్నాడని తాను ధ్రువీకరించుకున్నదే తడవుగా అతడిని తమకు అప్పగించమని తాలిబన్లకు అల్టిమేటం ఇచ్చింది కొండల్లో దాక్కుంటే పొగబెట్టి అయినా అతడిని బయటికి రప్పిస్తామని శపథం చేసి సకల సైనిక బలగాలనూ తరలించిందే తడవుగా అఫ్ఘాన్ చుట్టూ అమెరికా మోహరించింది తనకూ లాడెన్‌కూ సంబంధం లేదని పాక్ నియంత ముషారఫ్ బుకాయించినా వినిపించుకోక తాలిబన్లను నయానో భయానో ఒప్పించి అతడిని పట్టి తమకు అప్పగించేట్టు చూసే బాధ్యతను ముషారఫ్ మీదే వాషింగ్టన్ బలవంతంగా పెట్టింది. మరి – సెప్టెంబరు 11న అమెరికాకు జరిగినటువంటిదే కదా అక్టోబర్ 1న శ్రీనగర్‌లో మనకు కలిగిన భయానకానుభవం? రెండూ టెర్రరిస్టు దాడులే రెండిటికి పాల్పడినవీ ఒకే లాడెన్ శిష్యగణాలే మరి అమెరికా స్పందించిన తీరుతో పోల్చితే మన వృద్ధనాయకుల సణుగుడు పిల్లికూతలకంటే హీనం కాదా?

సెప్టెంబర్ 11 దాడుల వలె కాకుండా అక్టోబర్ 1న శ్రీనగర్ అసెంబ్లీపై దాడిని తామే జరిపినట్టు జైష్–ఎ–మహ్మద్ సంస్థ పబ్లిగ్గా చెప్పుకుంది ఆ సంస్థ ఊరూ పేరులేని, ఎవరికీ తెలియని అనామక సంస్థ ఏమీ కాదు విదేశాంగమంత్రి జశ్వంత్‌సింగ్ జైలునుంచి విడిపించి సగౌరవంగా వెంటబెట్టుకుని వెళ్ళి కాందహార్‌లో విమానం హైజాకర్లకు రెండేళ్ల కింద భద్రంగా అప్పగించిన మసూద్ అజార్ అనే హార్డ్‌కోర్ టెర్రరిస్టు అనంతర కాలంలో సృష్టించి, బీభత్సంగా నడిపిస్తున్న ముష్కర మురా అది బిన్‌లాడెన్‌కు సంబంధం ఉన్నదన్న కారణంతో అమెరికా ఆస్తులు స్తంభింపజేసిన 27 సంస్థల్లో ఒకటైన హర్కత్–ఉల్–ముజాహదిన్‌కు దీనికి సన్నిహిత బాంధవ్యం ఉంది. హర్కత్‌లాగే ఇది కూడా పాకిస్తాన్ గడ్డ మీదనుంచే పనిచేస్తున్నది ఇస్లామాబాద్ అండదండలతోనే కాశ్మీర్‌ను యథాశక్తి కాటువేస్తున్నది తమ దేశంలో టెర్రరిస్టులు ఎవరికీ ఆశ్రయమివ్వడం లేదని జనరల్

ముషారఫ్ ప్రపంచానికి బొంకి ఇరవై నాలుగుగంటలు తిరగకుండా శ్రీనగర్‌లో పాకిస్తానీ జేబు సంస్థ సాగించిన మహావిధ్వంసానికి ఇస్లామాబాద్‌ను నిలదీసి, సంజాయిషీ అడిగి, దానికి అర్థమయ్యే భాషలో తగిన బుద్ధి చెప్పవలసిన బాధ్యత భారత ప్రభుత్వానికి లేదా? వాజపేయి ప్రభుత్వం పౌరుషం అనేది ఎరుగకపోతే కనీసం అమెరికాను చూసి అయినా నేర్చుకోకూడదా? లాడెన్‌ను అప్పగించమని అమెరికా తాలిబన్లను డిమాండ్ చేసినట్టు శ్రీనగర్ దురాగతం తమ ప్రతాపమేనని అంగీకరించిన జైష్-ఎ-మహమ్మద్ ముష్కరులను తనకు అప్పగించాలని పాకిస్తాన్‌ను ఇండియా డిమాండ్ చేయవద్దా? అత్యున్నత రాజ్యాంగ వ్యవస్థ అయిన విధానసభను బాంబులతో ముట్టడించి 38 మందిని బలిగొన్న ఘాతుకం చాలదా వాజపేయి ప్రభుత్వానికి మొద్దునిద్దర వదలటానికి? పాకిస్తాన్‌లో పీఠం పెట్టిన ఉగ్రవాద సంస్థ పాకిస్తానీ వత్తాసుతో పథకం ప్రకారం భారతదేశంపై ఇంత క్రూరమైన దాడిచేసిన తరవాత కూడా "మా సహనానికికూడా హద్దుంది, మా ఓరిమిని పరీక్షించకండి" అంటూ ఇస్లామాబాద్‌కు హెచ్చరికలాంటి చచ్చువిజ్ఞప్తులు చేస్తున్నారంటే ఈ ప్రభుత్వ పురుషార్థాన్ని ఏమనాలి? ముషారఫ్, అతడి తైనాతీలు కలిసి ఇలాంటి దాడులు ఇంకా ఎన్ని చేస్తే భూదేవికి పినతండ్రిలాంటి వాజపేయి ప్రభుత్వానికి సహనం నశించి, కార్యాచరణకు ఉపక్రమిస్తుంది? కాశ్మీర్ అసెంబ్లీపై జరిగిన దాడిలాంటిది ఏకంగా పార్లమెంటుపైనే జరిగితే కానీ ఈ అప్రయోజక ప్రభుత్వానికి చురుకు పుట్టదా? మన ఇంటిమీద దాడి జరిగితే దుండగుల భరతం పట్టవలసింది మనమా? బయటివారా? అసెంబ్లీపై దాడిచేసిన టెర్రరిస్టు విద్రోహులకూ, వారిచేత దాడి చేయించిన పాకిస్తాన్‌కూ తగిన రీతిలో బుద్ధి చెప్పటానికి సర్వసత్తాకమైన భారత ప్రభుత్వానికి అమెరికా అజ్ఞ కావాలా? మగటిమిగల జాతీయ ప్రభుత్వం చేయవలసింది చేయకుండా మామీద దాడి జరిగింది చూడండంటూ అమెరికాకు పితూరీలు చేయటం, ఆయా ఉగ్రవాద సంస్థలపై చర్య తీసుకోవలసిందంటూ వాషింగ్టన్‌ను దేబిరించటం భారతజాతికి పరువు తక్కువ పని కాదా? అమెరికా ప్రయోజనాలను అమెరికా చూసుకుంటున్నట్టు ఇండియా ప్రయోజనాలను ఇండియా చూసుకోవద్దా? తాలిబన్లను సాధించి, లాడెన్‌ను పట్టుకునే పనికి పాకిస్తాన్ సాయం అమెరికాకు అవసరం కనుక పాకిస్తానీల టెర్రరిస్టు గోత్రాలన్నీ తెలిసికూడా తెలియనట్టు నటించి, ముషారఫ్‌ను నవరతీయటం బుష్‌కు తప్పనిసరి కావచ్చు కాని అమెరికా రాజకీయ స్వార్థాలకు, అమెరికన్ రణతంత్ర వ్యూహాలకు సర్వస్వతంత్ర రాజ్యమైన ఇండియా ఎందుకు లోబడాలి? లాడెన్ సంగతి తేల్చాక కాశ్మీర్ సంగతి ఆలోచిస్తాము లెమ్మని అమెరికన్లు భరోసా ఇచ్చినంత మాత్రాన, అప్పటిదాకా గొడవ చేయక ఊరుకోమని చెప్పినంత మాత్రాన అదే సుగ్రీవాజ్ఞ అయినట్టు న్యూఢిల్లీ ఎందుకు జీ హుజూర్ అనాలి?

అమెరికాకు ముషారఫ్ చుట్టం కనుక ఆ ముషారఫ్ కాశ్మీర్‌ను కబళించినా ఏకంగా ఇండియాను తగలబెట్టినా మనం చూస్తూ ఊరుకోవాలా? టెర్రరిజాన్ని అంతమొందించే అంతర్జాతీయ పోరాటానికి సహకరించటమంటే అర్థం – అదే టెర్రరిజం మనను నుగ్గునూచ చేస్తున్నా నిస్సహాయంగా మిన్నకుండి పోవటమనా? ఇంతకూ ఇండియా ఒక స్వతంత్ర రాజ్యమని, అమెరికా సంయుక్త రాష్ట్రాలలో ఇది కూడా ఒక రాష్ట్రం కాదని వాజపేయి సర్కారుకు ఎవరు గుర్తుచేయాలి?

– *'ఆంధ్రభూమి' సంపాదకీయం*

***(3 అక్టోబర్ 2001)***

# మనకు తెలియని కాశ్మీరం

***ఈ మధ్యకాలంలో -***

***మనం చాలా ఎక్కువ వింటున్నది కాశ్మీర్ గురించి.***

***మనకు చాలా తక్కువ తెలిసింది కాశ్మీర్ గురించే!***

జనాభాలో నూటికి అరవై మందికి పైగా విద్యాగంధం లేనివారు. తమ సొంత జిల్లా, సొంత రాష్ట్రం చరిత్రలే వారికి తెలియవు. ఎక్కడో దేశానికి కొసన ఉన్న కాశ్మీర్ చరిత్ర వారికి తెలిసే అవకాశమే లేదు. చదువుకున్న వారిలో సగం మందికి చరిత్రలంటేనే పెద్ద చిరాకు. ఏదీ తెలుసుకోవాలన్న ఆసక్తి వారికి ఉండదు. మిగిలిన సగం మందికి చరిత్ర గురించి స్థూలమైన అవగాహన ఉంటుంది. కాని - వారికి తెలిసింది సర్వసాధారణంగా తప్పే అయి ఉంటుంది. యూనివర్సిటీల్లో హిస్టరీ కోర్సులు చేసేవారికీ, వారికి పాఠాలు చెప్పే గురువులకీ, ఆ పాఠాల పుస్తకాలు రాసేవారికీ ఈ దేశ చరిత్రే సరిగా తెలియదు. ఇంగ్లీషు చరిత్రకారులు, చారిత్రక దృష్టి లేని ఇంగ్లీషు మేధావులు, క్రైస్తవ మతబోధకులు, వారి అనుయాయులు అహంకారంలో అజ్ఞానాన్ని రంగరించి, దుర్బుద్ధిని జోడించి, తిమ్మిని బమ్మిని చేసి అష్టావక్రంగా గిలిగిన గీతలే, అవకరపు రాతలే ఈనాటికీ పరమ ప్రామాణికమైన భారత చరిత్ర కింద చలామణి అవుతున్నాయి.

అసలైన దేశ చరిత్రకే దిక్కులేక పోయినప్పుడు అందులో ఒక భాగమైన కాశ్మీర్ చరిత్ర నూటికి 99 మందికి సరిగా తెలియక పోవడంలో ఆశ్చర్యపడవలసింది ఏమీ లేదు. చరిత్ర మీద ఆసక్తి ఉన్న కొద్దిమందిలోనూ కాశ్మీర్ చరిత్రతో పరిచయం ఉన్నది బహుకొద్దిమందికి. వారికి కూడా కాశ్మీర్ పేరు చెబితే మొదట స్ఫురించేది 'రాజతరంగిణి'. కల్హణుడనే వాడు రాసిన ఆ పురాతన గ్రంథంలో కాశ్మీర్ రాజుల చరిత్రల కథలున్నాయి గానీ ఎంతైనా అవి కథలేనని వారికి ఒక రకమైన ఉపేక్షా భావం. భారతీయులకు చారిత్రక

దృష్టి ఆది నుంచీ లేదని, వారి పూర్వులెవరూ ప్రామాణికమైన చరిత్ర అనదగ్గవి రాసిన పాపాన పోలేదని, ఉన్నవన్నీ పుక్కిట పురాణాలేనని సర్వజ్ఞులైన బ్రిటిష్ చరిత్రకారులు తిరుగులేని తీర్పు చెప్పారు కనుక 'రాజతరంగిణి' కూడా ఆటోమెటిగ్గా ఆ పద్దులోకే చేరుతుందనడంలో మన మేధావులు చాలామందికి సందేహం ఎంత మాత్రం లేదు వట్టి కథలే అయినా, వాటిని రాసింది 12వ శతాబ్దంలో కనక, ఆ కాలపు సామాజిక, రాజకీయ స్థితిగతులు, ఆచార వ్యవహారాలు ఎలా ఉండేవో వాటినిబట్టి తెలుసుకోవచ్చునని, అంతకు మించిన చారిత్రక ప్రాధాన్యం వాటికి ఏమీ లేదని ఇంగ్లీషు చరిత్రకారులు నూరిపోసిందే మన మేధావుల నరాల్లోనూ జీర్ణించుకు పోయింది అందుకే కాశ్మీర్ చరిత్ర మన మేధావుల కంటికి అస్పష్టంగా, అతుకుల బొంతగా, అనేక విదేశీ ప్రభావాల సమాహారంగా, అయోమయపు పుంతగా ద్యోతకమవుతుంది.

ఇంగ్లీషు వారి దుష్ప్రభావాలకు లోబడి ఒక శతాబ్ద కాలంగా మన కళ్ళకు మనం తగిలించుకున్న కుహనా చరిత్రగంతలను అవతల పారేసి, మన బుద్ధితో మనం ఆలోచించి, ప్రాచీన భారతీయ చారిత్రక గ్రంధాలను, మన పూర్వులు రాసి పెట్టిన రికార్డులను, వదిలివెళ్ళిన దాఖలాలను కొంచెం ఆదరభావంతో చూడగలిగితే అదే కాశ్మీర్ చరిత్ర స్ఫుటంగా, స్పష్టంగా, అవిచ్ఛిన్నంగా, ఏకధారలా ఆత్మీయంగా మనసుకు హత్తుకునేలా దర్శనమిస్తుంది పూర్వచరిత్ర రేఖామాత్రంగానైనా తెలిస్తే గానీ సమకాలిక సమస్యకు బీజం, మూలం ఏమిటో బోధపడవు

దేశంలోని మిగతా ప్రాంతాలు చాలా వాటికి లేనిది, కాశ్మీరానికి ప్రత్యేకమైనది ఒకటుంది. అదే . ప్రాచీన చరిత్రను గుదిగుచ్చి నిర్దుష్టంగా రూపొందించిన 'రాజతరంగిణి' తెలిసీ తెలియని మేధావులు కొందరు పొరబడుతున్నట్టు కల్హణుడి 'రాజతరంగిణి' కట్టుకథ కాదు, చరిత్రకు కల్పనను జోడించి కలగాపులగం చేసిన కవిత్వ రసాయనమూ కాదు నిజానికి తనకు పూర్వం జరిగిన అటువంటి కలగాపులగాలను సరిచేసి యధార్థ చరిత్రను అక్షరబద్ధం చేసేందుకే కల్హణుడు 'రాజతరంగిణి'కి ఉపక్రమించాడు ఆ సంగతి ఆయన గ్రంధం మొదట్లోనే చెప్పుకున్నాడు

దృష్టం దృష్టం నృపోదంతం బద్ధ్వా ప్రమయమీయుషాం
అర్వాక్కాలభవై ర్వార్తా యత్ప్రబంధేషు పూర్యతే

దాక్ష్యం కియదిదం తస్మాదస్మిన్భూతార్థ వర్ణనే!
సర్వప్రకారం స్థలితే యోజనాయ మమోద్యమః (రాజతరంగిణి 1-9, 1-10)

తనకు పూర్వపు పండితులు వారివారి కాలాల్లో తాము ప్రత్యక్షంగా చూసిన రాజుల గాథలను తమకు స్వయంగా తెలిసిన ప్రత్యక్ష సమాచారంతో విడివిడిగా రాసిపెట్టి, స్వర్గస్థులయ్యారని, అనంతర కాలపు చరిత్రకారులు వాటిని సంపుటీకరిస్తూ తమకు కర్ణాకర్ణిగా తెలిసిన అవాస్తవాలను కూడా వాటిలో చేర్చారని అటువంటి తప్పులను పరిహరించి, వైరుధ్యాలను సరిచేసేందుకే పాత రికార్డులు, దానపత్రాలు, శాసనాల సాయంతో ఈ ప్రాచీన చరిత్ర రచనకు తాను పూనుకున్నానన్నది ఈ శ్లోకాల తాత్పర్యం

వెనకటి చరిత్ర గ్రంథాల్లో దొర్లిన అవాస్తవాలను, అతిశయోక్తులను, వక్రీకరణలను చారిత్రక ఆధారాలతో సహేతుకంగా సవరించటమే కల్హణుడి ప్రధాన ధ్యేయమైనప్పుడు ఆయన గ్రంథాన్ని కల్పిత చరిత్రగా కొట్టివేయటం ఎంత మాత్రం కుదరదు *"The Sanskrit book which comes nearest to the European notion of a regular history is the Rajatarangini of Kalhana, a metrical chronicle of Kashmir, written in the twelfth century"* (క్రీస్తు శకం 12వ శతాబ్దంలో కాశ్మీర్ చరిత్రను ఛందోబద్ధం చేస్తూ కల్హణుడు రాసిన రాజతరంగిణి ఒక్కటే సక్రమ చరిత్ర గురించి యూరోపియన్లకున్న భావానికి చాలా దగ్గరగా ఉండేది) అని Oxford Students History of Indiaలో V A Smith కూడా ఒప్పుకున్నాడు

అంతటి ప్రామాణికమైన 'రాజతరంగిణి' లో రికార్డు చేసిన ప్రకారం మనకు తెలిసిన కాశ్మీర్ చరిత్ర దాదాపు ఐదున్నర వేల సంవత్సరాల పాతది క్రీస్తు పూర్వం 3450తో అది మొదలవుతుంది మొదటి రెండొందల సంవత్సరాల్లో పరిపాలించిన ఐదుగురు రాజుల గురించి ఇదమిత్థమైన ఆధారాలు లేవు చరిత్ర కందిన మొదటి రాజు గోనందుడు ఆయన జరాసంధుడి సమకాలికుడు జరాసంధుడికి సాయంగా శ్రీకృష్ణుడితో యుద్ధానికి వెళ్ళినప్పుడు కృష్ణుడి అన్న బలరాముడు అతణ్ని చంపాడు తరవాత అతడి కుమారుడు దామోదరుడు కాశ్మీర రాజ్యాన్నేలాడు గాంధార రాజకుమార్తె స్వయంవరాన్ని చెడగొట్టటానికి ప్రయత్నించగా సింధు నదీ తీరాన సంఘర్షణలో శ్రీకృష్ణుడు అతణ్ని సంహరించాడు ఆ సమయానికి అతడి భార్య యశోవతి గర్భవతి పుత్రులెవరూ లేకపోవటంతో ఆపద్ధర్మంగా ఆమెకే పట్టం గట్టారు కొన్ని నెలలకు ఆమె మగబిడ్డను ప్రసవించింది గోనందుడు అని తాతగారి పేరెపెట్టి పుట్టిన 12వ రోజునే ఆ పసిగుడ్డుకు మంత్రులు పట్టాభిషేకం చేశారు. తరవాత ఏడాదికే (సుమారుగా క్రీ పూ 3138) కురుక్షేత్ర సంగ్రామం సంభవించింది పసివాడు రాజైనందువల్ల కౌరవ, పాండవులెవరూ కాశ్మీర్ సేనల సాయాన్ని అపేక్షించలేదు

భారత యుద్ధం ముగిసిన 62 సంవత్సరాలకు అంటే క్రీ పూ 3076కు 'కాశ్మీరాబ్దం' మొదలైంది ( దీన్నే లౌకికాబ్దమని, యుధిష్ఠిర శకమని, సప్తర్షి శకమని కూడా అంటారు యుధిష్ఠరుడు సోదర సమేతంగా స్వర్గానికి బయలుదేరిన రోజు ఈ శకానికి మొదలు). మనం శాలివాహన శకాబ్దాలను, ఉత్తరాదిన విక్రమ శకాన్ని పేర్కొన్నట్టు నాటి నుంచి నేటి దాకా కాశ్మీర పంచాంగాల్లో ఈ సంవత్సరాన్ని పేర్కొంటున్నారు క్రీ పూ.3076 నాటి ఈ గణనను విలియం జోన్సు, బహ్లార్, కన్నింగ్‌హామ్, విల్‌ఫోర్డ్, మాక్సుముల్లర్ లాంటి పాశ్చాత్యులు కూడా అంగీకరించారు దీని ప్రకారం చూసినా కాశ్మీర్ చరిత్ర ఐదువేల సంవత్సరాలకు పూర్వపుది

గోనందుడు -1 నుంచి గోనందుడు-2 వరకు పైన ప్రస్తావించిన నలుగురు పాలకుల తరవాత గద్దెనెక్కిన 35 మంది రాజులు వేదధర్మాన్ని ధిక్కరించి, సనాతన ఆచారాలను విడిచి కర్మభ్రష్టులయ్యారట అందువల్ల వారి చరిత్రను ఎవరూ రాసిపెట్టలేదట 40 నుంచి 47 వరకు రాజుల చరిత్రను పద్మమిహిరుడు రాశాడు 48వ చక్రవర్తి అశోకుడు ఆయన కుమారుడు జలౌకుడు తరువాతి రాజు రెండవ దామోదరుడు 50వవాడు అనంతరం హుష్క, జుష్క, కనిష్కులనే ముగ్గురు తురుష్క సోదరులు కాశ్మీర్‌ను కైవసం చేసుకుని ఉమ్మడిన పాలించగా గోనంద వంశానికి చెందిన అభిమన్యుడు కాలక్రమంలో వారిని జయించి 52వ రాజుగా కాశ్మీర్ గద్దెనెక్కాడు అశోకుడు నుంచి అభిమన్యుడి వరకు ఐదుగురు రాజుల చరిత్రను శ్రీచ్ఛవిల్లాకరుడు గ్రంథస్థం చేశాడు 53వ వాడు మూడో గోనందుడు అతడు తనకు 2330 సంవత్సరాల పూర్వపు వాడని కల్హణుడు పేర్కొన్నాడు కల్హణుడు క్రీ శ 1148 వాడు కాబట్టి మూడో గోనందుడిది క్రీ పూ 1182 అయి ఉండాలి ట్రోయర్ వంటి పాశ్చాత్య చరిత్రకారులు కూడా ఈ సంగతి ఒప్పుకున్నారు

క్రీ పూ 1182 నాటి మూడో గోనందుడితో మొదలుపెట్టి రాజతరంగిణిని రాసిన క్రీ శ 12వ శతాబ్దం వరకూ కాశ్మీర్‌ను ఏలిన రాజవంశాలు, వాటి కాలాలు ఇలా ఉన్నాయి

| కాలం | మొత్తం సం. | వంశం | మొదటి రాజు | చివరి రాజు | మొత్తం రాజులు |
|---|---|---|---|---|---|
| క్రీ.పూ 1182 – 272 | 910 | గోనంద | మూడో గోనందుడు | అంధ యధిష్ఠిరుడు | 21 |
| క్రీ పూ 272 – 80 | 192 | ప్రతాపాదిత్య | ప్రతాపాదిత్య | సంధిమతి | 6 |
| క్రీ.పూ 80 – క్రీ.శ.252 | 332 | గోనంద | మేఘవాహన | బాలాదిత్య | 10 |
| క్రీ శ.252 – 852 | 600 | కర్కోటక | దుర్లభవర్ధన | సుఖవర్మ | 17 |
| క్రీ శ.852 – 936 | 84 | ఉత్పల | అవంతివర్మ | ఉన్మత్తవంతి | 8 |
| క్రీ.శ.936 – 1012 | 76 | గుప్తబ్రాహ్మణ | యశస్కర | దిద్ద | 10 |
| క్రీ.శ.1012 – 1110 | 98 | ఆంధ్ర శాతవాహన | సంగ్రామరాజ | హర్ష | 6 |
| క్రీ.శ.1110 – 1148 | 38 | బ్రాహ్మక్షాత్ర అగ్నివంశం | ఉచ్చల | జయసింహ | 4 |
| మొత్తం | 2330 సంవత్సరాలు | | | | 82మంది రాజులు |

(ఆధారం కోట వెంకటాచలంగారు 1955లో ప్రచురించిన Chronology of Kashmir History Reconstructed గ్రంథం)

గోనందుడికి పూర్వీకులైన 52 మంది రాజులను వారు పాలించిన 2268 సంవత్సరాలను కలిపితే మొత్తం (82+52) 134 మంది హిందూ రాజులు (2330 + 2268) 4598 సంవత్సరాల పాటు కాశ్మీరరాజ్యాన్ని అవిచ్ఛిన్నంగా ఏలారు సగటున ఒక్కో రాజూ 34 సంవత్సరాలు గద్దె మీద ఉన్నాడు కుట్రలూ కూహకాలూ చేసి రాజులను కూలదోయడాలు, యుద్ధాల్లో రాజ్యం పరహస్తగతం అవడాలు ఆ నాలుగున్నర వేల ఏళ్లలో చాలా అరుదు. క్రీ పూ 1400లో గోనంద వంశీకుడైన అశోకుడు (48వ కాశ్మీర్ రాజు) బౌద్ధమతాన్ని స్వీకరించి, అహింసకు అంకితమై క్షాత్రధర్మాన్ని నిర్లక్ష్యం చేశాడు శ్రీనగర్ నగరాన్ని కళాత్మకంగా కట్టించి చరితార్థుడైతే అయ్యాడు గాని – తన రాజ్యాన్ని కబళించేందుకు మ్లేచ్ఛులు చేస్తున్న కుయత్నాలను గమనించలేక పోయాడు కళ్ళు తెరిచేసరికి పరిస్థితి చెయి దాటిపోయింది. 48 ఏళ్ళు తాను కూర్చున్న గద్దెను మ్లేచ్ఛుల పాలు చేసి అశోకుడు క్రీ పూ 1672లో అడవులకు పలాయన మయ్యాడు అ సమయంలో అతడి కుమారుడు జలౌకుడు ధైర్యంగా నిలిచి పోరాడి మరి కొద్ది నెలలకే శత్రువులను తరిమి రాజ్యాన్ని వశం చేసుకున్నాడు ఏకంగా 56 సంవత్సరాలు ఎదురులేకుండా ఆయన కాశ్మీరాన్ని ఏలాడు ఆయన మరణానంతరం రెండో దామోదరుడు గద్దెనెక్కి యాభై ఏళ్లు రాజ్యం చేశాక తురుష్క సోదరత్రయం చేతిలో ఓడి క్రీ.పూ 1782లో రాజ్యభ్రష్టుడయ్యాడు కనిష్కుడు, అతడి సోదరులు కలిసి మొత్తం అరవై ఏళ్ళు పాలించాక గోనంద వంశానికే చెందిన అభిమన్యుడు తురుష్కులను జయించి 52 ఏళ్లు ఏకచ్ఛత్రంగా కాశ్మీర్‌ను ఏలాడు మ్లేచ్ఛులు, తురుష్కులు కాశ్మీరాన్ని కొద్దికాలం ఆక్రమించిన ఈ రెండు ఘట్టాలను మినహాయిస్తే కాశ్మీర్ చరిత్రలో నాలుగున్నరవేల ఏళ్లు హిందూ రాజవంశాల ఏలుబడిలో సుస్థిరంగా,

మొత్తంమీద ప్రశాంతంగా సాగాయని చెప్పవచ్చు. వంశాలు మారినప్పుడైనా ఒక వంశం రాజుకు సంతానం లేక వేరొక వంశానికి చెందిన దగ్గరి బంధువుకు రాజ్యం అప్పగించిన సందర్భాలే ఎక్కువ ఉదాహరణకు గోనంద వంశానికి చెందిన బాలాదిత్యుడు 37 ఏళ్ళు రాజ్యం చేసి క్రీ శ 252 లో కాలం చేయగా ఆయనకు పుత్ర సంతానం లేనందువల్ల కర్కోటక వంశానికి చెందిన ఆయన అల్లుడు దుర్లభవర్ధనుడికి పట్టం గట్టారు. స్వయంగా ఆయన 36 సంవత్సరాలు, ఆయన వంశీకులు 16 మంది 534 సంవత్సరాలు - మొత్తం 600 ఏళ్లు నిరాఘాటంగా రాజ్యమేలారు

నూట ముప్పై మంది హైందవ ప్రభువుల్లో పలువురు స్త్రీలు కూడా వుండటం విశేషం అందరిలోకీ ఎక్కువ కాలం పాలించింది దిత్తాదేవి ఆమెది గుప్త బ్రాహ్మణ వంశం. కాబూల్ ప్రభువు భీమసాహి మనవరాలు క్రీ శ. 948నుంచి 957 వరకు తొమ్మిదేళ్లు రాజ్యం చేసిన క్షేమగుప్తుడి భార్య 957లో భర్త మరణించాక మైనర్ కుమారుడైన అభిమన్యగుప్తుడి పేర 14 ఏళ్లు, మిగతా కుమారులు నందిగుప్తుడు, త్రిభువనగుప్తుడు, భీమగుప్తుల పేర్లమీద ఎనిమిదేళ్లు పాలించి ఆ తరవాత స్వయంగా కుట్రలు చేసి, ప్రత్యర్థులను చిత్తు చేయడంలో, ఎవరినైనా చంపి అడ్డు తొలిగించుకోవటంలో, విశృంఖల రాసలీలలు సాగించడంలో ఆమెది పెద్ద పేరు తానే 33 ఏళ్లు రాజ్యమేలి స్వచ్ఛందంగా గద్దెదిగి, మేనల్లుడు సంగ్రామ రాజుకు పట్టంగట్టింది ఆమెకు పూర్వం క్రీ శ 900లో ఉత్పల వంశస్థుడైన శంకరవర్మ మరణానంతరం మైనర్ కుమారుడు గోపాలవర్మ పేరిట తల్లి సుగంధాదేవి రెండేళ్లు రాజ్యం చేసింది అదే వంశంలో చక్రవర్మ మహారాజును చంపించి క్రీ శ 934లో ఉన్మత్తవంతి సింహాసనమెక్కింది రెండేళ్లు తిరక్కుండా బ్రాహ్మణరాజులు ఆమెను జయించారు

సుమారు ఐదువేల ఏళ్ల హైందవ పాలనలో రాజులందరూ ఉత్తములని చెప్పడానికి వీలులేదు అయోగ్యులు, అసమర్థులు, ప్రజాకంటకులు కూడా వారిలో వున్నారు సిరిసంపదలతో తులతూగే సుందర నగరంగా శ్రీనగర్‌ను నిర్మించిన అశోకుడు (క్రీ.పూ 15వ శతాబ్దం), ఆదిశంకరుడికి ఆలయాన్ని, మరెన్నో దేవాలయాలను, అగ్రహారాలను నిర్మించిన గోపాదిత్యుడు (క్రీ పూ 4వ శతాబ్దం) స్వయంగా మంచి కవి పండితులైన వసునందనుడు (క్రీ పూ 6వ శతాబ్దం), రణాదిత్యుడు (క్రీ.పూ 2వ శతాబ్దం), ఎన్నో కాలవలు తవ్వించిన అవంతివర్మ (క్రీ శ 9వ శతాబ్దం)ల వంటి మంచి రాజులున్నట్టే క్రూరులు, దుర్మార్గులు అయిన పరిపాలకులూ కొందరు లేకపోలేదు వారందరిలోకీ కర్కోటకుడు మిహిరకులుడు.

చరిత్రను తెలియక కొంత, దుర్బుద్ధితో కొంత తారుమారు చేసిన పాశ్చాత్య చరిత్రకారులు మిహిరకులుడిని హూణుడని, క్రీ.శ. 6వ శతాబ్దంవాడని అన్నారు. మన దేశవాళీ మేధావులూ మిగతా పాశ్చాత్య చారిత్రక పైత్యాల్లాగే దీన్నీ గుడ్డిగా నమ్మారు. కాని నిజానికి మిహిరకులుడు పదహారణాల భారతీయుడే అతడు గోనంద వంశస్థుడు. క్రీ పూ. 634 నుంచి 704 వరకూ డెబ్బై ఏళ్లు కాశ్మీర్‌ను కాల్చుకుతిన్నాడు.

ఓసారి ఈ మహానుభావుడు కొండలదారుల్లో సైన్యంతో వస్తుంటే ఓ ఏనుగు కాలు జారి కొండమీంచి దొర్లిందట కింద పడుతుండగా ప్రాణభయంతో అది చేసిన దయనీయ ఘీంకారం ఇతగాడికి వీనులవిందుగా తోచిందట. ఆ మృత్యు ఘోషను మళ్లీ మళ్లీ విని ఆనందించాలన్న బుద్ధిపుట్టి అక్కడికక్కడే నూరు ఏనుగులను వరసగా కొండమీది నుంచి కిందికి దొర్లించాడట. ఇంకోసారి చంద్రకుళ్యానదీ తీరానికి స్నానానికి వెళ్లినప్పుడు మిహిరకులుడికి పెద్ద బండరాయి కనిపించిందట. ఏమిటది అని వాకబు చేయగా, ఆ రాతిలో ఒక యక్ష బ్రహ్మచారి వున్నాడని, శీలవతి అయిన మహా సాధ్వి తప్ప వేరెవరూ దానిని కదిలించలేరని జనం చెప్పారట. ఇంకేం? ఆ చుట్టుపట్ల ఊళ్లలోని స్త్రీలందరినీ అప్పటికప్పుడు పిలిపించి ఒకరి తరువాత ఒకరిని బండరాయి కదిలించమన్నాడట. ఎంత ప్రయత్నించినా ఎవరివల్లా కాలేదు. చంద్రావతి అనే కుమ్మరి స్త్రీ ఒక్కతే ఆ రాయిని నెట్టగలిగిందట. అమె మినహా మిగతా స్త్రీలందరికీ శీలం లేదని తేలిపోయిందికదా?! ఆ నేరానికి వారినీ, వారి భర్తలనూ, వారి పిల్లలనూ నరికివేయమని ఆ ''దయ'' గల మారాజు అనతిచ్చాడట ఆ ఒక్కరోజు ఊచకోతలోనే మూడువేలమందిని నరికి పోగులు పెట్టారని కల్హణుడు.రాశాడు భూలోక భైరవుడిగా పేరుపడ్డ మిహిరకులుడికి ఆఖరికి సొంత శరీరం మీదా దయలేదు డెబ్బై ఏళ్లు రాజ్యమేలాక భయంకర రోగమేదో పట్టుకుంటే బాధను భరించలేక, నయమవుతుందన్న ఆశ లేక ఒంటికి నిప్పంటించుకుని తనను తానే అగ్నిదేవుడికి అహుతిచ్చుకున్నాడతడు.

నాలుగున్నరవేల ఏళ్ల హైందవ రాజుల చరిత్రలో క్రూరులెందరో వున్నా మహా క్రూరుడు, నరరూప రాక్షసుడు అనదగ్గవాడు మిహిరకులుడొక్కడే కాని– అనంతర కాలంలో కాశ్మీర్ పాలబడ్డ విదేశీ ప్రభువుల్లో వేళ్లమీద లెక్కించగలిగిన సజ్జనులు పోగా మిగిలేదంతా ముష్కరులే. వారిలో ప్రతి ఒక్కడూ ఒక మిహిరకులుడే వారి భయానకగాధలు, కాశ్మీరాన్ని వారు పెట్టిన బాధలు స్థూలంగానైనా తెలిస్తేగానీ నేటి కాశ్మీర్ దురవస్థకు మూలమేమిటో తేటపడదు

# టెర్రరిజానికి ఏడొందల ఏళ్లు

*కాశ్మీర్‌ను శనిలా పట్టిన శాపం సీమాంతర ఉగ్రవాదం. ఈ సంగతి అందరికీ తెలుసు. కాని – చాలామందికి తెలియనిది, తెలిసినా గమనించనిది ఏమిటంటే – సీమాంతర ఇస్లామిక్ ఉగ్రవాదం ఈనాటిది కాదు. దీనికి ఒకటీ రెండూ కాదు. ఏకంగా ఏడు శతాబ్దాల చరిత్ర ఉంది. సరిహద్దు ఆవలి నుంచి వచ్చిన విదేశీయులు, వారి తైనాతీలు జిహాద్ పేరిట భయానక నరమేధాన్ని సాగిస్తూ, హిందువులను వీలైన మేరకు ఊచకోతలు కోస్తూ, విచ్చలవిడిగా విధ్వంసానికి పాల్పడటం క్రీ.శ. 14వ శతాబ్దం నుంచీ నిరాఘాటంగా జరుగుతున్నది. నాటికీ నేటికీ తేడా అల్లా ఒక్కటే. ఈ కాలపు టెర్రరిజం విదేశీ పాలకుల పరోక్ష ప్రోద్బలంతో, అమాంబాపతు ఇస్లామిక్ మిలిటెంటు మూకల పేరు మీద, ప్రభుత్వంతో తలపడి రాజ్యాంగ వ్యవస్థకు వ్యతిరేకంగా సాగుతున్నది. పూర్వకాలపు టెర్రరిజం దీనికంటే దారుణం. సరిహద్దు ఆవలి నుంచి వచ్చి అపమార్గాల్లో రాజ్యాన్ని ఆక్రమించిన విదేశీ పాలకుల, వారి వారసుల ప్రత్యక్ష పర్యవేక్షణలో... ప్రభుత్వపరంగానే, అధికారిక విధానంలో భాగంగానే... ఇస్లాంలో కలవటానికి సమ్మతించని ప్రజలపై క్రూరాతి క్రూరంగా విరుచుకుపడిన ఘోరకలి అది!*

మిగతా భారతదేశంలాగే కాశ్మీర్‌లోనూ పాలకుల అతి మంచితనమే ఆది నుంచీ అనర్థాలకు మూలహేతువు. శరణు వేడిన వాడికల్లా అభయమిచ్చి ఆదరించడం మన ఉదార ప్రభువులకు అలవాటు. 14వ శతాబ్దం మొదట్లో కాశ్మీర రాజ్యాన్ని ఏలిన దామ్రరాజు సింహదేవుడు తన శరణుజొచ్చిన ఇద్దరు పరదేశులకు ఆ ప్రకారమే ఆశ్రయమిచ్చి జాగిర్లు కూడా కట్టబెట్టాడు. పెద్దమనసుతో తాను చూపిన దయ

కాలక్రమంలో యమపాశమై తన మెడకే చుట్టుకుంటుందని, తాను పాలుపోసి పోషించిన శరణార్థులే ముందు ముందు కాశ్మీరీ హిందువులందరూ శరణార్థులయ్యే దుర్గతికి కారకులవుతారని ఆ పిచ్చిమారాజు ఊహించలేకపోయాడు. వలస వచ్చిన ముష్కరుల్లో ఒకడి పేరు రెంచన. టిబెట్ రాజవంశీకుడు రెండోవాడు షామిర్. అతడిది అఫ్ఘనిస్తాన్

క్రీ.శ.1320లో చెంఘిజ్‌ఖాన్ వంశీకుడైన జుల్ఫీ కాదర్‌ఖాన్ (డుల్చ్) డెబ్బైవేల సైన్యంతో టర్కిస్తాన్ నుంచి దండయాత్ర చేయగా అతడి ధాటికి నిలవలేక కాశ్మీర్ రాజు సింహదేవుడు పరారయ్యాడు రాజ్యం అరాజకంకాకుండా అతడి మంత్రి రామచంద్రుడు గద్దెనెక్కి మామూలు పరిస్థితుల పునరుద్ధరణకు ప్రయత్నిస్తుండగా అప్పటిదాకా కపట రాజభక్తి కనపరచిన రెంచన కొత్త రాజును ఖూనీ చేసి బలవంతంగా సింహాసనం అక్రమించాడు ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత రాకుండా చేయాలనుకుని తాను చంపిన రామచంద్రుడి కుమార్తె కోటరాణిని పెళ్ళాడాడు. జనాన్ని మచ్చిక చేసుకునేందుకు బౌద్ధాన్ని వదిలి హిందూమతాన్ని స్వీకరించాలని కూడా అతడు ప్రయత్నించాడు కాని - మతాంతరీకరణల అలవాటులేని కాశ్మీరీ బ్రాహ్మణులు అందుకు ఖండితంగా నిరాకరించారు. దాంతో 'సెకండ్ బెస్ట్' గా అప్పటికే కొద్దికొద్దిగా వ్యాప్తిలోకి వస్తున్న ఇస్లాం మతాన్ని పుచ్చుకుని రెంచన మహారాజు కాస్తా సుల్తాన్ సద్రుద్దీన్‌గా పేరు మార్చుకున్నాడు.

అలా మొదలైంది కాశ్మీర్‌లో ముస్లిం పాలన. రెంచనను ఇస్లాంలో కలుపుకున్నది మొదలుకుని రాజ్యాధికారాన్ని అతని ద్వారా విచ్చలవిడిగా దుర్వినియోగం చేసి బుల్‌బుల్‌షా అనే మహమ్మదీయ గురువు హిందువులను యమయాతనలు పెట్టాడు. ఇస్లాంను స్వీకరించని వారిని వెంటాడి వేటాడాడు. గురువుగారి మార్గదర్శకత్వంలో నయా సుల్తాన్ సద్రుద్దీన్ స్వయంగా వందలాది హిందూ ఆలయాలను, బౌద్ధ ఆరామాలను ధ్వంసం చేసి, అంతదాకా కనీవినీ ఎరుగని మత విద్వేషాన్ని చవిచూపించి కాశ్మీరీల్లో భయోత్పాతం రేకెత్తించాడు.

ఆ సద్రుద్దీన్ సుల్తాను కాశ్మీర్ పాలిట మొట్టమొదటి ఇస్లామిక్ టెర్రరిస్టు!

అదృష్టవశాత్తూ సద్రుద్దీన్ పీడ త్వరగానే తప్పింది కిరీటం తగిలించుకుని మూడేళ్లు తిరక్కుండా అతడు మరణించడంతో పాతరాజు సింహదేవుడి తమ్ముడు ఉదయనదేవుడు రాజదండం అందుకున్నాడు రాజకీయంగా బలపడటం కోసం సద్రుద్దీన్ భార్య కోటరాణిని అతడు పెళ్లి చేసుకున్నాడు ఇంతకు ముందు పేర్కొన్న శరణార్థుల్లో రెండో వాడయిన షామిర్ అతడి ప్రాపకం పొంది, మంత్రిగిరీ చలాయించాడు. పదిహేనేళ్లు పరిపాలించాక 1338లో ఉదయనదేవుడు కన్ను మూయగా కోటరాణికి పట్టం కట్టబోతున్న

సమయంలో షామిర్ కుట్రచేసి రాణిని చెరబట్టి, ప్రధానమంత్రివి, ఇతర రాజోద్యోగులను రాత్రికి రాత్రి చంపించి రాజమకుటం గుంజుకున్నాడు. సుల్తాన్ షంసుద్దీన్‌గా తనను తాను ప్రకటించుకున్నాడు ఉదయనుడి స్థానంలో తాను రాజవగానే అతడి భార్య కూడా తనకు ఎక్స్అఫీషియో భార్య అయిపోవాలనుకున్నాడు కాబోలు – కోటరాణిని నిర్బంధించి నిఖా చేసుకున్నాడు విధిలేక పశుబలానికి తలవంచిన రాణి మొదటి రాత్రే కత్తితో పొడుచుకుని 'నీతో పెళ్ళికి ఇదీ నా అంగీకారం' అని పేగులను చూపించి నెత్తుటి మడుగులో కూలిపోయింది. రాణి విషయంలో తాను విఫలమైన పథకాన్నే కాశ్మీరీ హిందువుల మీదా షంసుద్దీన్ విస్తృతంగా ప్రయోగించాడు. హిందూ కుటుంబాలను విచ్ఛిన్నం చేసే దుర్బుద్ధితో హిందువులు, ముస్లింల మధ్య మతాంతర వివాహాలను పెద్దఎత్తున జరిపించాడు. ఇది ఇంకో రకం టెర్రరిజం!

తనకు పూర్వం సద్రుద్దీన్ లాగే 'షంసుద్దీన్ సుల్తాన్' కూడా కుట్రచేసి, గొంతులు కోసి గద్దె నెక్కిన మూడేళ్ళకే గోరీలో చేరాడు. అతడి అనంతరం పెద్దకొడుకు రాజు కాగా ఏడాది తిరక్కుండా చిన్నకొడుకు యుద్ధం చేసి అన్నను గెంటేసి కిరీటం తాను లాక్కున్నాడు. అతడి మరణానంతరం అతడి కుమారుడు షాఉద్దీన్ రాజ్యమేలి వందలాది హిందూ దేవాలయాలను జయప్రదంగా నేలమట్టం చేశాడు. అతడి బాధ భరించలేక సొంత రాణే విడాకులిచ్చింది. షా ఉద్దీన్ కాలం చేశాక హిందువులను వేధించే డ్యూటీని అతడి తమ్ముడు కుతుబుద్దీన్ తీసుకున్నాడు అయనగారి పదహారేళ్ల పాలనలో సయ్యద్ అలీ హందానీ అనే మతోన్మాది పర్యవేక్షణలో బలవంతపు మతం మార్పిడులు యథేచ్ఛగా జరిగాయి. కాశ్మీరీ హిందువుల మెడ మీద కత్తి పెట్టి మతం మారతావా చస్తావా అని అడిగేవారు. మారతానంటే ప్రాణం దక్కేది. మారకపోతే తల తెగేది. ఆ ప్రకారంగా తెగిన తలలకు లెక్కలేదు. అది రాజు సాగించిన టెర్రరిజం!

ఇదే దారుణమనుకుంటే దీనికి నూరింతల ఘోరం ఆ తరవాత (1389-1413) కాశ్మీర్‌ను ఏలిన 'విగ్రహ విధ్వంసకుడు' సికిందర్‌ది. ఆయనకి గురువు సయ్యద్ హందానీ గారే. సికిందర్ సుల్తాన్ ఎంత గొప్పవాడంటే హిందూ దేవాలయాలు కూలగొట్టటానికి ఏకంగా ఒక గవర్నమెంటు డిపార్టుమెంటునే పెట్టాడు. కాశ్మీర రాజ్యంలోని ఏ పల్లే, ఏ పట్నమూ క్రమపద్ధతి ప్రకారం అతడు జరిపించిన ఆలయ విధ్వంసం బారి నుంచి తప్పించుకోలేక పోయింది. మార్తాండ్‌లో ప్రసిద్ధి చెందిన సూర్య దేవాలయాన్ని మిగతా గుళ్ళలా కూల్చడం ఎంత ప్రయత్నించినా సికిందర్ మూకలకు సాధ్యపడలేదట. కూల్చలేనప్పుడు కాల్చటం మేలనుకుని, అడవి నుంచి పెద్దపెద్ద దుంగలను తెప్పించి

గుడి నిండా పేర్చి నిప్పంటించారట కాలే దుంగల వేడికి కొన్ని రోజుల తరవాత విగ్రహాలు, కట్టడాలు పగులుబారాక పలుగులు, సుత్తులతో వాటిని కూల్చివేసేవారు ఈకాలపు అఫ్ఘాన్ తాలిబన్లకు కూడా తెలియని 'టెక్నిక్' ఇది! పరాస్పోర్, అవంతిపుర, తాపార్ తదితర ప్రాంతాల్లోని ప్రసిద్ధ దేవాలయాలనూ ఇదే పద్ధతిలో కూల్చారని పర్షియన్ చారిత్రక పత్రాల్లో వెల్లడైంది

తాలిబన్ల తాతల్లా విగ్రహాలను, ఆలయాలను ధ్వంసం చేయడంతోపాటు నృత్య, నాటక శిల్ప కళలను, సంగీత వాద్యాలను కూడా సికిందర్ నిషేధించాడు నుదుట తిలకం పెట్టుకోరాదని శాసించాడు ఇస్లాంను స్వీకరించని హిందువుల మీద జిజియా పన్ను వేశాడు ముసల్మాన్ మతం పుచ్చుకోని బ్రాహ్మణుల మెడల నుంచి తెంపిన యజ్ఞోపవీతాలను ఒకమారు పోగు వేస్తే ఏడు మణుగుల బరువు తూగాయట బ్రాహ్మల తాళ్లు తెంచటంతోబాటు హిందువుల మత గ్రంథాలు ఎక్కడెక్కడ కంటపడ్డా కట్టగట్టి దాల్ సరస్సులోకి విసిరేయించిన ఘనుడు సికిందర్ సుల్తాన్. మరణించిన వారిని హిందూ మతాచారం ప్రకారం తగలబెట్టనీయకుండా, కూల్చిన గుళ్లను తిరిగి కట్టుకోనివ్వలేదు. గుర్రం మీద ఎక్కి తిరిగేందుకూ, వేలికి ఉంగరం పెట్టుకునేందుకూ నోచుకోకుండా హిందువులపై సికిందర్ అడ్డగోలు ఆంక్షలు పెట్టి నానావిధాల వేధించాడు. రాజ్యంలో ముస్లింలు నివసించే ప్రాంతంలో ఇల్లు కట్టుకునేందుకు కూడా హిందువులను అనుమతించేవారు కాదు. కాశ్మీర్‌లో తాలిబన్ తరహా టెర్రరిజానికి అతడే ఆద్యుడు.

సికిందర్ మరణానంతరం 1413లో గద్దెనెక్కిన అతడి కుమారుడు అలీషా దుర్మార్గంలో తండ్రిని మించినవాడు మతం మారని హిందువులను పగబట్టి వేటాడటంలో అతడు 'విలక్షణ ప్రజ్ఞావంతుడు'. 1320లో ముస్లిం పాలన మొదలయ్యే సమయానికి కాశ్మీర్ ఆర్ష ధర్మానికి పట్టుగొమ్మగా, హిందూ మతానికి శిఖరాయమానంగా సంస్కృత సారస్వతానికి, భారతీయ కళలకు, వైదిక విద్యలకు నందనవనంలా భాసించి సంస్కృత విద్వాంసులతో 'హిందూ పండిత కుటుంబాలతో, సాంప్రదాయక కళా ప్రవీణులతో కళకళలాడేది. అలాంటి చోట అలీషా ఏడేళ్లపాలన ముగిసే నాటికి కాశ్మీర్‌లో మిగిలిన పండిత కుటుంబాలు కేవలం పదకొండు దీన్ని బట్టే ఊహించవచ్చు తండ్రీ కొడుకుల తడాఖా ఎంతటిదో!

అయితే – ఉత్పాతంలోనే ఒకింత స్వాంతనం। కాశ్మీరీల అదృష్టం బాగుండి, వారు వేడుకున్న దేవతలు కరుణించి 1420లో అలీషా మరణానంతరం అతని తమ్ముడు బాద్‌షా జెయిన్ ఉల్ అబ్దిన్ గద్దెనెక్కాడు సికిందర్, అలీషాలు ఎంత పాపాత్ములో ఈ

బాద్‌షా అంత పుణ్యాత్ముడు తండ్రి, అన్నల పాలిసీలను పూర్తిగా మార్చి ఆయన హిందువులపై ఆంక్షలన్నిటినీ ఎత్తేశాడు జిజియా పన్ను తీసేశాడు గోవధను నిషేధించాడు. ధ్వంసమైన దేవాలయాలను పునర్నిర్మించుకోవటానికి అనుమతిచ్చాడు. స్వయంగా తానే శంకరాచార్యాలయం లాంటి కొన్ని హిందూ గుడులను పునరుద్ధరించాడు. హిందూ శాస్త్రాలను, మహాభారతాన్ని పర్షియన్‌లోకి అనువదింపజేశాడు దమనకాండకు తట్టుకోలేక కాశ్మీర్ వదిలిపోయిన పండిట్లను వెనక్కి పిలిపించి యోగ్యతనుబట్టి బాధ్యతగల పదవులు అప్పగించాడు బాద్‌షా ఖ్యాతిని విని భారతదేశం ఇతర ప్రాంతాలకు చెందిన కౌల్, ధర్ ఇత్యాది పేర్ల కుటుంబాల వారు కూడా కాశ్మీర్ వెళ్ళి స్థిరపడ్డారు. రాజోద్యోగాల్లో నియోగించిన బ్రాహ్మణులను 'కర్‌కూన్'లని, వైదిక వృత్తుల్లోని బ్రాహ్మలను 'వాచవతు'లని (తెలుగునాట బ్రాహ్మల్లో 'నియోగి' 'వైదీకి' శాఖలు ఏర్పడ్డట్టు) వ్యవహరించేవారు. మొగలాయీల కాలంలో అక్బర్ వలె మత సహిష్ణుత ఒక్కటేగాక కళలను, సంస్కృతిని, లౌకిక వృత్తులను ఆదరించి ప్రోత్సహించడం కూడా బాద్‌షా ప్రత్యేకత రాజ్యమంతటా కాలవలు తవ్వించి, చవుడు భూములను సాగులోకి తెచ్చి ఆయన వ్యవసాయోత్పత్తిని ఊహాతీతంగా పెంచాడు గ్రామంలో జరిగే నేరాలకు గ్రామ పెద్దది జవాబుదారీ చేసి, లంచగొండి అధికారులను కఠినంగా శిక్షించి, ఆహారపు అక్రమ నిల్వలను నిరోధించి, ధరలను నియంత్రించి, సమాచార వ్యవస్థను పటిష్ఠం చేసి ధర్మప్రభువు అనిపించుకున్నాడు. బాద్‌షా పాలించిన యాభై ఏళ్ళూ కాశ్మీరీలకు, ముఖ్యంగా కాశ్మీరీ హిందువులకు ముస్లిం హయాంలో స్వర్ణయుగం

ఎంత తీపి కలకైనా ముగింపు తప్పదు. బాద్‌షా జెయిన్ ఉల్ అబ్దిన్ కాలధర్మంతో కాశ్మీర్ కథ మొదటికి వచ్చింది బాద్‌షా ఎంత ఉత్తముడో ఆయన కుమారులు అంత అధములు. ఒకరిపై ఒకరు కుట్రలు పన్నడంలో, ఒకరిని మించిన చెడ్డపేరు ఇంకొకరు తెచ్చుకోవటంలో మహాప్రవీణులు. తరవాతి సుల్తాన్ అయిన హైదర్‌షా తాతగారి వారసత్వాన్ని పుణికి పుచ్చుకుని హిందూ దేవాలయాలను వరసబెట్టి చేతనైన మేరకు కూల్చాడు గద్దె మీద కూచోగలిగిన ఒక్క సంవత్సరంలోనే హిందువులను యధాశక్తి వేధించాడు అతడి అనంతరం వచ్చిన సుల్తానులూ అంతఃపుర కుట్రలు, రాసలీలలు, పానగోష్ఠుల వంటి అత్యవసరాలకు వెచ్చించగా మిగిలిన సమయంలో లూటీలు, గృహ దహనాలు చేయించి ముస్లిమేతరులను స్థాయీ భేదాల్లో చెండుకు తిన్నారు 1489లో సుల్తాన్ అయిన ఫతేషా ఒక్కడే 24 వేల మంది కాశ్మీరీ హిందువులను మెడమీద కత్తి పెట్టి ఇస్లాంలోకి బలవంతంగా మార్పించాడు తాను కూల్చిన కాళికాలయంలోకి ప్రవేశించే 'దుస్సాహసానికి' ఒడిగట్టిన 'నేరానికి' మండిపడి, కోపించిన కాశ్మీరీ పండిటుకల్లా ముక్కూ

చెవులూ కోసెయ్యమని ఆనతిచ్చిన ధర్మమూర్తి అతడు। గత్యంతరం లేక ఇస్లాం మతం పుచ్చుకున్నా హిందూ మతం మీద మమకారం చంపుకోలేక నమాజ్ సమయంలో వైదిక మంత్రాలను లోలోన గొణుగుతున్న నేరానికి 800 మంది ప్రముఖ హిందువులను 16వ శతాబ్దం చివరిలో మూసా రయినా అనే మంత్రి సామూహికంగా తలలు నరికించాడు

కాజీచాక్ అనే షియా మతస్థుడు కాశ్మీర్‌లో బలాధిక్యంగల సున్నీలను గెలిచి సుల్తాన్ అయ్యాక తన గురువు షామ్స్ ఇరాకీగారి దర్శనానికి పోతే ఆయన దీవించి 'పూర్తి అధికారం నీ చేతికి వచ్చింది కదా। దాన్ని ఉపయోగించి కాశ్మీర్‌కు ఇతర మతాల పీడ విరగడ చేసి హిందూ కాఫిర్ల భరతం పట్టమ'ని కర్తవ్య బోధ చేశాడట ఆ పాఠాన్ని సుల్తాన్‌గారు వెంటనే అమల్లో పెట్టి 1518 సంవత్సరంలో ఒక్కరోజునే 1800 మంది ప్రముఖ హిందువులను ఊచకోత కోయించాడని 'బహరిస్తాన్–ఇ–షాహి' గ్రంధం చెబుతుంది. సుల్తాన్ల అసమర్థత, అలసత్వాల మూలంగా, ముస్లింల్లోనే షియా – సున్నీల మధ్య ఘర్షణల కారణంగా, అంటువ్యాధుల వ్యాప్తి, వరదల వంటి ప్రకృతి వైపరీత్యాల జాస్తి పర్యవసానంగా విశేష జననష్టం సంభవించి, ఆర్థిక వ్యవస్థ చితికి కాశ్మీర్ మొత్తం దీర్ఘకాలం దారుణ దురవస్థల పాలయిన పరిస్థితుల్లో కాశ్మీర్ రాజ ప్రముఖులు కొందరు చక్రవర్తి అక్బర్‌కు కాశ్మీర్‌ను కూడా మొగల్ సామ్రాజ్యంలో కలిపేసుకోమని అభ్యర్థన చేశారు ఎటువంటి ప్రతిఘటనా లేకుండా 1589లో మొగలాయిలు కాశ్మీర్‌ను సునాయాసంగా వశం చేసుకున్నారు ఉత్తమ సంస్కారంగల అక్బర్, జహంగీర్, షాజహాన్ చక్రవర్తుల కాలంలో మొగల్ పాలన వల్ల కాశ్మీర్‌కు అనేక లాభాలు చేకూరాయి రాజకీయ అస్థిరత, మతకల్లోలాలు, అరాచకాలు, అవినీతి స్వైరవిహారాలు పోయి క్రమబద్ధమైన ప్రభుత్వ వ్యవస్థ ఏర్పడి, ఈతిబాధలను తట్టుకోగల ఆర్థిక స్తోమతు సమకూడి కాశ్మీర్ తెప్పరిల్లింది దుర్మార్గపు మతాంతరీకరణల బెడద పోయి అరవై డెబ్బై ఏళ్ళు అక్కడి హిందువులు కాస్తంత సుఖంగా ఉన్నారో లేదో 1659లో కాలయముడిలా ఔరంగజేబ్ ఢిల్లీ పాదుషా అయ్యాడు

కన్నతండ్రిని ఖైదుచేసి, సోదరులను హతమార్చి సింహాసనం అధిష్ఠించినందుకు తన మతస్థులు తనను అసహ్యించుకోకుండా చూసుకోవటానికి ఔరంగజేబు రెట్టించిన ఉత్సాహంతో ముస్లిం మతవ్యాప్తిని సాగించి ముహమ్మదీయేతరులను మహా క్రూరంగా వేధించాడు. 'మతవిశ్వాసం లేని ద్రోహుల పాఠశాలలను, దేవాలయాలను ధ్వంసం చేయమని తన సామ్రాజ్యంలోని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు ఉత్తర్వు చేశాడు. తట్టా, ముల్తాన్ రాష్ట్రాల్లో, ముఖ్యంగా బెనారస్‌లో బ్రాహ్మణ కాఫిర్లు పాఠశాలలు నడుపుతూ తప్పుడు గ్రంధాలను బోధిస్తున్నట్టు ఇస్లాం విశ్వాసానికి అంకితమైన ప్రభువుకు

తెలియవచ్చిందని, దూర ప్రాంతాల నుంచి కూడా హిందువులు, ముస్లింలు అక్కడికి చేరి భ్రష్ట జ్ఞానాన్ని ఆ నికృష్టుల నుంచి నేర్చుకుంటున్నారని, కాబట్టి అటువంటి దైవద్రోహుల పాఠశాలలను, దేవాలయాలను అన్ని రాష్ట్రాల్లోనూ తక్షణం కూల్చి అలాంటి తప్పుడు మతాలను ఎవరూ బహిరంగంగా ఆచరించకుండా అణచివేయాలని ఆ తాఖీదు సారాంశం

రాజు తలచుకుంటే దెబ్బలకు కొదవా? చక్రవర్తిగారు ఆజ్ఞాపించినదే తడవుగా అనుచరులు చెలరేగి కాశీ విశ్వనాథాలయాన్ని, సోమనాథ్‌లో రెండో గుడిని, మధురలో కేశవాలయాన్ని, ఇంకా భారతదేశం దశదిశలా వందల, వేల దేవాలయాలను, హిందూ విద్యా సంస్థలను నేలమట్టం చేశారు రాజపుత్రులు మినహా హిందువు లెవరూ పల్లకి ఎక్కరాదని, ఆయుధాలు ధరించరాదని, అనేక రకాల రాజోద్యోగాలకు వారు పనికిరారని, జిజియా పన్ను కట్టి తీరాలని దుర్మార్గపు ఆంక్షలు పెట్టారు తిలకం బొట్టు, జంధ్యం పోగు ఎవరి దగ్గర కనిపించినా అవమానించి క్రూరంగా హింసించేవారు ఒక్క కాశ్మీర్‌లోనే రోజుకు మణుగు బరువు జంధ్యాలు తెంపి పారేసేవారు ఈ బాధలు పడలేక కాశ్మీర్‌కు చెందిన హిందువులు కొందరు పంజాబ్ వెళ్లి తొమ్మిదో సిక్కు గురువు తేజ్ బహాదూర్‌కు తమ గోడు మొరపెట్టుకున్నారు. ఆ తరవాత జరిగింది చరిత్రలో చెరిగిపోని ధీరోదాత్త, బీభత్స గాథ।

కాశ్మీరీ పండిట్లు ఏకరువు పెట్టిన భయానకానుభవాలను ఆలకించి అనందపూర్ నివాసంలో తేజ్ బహాదూర్ విషణ్ణ వదనంతో దీర్ఘాలోచనలో ఉండగా ఆయన తొమ్మిదేళ్ల కుమారుడు గోవింద సింగ్ ఆటల మధ్యలో అక్కడికి వచ్చి అలా ఉన్నారేమిటని తండ్రిని అడిగాడు 'పాపాల భారం భూమికి పెరిగిపోతున్నది అన్నివిధాల యోగ్యుడైన వ్యక్తి ఆత్మబలిదానం చేస్తేగానీ ఈ క్లేశం తొలగదు' అని చెప్పాడు తండ్రి 'అంతటి గొప్ప త్యాగానికి మీకంటే యోగ్యులెవరు?' అన్నాడు కుమారుడు గురుతేజ్ బహాదూర్ మొహం వికసించింది తన సంకల్పాన్ని కుమారుడి ముఖతః దైవం ధ్రువీకరించినట్టుగా ఆయన భావించాడు కాశ్మీరీ హిందువులతో 'వెంటనే ఢిల్లీ వెళ్ళండి. తేజ్ బహాదూర్ కనుక ఇస్లాం స్వీకరిస్తే మీరందరూ కూడా మతం మారతారని చక్రవర్తికి తెలియపరచండి' అన్నాడు

ఆ కబురు వినగానే చక్రవర్తి ఆయనను ఢిల్లీ రమ్మని పిలిపించాడు ముగ్గురు శిష్యులు వెంటరాగా తేజ్ బహాదూర్ అనందపూర్ పొలిమేరలు దాటాడో లేదో ఔరంగజేబ్ పోలీసులు అరెస్టు చేసి ఇస్లాంను స్వీకరించమంటూ నాలుగు నెలలు సిర్హింద్‌లో చిత్రహింసలు పెట్టారు. ఎంతకూ వినకపోయేసరికి ఇనుప బోనులో బంధించి ఆయనను ఢిల్లీ పంపారు.

అక్కడ ఎన్నో ప్రలోభాలు ఎరవేశారు అయన లోబడలేదు చిత్రహింసలకు గురిచేశారు ఆయన తొణకలేదు. ఆయన కళ్ల ముందే అయన ప్రియశిష్యుడు భాయి మాతీదాస్‌ను తలనుంచి కింది దాకా నిలువునా రంపంతో కోసి రెండు ముక్కలు చేశారు. ఇంకో శిష్యుడు భాయి దయాళ్‌దాస్‌ను సలసల మరిగే నీటిలోకి విసిరారు. మూడో శిష్యుడు సతీదాస్‌ను దూదిమేటలో కట్టి నిప్పంటించారు. అయినా ధైర్యం చెదరక, మతం మార్పిడికి ఒప్పక స్థిరంగా ఉండిపోవటంతో అన్ని ఉపాయాలూ వ్యర్థమయ్యాక 1675 నవంబర్ 11న చాందినీచౌక్‌లో వేల మంది చూస్తుండగా, బహిరంగంగా గురుతేజ్ బహాదూర్ తల నరికారు ఆయన బలిదానం వృథా కాలేదు ఆయన ఆత్మార్పణం నిద్రాణమైన సిక్కు పౌరుషాన్ని జాగృతపరచి ఆయన ఉత్తరాధికారి గురు గోవింద్ సింగ్ నేతృత్వంలో సమరోన్ముఖం చేసి చివరికి మొగలాయీ పాలనకు భరత వాక్యం పలకడం జగమెరిగిన చరిత్ర

ఔరంగజేబ్ మరణానంతరం మొగల్ సామ్రాజ్యం ఛిన్నాభిన్నం కావడంతో కాశ్మీర్ కష్టాలు గట్టెక్కలేదు. పరిపాలన అస్తవ్యస్తమై, వరదలూ, కరవుల బారిన కాశ్మీర్ దుర్భర దైన్యం అనుభవిస్తున్న అరాజక స్థితిలో కాశ్మీరాన్ని మీ సామ్రాజ్యంలో చేర్చుకుని ఆదుకోవలసిందంటూ అఫ్ఘాన్ రాజు అహ్మద్‌షా అబ్దాలీకి కాశ్మీరీ ప్రముఖులు కొందరు (రెండు శతాబ్దాలకు పూర్వం మొగలాయీలను వేడుకున్నట్టే) ఆహ్వానించారు. అదే అదనుకొని అయన చప్పున సైన్యాన్ని పంపి 1753లో కాశ్మీర్‌ను అవలీలగా ఆక్రమించాడు దాంతో కాశ్మీరీల పరిస్థితి పెనం నుంచి పొయిలో పడ్డట్టయింది 67 ఏళ్లు ఒడిదుడుకులూ, కుట్రలూ తిరుగుబాట్ల మధ్య సాగిన అఫ్ఘాన్ల పాలన కాశ్మీర్ చరిత్రలో భయంకరమైన పీడకల 67 ఏళ్ళలో 24గురు గవర్నర్లు మారారు వారూ వీరన్న తేడా లేకుండా అన్ని మతాల వారినీ నిలువుదోపిడీ చేసి అడ్డగోలు పన్నులను గోళ్లూడగొట్టి వసూలు చేసి డబ్బు సంచులను కాబూల్‌కు మోసుకుపోయినా, అఫ్ఘాన్ కిరాతకుల 'వక్రదృష్టి' హిందువుల మీద మరీ ఎక్కువగా పడింది గవర్నరుకు కనుక మతప్రకోపం ఎక్కువైతే మహమ్మదీయేతరులకు మూడిందే మీర్ ఫకీరుల్లా ఖాన్ అనే గవర్నరు కాశ్మీర్‌లోని సుప్రసిద్ధ హిందూ విద్వాంసు లందరినీ నిష్కారణంగా చంపించగా, ఆజాద్‌ఖాన్ అనే గవర్నరు మతం మార్పుకు ఒప్పుకోని నేరానికి ఇద్దరేసి హిందువులను గడ్డిమూటలో కట్టేసి డాల్ సరస్సులోకి విసరేయించే వాడు చిట్టచివరి గవర్నరు జబ్బార్‌ఖాన్ తమను పెడుతున్న చిత్రహింసలను భరించలేక సహనం నశించి కాశ్మీరీ పండిట్లు ఆదుకోవలసిందని మహారాజా రంజిత్‌సింగ్‌ను వేడగా అయన సేనలను పంపి 1819 జులై 15న కాశ్మీర్‌ను తన అధీనంలోకి తెచ్చుకోవడంతో అఫ్ఘాన్ల బెడద పోయింది పావు శతాబ్దం తరవాత రంజిత్

సింగ్‌కు ఒకప్పటి సేనాని గులాబ్‌సింగ్ 75 లక్షల రూపాయలిచ్చి ఇంగ్లీషు వారి నుంచి కొనుక్కోవడంతో 1846 మార్చి 16 నుంచి కాశ్మీర్ డోగ్రా వంశీకుల పరిపాలనలోకి వచ్చింది

1320 నుంచి 1819 వరకూ ఐదొందల ఏళ్లపాటు సాగిన ముస్లిం పాలనలో చెలరేగిన జిహాద్‌ల, బలవంతపు మతమార్పిడుల, చారిత్రక టెర్రరిజాల భయానక కిరాతకాల సహజ పర్యవసానమే కొన్నేళ్లుగా కాశ్మీర్‌ను దహిస్తున్న అశాంతి

# అనుబంధం - 2

# Appendix - I

## Letter from Maharaja Hari Singh to Lord Mountbatten on the eve of Pak invasion on J & K in 1947

**My dear Lord Mountbatten,**

I have to inform your Excellency that a grave emergency has arisen in my State and request immediate assistance of your Government. As your Excellency is aware the State of Jammu and Kashmir has not acceded to the Dominion of India or to Pakistan Geographically my State is contiguous to both the Dominions It has vital economical and cultural links with both of them Besides my State has a common boundary with the Union of Soviet Socialist Republics and China. In their external relations the Dominion of India and Pakistan cannot ignore this fact. I wanted to take time to decide to which Dominion I should accede, or whether it is not in the best interests of both the Dominions and of my State to stand independent, of course with friendly and cordial relations with both I accordingly approached the Dominions of India and Pakistan to enter into Standstill Agreement with my State The Pakistan Government accepted this arrangement. The Dominion of India desired further discussion with representatives of my Government. I could not arrange this in view of the developments indicated below In fact the Pakistan Government under the standstill agreement are operating Post and Telegraph system inside the State Though we have got a Standstill Agreement with the Pakistan Government that Government permitted steady and increasing strangulation of supplies like food, salt and petrol to my State

Afridis, soldiers in plain clothes, and desperadoes with modern weapons have been allowed to infilter into the State at first in Poonch area and then in Sialkot and finally in a mass area adjoining Hazara District on the Ramkot side. The result has been that the limited number of troops at the disposal of the State had to be dispersed and thus had to face the enemy at several points simultaneously, so that it has become difficult to stop the wanton destruction of life and property and looting The Mahura power house which supplies electric current to the whole of Srinagar has been burnt

The number of women who have been kidnapped and raped makes my heart bleed The wild forces thus let loose on the State are marching on with the aim of capturing Srinagar, the summer capital of my Government, as a first step to over-running the whole State. The mass infiltration of tribesmen drawn from distant areas of the North-West Frontier coming regularly in motor trucks using Mansehra-Muzaffarabad Road and fully armed with up-to-date weapons cannot possibly be done without the knowledge of the Provisional Government of the North-West Frontier Province and the Government of Pakistan In spite of repeated requests made by my Government no attempt has been made to check these raiders or stop them from coming into my State The Pakistan Radio even put out a story that a provisional government had been set up in Kashmir The people of my State both Muslims and non-Muslims generally have taken no part at all

With the conditions obtaining at present in my State and the great emergency of the situation as it exists, I have no option but to ask for help from the Indian Dominion Naturally they cannot send the help asked for by me without my State acceding to the Dominion of India. I have accordingly decided to do so and I attach the Instrument of Accession for acceptance by your Government. The other alternative is to leave my State and my people to free-booters On this basis no civilized Government can exist or be maintained

This alternative I will never allow to happen as long as I am the ruler of the State and I have life to defend my country I may also inform your Excellency's Government that it is my intention at once to set up an interim Government and ask Sheikh Abdullah to carry the responsibilities in this emergency with my Prime Minister

If my State is to be saved, immediate assistance must be available at Srinagar Mr V.P. Menon is fully aware of the gravity of the situation and he will explain to you, if further explanation is needed

In haste and with kindest regards,

Yours sincerely,

**Hari Singh**

October 26, 1947

## Appendix - II

# Reply from Lord Mountbatten to Maharaja Hari Singh

**My dear Maharaja Sahib,**

Your Highness' letter dated 26 October 1947 has been delivered to me by Mr V P Menon In the circumstances mentioned by Your Highness, my Government have decided to accept the accession of Kashmir State to the Dominion of India. In consistence with their policy that in the case of any State where the issue of accession has been the subject of dispute, the question of accession should be decided in accordance with the wishes of the people of the State, it is my Government's wish that, as soon as law and order have been restored in Kashmir and its soil cleared of the invader, the question of the State's accession should be settled by a reference to the people

Meanwhile, in response to Your Highness' appeal for military aid, action has been taken today to send troops of the Indian Army to Kashmir, to help your own forces to defend your territory and to protect the lives, property, and honour of your people. My Government and I note with satisfaction that Your Highness has decided to invite Sheikh Abdullah to form an interim Government to work with your Prime Minister

**Mountbatten** of Burma

October 27, 1947

## Appendix - III

# Instrument of Accession

(As signed by Maharajadhiraj Hari Singh, Ruler of Jammu and Kashmir)

WHEREAS the Indian Independence Act, 1947, provides that as from the fifteenth day of August 1947, there shall be set up an independent Dominion known as India, and that the Government of India Act, 1935, shall with such omissions, additions, adaptations and modifications as the Governor General may by order specify be applicable to the Dominion of India.

AND WHEREAS the Government of India Act, 1935, as so adapted by the Governor General provides that an Indian State may accede to the Dominion of India by an Instrument of Accession executed by the Ruler thereof.

NOW THEREFORE

I, Shriman Inder Mahandar Rajrajeshwar Maharajadhiraj Shri Hari Singh Ji, Jammu Kashmir Naresh Tatha Tibbet adi Deshadhipathi, Ruler of Jammu and Kashmir State in the exercise of my sovereignty in and over my said State do hereby execute this my Instrument of Accession and

1 I hereby declare that I accede to the Dominion of India with the intent that the Governor General of India, the Dominion Legislature, the Federal Court and any other Dominion authority established for the purposes of the Dominion shall, by virtue of this my Instrument of Accession, but subject always to the terms thereof, and for the purposes only of the Dominion, exercise in relation to the State of Jammu and Kashmir (hereinafter referred to as "this State") such functions as may be vested in them by or under the Government of India Act, 1935 as in force in the Dominion of India on the 15th day of August 1947 (which Act as so in force is hereinafter referred to as "the Act")

2 I Hereby assume the obligation of ensuring that due effect is given to the provisions of the Act within this State so far as they are applicable therein by virtue of this my Instrument of Accession

3 I accept the matters specified in the Schedule hereto as the matters with respect to which the Dominion Legislature may make laws for this State

4 I hereby declare that I accede to the Dominion of India on the assurance that if an agreement is made between the Governor - General and the ruler of this State

whereby any functions in relation to the administration in this state of any law of the Dominion legislature shall be exercised by the Ruler of this State, then any such agreement shall be deemed to form part of this Instrument and shall be construed and have effect accordingly

5 The terms of this my Instrument of Accesion shall not be varied by any amendment of the Act or of the Indian Independence Act, 1947, unless such amendment is accepted by me by an Instrument supplementary to this Instrument.

6 Nothing in this Instrument shall empower the Dominion Legislature to make any law for this State authorising the compulsory acquisition of land for any purpose, but I hereby undertake that should the Dominion for the puposes of a Dominion law which applies in this State deem it necessary to acquire any land, I will at their request acquire the land at their expense or if the land belongs to me transfer it to them on such terms as may be agreed, or in default of agreement, determined by an arbitrator to be appointed by the Chief Justice of India.

7 Nothing in this Instrument shall be deemed to commit me in any way to acceptance of any future Constitution of India or to fetter my discretion to enter into arrangements with the Government of India under any such future constitution

8 Nothing in this Instrument affects the continuance of my sovereignty in and over this State, or, save as provided by or under this Instrument, the exercise of any powers, authority and rights now enjoyed by me as Ruler of this State or the validity of any law at present in force in this State

9 I hereby declare that I execute this Instrument on behalf of this State and that any reference in this Instrument to me or to the Ruler of the State is to be construed as including a reference to my heirs and successors

Given under my hand this 26th day of October, Nineteen hundred and forty-seven

Sd/- **(Hari Singh)**

Maharajadhiraj of Jammu and Kashmir State

I do hereby accept this Instrument of Accession

Dated, this twenty-seventh day of October, Nineteen hundred and forty-seven

Sd/- **Mountbatten of Burma**

(Governor - General of India)

## Appendix - IV

# Simla Agreement, 2 July 1972

## Agreement on Bilateral Relations between the Government of India and the Government of Pakistan

The Government of India and the Government of Pakistan are resolved that the two countries put an end to the conflict and confrontation that have hitherto marred their relations and work for the promotion of a friendly and harmonious relationship and the establishment of durable peace in the sub-continent, so that both countries may henceforth devote their resources and energies to the pressing task of advancing the welfare of their peoples

In order to achieve this objective, the Government of India and the Government of Pakistan have agreed as follows

(i) That the principles and purposes of the Charter of the United Nations shall govern the relations between the two countries,

(ii) That the two countries are resolved to settle their differences by peaceful means through bilateral negotiations or by any other peaceful means mutually agreed upon between them Pending the final settlement of any of the problems between the two countries, neither side shall unilaterally alter the situation and both shall prevent the organization, assistance or encouragement of any acts detrimental to the maintenance of peaceful and harmonious relations

(iii) That the pre-requisite for reconciliation, good neighbourliness and durable peace between them is a commitment by both the countries to peaceful co-existence, respect for each other's territorial integrity and sovereignty and non-interference in each other's internal affairs, on the basis of equality and mutual benefit,

(iv) That the basic issues and causes of conflict which have bedevilled the relations between the two countries for the last twenty five years shall be resolved by peaceful means,

(v) That they shall always respect each other's national unity, territorial

integrity, political independence and sovereign equality,

(vi) That in accordance with the Charter of the United Nations, they shall refrain from the threat or use of force against the territorial integrity or political independence of each other;

(II) Both Governments will take all steps within their power to prevent hostile propaganda directed against each other

Both countries will encourage the dissemination of such information as would promote the development of friendly relations between them,

(III) In order progressively to restore and normalize relations between the two countries step by step, it was agreed that,

(i) Steps shall be taken to resume communications, postal, telegraphic, sea, land including border posts, and air links including overflights,

(ii) Appropriate steps shall be taken to promote travel facilities for the nationals of the other country;

(iii) Trade and co-operation in economic and other agreed fields will be resumed as far as possible,

(iv) Exchange in the fields of science and culture will be promoted.

In this connection delegations from the two countries will meet from time to time to work out the necessary details

(IV) In order to initiate the process of the establishment of durable peace, both the Governments agree that.

(i) Indian and Pakistani forces shall be withdrawn to their side of the international border,

(ii) In Jammu and Kashmir, the line of control resulting from the cease-fire of December 17, 1971 shall be respected by both sides without prejudice to the recognized position of either side Neither side shall seek to alter it unilaterally, irrespective of mutual differences and legal interpretations. Both sides further undertake to refrain from the threat of the use of force in violation of this line;

(iii) The withdrawals shall commence upon entry into force of this Agreement and shall be completed within a period of thirty days thereof

(V) This Agreement will be subject to ratification by both countries in accordance with their respective constitutional procedures, and will come into force with effect from the date on which the Instruments of Ratification are exchanged

(VI) Both Governments agree that their respective Heads will meet again at a mutually convenient time in the future and that, in the meanwhile the representatives of the two sides will meet to discuss further the modalities and arrangements for the establishment of a durable peace and normalization of relations including the questions of repatriation of prisoners of war and civilian internees, a final settlement of Jammu and Kashmir and the resumption of displomatic relations

| | |
|---|---|
| Sd/- | Sd/- |
| **Indira Gandhi** | **Zulfiqar Ali Bhutto** |
| Prime Minister | President |
| Republic of India | Islamic Republic of Pakistan |

**Simla, the 2nd July, 1972**

## Appendix - V

# Parliament Resolution on Jammu and Kashmir

*(Following increasing terrorist violence and Pakistan's attempts to highlight the Kashmir dispute, both houses of the Indian Parliament unanimoulsy adopted a resolution on February 22, 1994 emphasizing that Jammu and Kashmir was an integral part of India, and that Pakistan must vacate parts of the State under its occupation. The test of the resolution follows)*

'This House note with deep concern Pakistan's role in imparting training to the terrorists in camps located in Pakistan and Pakistan Occupied Kashmir, the supply of weapons and funds, assistance in infiltration of trained militants, including foreign mercenaries into Jammu and Kashmir with the avowed purpose of creating disorder, disharmony and subversion

reiterates that the militants trained in Pakistan are indulging in murder, loot and other heinous crimes against the people, taking them hostage and creating an atmosphere of terror,

condemns strongly the continued support and encouragement Pakistan is extending to subversive and terrorist activities in the Indian state of Jammu & Kashmir;

calls upon Pakistan to stop forthwith its support to terrorism, which is in violation of the Simla Agreement and the internationally accepted norms of inter-State conduct and is the root cause of tension between the two countries,

reiterates that the Indian political and democratic structures and the Constitution provide for firm guarantees for the promotion and protection of human rights of all its citizens,

regard Pakistan's anti-India campaign of calumny and falsehood as unacceptable and deplorable

notes with deep concern the highly provocative statements emanating from Pakistan,

urges Pakistan to refrain from making statements which vitiate the atmosphere and incite public opinion,

expresses regret and concern at the pitiable conditions and violations of human rights and denial of democratic freedoms fo the people in those areas of the Indian State of Jammu and Kashmir, which are under the illegal occupation of Pakistan,

On behalf of the People of India,

Firmly declares that -

(a) The State of Jammu & Kashmir has been, is and shall be an integral part of India and any attempts to separate it from the rest of the country will be resisted by all necessary means,

(b) India has the will and capacity to firmly counter all designs against its unity, sovereignty and territorial integrity,

and demands that -

(c) Pakistan must vacate the areas of the Indian State of Jammu and Kashmir, which they have occupied through aggression, and resolves that -

(d) all attempts to interfere in the internal affairs of India will be met resolutely "

The Resolution was unanimously adopted Mr Speaker The Resolution is unanimosly passed

# పనికొచ్చిన పుస్తకాలు


1 Mission with Mountbatten- Alan Campbell - Johnson
Robert Hale Ltd.

2 This Happened in Kashmir - Krishna Mehta
Publications Division, 1966

3 My Frozen Turbulence in Kashmir - JagMohan
Allied Publishers Ltd , 1991

4 Kashmir And Indo-Pak Relations - Colonel Ravi Nanda
Lancer's Books, 2001

5 Anatomy of A Flawed Inheritence - J N Dixit
Konark Publishers Pvt. Ltd , 1995

6 Looking Back - Meher Chand Mahajan
Har - Anand Publications, 1963

7. Selected Works of Jawaharlal Nehru

8 Jawaharlal Nehru's Speeches, Vol.3
Publications Division, 1958

9 Heir Apparent - Dr. Karan Singh

10. Converted Kashmir - Narendra Sehgal

11 Cresent Over Kashmir - Anil Maheshwari

12 Perspectives on Kashmir
The Roots of Conflict in South Asia
Edited by Raju G.C.Thomas, Westview Press, 1992


దేశ

13 A study of Bungling in Kashmir - Balraj Madhok

14 My Life And Times - Mir Qasim

15 Chronology of Kashmir History Reconstructed
Kota Venkatachalam, 1955

16 The Roots of Kashmir Problem
Devendra Swarup & Sushil Aggrawal
Manthan Prakashan, 1992

17 Rajatarangani - Kalhana

18 Introduction to the Constitution of India
Durga Das Basu

19 Guru Tegh Bahadur - Harbans Singh
Manohar, 1994

సుందరయ్య గ్రంథాలయం
A C No. 6633
హైదరాబాద్-500 044.

# *KASHMIR KATHA*

M.V.R. SASTRY



ఎం.వి.ఆర్.శాస్త్రి

కాశ్మీర్‌పై మన విధానమేమిటో మనకే ఈ నాటికీ తెలియదు.
సమస్యను సమూలంగా పరిష్కరించడం మీదకంటే...
ఆ పని మనం సరైన రీతిలో చేస్తున్నట్టు ప్రపంచానికి
నమ్మకం కలిగించడం ఎలా?

మన మంచితనం మీద అన్ని దేశాలకూ గురి కుదర్చడం ఎలా
అన్న వాటిమీదే ఎంతసేపూ మన ప్రభుత్వాల ఆలోచన.
తడబాట్లు, తొట్రుబాట్లు, దిద్దుబాట్ల భంగపాట్లతోటే
అర్ధ శతాబ్ది చెల్లిపోయింది...

దుర్గా పబ్లికేషన్స్, హైదరాబాద్